సత్యమేవ జయతే
# సాక్షి
WWW.SAKSHI.COM
పేజీలు: 14+4 వెల: ₹ 5.50
సంపుటి: 16
సంచిక: 327
శనివారం 17-2-2024
SIMULTANEOUSLY PRINTED AT VIJAYAWADA | CHENNAI | DELHI | BANGALORE | HYDERABAD | MUMBAI | ANANTAPUR | GUNTUR | KADAPA | KHAMMAM | KARIMNAGAR | KURNOOL | MAHABOOBNAGAR | MANGALAGIRI | NALGONDA | NELLORE | NIZAMABAD | ONGOLE | RAJAMAHENDRAVARAM | SRIKAKULAM | TADEPALLI GUDEM | TIRUPATHI | VISAKHAPATNAM | WARANGAL








**సొంతంగా ఇంటి అలంకరణలో ఎదుర్కొన్న ఇబ్బందులు పిల్లల కోసం కొత్తగా ఏదైనా సృష్టించాలనే ఆలోచన రిధి ఖోస్లా జలాన్‌ని ఈ రోజు ఉన్నతంగా నిలబెట్టింది. హోమ్ డెకార్‌లో డిజైన్ ఇన్‌ఫ్లుయెన్సర్‌గా పేరొందిన రిధి పిల్లల కోసం లిటిల్ నెస్ట్ పేరుతో ఏర్పాటు చేసిన డిజైన్ స్టోర్‌తో మార్కెట్లో ఆమెను వ్యాపారవేత్తగా మార్చింది.**

# మన జీవితానికి మనమే డిజైనర్లం..


రిధి ఖోస్లా జలాన్

ముంబై నుంచి ఇటీవల హైదరాబాద్‌లోని ఫిక్కీ వైఎఫ్ఎల్ఓ ఏర్పాటు చేసిన సెషన్‌లో పాల్గొన్న ఈ యంగ్ ఎంట్రప్రెన్యూర్ తన జీవితాన్ని ఎలా డిజైన్ చేసుకుందో వివరించింది. 'మనలో ఉన్న అభిరుచి ఏంటో తెలుసుకుని, దానిని అమలులో పెడితే విజయం మన వెన్నంటే ఉంటుంది' అంటుందామె. స్ఫూర్తివంతమైన ఆమె మాటలు...

సాధారణ గృహిణిగా ఉన్న రిధి తన జీవితాన్ని ఈ రోజు ఉన్నత స్థితికి చేరుకోవడానికి ఎలాంటి మలుపులు తిప్పిందో వివరించింది. ఇంటీరియర్ డిజైనర్ నుండి కిడ్స్ ఫర్నీచర్ స్టోర్ యజమాని వరకు రిధి పేరొందింది.

''ఫైనాన్స్, మార్కెటింగ్‌లో బ్యాచిలర్ డిగ్రీ చేశాక పెళ్లవడంతో ముంబై వెళ్లిపోయాను. మొదటి బిడ్డ పుట్టాక నాలో తన కోసం ప్రత్యేకమైన డిజైనింగ్ రూమ్ ఉంటే బాగుంటుందనే ఆలోచన వచ్చింది. అంతేకాదు పిల్లల బట్టలు, వారికి కావల్సిన వస్తువుల విషయంలోనూ ఆలోచన పెరిగింది. అప్పుడే ఇంటీరియర్ డిజైన్‌కు సంబంధించిన కోర్సు చేయాలనుకున్నా. రెండవసారి ప్రెగ్నెంట్ అయిన టైమ్‌లోనే ఇంటీరియర్ డిజైనింగ్ కోర్సులో చేరాను. అలా ఆ అభిరుచే వృత్తిగా మారింది. నా లైఫ్‌లో ఇదొక స్పెషల్ జర్నీ అని చెప్పవచ్చు.

పిల్లల గదులను డిజైన్ చేయడం అనే నా హాబీ నన్ను చాలామందికి చేరువ చేసింది. మొదట ఈ రంగంలో పెరుగుతున్న డిమాండ్‌ను గుర్తించాను. ఫర్నీచర్, డెకార్ వస్తువుల కోసం ఎక్కడ షాపింగ్ చేయాలనే దానిపై స్నేహితులు తరచూ సలహాలు అడుగుతుండేవారు. వ్యక్తిగతంగానూ, నా స్నేహితులు పడుతున్న కష్టాన్ని గమనించినప్పుడు నా డిజైనింగ్‌లో ఎలాంటి మార్పులు ఉంటే బాగుంటుందో స్వయంగా తెలుసుకున్నాను. స్నేహితులకు సూచనలు ఇచ్చే క్రమంలో నాకూ చాలా విషయాల పట్ల అవగాహన పెరిగింది. కిడ్స్ డెకార్ బ్రాండ్‌ను ప్రారంభించడానికి ముందు మార్కెట్ పోకడలను గమనించాను. అప్పుడు 'లిటిల్ నెస్ట్' పేరుతో స్టోర్ ప్రారంభించాను. ఈ క్రియేటివ్ డిజైన్ నన్ను చాలా మందికి చేరువ చేసింది.

**ముందు కుటుంబమే**

నాకు అందుబాటులో ఉన్న సమాచారాన్ని, చేస్తున్న వర్క్ ప్రోగ్రెస్‌ను ఇన్‌స్టాగ్రామ్‌లో పోస్ట్ చేస్తుంటాను. ఒక ప్రశ్న–సమాధానంతో సోషల్ మీడియా వీడియోను ప్రారంభించాను. ఏడాది లోపు ఐదు లక్షలకు పైగా ఫాలోవర్లకు చేరువయ్యాను. ప్రజలు కోరుకునే సమాచారాన్ని అందించడంపై పెట్టే దృష్టి నన్ను ఇంతమందికి చేరువ చేసింది. అయితే, ఇల్లే నా మొదటి ప్రాధాన్యత. ఇంటిని మేనేజ్ చేయగలగితే చాలు, బయట అన్ని పనులను సులువుగా చక్కబెట్టవచ్చు. ఇందుకు నా పిల్లల సాయం కూడా ఉంటుంది. నా బిజీ వర్క్, ప్లానింగ్ చూస్తూ పెరుగుతున్న నా పిల్లలు కూడా వారి పనులు వారు చేసుకుంటారు. నా వర్క్ వల్ల సోషల్‌గా అందరితోనూ అంతగా కలిసే సమయం ఉండదు. మొదట్లో అన్నీ బ్యాలెన్స్ చేయగలిగాను. కానీ, డెకార్ వర్క్, కంటెంట్ క్రియేటివ్‌కు ఎక్కువ టైమ్ పడుతుంది. ఇదొక డైనమిక్ జర్నీ అవడంతో నా ముందున్న మార్పులను కూడా ఉత్సాహంగా చేసుకుంటూ వెళుతున్నాను. గ్లోబల్ డిజైన్ మ్యాప్‌లో మన దేశం నుంచి నేను ఉండాలన్నది నా కల. ఇన్‌స్టాగ్రామ్ ద్వారా ఎంతో మందికి చేరవయ్యాను. ఆఫ్‌లైన్‌లో వ్యక్తిగతంగా చాలా మందికి రీచ్ కావాలని కోరుకుంటున్నాను.

**అప్‌డేట్‌గా ఉంటాను..**

ఇంటీరియర్ డిజైన్ స్టూడియో మెయింటెయిన్ చేయాలంటే ఎప్పుడూ అప్‌డేట్‌గా ఉండాలి. ప్రతిరోజూ నాలుగు పేజీల షెడ్యూల్‌ని వేసుకుంటాను. ఇల్లు, వర్క్ స్పేస్, అప్‌డేట్స్, నా వ్యక్తిత్వాన్ని ప్రతిబింబించేవి ప్రోత్సాహాన్ని కలిగించే కోట్స్ నోట్ చేసుకుంటాను. దీని వల్ల ప్రతిదీ ఏ రోజు కా రోజు ప్లానింగ్‌గా జరిగిపోతుంటుంది. భవిష్యత్తు గురించి అంటే మరో ఐదేళ్లలో నా ప్రాజెక్ట్స్ గ్లోబల్ లెవల్‌కి వెళ్లాలి. ప్రపంచంలోని అత్యుత్తమ డిజైన్ ఇన్‌ఫ్లుయెన్సర్‌లలో ఒకరిగా ఉండాలన్నదే నా లక్ష్యం.

**రెండు వారాలకు ఒకసారి..**

ఎంత పని ఉన్నా రెండు వారాలకు ఒకరోజు పూర్తి విశ్రాంతి తీసుకుంటాను. నా కోసం నేను అన్నట్టుగా ఉంటాను. ఆ రోజులో ఎక్కువ సమయం బుక్స్ చదవడానికి సమయాన్ని కేటాయిస్తాను. రోజువారీ పనితో ఏ మాత్రం సంబంధం లేని పనులను చేస్తాను. దీంతో మరింత ఉత్సాహంగా మారిపోతాను'' అని తన విజయానికి వేసుకున్న బాటలను ఇలా మన ముందు ఉంచారు రిధి.

– నిర్మలారెడ్డి

## ఇంటిప్స్



- తుప్పు పట్టేసిన తాళంచెవిని కిరోసిన్‌లో ముంచి తుడిస్తే కొత్తదానిలా తయారవుతుంది.
- బియ్యం పురుగు పట్టకుండా ఉండాలంటే... వాటిలో ఎండిన కాకరకాయ వేయాలి.
- చెప్పులను క్లాత్‌తో తుడిస్తే పై లేయర్ రాలిపోతుంది. షైనింగ్ తగ్గుతాయి. స్పాంజితో తుడిస్తే మంచి షైనింగ్‌తో ఎక్కువ కాలం మన్నుతాయి.
- టాల్కమ్ పౌడర్ పెద్ద టిన్ కొన్నప్పుడు పూర్తయ్యే లోపుగా వాసన తగ్గుతుంది. అలాంటప్పుడు టిన్‌ను కొద్దిసేపు ఎండలో పెడితే తిరిగి సువాసనలు వెదజల్లుతుంది.



## కొత్తదారి

**కెరీర్‌లో దూసుకుపోతే ఆ కిక్కే వేరు. 'అంతమాత్రాన సామాజిక బాధ్యత మరచిపోతే ఎలా' అనుకునేవారు కొద్దిమంది ఉంటారు. అలాంటి వారిలో రేఖ–రిజ్వాన్ దంపతులు ఒకరు. తాము పనిచేస్తున్న రంగాలలో మంచి పేరు తెచ్చుకున్న రేఖ–రిజ్వాన్‌లు స్వచ్ఛందసేవారంగంలోకి వచ్చారు. 'కోయిట ఫౌండేషన్' ద్వారా హెల్త్‌కేర్ రంగంలో సామాజిక సేవా కార్యక్రమాలు చేపడుతున్నారు.**

# నై'పుణ్యా' సేవ


రేఖ
రిజ్వాన్

మేనేజ్‌మెంట్ కన్సల్టెంట్, స్టార్టప్ ఫౌండర్స్‌గా విజయపథంలో దూసుకుపోయిన రిజ్వాన్, రేఖ కోయిటలు దాతృత్వం దారిలో ప్రయాణం ప్రారంభించారు.

ఎన్నో స్వచ్ఛంద సంస్థలతో కలిసి పనిచేసిన రేఖకు వారు ఎదుర్కొంటున్న సమస్యలు ఏమిటో తెలిశాయి. ఈ నేపథ్యంలోనే స్వచ్ఛంద సంస్థలకు సాంకేతిక సహాయం తోడైతే ఎలా ఉంటుంది అనే అంశంపై దృష్టి పెట్టింది. సాంకేతిక సహకారంతో ఎన్నో సమస్యలకు పరిష్కారాలు దొరుకుతాయనే విషయాన్ని అవగాహన చేసుకుంది.

నేషనల్ అక్రిడిటేషన్ బోర్డ్ ఫర్ హాస్పిటల్స్(ఎన్ఏబీహెచ్)లో సభ్యుడిగా ఉన్న రిజ్వాన్ డిజిటల్ హెల్త్ స్పేస్‌లో ఎన్నో ఆస్పత్రులతో కలిసి పనిచేశాడు. విలువైన అనుభవాన్ని సొంతం చేసుకున్నాడు.

'కోయిట ఫౌండేషన్' తరఫున ఐఐటీ–ముంబైలో కోయిట సెంటర్ ఫర్ డిజిటల్ హెల్త్ (కెసీడీహెచ్)ను ప్రారంభించారు.

క్లినికల్ అప్లికేషన్స్, హెల్త్‌కేర్ డాటా మేనేజ్‌మెంట్(హెల్త్‌కేర్ డాటా ప్రైవసీ, సెక్యూరిటీ), హెల్త్‌కేర్ ఎనాలటిక్స్... మొదలైన వాటిని తన ప్రాధాన్యత అంశాలుగా ఎంపిక చేసుకుంది కెసీడీహెచ్. ఆసుపత్రుల నిర్వహణ, ఆరోగ్య సంరక్షణకు సంబంధించి శిక్షణ ఇవ్వడానికి ప్రణాళికలు కూడా రూపొందించుకుంది కెసీడీహెచ్.

హెల్త్ కేర్ కెరీర్‌కు సంబంధించి యంగ్ ప్రొఫెషనల్స్‌ను ఉత్సాహపరచడం తన ప్రధాన లక్ష్యం అంటున్నాడు రిజ్వాన్. లీడింగ్ ఇంజనీరింగ్ కాలేజీలు, హెల్త్‌కేర్ ఇన్‌స్టిట్యూట్‌లు పూనుకొని తగిన కోర్సులకు అవకాశం కల్పిస్తే తన లక్ష్యం నెరవేరడం కష్టమేమీ కాదంటాడు రిజ్వాన్.

'టాటా మెమోరియల్ సెంటర్'లో క్యాన్సర్ ఆస్పత్రులు డిజిటల్ హెల్త్‌టూల్స్‌ను ఎడాప్ట్ చేసుకోవడంలో సహాయపడటానికి 'కోయిట సెంటర్ ఫర్ డిజిటల్ ఆంకాలజీ'ని ఏర్పాటు చేశారు. ఎలక్ట్రానిక్ మెడికల్ రికార్డ్స్‌ను నిర్వహించడం అనేది ఆస్పత్రులకు సవాలుగా మారిన నేపథ్యంలో దీనికి పరిష్కార మార్గాలు కనుక్కునే దిశగా ఆలోచనలు చేస్తుంది కెసీడీహెచ్.

'మహారాష్ట్ర యూనివర్శిటీ ఆఫ్ హెల్త్ సైన్సెస్'తో ఒప్పందం కుదుర్చుకుంది కెసీడీహెచ్. డిజిటల్ హెల్త్‌కు సంబంధించి పరిజ్ఞానం విషయంలో వైద్యులు, ఫ్రంట్‌లైన్ వర్కర్లు... మొదలైన వారికి ఈ విశ్వవిద్యాలయంలో శిక్షణ ఇస్తారు.

ఇతర రాష్ట్రాలలో కూడా ఇలాంటి శిక్షణ కార్యక్రమాలు రూపొందించే విషయంపై చొరవ చూపుతున్నారు రిజ్వాన్–రేఖ దంపతులు.

'మెటర్నల్ హెల్త్'కు సంబంధించి ఫౌండేషన్ ఫర్ మదర్ అండ్ చైల్డ్‌హెల్త్(ఎఫ్ఎంసిహెచ్)తో కలిసి పనిచేస్తోంది కోయిట సెంటర్ ఫర్ డిజిటల్ హెల్త్. 'ఎఫ్ఎంసిహెచ్' తల్లీబిడ్డల ఆరోగ్యాన్ని పర్యవేక్షించే లక్ష్యంగా ఏర్పడిన స్వచ్ఛంద సంస్థ. ఇందులో ప్రతి ఫీల్డ్‌వర్కర్‌కు కొన్ని కుటుంబాల పర్యవేక్షణ బాధ్యత ఉంటుంది. 'న్యూట్రీ' యాప్ ద్వారా ఫీల్డ్ ఆఫీసర్‌లకు ఇన్‌పుట్ డాటాతో ఔట్‌పుట్ డెసిషన్స్ తీసుకునే అవకాశం ఉంటుంది.

మ్యాజిక్ బస్, స్నేహా, విప్ల ఫౌండేషన్ లాంటి ఎన్నో సంస్థలతో కలిసి పనిచేస్తోంది కోయిట ఫౌండేషన్.

'చేయాల్సిన పని సముద్రమంత పెద్దదిగా ఉంది. అయినప్పటికీ చేయాలనే ఆసక్తి ఉంది' అంటుంది రేఖ.

# భారీ సక్సెస్

ఢిల్లీ కేంద్రంగా వ్యాపార సంస్థను స్థాపించింది దీక్షా సింఘి. ఆమె స్థాపించిన స్టార్టప్ పేరు 'ఎ లిటిల్ ఎక్స్‌ట్రా'. వినడానికి తేలికగానే ఉంది. కానీ ఈ పేరు వెనక చాలా బరువైన కథ ఉంది. అంతకంటే బరువైన ఆవేదన ఉంది. బాల్యం నుంచి ఎదుర్కొన్న అవహేళనలే ఆమెలో అక్షర వాహినికి విషయాంశాలయ్యాయి. ఆ తర్వాత రోజూ ఏదో ఒకటి రాయకపోతే తోచని స్థితికి చేరింది. అచ్చంగా స్వచ్ఛంగా సాగే ఆమె అక్షరాలకు అభిమానులు లక్షలకు మించిపోయారు. బాడీ పాజిటివిటీ ఇన్‌ఫ్లూయెన్సర్‌గా గుర్తింపు పొందింది దీక్ష. ఆ తర్వాత ఆమె స్థాపించిన అంకుర సంస్థ అనతి కాలంలోనే విజయపథంలో దూసుకుపోవడానికి ఆమెకు ఆమే బ్రాండ్ అంబాసిడర్. ఇంతకీ ఎ లిటిల్ ఎక్స్‌ట్రా పేరుతో తయారు చేస్తున్న ఉత్పత్తి ఏమిటంటే... ఫ్యాషన్ ఆభరణాలు. ఇరవై తొమ్మిదేళ్ల దీక్షా సింఘి తన విజయగాథను ఇలా వివరించారు.

''మాది అస్సాం రాష్ట్రం, గువాహటి. చిన్నప్పటి నుంచి బొద్దుగానే ఉండేదాన్ని. తోటి పిల్లలు వేళాకోళం చేసేవారు. బోర్డింగ్ స్కూల్లో కూడా ఇదే పరిస్థితి. లావుగా ఉండడంతో పరుగెత్తలేనని వాళ్లే నిర్ణయించి ఆటల్లో కలుపుకునే వాళ్లు కాదు. పాఠశాల వార్షికోత్సవాల సందర్భంగా సాంస్కృతిక కార్యక్రమాలు, నాటకాల్లో కూడా అవకాశం ఇచ్చేవారు కాదు. దుస్తులు కూడా ఆడవాళ్ల సెక్షన్‌లో నా సైజువి ఉండేవి కాదు. మగవాళ్ల సెక్షన్‌లో దొరికేవి. అబ్బాయిల దుస్తులు... పైగా వదులుగా ఉన్నవి ధరించేదాన్ని. దాంతో స్కూలు పిల్లలతోపాటు బంధువులు కూడా అల్లరి చేస్తూ టామ్‌బాయ్ అనేవాళ్లు. ఇదిలా ఉంటే లావు తగ్గడం కోసం స్విమ్మింగ్ కెళ్లాను. అక్కడి కోచ్ నా స్విమ్ సూట్ విషయంలో కొన్ని నిబంధనలు పెట్టారు. అప్పటి నుంచి స్విమ్మింగ్ మీద కూడా విరక్తి కలిగింది. ఇలాంటి అనుభవాలతో స్కూలు ముగించుకుని కాలేజ్‌లో చేరాను.

**కొత్త శకం మొదలైంది!**

కాలేజ్ ఎడ్యుకేషన్ కోసం 2013లో ఢిల్లీకి వచ్చాను. కాలేజ్‌లో కొత్త స్నేహితులు కలిసే లోపు బ్లాగ్ నా తొలి స్నేహితురాలయింది. బ్లాగ్ రాయడం మొదలు పెట్టిన తర్వాత నాకు తెలియకుండానే నన్ను కదిలించిన ఒక్కో సంఘటన అక్షరరూపం దాల్చింది. అందులో మానవీయ కోణాల కోసం నేను ప్రయత్నం చేసిందేమీ లేదు. కానీ నా బాల్యపు ఆవేదన నా బ్లాగ్ చదువరులను కదిలించివేసింది. నన్ను అభిమానించడం మొదలైంది. క్రమంగా బ్లాగ్‌లో నా ఆవేదనలే కాకుండా ఆలోచనలు, సమాజం గురించిన ఆందోళనలు, నా పర్యటన వివరాలను కూడా పంచుకోవడం మొదలు పెట్టాను. బాడీ షేమింగ్ ఒక వ్యక్తిని ఎంతగా బాధిస్తుందో తెలిసి వాళ్ల మనసు ద్రవించేది. కొంతమంది మహిళలు తమకూ ఇలాంటి పరిస్థితులు ఎదురయ్యాయని పంచుకునేవారు. ఈ క్రమంలో నా రచనలు దేహాకృతి కారణంగా ఎదురయ్యే మానసిక సమస్యల నుంచి సాంత్వన పొందేవిధంగా ధైర్యం చెబుతూ సాగాయి. బాడీ పాజిటివిటీ ఇన్‌ఫ్లూయెన్సర్ గా నా రచనలను ఆదరించేవారు పెరిగారు. ఇన్‌స్టాగ్రామ్‌లో నాకు లక్షకు పైగా ఫాలోవర్స్ ఉన్నారిప్పుడు.


దీక్షా సింఘి

**వ్యాపార కుటుంబ నేపథ్యం**

చదువు పూర్తయిన తర్వాత ఉద్యోగమో, వ్యాపారమో చూసుకోవాల్సిన సమయంలో నేను వ్యాపారాన్నే ఎంచుకున్నాను. ఎందుకంటే మాది వ్యాపార కుటుంబం. ఏదైనా కొత్తగా చేయాలనే ఉద్దేశంతో 'ఎ లిటిల్ ఎక్స్‌ట్రా' పేరుతో ఆభరణాల తయారీ ప్రారంభించాను. మొదట ఇదే టైటిల్‌తో దుస్తుల వ్యాపారం చేయాలనుకున్నాను. కానీ దుస్తులకు సైజ్ పరిమితులుంటాయి. ఆభరణాలకు ఆ పరిమితి ఉండదు కదా! అందుకే ఆభరణాలతో మొదలుపెట్టాను. ఆభరణాలనగానే ఖరీదైన వ్యాపారం అనుకోవద్దు. చంకీ ఆభరణాలే ఎక్కువ. ఇప్పటికే మార్కెట్‌లో వందలాది ఆభరణాల తయారీదారులున్నారు. నా ఆభరణాలనే ఎందుకు కొనాలి? అంటే... నా ఆభరణాలు సందర్భాన్ని బట్టి ధరించేవిధంగా ఉంటాయి. ఉదాహరణకు నవరాత్రి సందర్భంగా పూసలతో చేసిన దుర్గాదేవి చెవి జూకాలు ధరిస్తే అందరి దృష్టి మీ చెవుల మీదే ఉంటాయి. కాదంటారా? అలాగే ఫుట్‌బాల్ మ్యాచ్ చూడడానికి వెళ్లేటప్పుడు ఫుట్‌బాల్ చెవి రింగులు, క్రికెట్ బ్యాట్ లాకెట్‌తో దండలు... ఇలాగన్నమాట. ఈ ప్రయోగాన్ని 2020 ఆగస్టులో ఐదు వేల రూపాయల పెట్టుబడితో ప్రారంభించాను. ఇప్పుడు ఐదు వందల డిజైన్లతో అరవై లక్షల టర్నోవర్‌తో వ్యాపారం సాగుతోంది. దేశంలో ఉన్న రకరకాల ఆభరణాల తయారీదారులు (కారీగారీ) నాతో కలిసి పని చేస్తున్నారు. నేను ఇచ్చిన డిజైన్‌ని ఆభరణం రూపంలో తీసుకువచ్చే అద్భుతమైన కళ వారి చేతిలో ఉంది. సందర్భానుసారంగా సేల్ అయ్యే డిజైన్‌లను రూపొందించే చురుకైన ఆలోచనలు నా బుర్రలో ఉన్నాయి. ఇదే నా సక్సెస్'' అన్నారు దీక్షా సింఘి.

## సక్సెస్ స్టోరీ

**వీడియోలు చేస్తే ఎంత వస్తుంది? యూట్యూబ్‌లో పెడితే ఎంత వస్తుంది? ఎంత టాలెంట్ ఉంటే అంత వస్తుంది. నితిష్ రాజ్‌పుట్‌కు నెలకు 25 లక్షలు సంవత్సరానికి ఎంత లేదన్నా 3 కోట్లు వస్తాయి. 'నాలెడ్జ్ ఈజ్ పవర్' అన్నారు. సామాజిక అంశాల పై విస్తృత సమాచారం అందిస్తూ అతడు చేసే వీడియోల వల్లే ఈ ఆదాయం. నితిష్ సక్సెస్ స్టోరీ.**

# వీడియో పెట్టు కోట్లు కొట్టు



నితిష్ రాజ్‌పుట్

**2022లో** మన దేశంలో పాన్‌మసాలా వ్యాపార లావాదేవీల మొత్తం ఎంతో తెలుసా? 43,410 కోట్లు. ఊహకు అందని భారీ వ్యాపారం. అందుకే పాన్‌మసాలా సంస్థలు తమ బ్రాండ్ పేరు జనం నాలికల మీద తద్వారా వారి పొగాకు ఉత్పత్తులు జనాల నోళ్ల లోపలకు వెళ్లాలంటే పెద్ద పెద్ద సెలబ్రిటీలతో ఎలా యాడ్స్ చేయిస్తాయో నితిష్ రాజ్‌పుట్ తన 30 నిమిషాల వీడియోలో వివరిస్తాడు. ఎలాగైతే ఆల్కహాల్ కంపెనీలు తమ బ్రాండ్ ప్రచారం కోసం మంచి నీళ్లు, మ్యూజిక్ సీడీలను తమ బ్రాండ్‌తో యాడ్స్ చేస్తాయో... పాన్ మసాలా కంపెనీలు కూడా అదే దారిలో సినిమా స్టార్స్‌ను పెట్టి లాఘవంగా 'ఇలాచీ', 'గులాబ్' అంటూ దొంగ యాడ్స్ చేస్తాయని వివరిస్తాడు. అమ్మేది మాత్రం పొగాకు ఉత్పత్తులనే అని తెలుపుతాడు. అంతేకాదు పొగాకు ఉత్పత్తుల్లో నేరుగా ప్రభుత్వం ఎలా భాగస్వామ్యం అయి ఉందో కూడా చెప్తాడు. ఇంత సవివరంగా మెయిన్ స్ట్రీమ్ మీడియా దాదాపుగా రాయదు. అందుకే నితిష్ రాజ్‌పుట్ వీడియోలకు అంత డిమాండ్.

**అన్ని వైపుల సమాచారం**

నితిష్ రాజ్‌పుట్ 2020లో తన పేరు మీద 'నితిష్ రాజ్‌పూట్ యూట్యూబ్ చానెల్'ను మొదలుపెట్టాడు. అందులో తనే మాట్లాడుతుంటాడు. ఏం మాట్లాడతాడు? ఒరిస్సాలో ట్రైన్ యాక్సిడెంట్‌కు కారణాలేమిటి? మణిపూర్‌లో ఏం జరుగుతోంది? ఖలిస్తాన్ ఉద్యమంలో వాస్తవం ఎంత? తాలిబన్‌లంటే ఎవరు? క్రెడిట్ కార్డ్స్‌లో మోసం ఎలా జరుగుతుంది... ఇలాంటి అంశాలతో వీడియోలు చేస్తాడు. అయితే ఇవి పైపైన చేసే వీడియోలు కాదు.దాదాపు పరిశోధనాత్మక జర్నలిజం స్థాయిలో ఉంటాయి. తీసుకున్న అంశంలో ఏదో ఒక పక్షం వహించకుండా అన్ని పక్షాల వైపు నుంచి సమాచారాన్ని రాసి పోస్ట్ చేస్తాడు. అంతేకాదు చరిత్రలో జరిగిపోయిన కొన్ని ఘటనలను కూడా వివరిస్తాడు. ఉదాహరణకు ఇజ్రాయిల్–పాలస్తీనాల మధ్య గొడవ. ఇలా ఒకటనేముంది మ్యూచువల్ ఫండ్స్ దగ్గరి నుంచి స్టాక్ మార్కెట్ పాఠాల వరకూ అన్నీ చెబుతాడు. అందుకే రెండేళ్ల కాలంలోనే అనూహ్యమైన విజయం సాధించాడు.

**50 లక్షల ఫాలోయెర్లు**

**నితిష్ రాజ్‌పుట్ యూట్యూబ్ చానల్‌కు 35 లక్షల మంది సబ్‌స్క్రయిబర్లు ఉన్నారు. ఫేస్‌బుక్, ఇన్‌స్టా ఇవన్నీ కలిపి మొత్తం 50 లక్షల మంది అతణ్ణి ఫాలో అవుతున్నారు. నితిష్ రాజ్‌పుట్ యూట్యూబ్‌లో ఇప్పటి వరకూ చేసిన వీడియోలకు 25 కోట్ల వ్యూస్ వచ్చాయి. ఈ వీడియోల్లో యాడ్స్ ప్లే అవుతాయి కనుక యూట్యూబ్ నుంచి అలాగే ప్రొడెక్ట్స్ ప్రమోషన్ వల్ల నెలకు అతడు 25 లక్షలు సంపాదిస్తున్నాడు. సంవత్సరానికి 3 కోట్ల ఆదాయం గడిస్తున్నాడు. రెండేళ్లల్లో సాధించిన విజయం అంటే ఆశ్చర్యమే.**

**ఉత్తరప్రదేశ్ కుర్రాడు**

నితిష్ రాజ్‌పుట్ ఉత్తర ప్రదేశ్‌లోని సుల్తాన్‌పూర్ అనే చిన్న ఊళ్లో పుట్టాడు. ఇప్పుడు అతనికి 33 ఏళ్లు. ఇన్ఫర్మేషన్ టెక్నాలజీలో బి.టెక్. చేసి ఐ.టి. కంపెనీల్లో పని చేశాడు. కాని తనకంటూ ఒక సొంత అస్తిత్వం, ఆర్థిక అంతస్తు ఉండాలని ఆశించి 2020లో వీడియో చానల్ ప్రారంభించాడు. సగటు మనిషికి నిత్యం కనిపించే విషయాలే లోతుగా తెలియచేయడం అతడు ఎంచుకున్న ఫార్ములా. ఉదాహరణకు బిట్‌కాయిన్ కథా కమామిషు ఏమిటి అనే వీడియో చూస్తే దాని గురించి మనకు దాదాపుగా ఓ సమగ్ర అవగాహన వస్తుంది. ఎయిర్‌పోర్ట్‌లు ఎలా ఆదాయం గడిస్తాయి అనేది అతని మరో వీడియో. బాలీవుడ్‌లో భారీ సినిమాలు ఫ్లాప్ అయినా డబ్బులెందుకు వస్తున్నాయి అనేది మరో వీడియో. స్పష్టంగా, డేటా విజువల్స్‌తో మంచి ఎడిటింగ్‌తో అతను ధారగా చెప్పుకుపోతాడు.

సత్యమేవ జయతే

# సాక్షి


WWW.SAKSHI.COM

పేజీలు: 14+4 వెల: ₹ 5.50

సంపుటి: 16
సంచిక: 327

శనివారం 17-2-2024

SIMULTANEOUSLY PRINTED AT VIJAYAWADA | CHENNAI | DELHI | BANGALORE | HYDERABAD | MUMBAI | ANANTAPUR | GUNTUR | KADAPA | KHAMMAM | KARIMNAGAR | KURNOOL | MAHABOOBNAGAR | MANGALAGIRI | NALGONDA | NELLORE | NIZAMABAD | ONGOLE | RAJAMAHENDRAVARAM | SRIKAKULAM | TADEPALLI GUDEM | TIRUPATHI | VISAKHAPATNAM | WARANGAL

'జల ప్రాజెక్టులపై జనం ఎన్నెన్నో ఆశలు పెట్టుకున్నారు. వాళ్ల నమ్మకం వమ్ము కాకుండా పనిచేయాలి'



**విష వలయంలో కాంగ్రెస్**

తనను వ్యతిరేకించడమే ఆ పార్టీ ఏకైక అజెండా అని ప్రధాని మోదీ విమర్శ - 6లో



**కాంగ్రెస్ ఖాతాల స్తంభన**

ట్రిబ్యునల్‌కు వెళ్లడంతో పునరుద్ధరణ.. ఆగ్రహం వ్యక్తం చేసిన రాహుల్ - 6లో



# విద్యాలో వండర్

**ఆన్‌లైన్ లెర్నింగ్ సంస్థ 'ఎడెక్స్ (edX)'తో రాష్ట్ర ప్రభుత్వం ఒప్పందం**

## 2 వేలకు పైగా కోర్సులను వర్టికల్స్‌గా చదువుకునే గోల్డెన్ చాన్స్: సీఎం జగన్

- ఎంఐటీ, లండన్ స్కూల్ ఆఫ్ ఎకనామిక్స్, హార్వర్డ్ అందించే కోర్సులను ఇక్కడి నుంచే ఉచితంగా నేర్చుకునే అవకాశం
- తద్వారా మన విద్యార్థులకు అంతర్జాతీయ వర్సిటీల సర్టిఫికేషన్.. 12 లక్షల మంది విద్యార్థులకు ఉచితంగా 'ఎడెక్స్' కోర్సులు
- నాణ్యమైన విద్యలో మనం వెనుకబడితే మిగతావారు ముందుకెళ్లిపోతారు
- అందుకే దేశంతో కాకుండా ప్రపంచంతో మనం పోటీపడుతున్నాం
- నాణ్యమైన విద్యతోనే మెరుగైన ఉద్యోగాలు, మంచి జీతాలు సాధ్యం
- నాలుగైదేళ్లలో వీటి ఫలాలు కనిపిస్తాయి.. మానవ వనరులపై పెట్టుబడికి ప్రాధాన్యం
- ప్రాథమిక స్థాయి నుంచి ఉన్నత విద్య వరకూ ఊహించని సంస్కరణలు చేపట్టాం
- యువతను గ్లోబల్ సిటిజన్లుగా మార్చేందుకే ప్రభుత్వ స్కూళ్లలో ఇంగ్లిష్ మీడియం
- 2035 నాటికి ఏపీలో టెన్త్ విద్యార్థులు 'ఐబీ' బోర్డు పరీక్షలు రాసేలా ఏర్పాట్లు

2 లో



ఎడెక్స్‌తో ఒప్పందం సందర్భంగా అభినందనలు తెలుపుతున్న ముఖ్యమంత్రి వైఎస్ జగన్. చిత్రంలో మంత్రి బొత్స, ఎడెక్స్ సీఈవో 'పద్మశ్రీ' అనంత్ అగర్వాల్ తదితరులు

> 'ఎడెక్స్'తో ఒప్పందం రాష్ట్ర విద్యా రంగ చరిత్రలో సువర్ణాధ్యాయం. 'రైట్ టు ఎడ్యుకేషన్' అనేది పాత నినాదం. 'రైట్ టు క్వాలిటీ ఎడ్యుకేషన్' అనేది మన ప్రభుత్వ విధానం. నాణ్యమైన విద్య అందించడం ద్వారానే పేదరికాన్ని నిర్మూలించవచ్చు. – ముఖ్యమంత్రి వైఎస్ జగన్

# 'ఫైబర్' ఫ్రాడ్ సూత్రధారి బాబే

## 'టెరాసాఫ్ట్'కు అడ్డగోలుగా ఫైబర్‌నెట్ ప్రాజెక్టు

**నేరచరితుడు వేమూరి కంపెనీకి పనులు.. బ్లాక్ లిస్ట్ నుంచి తొలగించి మరీ అప్పగింత**

**రూ.333 కోట్ల తొలిదశ పనుల్లో ప్రజాధనం లూటీ**

**నకిలీ ఇన్‌వాయిస్‌లతో షెల్ కంపెనీల ద్వారా తరలింపు**

**విజయవాడ ఏసీబీ కోర్టులో సీఐడీ చార్జ్‌షీట్**

**ఏ1 చంద్రబాబు, ఏ 2 వేమూరి, ఏ 3 కోగంటి**



సాక్షి, అమరావతి: కేంద్ర నిధులతో చేపట్టిన ఫైబర్ నెట్ ప్రాజెక్టు స్కామ్ కేసులో మాజీ సీఎం చంద్రబాబు లూటీకి సంబంధించి కీలక ఆధారాలను సేకరించిన సీఐడీ శుక్రవారం విజయవాడ ఏసీబీ కోర్టులో చార్జ్‌షీట్ దాఖలు చేసింది. తనకు సన్నిహితుడైన, నేర చరిత్ర కలిగిన వేమూరి హరికృష్ణకు చెందిన టెరాసాఫ్ట్ కంపెనీకి అడ్డగోలుగా ఈ ప్రాజెక్టును కట్టబెట్టి చంద్రబాబు ప్రజాధనాన్ని స్వాహా చేసినట్లు ఆధారాలతో నిగ్గు తేల్చింది. ఈ నేపథ్యంలో ఏ 1గా మాజీ సీఎం చంద్రబాబు, ఏ 2గా టెరాసాఫ్ట్ ఎండీ వేమూరి హరికృష్ణ, ఏ 3గా ఏపీ ఫైబర్‌నెట్ కార్పొరేషన్, ఇన్‌క్యాప్ సంస్థల మాజీ ఎండీ కోగంటి సాంబశివరావు (ప్రస్తుతం ద.మ. రైల్వేలో చీఫ్ కమర్షియల్ మేనేజర్)తోపాటు మరికొందరిని నిందితులుగా పేర్కొంది. వారిపై

మిగతా 8వ పేజీలో ▶

### 10 లక్షలు దాటిన ఇళ్ల పట్టాల రిజిస్ట్రేషన్లు

2 లో

పేదలకు ఇచ్చిన ఇళ్లపై శరవేగంగా హక్కులు కల్పిస్తున్న ప్రభుత్వం

పది రోజుల వ్యవధిలోనే 10 లక్షలకు పైగా రిజిస్ట్రేషన్లు

### మరో ఇద్దరు వైఎస్సార్‌సీపీ సమన్వయకర్తల నియామకం

పర్చూరు నియోజకవర్గానికి ఎదం బాలాజీ, కందుకూరుకు కటారి అరవింద యాదవ్

వైఎస్సార్‌సీపీ కేంద్ర కార్యాలయం ప్రకటన

- వివరాలు 8లో

# రాజ్యసభలో టీడీపీ సున్నా

## మూడు స్థానాల్లో ఏకగ్రీవంగా ఎన్నికైన వైఎస్సార్‌సీపీ అభ్యర్థులు

**రాష్ట్ర కోటాలో రాజ్యసభలోని 11 స్థానాలూ వైఎస్సార్‌సీపీ ఖాతాలోకే**

- 41 ఏళ్ల టీడీపీ చరిత్రలో రాజ్యసభలో ఆ పార్టీ ప్రాతినిధ్యం లేకపోవడం ఇదే తొలిసారి
- ఈ ఎన్నికల్లో ఓటుకు కోట్లు వెదజల్లడానికి సిద్ధమైన బాబు
- కుయుక్తులు ఫలించక.. చివరి నిమిషంలో పోటీ చేయడం లేదని ప్రకటన
- చంద్రబాబు మోసాలకు 2019 ఎన్నికల్లోనే చెక్ పెట్టిన ప్రజలు.. టీడీపీ చారిత్రక ఓటమి
- 151 శాసనసభ, 22 లోక్‌సభ స్థానాల్లో వైఎస్సార్‌సీపీ రికార్డు విజయం
- ప్రజల ఆకాంక్షలు నెరవేరుస్తున్న ముఖ్యమంత్రి వైఎస్ జగన్

8 లో



- తొలి ఏడాదే 95 శాతం, ఇప్పటివరకు 99.5 శాతం హామీలు అమలు
- సంక్షేమాభివృద్ధి పథకాలు, సుపరిపాలనతో ప్రజల మనసులు గెల్చుకున్న జగన్





కూటమిలో ఎవరున్నారో, లేరో తెలియడం లేదు! బీజేపీ, కాంగ్రెస్ మధ్యే పోటీ అనండి చాలు!!

శంభు సరిహద్దులో భారీగా మోహరించిన పోలీసులు




# రణరంగమైన 'శంభు'

పంజాబ్-హరియాణా సరిహద్దులో కొనసాగిన రైతుల ఆందోళన.. వారిపైకి భారీగా బాష్పవాయుగోళాలు

గుండె పోటుతో పంజాబ్‌కు చెందిన రైతు మృతి

రేపు మళ్లీ మంత్రుల చర్చలు 6లో

# ఇవిగో నవరత్నాల వెలుగులు

ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి రాష్ట్రంలో నిర్విఘ్నంగా అమలు చేస్తున్న నవరత్న పథకాల ద్వారా కోట్లాది మంది జీవితాల్లో వెలుగు నిండింది. ఈ పథకాల వల్లే తాము ఆనందంగా జీవిస్తున్నామని ఊరూరా ప్రజలు సంతోషంగా చెబుతున్నారు. వారంతా ఏ విధంగా అభివృద్ధిపథం వైపు పయనిస్తున్నారో వారి మాటల్లోనే 'సాక్షి' మీ ముందుకు తెస్తోంది.

## ఈ ప్రభుత్వమే రాకుంటే ఏమైపోయేవాళ్లమో!



గతంలో ఏనాడూ అందని సాయం ఈ ప్రభుత్వంలో మా కుటుంబానికి అందింది. చిత్తూరు జిల్లా కలికిరి గ్రామంలో టీ దుకాణం నడుపుకుంటున్న నాకు విభిన్న ప్రతిభావంతుల కేటగిరీలో దరఖాస్తు చేసుకున్న వెంటనే ప్రభుత్వం రూ.లక్షకు పైగా విలువ చేసే మూడు చక్రాల స్కూటీ మంజూరు చేసింది. నా కుమారుడు యశ్వంత్ రెడ్డి ప్రస్తుతం టెన్త్ చదువుతున్నాడు. నాలుగేళ్లుగా ఏటా రూ.15 వేలు చొప్పున అమ్మ ఒడి పథకం డబ్బులు అందాయి. ఇది నా కుటుంబంపై ఆర్థిక భారం పడకుండా సాయపడింది. రైతు భరోసా పథకం కింద ఏడాదికి రూ.13,500 చొప్పున నా భార్య బ్యాంకు ఖాతాలో జమవుతోంది. నాకు గతంలో రూ.3 వేలు పింఛన్ వచ్చేది. ఈ ప్రభుత్వం దాన్ని రూ.5 వేలకు పెంచింది. ఆ మొత్తాన్ని ప్రతినెలా ఒకటో తేదీ ఉదయాన్నే వలంటీర్ ఇంటికి వచ్చి మరీ అందిస్తున్నాడు. మా కుటుంబానికి వైఎస్సార్ ఆసరా కింద రూ.17,054, డ్వాక్రా సున్నా వడ్డీ పథకంలో రూ.10,674 లబ్ధి చేకూరింది. అన్ని రకాలుగా ప్రభుత్వం నుంచి మాకు సాయం అందుతోంది. దీంతో జీవితం సాఫీగా సాగుతోంది. సీఎం జగన్ మోహన్ రెడ్డికి ఎప్పటికీ రుణపడి ఉంటాం.

– తూపల్లి వెంకటరమణారెడ్డి, కలికిరి
(మంగిరి విశ్వనాథ, విలేకరి, కలికిరి)

## వడ్డీల బాధ తప్పింది



నా భర్త 30 ఏళ్ల క్రితం మరణించాడు. కూలినాలి చేసుకుంటూ ఇద్దరు మగ పిల్లల్ని పెంచి పెద్దచేసి పెళ్లి చేశాను. మాకు అనకాపల్లి జిల్లా మాకవరపాలెం మండలం తామరం గ్రామంలో రెండు ఎకరాల భూమి ఉంది. ఈ భూమిలో జీడి, మామిడి పంట సాగు చేస్తున్నా. ఏటా ఈ పంటకు గొప్పుల నుంచి పురుగు మందులు, దున్నడం, ఇతర పనుల నిమిత్తం రూ.10 వేల వరకు పెట్టుబడి అవసరం. వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం రాక మునుపు డబ్బులు వడ్డీకి తెచ్చి పెట్టుబడి పెట్టేదాన్ని. గత నాలుగేళ్లుగా ఏటా రైతు భరోసా పథకంలో రూ.13,500 నగదు అందుతోంది. ఈ పథకం లేని సమయంలో పెట్టుబడి కోసం తెచ్చిన అప్పును కష్టపడి కూలి పనులు చేసి తీర్చాల్సి వచ్చేది. ఈ ప్రభుత్వంలో వడ్డీల బాధ లేకుండా ముందుగానే రైతు భరోసా నగదు జమ చేయడం వల్ల పంట సాగుకు ఇబ్బందులు తప్పాయి. అంతేకాక 20 ఏళ్ల పూర్తయిన డీ పట్టా భూమిని జిరాయితీగా మార్చడంతో మాకు కొండంత భరోసా కలిగింది. నాకు వృద్ధాప్య పింఛన్ రూ.3 వేలు వస్తోంది. వైఎస్సార్ ఆసరా కింద నాలుగు విడతల్లో రూ.16 వేలు వచ్చింది. మా సొంత స్థలంలో ఇల్లు నిర్మించుకునేందుకు నా కోడలి పేరున రూ.లక్షా 80 వేలు ఇచ్చారు. ఈ ప్రభుత్వ సాయం మరువలేం.

– బూకా అర్జమ్మ, తామరం
(కోనూరు రమేష్, విలేకరి, మాకవరపాలెం)

## చేయూత మా జీవితానికి వెలుగైంది



నా భర్త కోటయ్యతో కలసి నేను ప్రకాశం జిల్లా హనుమంతునిపాడు మండలం పెద్దగొల్లపల్లిలో కూలి పనులకు వెళ్లేవాళ్లం. ఆ పని కూడా ఒక రోజుంటే నాలుగు రోజులు ఉండేది కాదు. మాకు పిల్లలు లేకపోయినా పూట గడవడం చాలా కష్టంగా ఉండేది. జీవనానికి అప్పులు చేయాల్సి వచ్చింది. ఈ సమయంలో వైఎస్సార్‌సీపీ అధికారంలోకి వచ్చిన తర్వాత మేము అప్పుల ఊబి నుంచి బయటపడ్డాం. వైఎస్సార్ చేయూత ద్వారా ఏడాదికి రూ.18,750 వంతున అందింది. వైఎస్సార్ ఆసరా ద్వారా కూడా కొంత నగదు మా బ్యాంకు ఖాతాలో జమయింది. ఆ మొత్తంతో కుట్టు మెషిన్లు, లైనింగ్ మిషన్లు కొనుగోలు చేశా. హనుమంతునిపాడులో ఓ గదిని అద్దెకు తీసుకుని టైలరింగ్ షాపు పెట్టాను. ముగ్గురు బాలికలకు కుట్టు శిక్షణ ఇస్తున్నా. చీరెలు, జాకెట్లు కుట్టి లైనింగ్ చేస్తాము. రూము అద్దె, ఖర్చులు పోను నెలకు రూ.10 వేల వరకు సంపాదిస్తున్నా. ఆ ఆదాయంతో ఇద్దరం సంతోషంగా జీవిస్తున్నాం. ఈ ప్రభుత్వం చేసిన మేలు జీవితంలో మరవలేము.

– వంగేపురం రాజకుమారి, పెద్దగొల్లపల్లి
(కోండ్రు ప్రసాదు, విలేకరి, హనుమంతునిపాడు)

## రేపు సీఎం జగన్ అనంతపురం జిల్లా రాప్తాడులో పర్యటన

**సిద్ధం సభలో పాల్గొననున్న ముఖ్యమంత్రి**

సాక్షి,అమరావతి : సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ఈ నెల 18న(ఆదివారం) అనంతపురం జిల్లా రాప్తాడులో పర్యటించనున్నారు. వైఎస్సార్‌సీపీ ఎన్నికల శంఖారావ సభ – సిద్ధంలో ఆయన పాల్గొననున్నారు. మధ్యాహ్నం 1.30 గంటలకు తాడేపల్లి నివాసం నుంచి బయలుదేరి రాప్తాడు చేరుకుంటారు, అక్కడ జరిగే వైఎస్సార్‌సీపీ ఎన్నికల శంఖారావ సభ.. 'సిద్ధం'లో పాల్గొని ప్రసంగిస్తారు. అనంతరం బయలుదేరి తాడేపల్లి చేరుకుంటారు.

## 10 లక్షలు దాటిన ఇళ్ల పట్టాల రిజిస్ట్రేషన్లు

- పేదలకు ఇచ్చిన ఇళ్లపై శరవేగంగా హక్కులు కల్పిస్తున్న ప్రభుత్వం
- పది రోజుల వ్యవధిలోనే 10 లక్షలకు పైగా రిజిస్ట్రేషన్లు

సాక్షి, అమరావతి: రాష్ట్ర ప్రభుత్వం పేదలకు ఇచ్చిన ఇళ్ల పట్టాలకు రిజిస్ట్రేషన్ చేసే కార్యక్రమం వేగంగా జరుగుతోంది. రోజుల వ్యవధిలోనే లక్షల సంఖ్యలో రిజిస్ట్రేషన్లు పూర్తవుతున్నాయి. శుక్రవారం సాయంత్రానికి 10.31 లక్షల రిజిస్ట్రేషన్లు పూర్తయ్యాయి. అత్యధికంగా కృష్ణా జిల్లాలో 79,953 రిజిస్ట్రేషన్లు జరిగాయి. కాకినాడ జిల్లాలో 79,892 రిజిస్ట్రేషన్లు పూర్తయ్యాయి. పల్నాడు, వైఎస్సార్, శ్రీపొట్టి శ్రీరాములు నెల్లూరు, గుంటూరు జిల్లాల్లో 50 వేలకుపైగా రిజిస్ట్రేషన్లు జరిగాయి. మిగిలిన రిజిస్ట్రేషన్లను వారం రోజుల్లో పూర్తి చేసే అవకాశం ఉందని రిజిస్ట్రేషన్ల శాఖ ఉన్నతాధికారులు చెబుతున్నారు. రిజిస్ట్రేషన్లు పూర్తయిన లబ్ధిదారులకు కన్వేయన్స్ డీడ్ల పంపిణీని త్వరలో చేపట్టనున్నారు. ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ఈ కార్యక్రమాన్ని ఒంగోలులో ప్రారంభించే అవకాశం ఉంది. ఆ తర్వాత అన్ని జిల్లాల్లోనూ ప్రజాప్రతినిధులు పంపిణీ చేయనున్నారు. స్వాతంత్ర్యం వచ్చిన నాటి నుంచి ఇప్పటివరకు పేదలకు స్థలాలు ఇచ్చినా వాటిపై పూర్తి హక్కులు ఇవ్వకుండా డి-పట్టాలు మాత్రమే జారీ చేశారు. తొలిసారిగా వైఎస్ జగన్ అన్ని హక్కులతో ఇళ్ల స్థలాలు ఇవ్వాలని సంకల్పించి ఆ దిశగా అడుగులు వేశారు. ఇళ్ల స్థలాలు ఇచ్చినప్పుడే వాటికి వెంటనే రిజిస్ట్రేషన్లు చేయాలని చూసినా చట్టపరమైన ఇబ్బందుల వల్ల ఆ పని ఆలస్యమైంది. అన్ని సమస్యలను అధిగమించి, అసైన్డ్ భూముల చట్టానికి సవరణ చేసి ఇప్పుడు రిజిస్ట్రేషన్లు చేస్తున్నారు. ఈ రిజిస్ట్రేషన్ల తర్వాత జారీ చేసే కన్వేయన్స్ డీడ్లు పదేళ్ల తర్వాత సేల్ డీడ్‌లుగా మారనున్నాయి. అప్పుడు రెవెన్యూ శాఖ ఎన్‌ఓసీ అవసరం లేకుండానే పేదలు వాటిని నిరభ్యంతరంగా అమ్ముకునే అవకాశం ఏర్పడుతుంది. అలాగే రిజిస్ట్రేషన్ అయిన నాటి నుంచి వాటిపై ప్రైవేటు భూముల మాదిరిగానే రుణాలు, ఇతర సౌకర్యాలు పొందే అవకాశం ఉంటుంది.

## నేడు హెచ్‌సీఎల్ రిక్రూట్‌మెంట్ డ్రైవ్



సాక్షి, అమరావతి: తమ సంస్థలో నియామకాల కోసం హెచ్‌సీఎల్ విజయవాడ క్యాంపస్ శనివారం ప్రత్యేక డ్రైవ్ నిర్వహించనున్నది. టెక్నాలజీ రంగంలో నిష్ణాతులైన 500మంది నియామకాల కోసం మూడేళ్లు అంతకంటే ఎక్కువ అనుభవం ఉన్న వారి కోసం ఈ డ్రైవ్ చేపట్టనున్నట్లు హెచ్‌సీఎల్ తెలిపింది. జావా ఫుల్ స్టాక్ డెవలపర్స్, జావా+ ఏడబ్ల్యూఎస్ డెవలపర్స్, మైక్రోసాఫ్ట్–నెట్ డెవలపర్స్, ఒరాకిల్/ పీఎల్ఎస్‌క్యూఎల్ డెవలపర్స్, ఎస్ఏపీ: ఏబీఏపీ, హనా, బేసిస్, సీ/లినక్స్ డెవలపర్స్, ఎస్‌క్యూఎల్/ఒరాకిల్ డీబీఏల్లో అనుభవం ఉన్నవారికి ప్రాధాన్యతను ఇవ్వనున్నట్లు పేర్కొంది. 2020లో ప్రారంభమైన విజయవాడ క్యాంపస్ అత్యంత ముఖ్యమైన సాంకేతిక పురోగతిలో నిపుణుల నైపుణ్యాలతో 100కి పైగా అంతర్జాతీయ క్లయింట్స్‌కు సేవలు అందిస్తున్నట్లు హెచ్‌సీఎల్ వైస్ ప్రెసిడెంట్ శివప్రసాద్ ఓ ప్రకటనలో తెలిపారు.

# విద్యలో వండర్

**ఆన్‌లైన్ లెర్నింగ్ సంస్థ 'ఎడెక్స్'తో రాష్ట్ర ప్రభుత్వం ఒప్పందం**

**2 వేలకు పైగా కోర్సులను వర్టికల్స్‌గా చదువుకునే గోల్డెన్ చాన్స్**



రాష్ట్ర ప్రభుత్వం, ఎడెక్స్ మధ్య ఒప్పందం సందర్భంగా తాడేపల్లిలోని క్యాంపు కార్యాలయంలో నిర్వహించిన కార్యక్రమంలో మాట్లాడుతున్న సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి

సాక్షి, అమరావతి: పిల్లల ఉన్నత చదువుల ఖర్చు కోసం వెనుకాడకుండా మానవ వనరులపై పెట్టుబడికి అధిక ప్రాధాన్యం ఇస్తున్నట్లు ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి తెలిపారు. పాఠశాల విద్య నుంచి ఉన్నత విద్య వరకు విప్లవాత్మక సంస్కరణలతో ఎవరూ ఊహించనన్ని మార్పులు తెచ్చామని గుర్తు చేశారు. ఈ క్రమంలో విదేశాలకు వెళ్లి చదువుకోలేని మన విద్యార్థుల కోసం ప్రపంచ ప్రఖ్యాత యూనివర్సిటీలు అందించే కోర్సులను 'ఎడెక్స్' (edX.org) ద్వారా ఉచితంగా అందుబాటులోకి తెస్తున్నట్లు ప్రకటించారు. తద్వారా లండన్ స్కూల్ ఆఫ్ ఎకనామిక్స్, ఎంఐటీ, హార్వర్డ్ లాంటి విఖ్యాత వర్సిటీలు అందించే కోర్సుల్లో 2 వేలకు పైగా వర్టికల్స్‌లో విద్యార్థులు తమకు నచ్చిన అంశాన్ని నేర్చుకునే అవకాశాన్ని కల్పిస్తున్నట్లు చెప్పారు. యువతకు నాణ్యమైన విద్యను అందించడంలో వెనుకబడితే మిగతా ప్రపంచం మనల్ని దాటుకుని ముందుకు వెళ్లిపోతుందని వ్యాఖ్యానించారు. అందుకే చదువుల్లో దేశంతో కాకుండా ప్రపంచంతో పోటీపడుతున్నామన్నారు. వరల్డ్ క్లాస్ విద్యను అందుకున్నప్పుడే విద్యార్థులు మంచి ఉద్యోగం, మెరుగైన జీతభత్యాలు సాధిస్తారన్నారు. వచ్చే ఏడాది నుంచి ప్రభుత్వ పాఠశాలల్లో ఇంటర్నేషనల్ బాకలారియట్ (ఐబీ) సిలబస్ అందుబాటులోకి తెస్తున్నామని, దీన్ని తొలుత ఒకటో తరగతితో ప్రారంభించి పదేళ్లలో రాష్ట్ర విద్యార్థులు ఐబీ విధానంలో టెన్త్ పరీక్షలు రాసేలా అడుగులు ముందుకు వేస్తున్నట్లు చెప్పారు. ఇప్పుడు చేపట్టిన ఈ సంస్కరణల ఫలాలు కనిపించేందుకు మరో నాలుగైదేళ్లు పట్టవచ్చని తెలిపారు. శుక్రవారం క్యాంపు కార్యాలయంలో సీఎం జగన్ సమక్షంలో రాష్ట్ర ప్రభుత్వం, ప్రముఖ ఆన్‌లైన్ లెర్నింగ్ సంస్థ 'ఎడెక్స్' మధ్య కీలక ఒప్పందం కుదిరింది. విద్యాశాఖ మంత్రి బొత్స సత్యనారాయణ, సీఎస్ డాక్టర్ కేఎస్ జవహర్‌రెడ్డి, ఉన్నత విద్యామండలి చైర్మన్ కె.హేమచంద్రారెడ్డి, ఉన్నత విద్యాశాఖ స్పెషల్ సీఎస్ బుడితి రాజశేఖర్, విద్యాశాఖ ముఖ్య కార్యదర్శి ప్రవీణ్ ప్రకాష్, కాలేజీ ఎడ్యుకేషన్ కమిషనర్ పోలా భాస్కర్, ప్రాథమిక విద్యాశాఖ కమిషనర్ (మౌలిక వసతుల కల్పన) కాటమనేని భాస్కర్, 26 వర్సిటీల వీసీలు ఈ కార్యక్రమంలో పాల్గొన్నారు. ఈ సందర్భంగా సీఎం జగన్ ఏమన్నారంటే..

### అనూహ్య సంస్కరణలు..

ఉన్నత విద్యారంగంలో అనూహ్య సంస్కరణలు తెచ్చాం. ఆర్థిక భారంతో ఏ ఒక్కరి చదువులూ మధ్యలో ఆగిపోకూడదనే ఉద్దేశంతో పూర్తి ఫీజు రీయింబర్స్‌మెంట్ అమలు చేస్తున్నాం. ప్రతిభ కలిగిన పేదింటి విద్యార్థులను ప్రైవేట్ వర్సిటీల్లోనూ కూర్చోబెట్టి చదివిస్తున్నాం. ఏటా జగనన్న వసతి దీవెన ద్వారా అర్హులందరికీ వసతి ఖర్చులు అందజేస్తున్నాం. ప్రతి విద్యార్థి చదువు పూర్తవగానే ఉద్యోగాలు సాధించేలా పాఠ్య ప్రణాళికను సమూలంగా మార్పు చేశాం. దాదాపు 30 శాతం స్కిల్ ఓరియెంటెడ్ కోర్సులు ప్రవేశపెట్టాం. తొలిసారి డిజిటల్ విద్యలో భాగంగా డిగ్రీలో ద్విభాషా పాఠ్యపుస్తకాలు, మూడేళ్ల కోర్సులో ఇంటర్న్‌షిప్‌ను తప్పనిసరి చేశాం. దీనికి అదనంగా మరో ఏడాది ఆనర్స్ డిగ్రీ ఇచ్చే విధానాన్ని ప్రవేశపెట్టాం. విద్యార్థులు సులభంగా సిలబస్ చదువుకునేలా 400కిపైగా బైలింగ్యువల్ పాడ్‌కాస్ట్‌లు అందుబాటులో ఉన్నాయి. ఉన్నత విద్యలో బోధన ప్రమాణాలు పెంచేందుకు కోర్టు కేసులను అధిగమించి 18 వర్సిటీల్లో 3,295 పోస్టుల భర్తీకి శ్రీకారం చుట్టాం. 2019లో 257 ఉన్నత విద్యాసంస్థలకు న్యాక్ గుర్తింపు ఉంటే మనం తీసుకొచ్చిన విద్యా సంస్కరణలతో 437కు పెరిగింది.

### అంతర్జాతీయ వర్సిటీ కోర్సులు స్థానికంగానే

మన విద్యార్థులకు నాణ్యమైన విద్యను సంపూర్ణ స్థాయిలో అందించేందుకు 'ఎడెక్స్'తో ఒప్పందం చేసుకున్నాం. ఈ ఆన్‌లైన్ లెర్నింగ్ ప్లాట్‌ఫారమ్ ద్వారా దాదాపు 2 వేలకు పైగా కోర్సులు మన పాఠ్య ప్రణాళికలో వర్టికల్స్ కిందకు వస్తాయి. ఎడెక్స్‌లో విద్యార్థి తనకు కావాల్సిన వర్టికల్స్ కోసం రిజిస్ట్రేషన్ చేసుకోవచ్చు. ప్రపంచ ప్రఖ్యాత లండన్ స్కూల్ ఆఫ్ ఎకనామిక్స్, ఎంఐటీ, హార్వర్డ్ లాంటి విద్యా సంస్థలు ఈ కోర్సులను ఆఫర్ చేసి బోధిస్తాయి. అక్కడి ప్రొఫెసర్లతో మన విద్యార్థులు ఆన్‌లైన్‌లో సందేహాలను నివృత్తి చేసుకోవచ్చు. పరీక్షల్లో ఉత్తీర్ణులైన వారికి సర్టిఫికెట్లతో పాటు క్రెడిట్స్ దక్కుతాయి. తద్వారా జాబ్ మార్కెట్‌లో ఉద్యోగాలు సులభంగా లభిస్తాయి. పాశ్చాత్య దేశాల్లో డిగ్రీలో ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్, మెషిన్ లెర్నింగ్, డేటా సైన్స్, రియల్ ఎస్టేట్ మేనేజ్‌మెంట్, సైబర్ ఫోరెన్సిక్, స్టాక్ ఎక్స్ఛేంజ్, వెల్త్ మేనేజ్‌మెంట్, రిస్క్ మేనేజ్‌మెంట్ లాంటి వర్టికల్స్ కనిపిస్తాయి. మన దగ్గర అవి లేకపోగా నేర్పించే సరైన మానవ వనరులు అందుబాటులో లేవు. ఈ సమస్యలను అధిగమించేందుకు అత్యుత్తమ వర్సిటీల కోర్సులను మన కరిక్యులమ్‌లో భాగం చేస్తున్నాం. తద్వారా ఆంధ్రా వర్సిటీ నుంచి తీసుకునే డిగ్రీల్లో స్టాక్ ఎక్స్ఛేంజ్, రిస్క్ మేనేజ్‌మెంట్, వెల్త్ మేనేజ్‌మెంట్, పైథాన్ కోర్సులకు ప్రపంచ వర్సిటీల సర్టిఫికేషన్ లభిస్తుంది. విదేశాలకు వెళ్లి చదువుకోలేని విద్యార్థుల కోసం మన వర్సిటీల్లో వీటిని అందుబాటులోకి తెస్తున్నాం. దీని ద్వారా ఉన్నత విద్యలో దాదాపు 12 లక్షల మంది విద్యార్థులకు మేలు జరుగుతుంది.

### బలమైన పునాది..

మానవ వనరులపై పెట్టుబడికి ప్రభుత్వం ప్రాధాన్యం ఇస్తోంది. అందుకే ప్రాథమిక స్థాయి నుంచి విద్యలో సమూల మార్పులు తీసుకొచ్చాం. విద్యార్థులను గ్లోబల్ సిటిజెన్స్‌గా తీర్చిదిద్దేందుకే ప్రభుత్వ పాఠశాలల్లో ఇంగ్లిషు మీడియం ప్రవేశపెట్టాం. నాడు – నేడుతో సర్కారు స్కూళ్ల రూపురేఖలు మార్చాం. విద్యార్థులను స్కూళ్లకు రప్పించేందుకు, తల్లిదండ్రుల్లో స్ఫూర్తిని నింపేందుకు అమ్మ ఒడి, గోరుముద్ద అమలు చేస్తున్నాం. పదేళ్లలో మన విద్యార్థులకు పూర్తిగా ఐబీ విధానంలో బోధన అందించే దిశగా అడుగులు వేస్తున్నాం. ఐబీ విభాగం ఎస్‌సీఈఆర్టీ భాగస్వామ్యంతో ఈ ఏడాది టీచర్లకు బోధన విధానాలపై శిక్షణ ఇస్తుంది. వచ్చే ఏడాది ఒకటో తరగతితో ఐబీని ప్రారంభించి ప్రతి ఏడాది ఒక్కో తరగతి చొప్పున పెంచుకుంటూ వెళతాం. తద్వారా 2035 నాటికి పదో తరగతిలో ఐబీ బోర్డు పరీక్షలు రాస్తారు.

### వర్సిటీల్లో టెక్నాలజీ వినియోగం పెరగాలి..

యువతకు మనం ఇవ్వగలిగే ఆస్తి విద్య మాత్రమే. నాణ్యమైన విద్య అందిస్తే పేదరికం నుంచి బయటపడతారు. మంచి కంపెనీల్లో పెద్దపెద్ద ఉద్యోగాల్లో కనిపిస్తారు. అందుకే జగనన్న విదేశీ విద్య ద్వారా అత్యధికంగా ఒక్కో విద్యార్థిపై రూ.1.20 కోట్లు ఖర్చు చేస్తున్నాం. ప్రపంచంలోని టాప్–50 వర్సిటీలు, 21 ఫ్యాకల్టీల్లో టైమ్స్ రేటింగ్స్, క్యూ ఎస్ రేటింగ్స్‌లోని 320 కాలేజీలలో సీటొస్తే ఉచితంగా చదివిస్తున్నాం. ఇప్పటి వరకు 400 మందికి పైగా ప్రభుత్వ సాయంతో విదేశాల్లో చదువుతున్నారు. విదేశాలకు వెళ్లి చదువుకోలేని వారికి కూడా మనం ఆ స్థాయి విద్యను అందించాలి. వర్సిటీల్లో ఏఐ, ఆగ్మెంటెడ్ టెక్నాలజీ, 3 డీ లెర్నింగ్ విధానాలను మన కరిక్యులమ్‌లో అందుబాటులోకి తేవాలని గతంలోనే వీసీలకు సూచించా. ఇప్పటికే పద్మావతి వర్సిటీలో ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్ పూర్తి స్థాయిలో వినియోగానికి చర్యలు తీసుకున్నారు. కంప్యూటర్ విజన్, మెటావర్స్ లెర్నింగ్ జోన్లు ఏర్పాటు చేశారు. ఒక్కో జోన్‌కు దాదాపు రూ.10 కోట్లు పెట్టుబడి పెట్టారు. ఇలాంటివి అన్ని వర్సిటీల్లోనూ రావాలి.

### సృజనకు పదును..

పేద, మధ్య తరగతి విద్యార్థులకు ప్రభుత్వ పాఠశాలల్లో నాణ్యమైన విద్యకు నాంది పలికి 6వ తరగతి నుంచి ఐఎఫ్‌పీ ప్యానెళ్లతో సృజనాత్మక బోధన చేపట్టాం. 8వ తరగతి విద్యార్థులకు బైజూస్ కంటెంట్‌తో ఉచితంగా ట్యాబ్‌లు అందించడం ద్వారా చదువుల్లో వేగం పెంచి సులభంగా అర్థమయ్యేలా చర్యలు చేపట్టాం. ద్విభాషా పాఠ్యపుస్తకాలు విద్యార్థుల నైపుణ్యాన్ని మరింత పెంపొందించాయి.

## సీఎం జగన్ దార్శనికతకు నిదర్శనం



**పద్మశ్రీ అనంత్ అగర్వాల్, ఎడెక్స్ సీఈవో**

రాష్ట్రంలో ప్రతి విద్యార్థీ అంతర్జాతీయ స్థాయిలో రాణించాలనే తపనతో 12 లక్షల మందికి ఎడెక్స్ కోర్సులు ఉచితంగా అందుబాటులోకి తెచ్చారు. నాణ్యమైన విద్యను ప్రతి విద్యార్థికీ అందించాలన్న ముఖ్యమంత్రి జగన్ దార్శనికతకు ఇది నిదర్శనం. ఉన్నత విద్యలో ఇది నిజంగా గేమ్ ఛేంజర్. పదేళ్ల కిందట ఎడెక్స్ ప్రయాణం మొదలైంది. డిగ్రీ చదివి రెండేళ్లు ఉద్యోగం కోసం ఎదురు చూసిన అక్షయ్ అనే విద్యార్థి కెరీర్‌పై ఆశలు వదులుకున్న తరుణంలో ఎంఐటీ రూపొందించిన పైథాన్ కోర్సు ఎడెక్స్ ద్వారా నేర్చుకున్నాడు. క్లౌడ్ కంప్యూటింగ్ చేశాడు. ఆ సర్టిఫికెట్లతో ఉద్యోగానికి దరఖాస్తు చేసుకోగానే ఎంపికయ్యాడు. బెంగళూరు విమానాశ్రయంలో నన్ను గుర్తుపట్టి ఎంతో సంతోషం వ్యక్తం చేశాడు. సంపన్నుల పిల్లలకు చాలా అవకాశాలు వస్తాయి. వాళ్లు డబ్బు ఖర్చుచేసి మంచి కోచింగ్ సెంటర్లకు వెళ్లి నేర్చుకోగలరు. 36 ఏళ్లపాటు ప్రొఫెసర్‌గా ఉన్న నన్ను ముఖ్యమంత్రి జగన్ ఆలోచనలు, విజన్ ఆశ్చర్యపరిచాయి. ఎంఐటీ, హార్వర్డ్ లాంటి వర్సిటీల విద్యను పేద విద్యార్థులందరికీ ఇవ్వాలని నాతో చెప్పారు. డిజిటల్ టెక్నాలజీని వాడుకుని ఆ స్థాయి విద్యను ఎలా అందించగలమో నాతో చర్చించారు. ఎడెక్స్‌తో ఒప్పందం ఆంధ్రప్రదేశ్‌ను విద్యారంగంలో మొదటి స్థానంలో నిలబెడుతుంది. విజ్ఞానం, ఆర్థిక ప్రగతి, మంచి పౌరుడిగా తీర్చిదిద్దడంలో నాణ్యమైన చదువు ఎంతో ముఖ్యం. అందుకే ఏపీ ప్రభుత్వం విద్యా రంగానికి అగ్రపీఠం వేస్తోంది. సామాన్యులకూ కార్పొరేట్ స్థాయి విద్యను అందిస్తోంది. త్వరలోనే వివిధ రాష్ట్రాలు, దేశాలు సైతం ఏపీ విద్యా విధానాన్ని అనుసరిస్తాయని చెప్పడంలో సందేహం లేదు. సీఎం కోరిక మేరకు పాఠ్య ప్రణాళికలను సమర్థంగా తీర్చిదిద్దేందుకు నా వంతు సహకారం అందిస్తా.

### మరింత రాణిస్తాం..

నాలాంటి ఎంతో మంది విద్యార్థులు నాణ్యమైన విద్య కోరుకుంటున్నారు. మధ్య తరగతి విద్యార్థులు పరిమిత వనరులతో ఉన్నత స్థాయి విద్య అందుకోవడం చాలా కష్టం. అంతర్జాతీయ వర్సిటీల్లో చదువుకోవడం కలే. ముఖ్యమంత్రి జగన్ విజనరీ లీడర్‌షిప్‌తో వరల్డ్ క్లాస్ విద్య సాధ్యమవుతోంది. ఏపీని స్టేట్ ఆఫ్ నాలెడ్జ్, స్టేట్ ఆఫ్ ఇన్నొవేషన్, స్టేట్ ఆఫ్ ఎక్సలెన్స్‌గా తీర్చిదిద్దడం గొప్ప విషయం. ఎడెక్స్ అందించే అంతర్జాతీయ వర్సిటీల కోర్సులను అందిపుచ్చుకుని రాణిస్తాం.

– ప్రగతి జైశ్వాల్, బీటెక్, పద్మావతి మహిళా విశ్వవిద్యాలయం, తిరుపతి

### స్ఫూర్తినిచ్చిన సీఎం జగన్

మా నాన్న చిన్న రైతు. జగనన్న విద్యా దీవెన, వసతి దీవెన పథకాల ద్వారా నేను చదువుకుంటున్నా. నాలాంటి ఎంతో మంది విద్యార్థులకు ఆర్థిక భారం లేకుండా ఉన్నత విద్యావకాశాలు దక్కుతున్నాయి. కరిక్యులమ్‌తో మా స్కిల్స్ పెరుగుతున్నాయి. ఎడెక్స్‌తో టాప్ వర్సిటీల కోర్సులను ఉచితంగా నేర్చుకుని గ్లోబల్ లెవల్ పోటీకి సిద్ధమవుతాం. ముఖ్యమంత్రి జగన్ లక్షలాది మంది విద్యార్థులకు స్ఫూర్తిదాయకం.

– ఎ.హరిత, బీటెక్, జేఎన్‌టీయూ–అనంతపురం

### మార్కెట్‌లో మంచి విలువ

స్కిల్ డెవలప్‌మెంట్ కోర్సులు, ఇంటర్న్‌షిప్‌తో చదువుకునే సమయంలోనే ఉద్యోగ నైపుణ్యాలను అందిపుచ్చుకుంటున్నాం. మాకంటూ మార్కెట్‌లో వాల్యూ క్రియేట్ చేశారు. ఇంటర్న్‌షిప్ ద్వారా నెలకు రూ.8 వేల స్టైపెండ్ పొందుతున్నా. మా అమ్మను నేనే చూసుకోవాలి. జీవితంలో స్థిరపడితేనే ఏదైనా చేయగలను. పోటీని తట్టుకుని నిలబడాలంటే నాణ్యమైన విద్య తప్పనిసరి. ఎడెక్స్‌తో ఇది ప్రతి విద్యార్థికీ దక్కుతుంది. అంతర్జాతీయ వర్సిటీ సర్టిఫికేషన్‌తో సులభంగా ఉద్యోగాలు వస్తాయి.

– అంజలి, బీకాం, మేరీ స్టెల్లా కాలేజీ, విజయవాడ

# పోయింది మీ బ్రాండ్ ఇమేజే..

- అందుకే ప్రతీనెలా ఒకసారి పరిశ్రమలు వెళ్లిపోతున్నాయంటూ చెప్పిందే చెబుతున్నారు రామోజీ..
- రిలయన్స్, అదానీ వంటి దిగ్గజ సంస్థలు జీఐఎస్ ఒప్పందాలకు అదనంగా రాష్ట్రంలో పెట్టుబడులు పెడుతున్నా కనపడడంలేదా?
- మూడు జిల్లాల్లో ఆదిత్య బిర్లా గ్రూపు భారీ పెట్టుబడులు తెలీదా?
- బద్వేల్‌లో సెంచురీ ప్లై.. విశాఖలో జపాన్ దిగ్గజ సంస్థ యకహోమా గ్రూపు యూనిట్లు మర్చిపోతే ఎలా?



సాక్షి, అమరావతి : సీఎం వైఎస్ జగన్, రాష్ట్ర ప్రభుత్వంపై కక్ష కట్టి రోజూ అదేపనిగా తప్పుడు కథనాలను వండి వార్చే వ్రతం ఆచరిస్తున్న ఈనాడు రామోజీరావుకు బాబుపట్ల తనకున్న పిచ్చి పీక్స్‌కు చేరింది. అరిగిపోయిన గ్రామ్‌ఫోన్ రికార్డులా చెప్పిందే చెప్పడం.. రాసిందే రాయడం చేస్తూ క్షీణిస్తున్న తన మానసిక పరిస్థితిని సిగ్గూఎగ్గూ లేకుండా ఈనాడు పాఠకులకు ప్రదర్శించుకుంటూ తన బ్రాండ్ ఇమేజ్‌ను పూర్తిగా పోగొట్టుకున్నారు. కేవలం ప్రభుత్వంపై బురద జల్లి సీఎం కుర్చీలో తన ఆత్మబంధువు చంద్రబాబును ఉన్న ఫళంగా అందులో కూర్చోబెట్టాలన్న ఏకైక లక్ష్యంతో ఒకే వార్తను కేవలం శీర్షిక మార్చి నెలానెలా తిప్పితిప్పి వండి వారుస్తున్నారు. ఈ మధ్యనే 'కక్షకట్టి పరిశ్రమలను వెళ్లగొట్టి'.. శీర్షకతో ఓ దిగజారుడు కథనాన్ని అచ్చోసి నెలరోజులు కాకుండానే 'బ్రాండుకు బ్యాండు' అంటూ మళ్లీ అదే వార్తను అటుఇటూ మార్చి మరోసారి తన పాఠకుల మీదకు రామోజీ వదిలారు. ప్రస్తుత ప్రభుత్వ హయాంలో పారిశ్రామికంగా రాష్ట్రం వేగంగా వృద్ధి చెందుతుండటమే కాకుండా అంబానీ, అదానీ, టాటా, బిర్లా, మిట్టల్, బంగూర్, భజంకా, సింఘ్వీ, ఐటీసీ, హెచ్‌యూఎల్ వంటి పారిశ్రామిక దిగ్గజాలు రాష్ట్రంలో పెట్టుబడులు పెడుతుంటే తన వర్గ రాజకీయాల కోసం రాష్ట్ర ప్రగతిని దిగజారుస్తూ రాష్ట్రానికి పెట్టుబడులు రావడంలేదంటూ వికృతానందాన్ని పొందుతున్నాడు. నిజానికి.. రాష్ట్రానికి ఎప్పుడూలేని విధంగా దిగ్గజ సంస్థల ప్రతినిధులు స్వయంగా వచ్చి సీఎం వైఎస్ జగన్‌ను కలిసి పెట్టుబడులు పెడుతుంటే రాష్ట్ర బ్రాండ్ దెబ్బతినడంతో రూ.1.24 లక్షల కోట్ల పెట్టుబడులు వెళ్లిపోయాయని గుండెలు బాదుకుంటూ ఓ గాలి వార్తను ప్రచురించారు. ఈ నేపథ్యంలో.. ఈనాడు వార్తలోని అంశాలపై 'ఫ్యాక్ట్ చెక్' ఏమిటంటే..

### పరిశ్రమలు వెనక్కి వెళ్లిపోతున్నాయా!?

- రిలయన్స్ అంబానీ స్వయంగా విశాఖ పెట్టుబడుల సమావేశానికి హాజరై గ్రీన్ ఎనర్జీ రంగంలో రూ.50,000 కోట్ల విలువైన పెట్టుబడులు పెట్టే విధంగా సీఎం సమక్షంలో ఒప్పందం చేసుకున్నారు. ఇప్పుడు వీటికి అదనంగా బయో ఎనర్జీ రంగంలో రిలయన్స్ గ్రూపు వ్యవసాయ వ్యర్థాల నుంచి కంప్రెస్డ్ బయో గ్యాస్‌ను ఉత్పత్తి చేసేందుకు సుమారు రూ.1,900 కోట్లతో రాష్ట్రంలో 15 యూనిట్లను పెట్టడానికి ముందుకొచ్చారు. తొలిదశలో 8 యూనిట్ల నిర్మాణ పనులను మూడ్రోజుల క్రితం ప్రారంభించింది.
- ఆదిత్య బిర్లా గ్రూపు తూర్పుగోదావరి జిల్లా బలభద్రపురంలో గ్రాసిం ఇండస్ట్రీస్ పేరుతో కాస్టిక్ సోడా తయారీ యూనిట్, పులివెందులలో ఆదిత్య బిర్లా రెడీమేడ్ గార్మెంట్స్ తయారీ యూనిట్లను ఏర్పాటుచేయగా తాజాగా చిత్తూరు జిల్లాలో రూ.1,700 కోట్లతో కార్బన్ బ్లాక్ తయారీ యూనిట్‌ను ఏర్పాటుచేసింది.
- ఐటీసీ గ్రూపు గుంటూరులో వెల్‌కమ్ గ్రూపు పేరుతో ఫైవ్‌స్టార్ హోటల్ నిర్మించడమేగాక స్పైసెస్ పార్క్‌ను ఏర్పాటు చేసింది.
- హిందుస్థాన్ యూనీ లీవర్ తాజాగా ఆయిల్‌పామ్ రిఫైనరీ యూనిట్‌తోపాటు రాష్ట్రంలో 30,000 హెక్టార్లలో ఆయిల్‌పామ్ సాగును ప్రోత్సహించే విధంగా ఒప్పందం చేసుకుంది.
- అలాగే, వైఎస్సార్ జిల్లా బద్వేల్‌లో సెంచురీ ప్లైవుడ్స్, అనకాపల్లి జిల్లా అచ్యుతాపురంలో జపాన్‌కు చెందిన యకహోమా టైర్ల తయారీ యూనిట్లు కరోనా ఉన్నప్పటికీ రికార్డు సమయంలో యూనిట్లను నిర్మించి ఉత్పత్తి ప్రారంభించి తమ విస్తరణ ప్రణాళికలతో ముందుకెళ్తున్నాయి. ఇలా విశాఖ జీఐఎస్ సదస్సులో రూ.13.11 లక్షల కోట్ల ఒప్పందాలు కుదరడమే కాకుండా ఏడాది కాకుండానే వాటిలో ఇప్పటికే రూ.2.46 లక్షల కోట్ల పెట్టుబడులను వాస్తవ రూపంలోకి తేవడం ద్వారా రాష్ట్ర ప్రభుత్వం రికార్డు సృష్టించింది. వాస్తవాలిలా ఉంటే.. పెట్టుబడులు వెళ్లిపోయాయంటూ రామోజీ ఏ ఆధారాలతో రాశారో చెప్పాలి.

### అమరరాజా చెప్పినా సరే..

ఇక వ్యూహాత్మక వ్యాపార విస్తరణలో భాగంగా అమరరాజా గ్రూపు తెలంగాణలో కొత్తగా పెట్టుబడులను పెట్టింది. రాష్ట్రంలో ప్రస్తుత పెట్టుబడులను కొనసాగిస్తూ ఇక్కడ కూడా విస్తరణ కార్యక్రమాలను చేపడుతోంది. ఇదే విషయాన్ని అమరరాజా గ్రూపే స్వయంగా ప్రకటించింది. కార్పొరేట్ సంస్థలు తమ వ్యాపార ప్రయోజనాల కోసం వివిధ రాష్ట్రాలు, దేశాల్లో పెట్టుబడులు పెడుతుంటాయి. ఉదా.. డాక్టర్ రెడ్డీస్ ల్యాబ్ హైదరాబాద్‌తో పాటు శ్రీకాకుళం, హిమాచల్‌ప్రదేశ్‌లలో యూనిట్లు పెట్టింది. అంతమాత్రానా ఆ సంస్థ తెలంగాణ నుంచి వెళ్లిపోయిందంటూ వార్త రాయగలమా? రామోజీకి చెందిన మార్గదర్శి గ్రూపు కర్ణాటకలో కొత్తగా బ్రాంచీలను ఏర్పాటుచేసింది. అంటే ఏపీ, తెలంగాణ నుంచి మీ గ్రూపు వెళ్లిపోయిందని రాస్తావా రామోజీ? టీడీపీ ఎంపీ గల్లా జయదేవ్ ఈ మధ్య పార్లమెంటు సమావేశాల్లోనే రాజకీయాల్లోకి రావడంవల్ల కేంద్ర, ఈడీ సంస్థల నుంచి ఇబ్బందులు ఎదుర్కొన్నా అన్నారేగానీ ఆయన ఏ రాష్ట్రం గురించి ప్రస్తావించలేదు. కానీ, రాష్ట్ర ప్రభుత్వ వేధింపులవల్ల అమరరాజా రాష్ట్రం నుంచి వెళ్లిపోయిందంటూ రామోజీ రాసి పారేశారు. విశాఖలో అత్యంత ఖరీదైన భూమిని ఇంటర్నేషనల్ కన్వెన్షన్ సెంటర్ నిర్మించడం కోసం లులూ గ్రూపునకు గత ప్రభుత్వం భూమిని కేటాయించింది. కానీ, ఈ భూమికి చెల్లించాల్సిన మొత్తం ఆ గ్రూపు చెల్లించడంలో విఫలమైంది. భూమి ధర మొత్తాన్ని చెల్లిస్తే భూమిని అప్పగిస్తామంటూ ఏపీఐఐసీ పలు లేఖలు రాసినా స్పందన లేకపోవడంతో ఏపీఐఐసీ ఆ భూమిని కేటాయించలేదు.

### ఇది అభివృద్ధి కాదా రామోజీ..

- 2019–20లో జీఎస్‌డీపీలో 22.04 శాతంగా ఉన్న పరిశ్రమల వాటా ఇప్పుడు 23.36 శాతానికి చేరింది.
- వరుసగా మూడేళ్ల నుంచి సులభతర వాణిజ్య ర్యాంకుల్లో ఏపీ అగ్రస్థానంలో నిలుస్తోంది.
- పారిశ్రామిక మౌలిక వసతుల కల్పన లీడ్ ఇండెక్స్–2023లో మన రాష్ట్రం టాప్ అచీవర్‌గా నిలిచింది.
- రూ.1.59 లక్షల కోట్ల ఎగుమతులతో దేశంలో ఆరో స్థానానికి రాష్ట్రం ఎగబాకింది.
- 2019 నుంచి రాష్ట్రంలో 130 లార్జ్ అండ్ మెగా యూనిట్లు ప్రారంభమయ్యాయి.
- ఎగుమతుల సన్నద్ధ రాష్ట్రాల్లో ఏపీ 8వ స్థానానికి చేరింది.

..ఇలా వీటన్నింటి ద్వారా రూ.63,754 కోట్ల పెట్టుబడులు, 77,227 మందికి ఉపాధి లభించింది. అలాగే, ఎంఎస్ఎంఈలతో కలుపుకుంటే రాష్ట్రంలో 3,69,831 యూనిట్లు ఏర్పాటుకావడం ద్వారా రూ.14.18 లక్షల కోట్ల పెట్టుబడులు రానున్నాయి. వీటి ద్వారా ప్రత్యక్షంగా 32,30,425 మందికి ఉపాధి.. పరోక్షంగా 64,60,850 మందికి ఉపాధి లభించనుంది.

# జాతీయ జెండాను చూస్తే గర్వంగా ఉంటుంది

- గవర్నర్ అబ్దుల్ నజీర్
- జగ్గయ్యపేటలో 150 అడుగుల భారీ జాతీయ జెండా ఆవిష్కరణ



**జగ్గయ్యపేట అర్బన్:** మన దేశ జాతీయ జెండాను చూస్తే ఎంతో గర్వంగా ఉంటుందని రాష్ట్ర గవర్నర్ ఎస్.అబ్దుల్ నజీర్ తెలిపారు. జగ్గయ్యపేటలోని విష్ణుప్రియ నగర్‌లో, పురపాలక సంఘం ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన 150 అడుగుల జాతీయ జెండాను శుక్రవారం ఆయన ఆవిష్కరించారు. స్థానిక ఎమ్మెల్యే, ప్రభుత్వ విప్ సామినేని ఉదయభాను అధ్యక్షతన సభ జరిగింది. ఈ సభలో గవర్నర్ మాట్లాడుతూ పంజాబ్‌లోని అమృత్‌సర్ దగ్గర దేశంలోనే ఎత్తయిన 418 అడుగుల భారీ జాతీయ జెండా ఉందని, ఇప్పుడు ఏపీ సరిహద్దులోని జగ్గయ్యపేట వద్ద 150 అడుగుల భారీ జాతీయ జెండా ఏర్పాటు చేయడం సంతోషంగా ఉందన్నారు. దీని ద్వారా జాతీయ జెండా రూపశిల్పి పింగళి వెంకయ్యకు గొప్ప గౌరవం కల్పించారన్నారు. స్వాతంత్ర్యం వచ్చి 2047కు 100 ఏళ్లు అవుతుందని, అప్పటికల్లా భారత్ ప్రపంచంలోనే గొప్పగా వెలిగిపోతుందన్నారు. ఈ జెండా ఏర్పాటు ద్వారా ప్రజల్లో జాతీయ భావం పెంపొందించిన ఎమ్మెల్యే ఉదయభాను అభినందనీయుడన్నారు. కార్యక్రమంలో విజయవాడ ఎంపీ కేశినేని శ్రీనివాస్(నాని), ఎమ్మెల్సీ మొండితోక అరుణకుమార్, ఎన్టీఆర్ జిల్లా కలెక్టర్ ఢిల్లీరావు, జగ్గయ్యపేట మున్సిపల్ చైర్మన్ రంగాపురం రాఘవేంద్ర తదితరులు పాల్గొన్నారు.

# రక్షణ విభాగంలో ప్రైవేట్ రంగానికి అవకాశాలు

- 2035 నాటికి స్వదేశీ పరిజ్ఞానంతో 170 యుద్ధ నౌకలు
- సీఐఐ సదరన్ రీజియన్ కౌన్సిల్‌లో తూర్పు నౌకాదళాధిపతి వైస్ అడ్మిరల్ రాజేష్



సదరన్ రీజియన్ కౌన్సిల్‌లో వైస్ అడ్మిరల్ రాజేష్ తదితరులు

**సాక్షి, విశాఖపట్నం:** భారత రక్షణ విభాగంలో ప్రైవేట్ రంగానికి భారీ అవకాశాలున్నాయని తూర్పు నౌకాదళాధిపతి, వైస్ అడ్మిరల్ రాజేష్ పెంధార్కర్ తెలిపారు. భారత పరిశ్రమల సమాఖ్య(సీఐఐ) సదరన్ రీజియన్ కౌన్సిల్ నగరంలోని ఓ హోటల్‌లో శుక్రవారం నిర్వహించారు. ఈ సదస్సుకు ముఖ్య అతిథిగా హాజరైన వైస్ అడ్మిరల్ పెందార్కర్ మాట్లాడుతూ ఆత్మనిర్భర్ భారత్ ప్రయాణంలో పరిశ్రమల్ని భాగస్వాములుగా చేసే దిశగా అడుగులు పడుతున్నాయనీ.. దీన్లో భాగంగా భారత నౌకాదళం ఆధ్వర్యంలో ఇండస్ట్రీ యాత్రలను ప్రారంభించామని చెప్పారు. ప్రస్తుత పారిశ్రామిక సామర్థ్యాల్ని అంచనా వేసేందుకు మల్టీ డిసిప్లినరీ బృందాలు వివిధ పారిశ్రామిక కారిడార్లను సందర్శించనున్నాయని తెలిపారు. యుద్ధ నౌకలు, జలాంతర్గాముల రూపకల్పన, నిర్మాణ సామగ్రి, యంత్రాలు, పరికరాలు మొదలైనవన్నీ స్వదేశీ పరిజ్ఞానంతో తయారయ్యేలా భారత నౌకాదళం చర్యలు చేపడుతోందన్నారు. 2035 నాటికి సుమారు 170 యుద్ధ నౌకలు, జలాంతర్గాముల్ని స్వదేశీ పరిజ్ఞానంతో తయారు చేస్తున్నామని చెప్పారు. ప్రస్తుతం 67 నౌకలు నిర్మాణంలో ఉన్నాయని, వాటిలో 65 భారత షిప్‌యార్డుల్లో రూపుదిద్దుకుంటున్నాయని వివరించారు. డైరెక్టరేట్ ఆఫ్ ఇండిజినైజేషన్ ఆధ్వర్యంలో స్వదేశీ పరిజ్ఞానంతో 5,629 పరికరాలు ఆవిష్కరణలో ఉన్నాయన్నారు. ప్రస్తుతం రూ.3,218.5 కోట్లతో 107 ప్రాజెక్టులు నిర్వహిస్తుండగా.. ఇప్పటికే రూ.680 కోట్ల విలువైన 52 ఒప్పందాలు పూర్తయ్యాయని ఆయన వివరించారు. ఈ సదస్సులో సీఐఐ సదరన్ రీజియన్ చైర్మన్ కమల్ బాలి, డిప్యూటీ చైర్‌పర్సన్ డా.నందిని, ఆరు దక్షిణాది రాష్ట్రాల నుంచి 60 మంది ప్రముఖులు ఈ కార్యక్రమానికి హాజరయ్యారు.

సమస్త ప్రాణికోటిలో అంతర్యామిగా వుండే, అందరినీ తన వశంలో వుంచుకునే,
అద్వితీయమైన ఏకాకృతి కలిగిన ఆ పరబ్రహ్మ సర్వము తాను ఒక్కడే
అయినప్పటికీ అపూర్వలీలచే నానాప్రకారాలుగా రూపాలు ధరిస్తూంటాడు.
– హైందవ ధర్మం



సాక్షి
శనివారం, 17 ఫిబ్రవరి 2024

## ఇండొనేసియాలో కొత్త ఏలిక

సర్వేలన్నీ జోస్యం చెప్పినట్టు బుధవారం జరిగిన ఇండొనేసియా దేశాధ్యక్ష ఎన్నికల్లో రక్షణమంత్రి, వివాదాస్పద మాజీ సైనికాధికారి జనరల్ ప్రబోవో సుబియాంటో విజయం సాధించారు. అభ్యర్థుల్లో మిగిలినవారితో పోలిస్తే ఓటర్లకు బాగా పరిచయమున్న నేత గనుక తొలి రౌండులో ముందంజలో ఉంటాడని అందరూ అంచనా వేశారు. కానీ నెగ్గటానికి అవసరమైన 50.1 శాతం కనీస ఓట్ల వరకూ వెళ్లగలరని ఎవరూ అనుకోలేదు. ఇండొనేసియా ఎన్నికల నిబంధనల ప్రకారం అభ్యర్థుల్లో ఎవరికీ కనీస ఓట్లు లభించకపోతే తిరిగి పోలింగ్ నిర్వహించకతప్పదు. గతంలో అధ్యక్ష పదవికి రెండు దఫాలు పోటీచేసి ఓడిన సుబియాంటోకు తాజా ఎన్నికల్లో సానుభూతితోపాటు యువత మద్దతు పుష్కలంగా దొరికింది. అందుకే ఆయనకు 60 శాతం ఓట్లు పోలయ్యాయి. సుబియాంటో చరిత్ర ఏమంత ఘనమైనది కాదు. దేశాన్ని దీర్ఘకాలం పాలించిన తన సొంత మామ, నియంత జనరల్ సుహార్తో ప్రాపకంతో సైన్యంలో ఉన్నత పదవులకు ఎగబాకి లెఫ్టినెంట్ జనరల్ స్థాయికి ఎదిగారు. 1997 నాటి విద్యార్థి ఉద్యమాన్ని దారుణంగా అణిచేయటంలో కీలకపాత్ర పోషించారు. ఆ సమయంలో దాదాపు 20 మంది విద్యార్థి నేతల అపహరణలకు సుబియాంటోయే కారణమన్న ఆరోపణలున్నాయి. వారందరూ సైన్యం చిత్రహింసలకు బలైవుంటారని మానవ హక్కుల సంఘాలు ఆరోపించాయి. చిత్రమేమంటే ఆ తర్వాత మరో ఏడాదికే సుహార్తోను గద్దెదించటానికి సుబియాంటో తోడ్పడ్డారు. ఆ తర్వాత తానే ఆ పీఠాన్ని అధిష్ఠించాలని ఉవ్విళ్లూరినా అది సాధ్యపడలేదు. కనీసం సైనిక దళాల చీఫ్ కావాలని కలలుకన్నా సుహార్తో స్థానంలో అధ్యక్షుడైన బీజే హబీబి అందుకు ససేమిరా అంగీకరించలేదు. దాంతో ఆయనపై ఆగ్రహించి కొందరు సైనికులను వెంటబెట్టుకుని అధ్యక్ష భవనంపై దాడికి సిద్ధపడ్డారు. కానీ అది వికటించి సైన్యం నుంచి ఉద్వాసన తప్పలేదు. ఆ తర్వాత జోర్డాన్ పరారై వ్యాపారవేత్తగా అవతరించారు. 2009 అధ్యక్ష ఎన్నికల నాటికి సొంతంగా ఒక పార్టీ స్థాపించి మాజీ దేశాధ్యక్షురాలు మేఘావతి సుకర్ణోపుత్రితో కూటమికట్టి ఉపాధ్యక్షుడిగా పోటీచేశారు. కానీ ఆ కూటమి ఓటమి చవిచూసింది. 2014, 2019 ఎన్నికల్లో అధ్యక్ష పదవికి పోటీ చేసినా ఓటర్లు తిరస్కరించారు. ఆ తర్వాతే సుబియాంటోకు జ్ఞానోదయమైంది. రెండుసార్లూ తనపై గెలిచిన అధ్యక్షుడు జోకోవితో సంధి చేసుకుని రక్షణమంత్రి అయ్యారు. ఈసారి సైతం జోకోవియే పోటీచేసేవారు. కానీ అధ్యక్ష పదవికి వరసగా రెండుసార్లు మించి పోటీ చేయకూడదన్న నిబంధన కారణంగా ఆయన రంగం నుంచి తప్పుకోవాల్సి వచ్చింది.

ప్రపంచంలోనే ఇండొనేసియా మూడో అతి పెద్ద ప్రజాతంత్ర దేశం. జనాభా రీత్యా ముస్లింలు అత్యధికంగా వున్న దేశం. ఆగ్నేయాసియాలో అతి పెద్ద పారిశ్రామిక దేశంగా ఒకప్పుడున్నా 1997లో వచ్చిన ఆర్థిక సంక్షోభంలో దెబ్బతింది. ఆ తర్వాత క్రమేపీ వృద్ధి సాధిస్తూ 2012 నాటికి జీ–20 దేశాల్లో ఆర్థికాభివృద్ధి వైపు దూసుకుపోతున్న నాలుగో అతి పెద్ద దేశంగా ఎదిగింది. 2020లో కోవిడ్ బారిన పడటమేకాక, ఆర్థిక మాంద్యంలో చిక్కుకుంది. ఇప్పుడిప్పుడే తిరిగి పుంజుకుంటున్నా నిరుద్యోగం, అధిక ధరలు వేధిస్తూనే వున్నాయి. దానికితోడు దక్షిణ చైనా సముద్రంలో చైనాతో సరిహద్దు తగాదాలున్నాయి. అయితే ఇరు దేశాల ఆర్థిక సంబంధాలకూ ఆ వివాదం అడ్డురాలేదు. అటు అమెరికా, భారత్‌లతో సాన్నిహిత్యం సాగిస్తూ ఇండొనేసియా ఆర్థికంగా పుంజుకుంటోంది. విదేశీ పెట్టుబడులను ఆకర్షిస్తోంది. అయితే దీర్ఘకాలం నుంచి రాజకీయాల్లో కొనసాగుతూ, ఉద్యమ చరిత్రగల ఇద్దరు నేతలను కాదని మాట నిలకడ, సిద్ధాంత నిబద్ధత లేని సుబియాంటోకు ఈ స్థాయిలో ప్రజలు నీరాజనాలు పట్టడం ఆశ్చర్యకరమే. యువతలో సుబియాంటో పేరు మారుమోగటానికి టిక్‌టాక్, ఇన్‌స్టాగ్రామ్ వంటి మాధ్యమాలు దోహదపడ్డాయి. సర్వే నిర్వహించిన సంస్థలకు ఓటర్లు... మరీ ముఖ్యంగా యువ ఓటర్లు ఆయన గత చరిత్ర తమకు అనవసరమని చెప్పటం సుబియాంటోకున్న జనాకర్షణను తెలియజేస్తుంది. గతంలో దేశాధ్యక్ష పదవికి పోటీచేసిన రెండుసార్లూ తన సైనిక గతాన్ని ఘనంగా చెప్పుకున్న సుబియాంటో ఈసారి ఆ జోలికి పోలేదు. సైనికాధికారిగా పనిచేసిన కాలంలో తూర్పు తైమూర్‌లో స్వాతంత్ర్యం కోసం పోరాడుతున్నవారిని హతమార్చటం, యువతకు ఉద్యోగావకాశాలు కల్పించాలని ఉద్యమించిన విద్యార్థి నేతలను మాయం చేసి వారి ప్రాణాలు తీయటంవంటి అంశాల్లో అమెరికా, ఆస్ట్రేలియా గతంలో తీవ్ర ఆగ్రహం వ్యక్తంచేశాయి. ఆయనపై నిషేధం కూడా విధించాయి.

మూడో అతి పెద్ద ప్రజాస్వామిక దేశమైన ఇండొనేసియాలో క్రమేపీ వ్యవస్థలు బలహీనపడుతుండటం అందరిలోనూ ఆందోళన కలిగిస్తోంది. ఈసారి సుబియాంటో తరఫున ఉపాధ్యక్ష పదవికి నిలబడిన 36 ఏళ్ల గిబ్రాన్ నేపథ్యమే ఈ సంగతి చెబుతుంది. కనీసం 40 ఏళ్లుంటే తప్ప ఉపాధ్యక్ష పదవికి పోటీచేయటానికి వీల్లేదని ఎన్నికల నిబంధనలు చెబుతున్నా రాజ్యాంగ న్యాయ స్థానం చీఫ్ జస్టిస్‌గా వున్న గిబ్రాన్ మామ ఈ నిబంధనను సవరించి అతనికి సాయపడ్డాడు. దీనిపై ఆందోళన చెలరేగి చీఫ్ జస్టిస్ రాజీనామా చేయాల్సివచ్చినా, ఆ తీర్పు మాత్రం రద్దుకాలేదు. 20 కోట్ల మంది ఓటర్లలో అత్యధికుల మనసు గెలుచుకున్న సుబియాంటో అంతంతమాత్రంగా వున్న వ్యవస్థలను మరింత బలహీనపరుస్తారని ఆయన ఎన్నికల ప్రసంగాలే చెబుతున్నాయి. మానవ హక్కుల చార్టర్, రాజ్యాంగ న్యాయస్థానం వంటివి కనుమరుగైతే ఇండొనేసియా తిరిగి నియంతృత్వంలోకి జారుకుంటుంది. ఆర్థికాభివృద్ధి దెబ్బతింటుంది. ప్రజల అప్రమత్తతే ఆ ప్రమాదాన్ని నివారించాలి.

# రైతుల డిమాండ్లకు చెవి ఒగ్గాలి!

విశ్లేషణ



ప్రొ॥ ప్రమోద్ కుమార్

**పార్లమెంట్ ఎన్నికలు సమీపిస్తున్న తరుణంలో మళ్లీ పంజాబ్ రైతులు నిరసన బాట పట్టారు. కనీస మద్దతు ధరకు చట్టబద్ధతను అందించే మార్గాలను కనుగొనడానికి ఒక కమిటీని ఏర్పాటు చేస్తామన్న కేంద్రం వాగ్దానం విషయంలో ఆలస్యమే ఈ నిరసనకు ఒక ప్రేరేపకం. ఎన్నికల వేళ మాత్రమే రాజకీయ పార్టీలు మాట వింటాయనేది మరొక కారణం. అయితే, 2020 నాటి రైతుల ఆందోళనకు 32 సంఘాల సమ్మేళనం నాయకత్వం వహించింది. ఈసారి నిరసనలకు అంత విస్తృత మద్దతు లేదు. అయినప్పటికీ, మునుపటి కంటే డిమాండ్లు నిర్మాణాత్మకంగా కనిపిస్తున్నాయి. ప్రపంచ వాణిజ్య సంస్థ నుండి భారత్ వైదొలగడం, స్వామినాథన్ కమిషన్ సిఫార్సుల అమలు, రైతులు, రైతుకూలీలకు పింఛన్లు వంటివి ఇందులో ఉన్నాయి.**

రానున్న 2024 పార్లమెంటరీ ఎన్నికలు విరుద్ధమైన అవగాహనలకు సాక్షీభూతంగా నిలుస్తున్నాయి. ప్రతిపక్షాల కుల గణన డిమాండ్‌కు బీజేపీ తలొగ్గుతుందనే భావన పోయి, అయోధ్యలో రామ మందిర ప్రారంభోత్సవం తర్వాత బీజేపీ ప్రయోజనం పొందుతుందనే అభిప్రాయం వైపు లోలకం సూచీ కదిలింది. అయితే, సమాఖ్య నిధుల్లో తమ వాటా కోసం కేంద్రాన్ని డిమాండ్ చేస్తున్న దక్షిణాది ప్రాంతీయ పార్టీలు మాత్రం ఈ కథనాన్ని సవాలు చేస్తున్నాయి. ఈ పరిణామాల మధ్యనే పంజాబ్ రైతులు ఢిల్లీ వైపు కవాతు చేసేందుకు ప్రయత్నిస్తున్నారు. ఈ నిరసనకు పలు రైతు సంఘాలు మద్దతు తెలుపడంతో ఎన్నికల ముందు మరోసారి రంగం సిద్ధమైంది. ఢిల్లీ సరిహద్దులో బలగాలను మోహరించి, భారీగా బారికేడ్లు ఏర్పాటు చేశారు. అయితే, డిమాండ్ల స్వభావం, పాల్గొంటున్న సంఘాలు, ప్రభుత్వ ప్రతిస్పందన వంటి అనేక అంశాలలో, 2020 రైతుల నిరసనలకు ప్రస్తుత నిరసన భిన్నంగా ఉంది.

ప్రస్తుతం ఢిల్లీ సరిహద్దుల్లో కొనసాగుతున్న నిరసనలకు జగ్జీత్ సింగ్ డల్లేవాల్, సర్వన్ సింగ్ పంధేర్ నేతృత్వంలోని సంయుక్త కిసాన్ మోర్చా నాయకత్వం వహిస్తోంది. వీరు మునుపటి రైతుల నిరసనలో ప్రముఖులు కాదు. దర్శన్ పాల్, బల్బీర్ సింగ్ రాజేవాల్ నేతృత్వం వహిస్తున్న రెండు గ్రూపులు భారత్ బంద్‌కు వేర్వేరుగా పిలుపునిచ్చాయి. హరియాణాలో మితిమీరిన ప్రభుత్వాధికార వినియోగానికి వ్యతిరేకంగా భారత్ కిసాన్ యూనియన్(ఉగ్రాహాన్) రైల్ రోకోకు ప్రత్యేక పిలుపునిచ్చింది.

2020లో మొదలైన రైతుల ఆందోళనకు సైద్ధాంతికంగా సమర్థమైన 32 సంఘాల సమ్మేళనం నాయకత్వం వహించింది. పైగా అది పంజాబ్ కేంద్రంగా మాత్రమే జరగలేదు. అందులో పశ్చిమ ఉత్తర ప్రదేశ్, హరియాణా నుండి కూడా రైతులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు. ఈసారి మాత్రం ఉత్తరప్రదేశ్, రాజస్థాన్, మధ్యప్రదేశ్ రాష్ట్రాలు ఇప్పటికి చాలావరకు మౌనంగా ఉన్నాయి. అలాగే రాకేశ్ టికైత్, గుర్నామ్ సింగ్ చధూనీ నేతృత్వంలోని యూనియన్లు ప్రస్తుతం ఆందోళనలో భాగం కాకూడదని నిర్ణయించుకున్నాయి.

అంతకుముందటి నిరసన ఉద్యమం... పౌర సమాజ కార్యకర్తలు, కళాకారులు, నిపుణులు, పదవీ విరమణ చేసిన పౌర సేవకులు, ఉపాధ్యాయులు, విద్యార్థుల నుండి విస్తృత మద్దతును పొందింది. రాడికల్ మితవాదులు కూడా తమ సొంత కథనాలతో అందులోకి వచ్చారు కానీ వారు కేంద్రస్థానంలోకి ప్రవేశించలేదు. ఉద్యమానికి ప్రగతిశీల రైతులు నాయకత్వం వహించడం, వారికి మతకుల అనుబంధాలకు అతీతంగా ఉదారవాదులు మద్దతునివ్వడం వల్ల రాడికల్ మితవాద రాజకీయాల పాత్ర పరిమితమైంది. కానీ ప్రస్తుత



నిరసనకు విస్తృతమైన మద్దతు లేదు. పైగా గుర్తింపు రాజకీయాల వెంపర్లాట కూడా దీని వెనుక ఉంటోంది. నేడు రైతు సంఘాలలోని మూడు ప్రధాన వర్గాలు ఒకే బ్యానర్ కింద ఐక్యం కాలేదు. అవి ఒక దానితో ఒకటి పోటీ పడుతున్నాయి. సంయుక్త కిసాన్ మోర్చా (రాజకీయేతరమైన గ్రూప్) ఇతర యూనియన్లను అధిగమించి నాయకత్వ స్థానంలోకి ప్రవేశించింది. పంజాబ్ ప్రభుత్వ మద్దతుతో కేంద్ర ప్రభుత్వంతో చర్చలు జరపడానికి సిద్ధమైంది.

డిమాండ్ల విషయానికొస్తే, ప్రస్తుత నిరసనలు మునుపటి కంటే నిర్మాణాత్మకంగా కనిపిస్తున్నాయి. ప్రపంచ వాణిజ్య సంస్థ నుండి భారతదేశం వైదొలగడం, వ్యవసాయ రుణాల మాఫీ, స్వామినాథన్ కమిషన్ సిఫార్సుల అమలు, కనీస మద్దతు ధరకు చట్టపరమైన హామీ, రైతులు– రైతు కూలీలకు పెన్షన్లు, 2020–21 నిరసనల సందర్భంగా రైతులపై దాఖలైన కేసుల ఉపసంహరణ, నష్టపరిహారం వంటివి ఇందులో ఉన్నాయి. నిరసన కాలంలో మరణించిన రైతులకూ, 'లఖీంపూర్ ఖీరీ ఘటన' బాధితులకూ న్యాయం జరిగేలా చూడటం, వ్యవసాయ చట్టాల రద్దు తర్వాత 2021లో బీజేపీ చేసిన వాగ్దానాలపై దృష్టి పెట్టడం కూడా డిమాండ్లలో ఉన్నాయి.

మరోవైపు, సరిహద్దుల్లో భారీగా కంచెలు వేయడం, ఘాజీపూర్, సింఘు, టిక్రి సరిహద్దుల్లో 144 సెక్షన్ విధించడం చూస్తుంటే ప్రస్తుత నిరసనపై ప్రభుత్వ ప్రతిస్పందన ఇప్పుడు కూడా ప్రతిచర్యగానే కనిపిస్తోంది. పంజాబ్, హరియాణాల్లో అనేక ప్రాంతాలలో ఇంటర్నెట్ సేవలను నిలిపివేశారు. పంజాబ్, హరియాణా సరిహద్దులను రాజస్థాన్ మూసివేసింది. అనేక జిల్లాలలో నిషేధాజ్ఞలను విధించింది. వారి 'ఢిల్లీ ఛలో' ప్రకటనకు ముందే, రైతులతో చర్చలు ప్రారంభించినప్పటికీ, 2021లో చేసిన వాగ్దానాలపై కేంద్రప్రభుత్వం ఇంకా స్పందించలేదు.

అలాగే, నిరసన ప్రదేశంలో టియర్ గ్యాస్ వాడకం, డ్రోన్ల ద్వారా పొగ బాంబులు వేయడం, రాళ్లు రువ్వడం, వాహనాలను సీజ్ చేయడం, రైతులను పోలీసులు నిర్బంధించడం వంటి ఘటనలు అలాగే కొనసాగుతున్నాయి. క్రితంసారి మితిమీరిన బలప్రయోగం జరిపిన అనుభవం నుంచి ప్రభుత్వం పాఠాలేమీ నేర్చుకున్నట్టు లేదు. ఎందుకంటే, మితిమీరిన బలప్రయోగం చేయడం... నిరసనను తీవ్ర దారుల్లోకి మళ్లించాలనుకునేవారికి ఊతమిస్తుంది.

2020లో జరిగిన రైతుల నిరసన నుండి ఇతర పాఠాలు కూడా ఉన్నాయి. అది రైతుల విజయంతో ముగిసింది, అయితే 700 కంటే ఎక్కువ మంది ప్రాణాలు కోల్పోయారు. 1990లలో ప్రారంభమైన ఆర్థిక సంస్కరణల ఎజెండాకు వ్యతిరేకంగా ఇది మొదటి, సుదీర్ఘ పోరాటం. అన్నదాతలు ఆకలితో అలమటిస్తున్న వేళ వ్యవసాయ వ్యాపారం (అగ్రి బిజినెస్) మాత్రం విపరీతంగా లాభాలు ఆర్జించడం విడ్డూరం. ఆహార ధాన్యాలకు కొత్త మార్కెట్లు లేకపోవడం, నీటి మట్టం తగ్గడం లాంటి కారణాలనే వ్యవసాయ సంక్షోభానికి కారణాలుగా చూపడం పరిస్థితి తీవ్రతను తగ్గించడమే అవుతుంది.

ఆహారమే ఇప్పుడు రాజకీయం. ఇది కేవలం పరిపాలన, చట్టపరమైన చర్యల ద్వారా మాత్రమే పరిష్కారం కాదు. ఆహార సార్వభౌమాధికారం, ఆహార భద్రత, రైతుల జీవనోపాధికి సంబంధించిన సమస్యల పరిష్కారానికి రాజకీయ సంకల్పం అవసరం. కేంద్రం అన్ని రాజకీయ పార్టీలను భాగం చేస్తూ, దీర్ఘకాలిక పరిష్కారాలను కనుగొనడంలో నిమగ్నం కావాలి. దీన్నొక ఓట్ల వ్యవహారంగా చూడకూడదు. వ్యవసాయాన్ని ప్రపంచంతో పోటీపడేలా చేయాలంటే, సబ్సిడీలు ఇవ్వాలి. తమ వాణిజ్య వ్యవసాయాన్ని నిలబెట్టుకోవడానికి, అభివృద్ధి చెందిన దేశాలు కూడా భారీ సబ్సిడీలు ఇస్తున్నాయి.

క్రితంసారి రైతులు వీధుల్లోకి వచ్చిన ఘటన నుండి మరొక పాఠం ఏమిటంటే, ప్రభుత్వం అన్ని భాగస్వామ్య పక్షాలతో సంప్రదింపుల తర్వాతే చట్టాలను రూపొందించాలి. లేకపోతే, అది ప్రజలకు విషాదాన్నీ, నాయకత్వానికి ఇబ్బందినీ కలిగిస్తుంది. మూడు వ్యవసాయ చట్టాలను ఉపసంహరించుకున్న కేంద్రం, కనీస మద్దతు ధరకు చట్టబద్ధమైన మద్దతును అందించే మార్గాలను కనుగొనడానికి ఒక కమిటీని ఏర్పాటు చేయాలని ప్రతిపాదించింది. ఈ వాగ్దానంపై చొరవ విషయంలో ఆలస్యమే ఇప్పుడు తమ నిరసనను ప్రారంభించేందుకు రైతులకు తగిన కారణాన్ని అందించింది. రాజకీయ నాయకత్వం కేవలం నిరసనలకు మాత్రమే స్పందిస్తుందనీ, ఎన్నికల వేళ మాత్రమే ప్రజల వాణిని వింటుందనే భావన ట్రిగ్గర్‌గా పనిచేసింది.

*వ్యాసకర్త చండీగఢ్‌లోని ఇన్‌స్టిట్యూట్ ఫర్ డెవలప్‌మెంట్ అండ్ కమ్యూనికేషన్ చైర్‌పర్సన్*

## సోషల్ మీడియా

సోషల్ నెట్ వర్కింగ్ వెబ్‌సైట్లు ఫేస్‌బుక్, ట్విట్టర్‌లలో సెలబ్రిటీల 'మనసులోని మాట'లు తాజాగా ఇలా...!

### ఎగిరేలా ప్రేరణ



కవితా చౌధరీ మరణ వార్త దిగ్భ్రాంతికరం. ఆమె సృజన 'ఉడాన్' తన కాలానికి అత్యంత ప్రేరణాత్మక ధారావాహిక (దూరదర్శన్‌లో 1989–91 మధ్య ప్రసారమైంది). ఇండియన్ సివిల్ సర్వీసె స్‌లో ఇప్పుడు అత్యున్నత స్థానాల్లో ఉన్న చాలామంది మహిళలు తాము ఉడాన్ వల్ల ప్రేరణ పొందామని నాతో అన్నారు. ఆమె అద్వితీయమైన దర్శకురాలు.

– శేఖర్ కపూర్, దర్శకుడు

### అమెరికా ఆట



ఒక సిక్కు మిలిటెంటు (హర్‌దీప్ సింగ్ నిజ్జార్) హత్య గురించి భారత్‌తో (కెనడా ప్రధాని) ట్రూడో ఘర్షణ పడటం వెనుక బైడెన్(అమెరికా) ప్రభుత్వం ఉన్నదని ఇప్పుడు స్పష్టమవుతోంది. కెనడాతో అమెరికా పంచుకున్న అవిశ్వసనీయ నిఘా సమాచారమే దీనికి కారణం.

– బ్రహ్మ చెల్లానీ
వ్యూహాత్మక అంశాల నిపుణుడు

### చంపేశారా!



అలెక్సీ నవాల్నీ 47 ఏళ్ల వయసులో కారాగారంలో చనిపోయారు. ఆయన (రష్యా అధ్యక్షుడు) పుతిన్‌కు కఠినమైన విమర్శకుడు. తనకు ఏం జరగగలదో తెలిసీ రష్యాకు తిరిగి వచ్చారు.

– విక్రమ్ చంద్ర, సంపాదకుడు

### ఉల్లంఘన



పార్లమెంట్ ఎన్నికలు సమీపిస్తున్న సమయంలో ప్రతిపక్ష పార్టీ బ్యాంక్ అకౌంట్లను స్తంభింప జేయడం, స్వేచ్ఛా ఎన్నికల సూత్రాన్ని ఉల్లంఘించడం కాదా?

– సుహాస్ పల్శీకర్, ప్రొఫెసర్

### సహనశీలతే నాయకగుణం



గల్ఫ్ ప్రాంతంతో ఇండియా సంబంధాలు పెరుగుతుండటం పట్ల పాకిస్తాన్ అసౌకర్యంగా ఉండటం, కశ్మీర్‌లో పాకిస్తాన్ తీవ్రవాద బాధితురాలిగా నాకు చాలా ఓదార్పునిస్తోంది. తనను తాను ఇస్లాం సంరక్షకురాలిగా భావించుకునే పాకిస్తాన్‌కు బదులుగా, సహనశీలమైన యూఏఈ లాంటి దేశం ముస్లిం ప్రపంచానికి నాయకత్వం వహించాలి.


– సోనమ్ మహాజన్, వ్యాఖ్యాత

ఇన్ బాక్స్

## నాస్తికోద్యమ యోధుడు

సుమారు యాభై ఏళ్ల పాటు నాస్తిక జెండాను మోస్తూ మూఢ నమ్మకాల నిర్మూలనకై నిర్విరామ కృషి చేసిన డా॥ జయగోపాల్ ఫిబ్రవరి 7న విశాఖ పట్నంలో తుదిశ్వాస విడిచారు. 'ఆంధ్ర పెరియార్'గా పిలువబడే జయగోపాల్‌ను గుర్తు చేసుకుంటూ ఎందరో అభిమానులు నివాళులు అర్పిస్తున్న సందర్భం ఇది. భౌతిక వాదిగా డా॥ జయగోపాల్ కార్యాచరణ ఎంతో సుదీర్ఘమైనది.

జయగోపాల్ తొలుత కొంతకాలం నాస్తిక కేంద్రం 'గోరా'తో కలిసి పని చేశారు. 1972 ఫిబ్రవరి 13న ఆయన 'భారత నాస్తిక సమాజం' (భానాస) ఏర్పాటు చేశారు. నాస్తిక, హేతువాద ఉద్యమ వ్యాప్తికై ఎన్నో పల్లెలు, పట్టణాలు తిరిగి రకరకాల కార్యక్రమాలు నిర్వహించారు. సమైక్య ఆంధ్రప్రదేశ్‌లోనే కాకుండా ఎనిమిది రాష్ట్రాలలో నాస్తికవాదాన్ని విస్తరింపజేశారు. దళితులపై దాడులకు వ్యతిరేకంగా అనేక సాహసిక ఉద్యమాలలో భాగమయ్యారు.



డా॥ జయగోపాల్

నాస్తికోద్యమ వ్యాప్తి కోసం జయ గోపాల్ వందలాది వ్యాసాలు దేశ విదేశీ పత్రికల్లో రాశారు. నాలుగైదు భాషల్లో వివిధ రాష్ట్రాల్లో ఉపన్యాసాలు ఇచ్చారు. సాంస్కృతిక, భౌతిక వాద భావజాల వ్యాప్తి కోసం పదుల సంఖ్యలో పుస్తకాలు రాశారు. 'నాస్తిక యుగం' అనే పత్రికను స్థాపించి 40 సంవత్సరాలు నడిపారు. ఇంగ్లీషులో 'ఏజ్ ఆఫ్ ఎథియిజం' అనే పత్రికను నడిపారు. అంతర్జాతీయ స్థాయిలో 'నాస్తిక పౌరహక్కుల కేంద్రం' స్థాపించి దాని గుర్తింపు కోసం ఐక్య రాజ్య సమితిని కోరారు. మానవ హక్కుల ఉప సంస్థగా దానిని ఐరాస పరిగణించింది. ఇప్పటికీ ఆయనకు సమితితో ఉత్తరాల అనుబంధం ఉంది. ప్రపంచంలోని ఆలోచనాపరుల రక్షణ కోసం జర్మనీలో అంతర్జాతీయ కమిటీని ఏర్పాటు చేశారు. దాని ద్వారా ప్రపంచవ్యాప్త మానవ హక్కుల కార్యకర్తలకు అండగా నిలబడుతూ పోరాటం చేశారు. అంతర్జాతీయ సేవలకు గుర్తింపుగా ఆయన 'బ్రేవ్ మైండ్' అవార్డును అందుకున్నారు.

ఆయన నాస్తిక ఉద్యమకారుడే కాదు, హక్కుల ఉద్యమకారుడు కూడా. విశాఖ పౌర హక్కుల సంఘానికి జిల్లా కార్యదర్శిగా ఒక దశాబ్ద కాలం పని చేశారు. 'భానాస'కు అనుబంధంగా 'కులాంతర వివాహితుల పరిరక్షణ సమితి'ని స్థాపించి వందలాది కులాంతర, మతాంతర వివాహాలు నిర్వహించారు. పెరియార్ 144వ జయంతి సందర్భంగా 2023 సెప్టెంబర్ 17 నాడు జయగోపాల్ చేతుల మీదుగా భారత నాస్తిక సమాజం వెబ్‌సైట్ ప్రారంభమైంది. నాస్తికోద్యమకారుడిగా అంతర్జాతీయ గుర్తింపు పొందిన డా॥ జయగోపాల్ కృషి శ్లాఘనీయం. ఆయన సంస్థలను, వాటి ఆశయాలను ముందుకు నడిపించడమే ఆయనకు ఉత్తమ నివాళి.

– బి. నర్సన్, హైదరాబాద్



# దయ్యాలు వేదాలు వల్లించడం అంటే ఇదే!

అభిప్రాయం



అడుసుమిల్లి జయప్రకాష్

అధికారంలో ఉన్నప్పుడు కళ్లు మూసుకుని, పదవీ విరమణ తర్వాత తగుదునమ్మా అంటూ టీడీపీకి రాజకీయ ప్రయోజనం కలిగించేందుకు రిటైర్డ్ ఐఏఎస్ అధికారులు ఊరూరా తిరుగుతున్నారు. హింసలేని ఎన్నికలు, స్వేచ్ఛ అంటూ పెద్ద మాటలు చెబుతున్నారు. కాపాడే అధికారం ఉన్నప్పుడు ఏం చేశారని పౌర సమాజం ప్రశ్నిస్తోంది.

ఇటీవల కాలంలో 'సిటిజన్స్ ఫర్ డెమొక్రసీ' (సీఎఫ్‌డీ) పేరుతో ఏపీ ఎన్నికల మాజీ ప్రధాన అధికారి నిమ్మగడ్డ రమేశ్‌కుమార్, ఏపీ ప్రభుత్వ మాజీ ప్రధాన కార్యదర్శి డాక్టర్ ఎల్వీ సుబ్రహ్మణ్యం తదితరులు సమావేశాలతో హడావిడి చేస్తున్నారు. సిటిజన్స్ ఫర్ డెమొక్రసీ ప్రధాన లక్ష్యం స్వేచ్ఛగా, ప్రజాస్వామ్య బద్ధంగా ఎన్నికల్లో ఓటు హక్కును ఉపయోగించుకోవడం అని ప్రకటించారు. ఇదే నిమ్మగడ్డ రమేశ్‌కుమార్ ఏపీ రాష్ట్ర ఎన్నికల అధికారిగా ఉన్న కాలంలో, స్థానిక సంస్థల్లో ఏకగ్రీవాలు ఎక్కువయ్యాయనీ, అలాగే నామినేషన్లు వేయనివ్వడం లేదనీ, దౌర్జన్యాలు నెరిగాయనీ పెద్ద ఎత్తున విపక్షాలు ఫిర్యాదు చేయడం గమనార్హం.

ఎల్వీ సుబ్రహ్మణ్యాన్ని ప్రభుత్వ ప్రధాన కార్యదర్శిగా తొలగించడంతో ఆయనకు ప్రజాస్వామ్యం, స్వేచ్ఛ లాంటివి గుర్తు కొస్తున్నాయి. ఈయన అప్రజాస్వామికంగా వ్యవహరిస్తున్నారని గతంలో ఎన్నికల సమయంలో చంద్రబాబు తీవ్ర ఆరోపణలు చేశారనే విషయాన్ని మరిచిపోతే ఎలా?

సీఈసీ విడుదల చేసిన వివరాల ప్రకారం 2019లో ఆంధ్రప్రదేశ్‌లో జరిగిన ఎన్నికల్లో 79.74 శాతం ఓట్లు పోలయ్యాయి. నరసరావుపేట పార్లమెంటరీ నియోజకవర్గంలో అత్యధికంగా 85.53 శాతం పోలయ్యాయి. అలాగే 2014 ఎన్నికల్లో రాష్ట్రంలో 74.64 శాతం ఓట్లు పోలయ్యాయి. బాపట్ల పార్లమెంటరీ నియోజకవర్గంలో అత్యధికంగా 85.16 శాతం ఓట్లు పోలయ్యాయి. అంటే, రాష్ట్ర విభజన జరిగిన మొదటి ఐదేళ్లకే ఇక్కడి ప్రజల్లో కలిగిన చైతన్యం కారణంగా 2019 ఎన్నికల్లో చంద్రబాబును ఇంటికి పంపడం కోసం, మరో ఐదు శాతం మంది కొత్తగా ఓటింగ్‌లో పాల్గొన్నారన్నమాట. ఇక్కడి గణాంకాలు ఇలా ఉన్నప్పుడు, 'ప్రజాస్వామ్య పరిరక్షణ' పేరుతో మళ్ళీ ఓటు–హక్కు అంటూ, వీరి కసరత్తు ఎందుకు? ఈ ఐఏఎస్ అధికారులతో పీవీ రమేష్ అనే మరొక ఐఏఎస్ కలిశారు. వీరు కలిగించే చైతన్యం అంతా బెజవాడ కేంద్రంగానే సాగడం గమనార్హం.

'ప్రజాస్వామ్య పరిరక్షణ' పేరుతో నిమ్మగడ్డ బృందం నిర్వహిస్తున్న సభల్లో గెస్ట్ పాత్రల్లో పాల్గొంటున్నవారి విషయమై పౌరులు బాధపడుతున్నారు. రిటైర్ అయ్యాక కూడా వైసీపీ ప్రభుత్వంలో చక్రం తిప్పబోయి క్షతగాత్రులైన ఈ ముగ్గురు అధికారులు తమకంటూ ఇక్కడ ఒక విలువ లేక, 'మీడియా అటెన్షన్' కోసం, మాజీ భారత ఎన్నికల కమిషనర్ వీఎస్ సంపత్, కేబినెట్ సెక్రటరీ కె. పద్మనాభయ్యలను తమ పక్కన పెట్టుకుంటున్నారు.

ఎందుకు ఈ మాజీ అధికారులను క్షతగాత్రులు అనవలసివచ్చిందో తెలియాలి. నిమ్మగడ్డ రమేష్ కుమార్ స్పెషల్ చీఫ్ సెక్రెటరీ కేడర్‌లో ఏదో ఒక ప్రధాన శాఖలో కాకుండా, చంద్రబాబు కోసం తన సర్వీస్ చివరి రోజు వరకూ రాజ్ భవన్‌లో గవర్నర్ సెక్రటరీగా పనిచేశారు. రాష్ట్ర విభజనకు ముందు 4 నెలల పాటు రాష్ట్రపతి పాలన ఉండడం మనకు తెలిసిందే. అప్పట్లో గవర్నర్ ఇ.ఎస్.ఎల్. నరసింహన్ ఆఫీస్ కేంద్ర–రాష్ట్ర ప్రభుత్వాల్లో అన్ని కీలక నిర్ణయాలకు కేంద్రం అయింది. ఇలా టీడీపీ రాజకీయ ప్రయోజనాల కోసం పనిచేయడం మొదటి నుంచి నిమ్మగడ్డకు కొత్తకాదు. అందుకే 2016లో రిటైర్ అయిన మరుసటి రోజు ఇతణ్ణి రాష్ట్ర ఎన్నికల కమిషనర్ పోస్ట్‌లో చంద్రబాబు నియమించారు.

అదే నెలలో ఆయన కుమార్తె నిమ్మగడ్డ లావణ్యను ఏపీ 'ఎకనమిక్ డెవలప్మెంట్ బోర్డ్'లో సీనియర్ కన్సల్టెంట్‌గా నెలకు రూ 1.50 లక్షల జీతంతో నియమించారు. అయితే ప్రభుత్వం మారడంతో ఉపాధి కోల్పోయి, పౌర వేదిక ముసుగులో జగన్ మోహన్ రెడ్డి ప్రత్యర్థి తరహాలో ఇప్పుడు నిమ్మగడ్డ వ్యవహరిస్తున్నారు. ఇప్పుడు ఈ ప్రభుత్వం మారితే, మళ్ళీ 'ఫ్యామిలీ ప్యాకేజీ' ప్రయోజనాలు పొందడం ఆయన లక్ష్యం. అందుకోసం 'ఈ ప్రభుత్వంలో సలహాదారులు ఎంతమంది? వీరు కేబినెట్ హోదాలో ఉంటూ రాజకీయాలు ఎలా మాట్లాడతారు?' అంటూ రమేష్ టీడీపీ తరఫున విమర్శలు చేస్తున్నారు. టీడీపీ ప్రభుత్వంలో ఇప్పటికంటే ఎక్కువమంది సలహాదారులు, 'కన్సల్టెంట్లు' ఉన్న విషయం తెలియనిది కాదు.

'స్కిల్ స్కామ్'లో అరెస్టయిన 'ఏ 1' గంటా సుబ్బా



రావు, ముందస్తు బెయిల్ తెచ్చుకున్న 'ఏ 2' ఐఏఎస్ లక్ష్మీనారాయణలు ఇద్దరూ ఇదే తరహాలో బయట నుంచి ప్రభుత్వం 'కన్సల్టెంట్స్'గా నియమించిన వారేకదా! ప్రభుత్వంలో సలహాదారులు రాజకీయాలు మాట్లాడ్డం నేరమా? లేక నమ్మకంగా ప్రభుత్వంలో ఉంటూ, దొంగ దారుల్లో నిధులు బయటకు పంపడం నేరమా? ఈ రెండింటిలో ఏది ప్రజాస్వామ్యానికి చేటు? అని రాష్ట్ర ప్రజలు ఈ నిమ్మగడ్డ బృందాన్ని నిలదీయొద్దా? 'రాజ్యాంగ స్ఫూర్తికి విరుద్ధం...' అంటూ పెద్దపెద్ద మాటలు మాట్లాడుతున్న నిమ్మగడ్డ, బెజవాడలో రాష్ట్ర ప్రధాన ఎన్నికల అధికారి సీటులో కూర్చుని, తన తప్పుడు చర్యలకు తగిన శిక్ష నుంచి తప్పించుకోవడానికి క్రింది ఉద్యోగులతో 'కంప్యూటర్ హార్డ్ డిస్క్'లు ధ్వంసం చేయించడం ఏ స్ఫూర్తి అవుతుందో చెప్పగలరా?

అసలు ఎల్వీ సుబ్రహ్మణ్యంను సీఎస్‌గా నియమించడమే ఓ ప్రహసనం! ఎన్నికల కోడ్ అమలులో ఉన్నప్పుడు సీఎస్‌గా ఉన్న అనిల్ చంద్ర పునేఠా చంద్రబాబు కనుసన్నల్లో పనిచేస్తూ ఉండడంతో, భారత ఎన్నికల కమిషనర్ వెంటనే అయన్ని తొలగించి, క్రీడలు యువజన సర్వీసులు సెక్రటరీగా ఉన్న సుబ్రహ్మణ్యంను సీఎస్ పోస్టులో నియమించింది. అయితే, జగన్ మోహన్ రెడ్డి ముఖ్యమంత్రి అయ్యాక, సీఎం పరిపాలనా శైలి వేగాన్ని అందుకోలేని స్థితిలో ఉన్న ఎల్వీ స్థానంలో మరొకరిని సీఎస్ పోస్టులో నియమించారు. అదీ ఎల్వీ ఆక్రోశానికి కారణం. దాంతో, నిమ్మగడ్డ వెనుక తిరుగుతూ జగన్ ప్రభుత్వం మీద ముసుగు దాడికి దిగారు.

ఇందులో ముఖ్యుల ఎంపిక ఎవరిదోగానీ, ఆసక్తికరంగా ఉంది. అంబేడ్కరిస్టుల కుటుంబం నుంచి మాజీ ఐఏఎస్ పీవీ రమేష్ కొంచెం ఆలస్యంగా ఇందులోకి దిగారు. 'స్కిల్ స్కామ్' జరిగినప్పుడు, ఆర్థిక శాఖ ముఖ్య కార్యదర్శిగా ఉన్న ఈయన కేస్ సమయంలో 'మీడియా' ముందు వివాదాస్పదంగా మాట్లాడి వార్తల్లో వ్యక్తి అయ్యారు. సర్వీసులో ఎక్కువకాలం పలుదేశాల్లో 'వరల్డ్ బ్యాంక్'లో పనిచేశానని చెప్పుకునే రమేష్, ప్రస్తుతం 'ఇండియన్ బిజినెస్ స్కూల్'లో 'ఫ్యాకల్టీ'గా పనిచేస్తూ, మధ్యలో ప్రజాస్వామ్య పరిరక్షణకు బెజవాడ వస్తున్నారు. అయితే, ఇక్కడ ఈ ప్రభుత్వం ఏర్పాటు చేసిన అంబేడ్కర్ విగ్రహం గురించి ఈయన ఒక్క మాటా మాట్లాడరు!

వీరంతా 'పొలిటికల్ జేఏసీ'గా ఏర్పడి, దానికి 'సిటిజన్స్ ఫర్ డెమొక్రసీ' అని పేరుపెట్టి ఏపీలో తటస్థ ఓటరును ప్రభావితం చేయాలనే రహస్య 'ఎజెండా'తో పనిచేస్తున్నారు. వీరికి 'మీడియా' కవరేజి కోసం 'బాబు మీడియా' ఎటూ ఉండనే ఉంది. ఏతా వాతా చెప్పొచ్చేది ఏమిటంటే... ప్రజలు అంతా గమనిస్తున్నారు. తగిన సమయంలో తగినవిధంగా స్పందిస్తారు.

*వ్యాసకర్త మాజీ ఎమ్మెల్యే । 98481 28844*

గ్రహం అనుగ్రహం

శ్రీ శోభకృత్ నామ సంవత్సరం, ఉత్తరాయణం, శిశిర ఋతువు, మాఘ మాసం, తిథి: శు.అష్టమి ప.1.19 వరకు, తదుపరి నవమి, నక్షత్రం: కృత్తిక ప.1.40 వరకు, తదుపరి రోహిణి, వర్జ్యం: తె.5.31 నుండి 7.04వరకు (తెల్లవారితే ఆదివారం), దుర్ముహూర్తం: ఉ.6.31 నుండి 8.02 వరకు, అమృతఘడియలు: ఉ.11.20 నుండి 12.51 వరకు ; రాహుకాలం: ఉ.9.00 నుండి 10.30 వరకు, యమగండం: ప.1.30 నుండి 3.00 వరకు, సూర్యోదయం: 6.30, సూర్యాస్తమయం: 5.57.

# నిరసన గళం మూగబోయింది

## జైల్లోనే మరణించిన రష్యా విపక్ష నేత నవాల్నీ

**పుతిన్ పనేనంటూ ఇంటాబయటా విమర్శలు ● పుతిన్‌కు చెమటలు పట్టించిన హక్కుల నేత**



**మాస్కో:** రష్యాలో మరో అసమ్మతి గళం శాశ్వతంగా మూగబోయింది. మూడేళ్లుగా నిర్బంధంలో ఉన్న విపక్ష నేత, హక్కుల ఉద్యమకారుడు 47 ఏళ్ల అలెక్సీ నవాల్నీ అనుమానాస్పద పరిస్థితుల్లో మృతి చెందారు. ''ఆయన శుక్రవారం ఉదయం వాకింగ్ అనంతరం అస్వస్థతకు గురయ్యారు. ఆ వెంటనే అపస్మారక స్థితిలోకి జారుకున్నారు. కాపాడేందుకు వైద్యులు ఎంత ప్రయత్నించినా, తక్షణం అంబులెన్సు రప్పించినా లాభం లేకపోయింది'' అని జైలు వర్గాలు తెలిపాయి. అయితే మరణానికి కారణమేమిటో బయట పెట్టలేదు. దశాబ్దానికి పైగా అధ్యక్షుడు వ్లాదిమిర్ పుతిన్ కంట్లో నలుసుగా మారి ఆయనకు ప్రబల ప్రత్యర్థిగా ఎదిగిన నవాల్నీ మృతిపై తీవ్ర అనుమానాలు తలెత్తుతున్నాయి. ఇది కచ్చితంగా ప్రభుత్వ హత్యేనని విమర్శలు వెల్లువెత్తుతున్నాయి. 2018లో రష్యా అధ్యక్ష పదవి కోసం పుతిన్‌తో పోటీ పడేందుకు విఫలయత్నం చేసిన నవాల్నీ, నాటినుంచీ ప్రభుత్వ అవినీతిపై పోరును తీవ్రతరం చేశారు. పలు స్థాయిల్లో పెచ్చరిల్లిన అవినీతిని బయటపెడుతూ సంచలనం సృష్టిస్తూ వచ్చారు. దాంతో ప్రభుత్వం ఆయన్ను నిర్బంధించడమే గాక దేశద్రోహం తదితర అభియోగాలు మోపింది. 19 ఏళ్ల జైలు శిక్ష అనుభవిస్తున్న నవాల్నీని మాస్కో సమీపంలోని జైలు నుంచి గత డిసెంబర్‌లో దాదాపు 2,000 కిలోమీటర్ల దూరంలోని స్పెషల్ రెజీమ్ పీనల్ కాలనీకి తరలించారు. అతి శీతల ఆర్కిటిక్ ప్రాంతంలోని ఈ కాలనీ రష్యాలోకెల్లా అత్యంత కఠినమైన పరిస్థితులుండే కారాగారం. వచ్చే నెలలో రష్యాలో అధ్యక్ష ఎన్నికలున్న నేపథ్యంలో ఇది కచ్చితంగా ఆయన గొంతు నొక్కే ప్రయత్నమేనని అభిమానులు అప్పుడే ఆందోళనలకు దిగారు. ఈ ఎన్నికల్లో పుతిన్‌ను సవాలు చేసే గట్టి ప్రత్యర్థి లేకపోయినా 'నవాల్నీ ఫ్యాక్టర్' ఆయన్ను బాగా చీకాకు పరుస్తోంది. నవాల్నీ అనుయాయులతో పాటు నానాటికీ పెరిగిపోతున్న అభిమాన గణం సోషల్ మీడియా ద్వారా పుతిన్ వ్యతిరేక ప్రచారంతో దేశమంతటా హోరెత్తిస్తోంది. దేశ విదేశాల్లోని పుతిన్ అపార ఆస్తుల చిట్టాను కొద్ది రోజులుగా ఒక్కొక్కటిగా విప్పుతూ ఫొటోలు, వీడియోలతో సహా బయట పెడుతూ వస్తోంది. వాటికి మిలియన్ల కొద్దీ వ్యూస్, లక్షలాది లైక్‌లు వచ్చి పడుతున్నాయి! ఈ నేపథ్యంలో నవాల్నీ 'మృతి' పుతిన్ పనేనని భావిస్తున్నారు. దీనిపై పాశ్చాత్య దేశాలన్నీ స్పందించాయి. పుతిన్ అణచివేతను నవాల్నీ ఆజన్మాంతం అత్యంత ధైర్యసాహసాలతో ఎదిరించారంటూ పలు దేశాధినేతలు కొనియాడారు.

### విషప్రయోగం జరిగినా...

మూడున్నరేళ్ల క్రితం ప్రాణాంతక విష ప్రయోగం జరిగినా వెరవని గుండె ధైర్యం నవాల్నీది! ఆయన 2020 ఆగస్టులో సైబీరియా పర్యటన ముగించుకుని తిరిగొస్తుండగా 'నొవిచోక్' దాడికి గురయ్యారు. రష్యాకే ప్రత్యేకమైన ఆ ప్రాణాంతక రసాయనాన్ని నవాల్నీ లో దుస్తులపై చల్లినట్టు తర్వాత తేలింది. నాడీ మండలాన్ని నేరుగా దెబ్బ తీసే నొవిచోక్ ప్రభావానికి విమానంలోనే ఆయన అపస్మారక స్థితిలోకి వెళ్లిపోయారు. అనుయాయులు హుటాహుటిన జర్మనీకి తరలించడంతో ప్రాణాపాయం తప్పింది. నెలల తరబడి చికిత్స తర్వాత కోలుకున్నాక పుతిన్‌పై 'అండర్‌ప్యాంట్స్ (లో దుస్తుల) పాయిజనర్' అంటూ చెణుకులు విసిరారు. దాంతో అండర్‌ప్యాంట్స్ పదబంధం ఒక్కసారిగా రష్యా సోషల్ మీడియాలో పాపులరైంది. దానిపై లెక్కలేనన్ని మీమ్స్ కూడా పుట్టుకొచ్చాయి. నిర్బంధం ఖాయమని తెలిసి కూడా ఆరోగ్యం చక్కబడుతూనే 2021 జనవరిలో నవాల్నీ రష్యా తిరిగొచ్చారు. మాస్కోలో విమానం దిగీ దిగగానే ఆయన్ను నిర్బంధంలోకి తీసుకుని జైలుకు తరలించారు. చివరికి జైల్లోనే ప్రాణాలు కోల్పోయారు.

### నవ్వుతూనే కన్పించారు...

నవాల్నీ చివరిసారిగా గురువారం బయటి ప్రపంచానికి కన్పించారు. ఓ కేసు విచారణలో వీడియో లింక్ ద్వారా పాల్గొన్నారు. ఆరోగ్యంగా ఉండటమే గాక సరదాగా నవ్వుతూ, విచారణ సందర్భంగా జడ్జితోనూ జోకులు వేస్తూ గడిపారు.



### పుతినే బాధ్యుడు: భార్య

నవాల్నీ మరణ వార్తలపై ఆయన భార్య యూలియా నవాల్నయా అనుమానాలు వెలిబుచ్చారు. శుక్రవారం మ్యూనిచ్ భద్రతా సదస్సులో మాట్లాడుతూ ఆమె కన్నీటి పర్యంతమయ్యారు. ''నా భర్త మృతి నిజమే అయితే అందుకు పుతిన్, ఆయన అనుచర గణమే బాధ్యులు. ఎప్పటికైనా వారు శిక్ష నుంచి తప్పించుకోలేరు'' అన్నారు. సదస్సులో పాల్గొన్న అమెరికా విదేశాంగ మంత్రి ఆంటోనీ బ్లింకెన్ తదితర నేతలు ఆమెను ఓదార్చారు.

### సాహసమే శ్వాస...

మాస్కో శివారు ప్రాంతమైన బుటిన్‌లో జన్మించిన నవాల్నీ మాస్కోలో లా డిగ్రీ అనంతరం విదేశాల్లో పై చదువులు పూర్తి చేశారు. ప్రభుత్వ అవినీతిని ప్రశ్నించడం ద్వారా పుతిన్ వ్యతిరేకునిగా తెరపైకి వచ్చారు. రష్యా చమురు, గ్యాస్ కంపెనీల్లో వాటాలు కొనుగోలు చేసి వాటిలోని విచ్చలవిడి అవినీతిని బయట పెట్టారు. 2008 నుంచీ ఆయన పేరు క్రమంగా రష్యా అంతటా పాకింది. దాంతో 2012లో నవాల్నీ అరెస్టుల పర్వం మొదలైంది. 2014లో ఆశ్చర్యకరంగా జైలు నుంచి విడుదల చేయడంతో మాస్కో మేయర్ ఎన్నికల బరిలో దిగారు. ప్రచార మార్గాలన్నింటినీ మూసేసినా పుతిన్ బలపరిచిన అభ్యర్థికి గట్టి పోటీ ఇవ్వడంతో నవాల్నీ పేరు మారుమోగిపోయింది. దాంతో ప్రభుత్వం మళ్లీ అరెస్టుల పర్వానికి తెర తీసింది. చివరికి 2018 అధ్యక్ష ఎన్నికల్లో పోటీకి అనర్హునిగా ప్రకటించడంతో ప్రజల దృష్టిలో నవాల్నీ మళ్లీ హీరోగా మారారు. రష్యాలో రెండు దశాబ్దాలుగా విపక్ష నేతలు, పుతిన్ విమర్శకులు, వ్యతిరేకులు నిర్బంధం పాలవడం, అనుమానాస్పద పరిస్థితుల్లో మరణించడం పరిపాటిగా మారింది. విపక్ష నేత బోరిస్ నెమ్‌త్సోవ్‌ను 2015లో పుతిన్ అధికార నివాసం క్రెమ్లిన్ ప్రాసాదానికి కూతవేటు దూరంలోనే కాల్చి చంపారు. పుతిన్‌ను విమర్శించిన వాగ్నర్ గ్రూప్ బాస్ ప్రిగోజిన్ 2023 ఆగస్టులో 'విమాన ప్రమాదం'లో మరణించాడు. ప్రభుత్వంపై విమర్శలు చేసి అకాల మరణం పాలైన రష్యా కుబేరుల జాబితా చాలా పెద్దది. నవాల్నీ మాత్రం పుతిన్‌ను గట్టిగా సవాలు చేస్తూ ప్రబల ప్రత్యర్థిగా ఎదుగుతూ వచ్చారు. సోషల్ మీడియాను, స్వతంత్ర మీడియాను సమర్థంగా వాడుకుంటూ చెమటలు పట్టించారు. భౌతిక దాడులు, హత్యాయత్నాలను ఏమాత్రం లెక్కచేయని తీరు ఆయనకు అసంఖ్యాకంగా అభిమానులను సంపాదించి పెట్టింది.



2018లో మాస్కోలో ప్రభుత్వ వ్యతిరేక ర్యాలీలో నవాల్నీ

### నిరసనలు... ఆగ్రహావేశాలు

నవాల్నీ మృతి పట్ల ప్రపంచవ్యాప్తంగా నిరసనలు, ఆగ్రహావేశాలు వ్యక్తమవుతున్నాయి. ఇది పుతిన్ పనేనంటూ అమెరికా అధ్యక్షుడు జో బైడెన్ మండిపడ్డారు. నవాల్నీ కుటుంబానికి ప్రగాఢ సంతాపం తెలిపారు. అధికారాన్ని కాపాడుకునేందుకు ఎవరినైనా అంతమొందించడం పుతిన్ నైజమంటూ ఉక్రెయిన్ అధ్యక్షుడు వొలోదిమిర్ జెలెన్‌స్కీ దుయ్యబట్టారు. ఆయన సర్వం కోల్పోవడంతో పాటు తన తప్పిదాలకు బాధ్యునిగా శిక్ష అనుభవించి తీరాల్సిందేనన్నారు. నవాల్నీ తన అసమాన ధైర్యసాహసాలకు జీవితాన్నే మూల్యంగా చెల్లించాల్సి రావడం బాధాకరమని జర్మనీ చాన్సలర్ ఒలాఫ్ స్కొల్జ్ ఆవేదన వెలిబుచ్చారు. అడుగడుగునా ప్రాణాపాయం పొంచి ఉన్నా మొక్కవోని ధైర్యసాహసాలు ప్రదర్శించడం నవాల్నీకే చెల్లిందంటూ బ్రిటన్ ప్రధాని రిషి సునాక్ కొనియాడారు. ఆయన్ను రష్యా ప్రభుత్వమే క్రూరంగా పొట్టన పెట్టుకుందని లాత్వియా అధ్యక్షుడు రింకేవిక్స్ ఆరోపించారు. తాను అత్యంత బలహీనుడినని ఈ చర్యతో పుతిన్ రుజువు చేసుకున్నారని అమెరికా విదేశాంగ మంత్రి ఆంటోనీ బ్లింకెన్ అభిప్రాయపడ్డారు. రష్యాలో స్వేచ్ఛా గళాలపై ఉక్కుపాదం మోపుతున్నారంటూ ఫ్రాన్స్ అధ్యక్షుడు ఇమ్మాన్యుయేల్ మాక్రాన్ మండిపడ్డారు. సొంత ప్రజల అసమ్మతి పుతిన్‌ను విపరీతంగా వణికిస్తోందని మరోసారి రుజువైందని ఈయూ కమిషన్ ప్రెసిడెంట్ ఉర్సులా వాండర్ లియన్ అన్నారు. పుతిన్ ఆదేశాల మేరకే నవాల్నీ హత్య జరిగిందని ప్రపంచ మాజీ చెస్ చాంపియన్, రష్యా విపక్ష నేత గారీ కాస్పరోవ్ తదితరులు దుమ్మెత్తిపోశారు.

## నేడు జీఎస్ఎల్‌వీ సీ14 ప్రయోగం



**సూళ్లూరుపేట(తిరుపతి జిల్లా):** వాతావరణ ఉపగ్రహం ఇన్‌శాట్–3డీఎస్‌ను మోసుకెళ్లే జీఎస్ఎల్‌వీ ఎఫ్14 ఉపగ్రహ వాహక నౌక ప్రయోగానికి శుక్రవారం మధ్యాహ్నం కౌంట్‌డౌన్ మొదలైంది. తిరుపతి జిల్లా సతీష్ ధవన్ స్పేస్ సెంటర్ నుంచి శనివారం సాయంత్రం 5.35 గంటలకు దీనిని ప్రయోగించనున్నారు. గతంలో ప్రయోగించిన ఇన్‌శాట్–3డీ, ఇన్‌శాట్–3డీఆర్ ఉపగ్రహాలకు కొనసాగింపుగానే ఇన్‌శాట్–3డీఎస్‌ని పంపుతున్నట్లు ఇస్రో వెల్లడించింది. సుమారు 2,275 కిలోల బరువైన ఈ ఉపగ్రహంలో అత్యాధునిక సాంకేతిక పరిజ్ఞానంతో రూపొందించిన పేలోడ్లున్నాయి. ఈ పేలోడ్లు వాతావరణ అంచనా, విపత్తు హెచ్చరికల కోసం మెరుగైన వాతావరణ పరిశీలన, భూమి, సముద్ర ఉపరితలాల పర్యవేక్షణ విధులను చేపడతాయి. ప్రయోగం మొదలైన 20 నిమిషాల తర్వాత జియోసింక్రనస్ ట్రాన్స్‌ఫర్ ఆర్బిట్(జీటీవో)లో శాటిలైట్‌ను ప్రవేశపెడతారు. అనంతరం దశల వారీగా రెండు రోజులపాటు కక్ష్యను మారుస్తూ జియో స్టేషనరీ ఆర్బిట్‌లోకి మారుస్తారు.

## సముద్రంలోకి కార్టోశాట్–2

**బెంగళూరు:** పాత ఉపగ్రహాలతో ఆయా కక్ష్యల్లో పెరిగిపోతున్న అంతరిక్ష చెత్తను కాస్తయినా తగ్గించే లక్ష్యంతో ఇస్రో మరో అడుగు ముందుకేసింది. దాదాపు 17 సంవత్సరాల క్రితం ప్రయోగించాక చాలా ఏళ్లు దేశానికి సేవలందించిన కార్టోశాట్–2 ఉపగ్రహాన్ని ఇస్రో విజయవంతంగా భూవాతావరణంలోకి తీసుకొచ్చి హిందూ మహాసముద్రంలో పడేలా చేసింది. ఫిబ్రవరి 14వ తేదీ మధ్యాహ్నం 3.48 గంటలకు ఈ ప్రక్రియ విజయవంతంగా పూర్తయిందని ఇస్రో శుక్రవారం ప్రకటించింది. పట్టణ ప్రణాళికలకు సాయపడేలా అత్యంత స్పష్టమైన హై రెజల్యూషన్ ఇమేజీలు తీసేందుకు 2007 జనవరి పదో తేదీన 680 కేజీల ఇస్రో కార్టోశాట్–2 ఉపగ్రహాన్ని 635 కిలోమీటర్ల ఎత్తులోని కక్ష్యలో విజయవంతంగా పంపింది. ఇది 2019 ఏడాదిదాకా పనిచేసింది. తర్వాత కక్ష్య తగ్గించుకుంటూ క్రమంగా భూవాతావరణంలోకి ప్రవేశించి అత్యంత వేగంగా తిరుగుతూ మండి, ధ్వంసమై అతి చిన్న ముక్కలుగా మారిపోనుంది. అలా కావడానికి సాధారణంగా 30 సంవత్సరాల సమయం పడుతుంది. ఈలోపు ఉపగ్రహాలుండే కక్ష్యల్లో అంతరిక్ష చెత్తను తగ్గించేందుకు ముందుగానే దీనిని భూవాతావరణంలోకి రప్పించారు.

## రూ.84,560 కోట్లతో సైనిక సామగ్రి

**న్యూఢిల్లీ:** దేశ సైనిక బలగాల యుద్ధ పటిమను గణనీయంగా పెంచే రూ.84,560 కోట్ల విలువైన పలు ఆయుధ వ్యవస్థల కొనుగోలుకు రక్షణ శాఖ పచ్చజెండా ఊపింది. కొనుగోలుకు సంబంధించిన ప్రతిపాదనలకు రక్షణ మంత్రి రాజ్‌నాథ్ సింగ్ సారథ్యంలోని డిఫెన్స్ అక్విజిషన్ కౌన్సిల్(డీఏసీ)ఆమోదం తెలిపింది. కొత్త తరం యాంటీ ట్యాంక్ మందుపాతరలు, ఎయిర్ డిఫెన్స్ టాక్టికల్ కంట్రోల్ రాడార్లు, హెవీ వెయిట్ టోర్పెడోలు, మధ్యశ్రేణి, మల్టీ మిషన్ యుద్ధ విమానాలు, ఫ్లయిట్ రీఫ్యూయలర్ విమానాలు, అధునాతన రేడియో వ్యవస్థలు ఇందులో ఉన్నట్లు రక్షణ శాఖ తెలిపింది. వీటి చేరికతో నేవీ, కోస్ట్‌గార్డ్, ఎయిర్‌ఫోర్స్ పాటవం గణనీయంగా పెరుగుతాయని పేర్కొంది.

## సీపీఐ (ఎంఎల్)ఎమ్మెల్యేపై అనర్హత వేటు

**పట్నా:** సీపీఐ(ఎంఎల్)లిబరేషన్ పార్టీకి చెందిన ఎమ్మెల్యే మనోజ్ మంజిల్‌ను బిహార్ అసెంబ్లీ అనర్హుడిగా ప్రకటించింది. ఓ హత్య కేసులో న్యాయస్థానం ఆయనకు జీవిత ఖైదు విధిస్తూ తీర్పు వెలువరించినందున, ప్రజాప్రాతినిధ్య చట్టంలోని సెక్షన్ 8 ప్రకారం ఈ నిర్ణయం తీసుకున్నట్లు విధాన సభ సెక్రటేరియట్ తెలిపింది. కోర్టు శిక్ష ప్రకటించిన ఫిబ్రవరి 13వ తేదీ నుంచి అనర్హత అమల్లోకి వస్తుందని శుక్రవారం జారీ చేసిన నోటిఫికేషన్‌లో తెలిపింది. భోజ్‌పూర్ జిల్లా తరారీ స్థానం నుంచి మంజిల్ ప్రాతినిధ్యం వహిస్తున్నారు. ఎనిమిదేళ్ల క్రితం నాటి హత్య కేసు విచారించిన ఎంపీ/ఎమ్మెల్యే కేసుల ప్రత్యేక కోర్టు మంజిల్‌ను దోషిగా నిర్ధారించిన విషయం తెలిసిందే. తాజా పరిణామంతో బిహార్ అసెంబ్లీలో వామపక్షాల బలం 11కు తగ్గినట్లయింది.

## నేటి నుంచి బీజేపీ సమావేశాలు

**సాక్షి, న్యూఢిల్లీ:** రాబోయే లోక్‌సభ ఎన్నికల్లో బీజేపీ సొంతంగానే 370 స్థానాలు, జాతీయ ప్రజాస్వామ్య కూటమి(ఎన్డీయే) 400కు పైగా సీట్లు గెలుచుకోవడం తథ్యమని ప్రధానమంత్రి నరేంద్ర మోదీ ధీమా వ్యక్తం చేస్తున్నారు. ఈ లక్ష్య సాధనలో భాగంగా బీజేపీ జాతీయ కార్యవర్గ సమావేశాలు నిర్వహించబోతున్నారు. ఢిల్లీలోని భారత్ మండపంలో శనివారం నుంచి రెండు రోజుల పాటు జరిగే ఈ సమావేశాలకు ఏర్పాట్లు పూర్తయ్యాయి. దేశవ్యాప్తంగా అన్ని రాష్ట్రాల నుంచి 11,500 మందికిపైగా బీజేపీ ముఖ్య నేతలు, ప్రజాప్రతినిధులు పాల్గొనబోతున్నారు. తెలంగాణ, ఆంధ్రప్రదేశ్ నుంచి ఇప్పటికే వందలాది మంది బీజేపీ నేతలు, కార్యకర్తలు ఢిల్లీ చేరుకున్నారు. బీజేపీ జాతీయ అధ్యక్షుడు జేపీ నడ్డా అధ్యక్ష ప్రసంగంతో శనివారం మధ్యాహ్నం ప్రారంభమయ్యే జాతీయ కార్యవర్గ సమావేశాలు ఆదివారం సాయంత్రం ప్రధాని నరేంద్ర మోదీ ప్రసంగంతో ముగుస్తాయి.

## గాజా ఆస్పత్రిని చుట్టుముట్టిన ఐడీఎఫ్

**ఆక్సిజన్ నిల్వలు అడుగంటి అయిదుగురు రోగులు మృతి**

**రఫా:** ప్రాణాలతో మిగిలి ఉన్న బందీలను హమాస్ మిలిటెంట్లు నాసిర్ ప్రాంగణం అడుగునున్న సొరంగాల్లో దాచినట్లు ఇజ్రాయెల్ రక్షణ బలగాలు (ఐడీఎఫ్)అనుమానిస్తున్నాయి. దీంతో, వారం రోజులుగా ఆస్పత్రిని దిగ్బంధించి అణువణువూ శోధిస్తున్నాయి. గత ఏడాది అక్టోబర్ 7వ తేదీ దాడితో సంబంధమున్నట్లుగా అనుమానిస్తున్న 20 మందిని అదుపులోకి తీసుకుని ప్రశ్నిస్తున్నట్లు ఐడీఎఫ్ తెలిపింది. ఆస్పత్రిలోని 460 మందికి పైగా సిబ్బంది, రోగులను ఎలాంటి సౌకర్యాలు లేని ఆ పక్కనే ఉన్న పాతభవనంలోకి తరలివెళ్లాలని ఆర్మీ ఆదేశించింది. విద్యుత్ సరఫరా నిలిపివేయడంతోపాటు, ఆక్సిజన్ నిల్వలు అడుగంటడంతో ఐసీయూలోని ఆరుగురు రోగుల్లో ఐదుగురు చనిపోయినట్లు గాజా అధికారులు శుక్రవారం తెలిపారు.

## కాంగ్రెస్ ఖాతాల స్తంభన

- అప్పిలేట్ ట్రిబ్యునల్‌ను ఆశ్రయించడంతో పునరుద్ధరణ
- ప్రజాస్వామ్యంపై దాడి: కాంగ్రెస్

**న్యూఢిల్లీ:** ఎలక్టోరల్ బాండ్ల విధానాన్ని రద్దుచేస్తూ సర్వోన్నత న్యాయస్థానం ఇచ్చిన తీర్పుతో మోదీ సర్కార్‌కు గట్టి ఎదురుదెబ్బ తగిలిన మరుసటి రోజే కాంగ్రెస్ పార్టీ బ్యాంక్ ఖాతాలను ఆదాయ పన్ను శాఖ స్తంభింపజేయడం కలకలం సృష్టించింది. 2018–19 ఆర్థిక సంవత్సరానికి సంబంధించిన కేసులో ఐటీ రిటర్నుల్లో రూ.210 కోట్ల వ్యత్యాసం ఉన్న నేపథ్యంలో వాటి రికవరీ కోసం ఆయా ఖాతాలను ఐటీ శాఖ స్తంభింపజేసినట్లు వార్తలొచ్చాయి. పార్టీ ప్రధాన ఖాతాలను ఫ్రీజ్ చేయడంతో కాంగ్రెస్ వేగంగా స్పందించింది. వెంటనే ఐటీ, ఐటీ అప్పిలేట్ ట్రిబ్యునల్(ఐటీఏటీ)ను ఆశ్రయించింది. దీంతో ట్రిబ్యునల్ కాస్త కాంగ్రెస్‌కు అనుకూలంగా ఆదేశాలిచ్చింది. ఆయా ఖాతాల్లో మొత్తంగా రూ.115 కోట్లు అలాగే నిల్వ ఉంచి మిగతాది మాత్రమే విత్‌డ్రా, ఇతరత్రా అవసరాలకు వాడుకోవచ్చని సూచించింది. వెంటనే ఆయా ఖాతాలను డీ ఫ్రీజ్ చేయాలని ఐటీ అధికారులను ఆదేశించింది. ట్రిబ్యునల్ ఆదేశాలతో సంబంధిత ఖాతాలన్నీ పునరుద్ధరించబడ్డాయి. ట్రిబ్యునల్ ఈ అంశంపై బుధవారం మరోసారి వాదనలు విననుంది. ఫ్రీజ్ చేసిన ఖాతాల్లో యూత్ కాంగ్రెస్ ఖాతాలూ ఉన్నాయి. ఖాతాల స్తంభనపై మోదీ సర్కార్‌పై కాంగ్రెస్ పార్టీ తీవ్రస్థాయిలో ధ్వజమెత్తింది. '' 2018–19 ఆర్థికంలో ఐటీ రిటర్నులను కాస్త ఆలస్యంగా సమర్పించాం. ఎమ్మెల్యేలు, ఎంపీలు తమ జీతభత్యాలను పార్టీకి విరాళాల రూపంలో ఇచ్చారు. అలాంటి కొన్ని మొత్తాలు ఐటీ రిటర్నుల్లో ప్రతిబింబించలేదు. అంతమాత్రానికే ప్రధానమైన తొమ్మిది ఖాతాలను స్తంభింపజేస్తారా?' అని కాంగ్రెస్ తీవ్ర ఆగ్రహం వ్యక్తంచేసింది. దీనిపై పార్టీ కోశాధికారి అజయ్ మాకెన్ మాట్లాడారు. '' ఖాతాల్లో ఉన్న మొత్తంలో రూ.115 కోట్లే అత్యంత ఎక్కువైనది. సిబ్బంది జీతభత్యాలు, విద్యుత్ బిల్లులు చెల్లించడానికి మిగతా డబ్బు అస్సలు సరిపోదు. రాబోయే లోక్‌సభ ఎన్నికల వేళ ఇలా ఖాతాలను ఫ్రీజ్ చేస్తే ఎన్నికల్లో పార్టీ భాగస్వామి కావడం చాలా కష్టం'' అని మాకెన్ అన్నారు.

### భయపడకండి మోదీ జీ: రాహుల్

ఈ వ్యవహారంపై రాహుల్ గాంధీ స్పందించారు. '' భయపడకండి మోదీ జీ! కాంగ్రెస్ ప్రజాశక్తికి కాంగ్రెస్ చిరునామా. నియంతృత్వం ముందు మోకరిల్లేది లేదు'' అన్నారు. అధికార దాహంతో లోక్‌సభ ఎన్నికల వేళ దేశంలోని అతిపెద్ద ప్రతిపక్ష పార్టీ ఖాతాలను ప్రభుత్వం స్తంభింపచేసిందని కాంగ్రెస్ చీఫ్ మల్లికార్జున ఖర్గే దుయ్యబట్టారు. కాంగ్రెస్ ఆరోపణలను బీజేపీ తిప్పికొట్టింది. మోదీ మూడోసారి పగ్గాలు చేపట్టాక ఇలాంటి ఆరోపణలకు కాంగ్రెస్ చాలా సమయం దొరుకుతుందంటూ కేంద్ర మంత్రి రాజీవ్ చంద్రశేఖర్ ఎద్దేవాచేశారు.

## దిగ్గజ భారత చెఫ్ ఖురేషి అస్తమయం



**న్యూఢిల్లీ:** మొగలుల కాలంనాటి దమ్ పుఖ్త్ వంట విధానాన్ని దేశవ్యాప్తంగా ప్రాచుర్యంలోకి తెచ్చిన ప్రముఖ పాకశాస్త్ర దిగ్గజం ఇంతియాజ్ ఖురేషి తుదిశ్వాస విడిచారు. ఆయన వయసు 93 సంవత్సరాలు. లక్నో ప్రాంతంలో మాత్రమే వాడే వంట పాత్ర మూత చివర్ల నుంచి గాలి పోకుండా పిండి ముద్దను చుట్టే (ధమ్ పుఖ్త్) టెక్నిక్‌ను ప్రాచుర్యంలోకి తెచ్చిన ఘనత ఆయనదే. ప్రాచీన అవధ్ వంటకాలనూ ఆయన కొత్త తరహాలో సృష్టించారు. బుఖారా వంటకాలను కనిపెట్టింది కూడా ఖురేషీనే. 1979లో ఐటీసీ హోటల్స్‌లో చేరి ప్రధాన చెఫ్ స్థాయికి ఎదిగారు. ఎందరో దేశ, విదేశీ ప్రముఖులకు తన వంటకాలు రుచు చూపి ఔరా అనిపించారు. ఆహార ప్రియులకు పరిచయం అక్కర్లేని వ్యక్తి అయిన ఖురేషీ వంటలంటే పడిచచ్చే వాళ్ల జాబితా చాలా పెద్దది. ప్రధాని, రాష్ట్రపతి విశిష్ట అతిథుల ప్రత్యేక విందుల్లో ఆయనే స్పెషల్ వంటకాలు వండేవారు. 2016లో పద్మశ్రీ పొందారు. ఈ అవార్డ్ అందుకున్న తొలి పాకశాస్త్ర ప్రవీణుడు ఖురేషీనే.

## విష వలయంలో కాంగ్రెస్

**బంధుప్రీతి, వారసత్వ రాజకీయాలు ● నన్ను వ్యతిరేకించడమే అజెండా: మోదీ**

**జైపూర్/రేవాడీ:** కాంగ్రెస్‌పై ప్రధాని నరేంద్ర మోదీ మరోసారి విరుచుకుపడ్డారు. ఆ పార్టీ బంధుప్రీతి, వారసత్వ రాజకీయాల విష వలయంలో చిక్కుకుందని, అందుకే నాయకులంతా బయటకు వెళ్లిపోతున్నారని చెప్పారు. తనను వ్యతిరేకించడమే కాంగ్రెస్ ఏకైక అజెండాగా మారిపోయిందని మండిపడ్డారు. ''కాంగ్రెస్‌కు దశ, దిశ లేవు. భవిష్యత్తులో చేయాల్సిన అభివృద్ధి పట్ల విజన్, రోడ్డు మ్యాప్ లేవు'' అన్నారు. శుక్రవారం జైపూర్‌లో 'వికసిత్ భారత్, వికసిత్ రాజస్తాన్' సభనుద్దేశించి మోదీ వర్చువల్‌గా ప్రసంగించారు. రోడ్లు, రైల్వేలు, సౌర శక్తి, విద్యుత్ సరఫరా, తాగునీరు, పెట్రోలియం, సహజ వాయువు తదితర రంగాలకు చెందిన రూ.17,000 కోట్ల విలువైన ప్రాజెక్టులకు శంకుస్థాపన చేశారు.

### వికసిత్ భారత్ అంటే...

ప్రజలకు ఇచ్చిన గ్యారంటీలను తాము అమలు చేస్తుంటే కొందరికి నిద్ర పట్టడం లేదని మోదీ అన్నారు. వికసిత్ భారత్, మేక్ ఇన్ ఇండియా, వోకల్ ఫర్ లోకల్ వంటివి తాము ప్రారంభించిన పథకాలు కావడంతో వాటి గురించి కాంగ్రెస్ మాట్లాడడం లేదని ఆరోపించారు. మోదీ ఏం మాట్లాడినా, ఏం చేసినా కాంగ్రెస్ వ్యతిరేకిస్తోందని, దీనివల్ల దేశానికి భారీ నష్టం కలిగే అవకాశం ఉన్నా ఆ పార్టీ లెక్కచేయడం లేదని మండిపడ్డారు. ఇలాంటి ప్రతికూల రాజకీయాలు యువతకు ఏమాత్రం స్ఫూర్తిని ఇవ్వబోవని తేల్చిచెప్పారు. ఇటీవలే యూఏఈలో పర్యటించానని, భారత్ సాధిస్తున్న ప్రగతిని చూసి అక్కడి నేతలు ఆశ్చర్యం వ్యక్తం చేశారని ప్రధాని మోదీ వెల్లడించారు. వికసిత్ భారత్ అంటే కేవలం కొన్ని పదాలు లేదా భావోద్వేగం కాదని వివరించారు. దేశంలో ప్రతి కుటుంబాన్ని సౌభాగ్యవంతంగా మార్చే, పేదరికాన్ని తొలగించే, ఉపాధి అవకాశాలు సృష్టించే, ఆధునిక వసతులు కల్పించే కార్యక్రమం అని తెలియజేశారు. తన దృష్టిలో యువత, మహిళలు, రైతులు, పేదలు అనే నాలుగు కులాలు మాత్రమే ఉన్నాయని ప్రధానమంత్రి మరోసారి వివరించారు. హరియాణాలోని రేవాడీలో ఎయిమ్స్‌కు మోదీ శంకుస్థాపన చేశారు. పలు ప్రాజెక్టులను ప్రారంభించారు. అనంతరం బహిరంగ సభలో మాట్లాడారు. రాముడు కేవలం ఊహేనని, ఆయోధ్యలో ఆలయం అవసరం లేదని అన్న కాంగ్రెస్ ఇప్పుడు జైశ్రీరామ్ అంటూ నినాదాలు చేస్తోందని ఎద్దేవా చేశారు.



## అదానీ లబ్ధి కోసమే అగ్నివీర్: రాహుల్

**న్యూఢిల్లీ/మొహానియా:** పారిశ్రామికవేత్త అదానీకి ప్రయోజనం కలిగించేందుకే కేంద్రంలో మోదీ ప్రభుత్వం అగ్నివీర్ పథకం తెచ్చిందని కాంగ్రెస్ నేత రాహుల్ గాంధీ ఆరోపించారు. దేశ సరిహద్దులను కాపాడే జవాన్లకు వేతనాలివ్వడం మోదీకి ఇష్టం లేదన్నారు. భారత్ జోడో న్యాయ్ యాత్రలో భాగంగా ఆయన శుక్రవారం బిహార్‌లోని కైమూర్ జిల్లా మొహానియాలో ర్యాలీలో మాట్లాడారు. ''సాధారణ సైనికుడి మాదిరిగా అగ్నివీర్‌కు వేతనం, పింఛను ఉండవు. క్యాంటిన్ సౌకర్యముండదు. విధి నిర్వహణలో మరణిస్తే అమరవీరుడి గుర్తింపూ ఇవ్వరు. రక్షణ బడ్జెట్ నుంచి సైనికులకు వేతనాలు, వసతులు కల్పించడం మోదీ సర్కారుకు ఇష్టం లేదు. బడ్జెట్‌ను అదానీకి లబ్ధి కలిగిలా ఖర్చు చేయాలనుకుంటోంది'' అని ఆరోపించారు. బిహార్‌లో ఆర్జేడీ నేత తేజస్వీ యాదవ్ తదితరులు కూడా యాత్రలో పాల్గొన్నారు. ప్రియాంకా గాంధీ అనారోగ్యంతో ఆస్పత్రిలో చేరడంతో శుక్రవారం యాత్రలో పాల్గొనలేకపోయినట్టు పార్టీ ప్రకటించింది.

## రణరంగమైన శంభు సరిహద్దు

- కొనసాగిన రైతుల ఆందోళన
- వారిపైకి భారీగా బాష్పగోళాలు
- గుండె పోటుతో రైతు మృతి
- రేపు మళ్లీ మంత్రుల చర్చలు

**చండీగఢ్:** డిమాండ్ల సాధన కోసం రైతులు చేపట్టిన ఆందోళనలతో పంజాబ్–హరియాణా నుంచి ఢిల్లీకి దారితీసే ప్రాంతాలన్నీ శుక్రవారం నాలుగో రోజూ అట్టుడికిపోయాయి. శంభు సరిహద్దు తదితర చోట్ల తీవ్ర ఉద్రిక్తత కొనసాగింది. పోలీసు వలయాలను ఛేదించుకొని దూసుకెళ్లేందుకు నిరసనకారులు తీవ్ర ప్రయత్నం చేశారు. కొందరు ముసుగులు ధరించి పోలీసులపైకి రాళ్లు విసిరారు. వారిని చెదరగొట్టానికి పోలీసులు భారీ సంఖ్యలో బాష్పవాయువు గోళాలు ప్రయోగించారు. ఇరు వర్గాల ఘర్షణలతో శంభు సరిహద్దు రణరంగంగా మారింది. పంటల కనీస మద్దతు ధరకు చట్టబద్ధత తదితర డిమాండ్ల సాధనకు సంయుక్త కిసాన్ మోర్చా, కిసాన్ మజ్దూర్ మోర్చా తదితర రైతు సంఘాలు 'చలో ఢిల్లీ'కి పిలుపునివ్వడం తెలిసిందే. నాలుగు రోజులుగా కొనసాగుతున్న రైతుల ఉద్యమాన్ని సోషల్ మీడియాలో ప్రసారం చేస్తున్న 70 యూట్యూబ్ చానళ్లపై కేంద్రం నిషేధం విధించింది. ఆందోళనకారులు రాళ్లు రువ్వుతూ భద్రతా దళాలను కవ్విస్తున్నారంటూ పోలీసులు వీడియోలు విడుదల చేశారు. శంభు సరిహద్దు వద్ద నాలుగు రోజులుగా ఆందోళనల్లో పాల్గొంటున్న జ్ఞాన్‌సింగ్ అనే 63 ఏళ్ల రైతు గుండెపోటుతో మృతిచెందాడు. పంజాబ్‌లోని గురుదాస్‌పూర్ జిల్లాకు చెందిన ఆయనకు ఉదయం గుండె నొప్పి రావడంతో ఆసుపత్రిలో చేర్చినా లాభం లేకపోయింది. మరోవైపు, రైతు సంఘాలు ఇచ్చిన గ్రామీణ భారత్ బంద్ పిలుపుతో శుక్రవారం పంజాబ్, హరియాణాతోపాటు ఉత్తరాది రాష్ట్రాల్లో చాలాచోట్ల రవాణా వ్యవస్థ స్తంభించింది. వ్యాపార, వాణిజ్య సముదాయాలు మూతపడ్డాయి. జనం తీవ్ర ఇక్కట్లు ఎదుర్కొన్నారు.



శంభు వద్ద పోలీసులు బాష్పవాయుగోళాలు ప్రయోగించడంతో పరుగులు తీస్తున్న రైతులు

రైతులు హైవేలను దిగ్బంధించారు.

### రేపు మంత్రుల కమిటీ చర్చలు

కేంద్ర మంత్రులు, రైతు సంఘాల నేతల మధ్య ఇటీవల మూడు సార్లు చర్చలు జరిగాయి. ఈ నెల 8, 12, 15వ తేదీల్లో చర్చలు ఈ చర్చలు ఫలించలేదు. గురువారం రాత్రి ఐదు గంటలకు పైగా చర్చించినా ఇరు వర్గాలు ఏకాభిప్రాయానికి రాలేదు. డిమాండ్ల నుంచి రైతు సంఘాలు వెనక్కి తగ్గడం లేదు. చర్చలు ఆదివారం కూడా కొనసాగనున్నాయి.

## కేజ్రీవాల్ సర్కారు విశ్వాస తీర్మానం

**న్యూఢిల్లీ:** ఢిల్లీ ముఖ్యమంత్రి అరవింద్ కేజ్రీవాల్ తమ సర్కారుపై శుక్రవారం శాసనసభలో విశ్వాస తీర్మానం ప్రవేశపెట్టారు. మద్యం కుంభకోణంలో ప్రశ్నించేందుకు ఈడీ ఎన్నిసార్లు సమన్లు జారీచేసినా గైర్హాజరవడంతో శనివారం తమ ముందు హాజరుకావాలని సిటీ కోర్టు కేజ్రీవాల్‌ను ఆదేశించిన నేపథ్యంలో ఆయన ఈ చర్యకు దిగడం గమనార్హం. విశ్వాస తీర్మానంపై శనివారం సభలో చర్చించనున్నారు. 70 మంది సభ్యుల అసెంబ్లీలో కేజ్రీవాల్ బలపరీక్షకు సిద్ధపడటం ఇది రెండోసారి. ఆప్‌కు 62 మంది ఎమ్మెల్యేలుండగా బీజేపీ బలం రెండుకు పడిపోయింది. లెఫ్టినెంట్ గవర్నర్ ప్రసంగానికి అడ్డు తగిలారన్న కారణంతో గురువారం ఆరుగురు బీజేపీ ఎమ్మెల్యేలను సెషన్ మొత్తానికీ సస్పెండ్ చేయడమే ఇందుకు కారణం. శుక్రవారం విశ్వాస తీర్మానం ప్రవేశపెట్టి కేజ్రీవాల్ మాట్లాడారు. తమ ఎమ్మెల్యేలంతా తమతోనే ఉన్నారన్నారు. కానీ వారెక్కడ జారిపోతారోననే భయంతోనే ఆయన బలపరీక్షకు దిగారని బీజేపీ ఎద్దేవా చేసింది.

## ఎన్ఆర్ఐ పెళ్లిళ్ల నమోదు తప్పనిసరి

**మోసాల కట్టడికి సమగ్ర చట్టం.. న్యాయ కమిషన్ సిఫార్సులు**



**న్యూఢిల్లీ:** ప్రవాస భారతీయులు (ఎన్ఆర్ఐలు), భారత సంతతికి చెందిన విదేశీయులు(ఓసీఐ)–భారతీయ పౌరుల మధ్య మోసపూరిత వివాహాల పెరుగుతండటం ఆందోళనకరమని న్యాయ కమిషన్ పేర్కొంది. ఈ ధోరణికి అడ్డుకట్ట వేయడానికి సమగ్రమైన చట్టం తేవాలని కేంద్రానికి సూచించింది. భారతీయులు–ఎన్ఆర్ఐలు, భారతీయులు–ఓసీఐల మధ్య పెళ్లిళ్లను విధిగా రిజిస్టర్ చేసే విధానం ఉండాలని స్పష్టం చేసింది. జస్టిస్ రితూరాజ్ అవస్థీ నేతృత్వంలోని లా కమిషన్ 'లా ఆన్ మ్యాట్రిమోనియల్ ఇష్యూస్ రిలేటింగ్ టు ఎన్ఆర్ఐ, ఓసీఐ' అంశంపై అధ్యయనం చేసింది. ఇటీవల కేంద్ర న్యాయ శాఖకు ఇటీవలే నివేదిక సమర్పించింది. దీనిపై కేంద్రం తేదలచిన చట్టం పెళ్లిళ్లకు వివాదాలన్నింటినీ పరిష్కరించేలా సమగ్రంగా ఉండాలని అభిప్రాయపడింది. మోసపూరిత ఎన్ఆర్ఐ వివాహాలతో భారత యువతులు అధికంగా నష్టపోతున్నారని గుర్తుచేసింది. విడాకులు, భాగస్వామికి భరణం, కస్టడీ, చిన్నారుల జీవన వ్యయాన్ని భరించడం వంటి అంశాలను చట్టంలో చేర్చాలని సిఫార్సు చేసింది. వైవాహిక స్థితిని కచ్చితంగా వెల్లడించేలా పాస్‌పోర్టు చట్టం–1967లో సవరణలు చేయాలని పేర్కొంది. పాస్‌పోర్టులో మ్యారేజీ రిజిస్ట్రేషన్ నెంబర్ కూడా ఉండాలని తెలిపింది. ఇద్దరు జీవిత భాగస్వాముల పాస్‌పోర్టులను అనుసంధానించాలని, దీనివల్ల మోసాలను అడ్డుకోవచ్చని అభిప్రాయపడింది.

# సప్త వాహనాలపై మలయప్ప దర్శనం



**తిరుపతి(అలిపిరి):** తిరుమలలో సూర్య జయంతిని పురస్కరించుకుని శుక్రవారం 'రథసప్తమి' ఉత్సవం టీటీడీ ఆధ్వర్యంలో వైభవంగా నిర్వహించారు. ఉదయం నుంచి రాత్రి వరకు శ్రీమలయప్ప స్వామివారు సూర్యప్రభ, చిన్నశేష, గరుడ, హనుమ, కల్పవృక్ష, సర్వభూపాల, చంద్రప్రభ వాహనాలపై ఊరేగుతూ భక్తులను కటాక్షించారు. టీటీడీ ధర్మకర్తల మండలి చైర్మన్ భూమన కరుణాకరరెడ్డి, ఈవో ఏవీ ధర్మారెడ్డి, జేఈవో వీరబ్రహ్మం, సీవీఎస్వో నరసింహ కిషోర్, ఎస్పీ మలికా గర్గ్, బోర్డు సభ్యులు వాహన సేవలను పర్యవేక్షించారు.

# నిజరూపం.. అపురూపం

- అరసవల్లిలో వైభవంగా రథసప్తమి ఉత్సవం
- సూర్యనారాయణుడి దర్శనానికి పోటెత్తిన భక్తులు



అరసవల్లి శ్రీసూర్యనారాయణస్వామి ఆలయానికి తరలివచ్చిన భక్తులు

**అరసవల్లి(శ్రీకాకుళం):** శ్రీకాకుళం జిల్లాలో అరసవల్లిలో కొలువైన శ్రీసూర్యనారాయణస్వామి ఆలయంలో రథసప్తమి (సూర్య జయంతి) ఉత్సవం శుక్రవారం అంగరంగ వైభవంగా జరిగింది. గర్భాలయంలో కొలువైన శ్రీ ఉషా పద్మిని, ఛాయా దేవేరులతో శ్రీసూర్యనారాయణ స్వామి వారి మూల విరాట్టుకు గురువారం అర్ధరాత్రి 12.30 గంటల నుంచి శుక్రవారం ఉదయం 7 గంటల వరకు క్షీరాభిషేకం నిర్వహించారు. పిడకల పొయ్యిలపై క్షీరాన్నం వండి స్వామికి నివేదించారు. అనంతరం నిజరూప దర్శనం కల్పించారు. సుమారు లక్ష మంది భక్తులు స్వామివారి దర్శనం కోసం పోటెత్తారు. ఈ ఉత్సవంలో రాష్ట్ర రెవెన్యూ శాఖామంత్రి ధర్మాన ప్రసాదరావు, పశుసంవర్ధక శాఖ మంత్రి డాక్టర్ సీదిరి అప్పలరాజు, శాసన మండలి ప్రభుత్వ విప్ పాలవలస విక్రాంత్, ఎంపీలు బెల్లాన చంద్రశేఖర్, కె.రామ్మోహన్ నాయుడు, ఎమ్మెల్సీలు వరుదు కల్యాణి, నర్తు రామారావు, ఎమ్మెల్యేలు గొర్లె కిరణ్ కుమార్, విశ్వాసరాయి కళావతి, కంబాల జోగులు, తెలంగాణ ఎమ్మెల్యే మల్‌రెడ్డి తదితరులు పాల్గొని ప్రత్యేక పూజలు చేశారు. ఉత్సవ ప్రధానాధికారి, రీజనల్ జాయింట్ కమిషనర్ విజయరాజు పర్యవేక్షణలో ఆలయ ఈవో డీఎల్‌వీ రమేష్‌బాబు, అసిస్టెంట్ కమిషనర్ వి.హరిసూర్యప్రకాష్, ప్రధానార్చకులు ఇప్పిలి శంకరశర్మ ఆధ్వర్యంలో ఉత్సవం ప్రశాంతంగా ముగిసింది.

## 541 అద్దె బస్సులకు ఆర్టీసీ టెండర్లు

**సాక్షి, అమరావతి:** కొత్తగా 541 అద్దె బస్సుల కోసం ఏపీఎస్ ఆర్టీసీ టెండర్లు ఆహ్వానించింది. ఆసక్తి ఉన్న వారు ఏపీఎస్ఆర్టీసీ 'ఎంఎస్‌టీసీ ఈ-కామర్స్ పోర్టల్'లో రిజిస్ట్రేషన్ చేసుకుని టెండర్ల ప్రక్రియలో పాల్గొనవచ్చు. ఈ నెల 21 నుంచి మార్చి 6వ తేదీ వరకు బిడ్లు దాఖలు చేసేందుకు అవకాశం ఉంది. మార్చి 14వ తేదీ ఈ-వేలం నిర్వహిస్తారు. అద్దె బస్సులు నిర్వహించాల్సిన రూట్లు, టెండరు నిబంధనలు, ఇతర వివరాల కోసం తమ వెబ్‌సైట్ https://apsrtc.ap.gov.inను సంప్రదించాలని ఏపీఎస్ ఆర్టీసీ శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపింది. టెండర్లు పిలిచిన బస్ సర్వీసుల వివరాలు ఏసీ స్లీపర్-2, నాన్ ఏసీ స్లీపర్-9, సూపర్ డీలక్స్-22, అల్ట్రా డీలక్స్-33, ఎక్స్‌ప్రెస్-168, అల్ట్రా పల్లెవెలుగు-74, పల్లె వెలుగు-225, మెట్రో ఎక్స్‌ప్రెస్‌లు-3, సిటీ ఆర్డినరీ-5.

## క్లుప్తంగా...

### మరో ఇద్దరు వైఎస్సార్‌సీపీ సమన్వయకర్తల నియామకం

- పర్చూరుకు ఎడం బాలాజీ, కందుకూరుకు అరవింద యాదవ్
- వైఎస్సార్‌సీపీ కేంద్ర కార్యాలయం ప్రకటన


ఎడం బాలాజీ


అరవింద యాదవ్

సాక్షి, అమరావతి: రాష్ట్రంలో మరో రెండు శాసనసభ స్థానాలకు వైఎస్సార్‌సీపీ సమన్వయకర్తలను నియమిస్తూ పార్టీ అధినేత, రాష్ట్ర ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి నిర్ణయం తీసుకున్నారు. ఏడో జాబితాలో కందుకూరు నియోజకవర్గం సమన్వయకర్తగా కటారి అరవింద యాదవ్, పర్చూరు నియోజకవర్గ సమన్వయకర్తగా ఎడం బాలాజీని నియమించారు. గతంలో కందుకూరు స్థానాన్ని ఓసీలకు ఇవ్వగా, ఇప్పుడు బీసీ మహిళకు కేటాయించారు. అలాగే ఇంతకుముందు పర్చూరు స్థానాన్ని ఓసీలకు ఇవ్వగా.. ఇప్పుడు కూడా ఓసీ (కాపు) సామాజికవర్గానికి చెందిన ఎడం బాలాజీకి అవకాశం కల్పించారు. ఈ మేరకు శుక్రవారం వైఎస్సార్‌సీపీ కేంద్ర కార్యాలయం ఒక ప్రకటన విడుదల చేసింది.

### ఏపీ మహిళా కార్పొరేషన్ డైరెక్టర్‌గా జయంతి

సాక్షి, అమరావతి: ఆంధ్రప్రదేశ్ మహిళా సహకార ఆర్థిక సంస్థ (కార్పొరేషన్) డైరెక్టర్‌గా మేడికొండ జయంతిని ప్రభుత్వం నియమించింది. ఈ మేరకు ఆంధ్రప్రదేశ్ మహిళా, శిశు, విభిన్న ప్రతిభావంతులు, వయో వృద్ధుల సంక్షేమ శాఖ ముఖ్య కార్యదర్శి జి.జయలక్ష్మి శుక్రవారం ఉత్తర్వులు జారీ చేశారు. ప్రకాశం జిల్లాకు చెందిన జయంతి ఈ పదవిలో తదుపరి ఉత్తర్వులు వచ్చే వరకు కొనసాగుతారని పేర్కొన్నారు.

### ఉమ్మడి ప్రాజెక్టుల అప్పగింతపై భేటీ వాయిదా

సాక్షి, అమరావతి: ఉమ్మడి ప్రాజెక్టులు శ్రీశైలం, నాగార్జునసాగర్‌ను కృష్ణా బోర్డుకు అప్పగించడమే అజెండాగా రెండు రాష్ట్రాల జలవనరుల శాఖ ఉన్నతాధికారులతో శుక్రవారం ఢిల్లీలో నిర్వహించాల్సిన సమావేశాన్ని తెలంగాణ ప్రభుత్వం విజ్ఞప్తి మేరకు వాయిదా వేసినట్లు కేంద్ర జల్‌శక్తి శాఖ కార్యదర్శి దేబశ్రీ ముఖర్జీ ప్రకటించారు. రెండు రాష్ట్రాల జలవనరుల శాఖ ఉన్నతాధికారుల అభిప్రాయం మేరకు సమావేశాన్ని ఎప్పుడు నిర్వహించేది చెబుతామని తెలిపారు. గత నెల 17న ఢిల్లీలో నిర్వహించిన సమావేశంలో నెలలోగా ఉమ్మడి ప్రాజెక్టులను కృష్ణా బోర్డుకు అప్పగించేందుకు రెండు రాష్ట్రాలు అంగీకరించాయి. ఆ నిర్ణయాన్ని అమలు చేసేందుకు రెండు రాష్ట్రాల అధికారులతో సమావేశం నిర్వహిస్తామని అప్పట్లో కేంద్ర జల్ శక్తి శాఖ కార్యదర్శి దేబశ్రీ ముఖర్జీ వెల్లడించిన విషయం విదితమే.

### పొగాకు బోర్డు వైస్ చైర్మన్‌గా వాసుబాబు

కొరిటిపాడు(గుంటూరు): భారత పొగాకు బోర్డు వైస్ చైర్మన్‌గా గుత్తా వాసుబాబు ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. 162వ పొగాకు బోర్డు సమావేశం గుంటూరు జీటీ రోడ్‌లోని బోర్డు ప్రధాన కార్యాలయంలో వర్చువల్ విధానంలో బోర్డు చైర్మన్ చిడిపోతు యశ్వంత్‌కుమార్ అధ్యక్షతన శుక్రవారం జరిగింది. ఈ సమావేశంలో పొగాకు బోర్డు వైస్ చైర్మన్‌గా గుత్తా వాసుబాబును ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. 2024–25 ఆర్థిక సంవత్సరంలో కర్ణాటక ప్రాంత పంట కాలానికి 100 మిలియన్ కిలోల పరిమాణాన్ని నిర్ధారించారు. ఈ సమావేశంలో బోర్డు ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్ అద్దంకి శ్రీధర్‌బాబు, డైరెక్టర్లు పాల్గొన్నారు.

### వైఎస్సార్‌సీపీ రాష్ట్ర మైనార్టీ కమిటీ నియామకం

సాక్షి,అమరావతి: వైఎస్సార్‌సీపీ అధ్యక్షుడు వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ఆదేశాల మేరకు 15 మందితో పార్టీ మైనార్టీ విభాగం రాష్ట్ర కమిటీని నియమించారు. ముగ్గురు అధికార ప్రతినిధులు, ఇద్దరు ప్రధాన కార్యదర్శులు, 8మంది కార్యదర్శులు, ఇద్దరు సహాయ కార్యదర్శులుగా నియమితులయ్యారు. అధికార ప్రతినిధులుగా ఎం.ఆరీఫ్, ఎ.రఫీ, ఎం .రవూఫుద్దీన్, ప్రధాన కార్యదర్శులుగా మునీర్ సిద్దిక్, ఎస్.రసూల్ అజాద్‌ను నియమించారు.

### అందరికీ టికెట్లు ఇవ్వలేం

**టెలీకాన్ఫరెన్స్‌లో చంద్రబాబు**

సాక్షి, అమరావతి: పొత్తుల కారణంగా అందరికీ టికెట్లు ఇవ్వలేమని టీడీపీ అధ్యక్షుడు చంద్రబాబు కుండబద్దలు కొట్టారు. పొత్తుల వల్ల నష్టపోయిన వారికి అధికారంలోకి వచ్చిన తర్వాత ప్రాధాన్యం ఇస్తామన్నారు. ఉండవల్లిలోని తన నివాసం నుంచి శుక్రవారం చంద్రబాబు పార్టీ నేతలతో టెలీకాన్ఫరెన్స్‌లో మాట్లాడారు. టికెట్ రాలేదని ఎవరూ నిరుత్సాహ పడవద్దన్నారు. పార్టీలో కొత్తగా చేరే నేతలతో కలిసి పని చేయాలని సూచించారు. 'రా కదలిరా' సభలు ముగిశాక ప్రజాచైతన్య యాత్ర పేరుతో పర్యటనలు చేస్తానని తెలిపారు.

**బాబు నివాసంలో రాజశ్యామల యాగం**

చంద్రబాబు తన నివాసంలో శుక్రవారం రాజశ్యామల యాగం చేపట్టారు. మొదటి రోజు జరిగిన పూజా కార్యక్రమాలు, యాగ క్రతువుకు చంద్రబాబు, ఆయన సతీమణి భువనేశ్వరి హాజరయ్యారు. 50 మంది రిత్వికులు యాగ నిర్వహణలో పాల్గొన్నారు. మూడు రోజుల పాటు ఈ యాగం జరుగుతుందని టీడీపీ నేతలు తెలిపారు.

# రాజ్యసభలో టీడీపీ సున్నా

## ఏప్రిల్ 2 తర్వాత పెద్దల సభలో ప్రాతినిధ్యం కోల్పోనున్న టీడీపీ

## 41 ఏళ్ల టీడీపీ చరిత్రలో ఇదే తొలిసారి



సాక్షి, అమరావతి: తెలుగుదేశం పార్టీ 41 ఏళ్ల చరిత్రలో ఘోర పరాభవమిది. పార్టీ స్థాపించిన తర్వాత తొలిసారిగా రాజ్యసభలో ప్రాతినిధ్యాన్ని కోల్పోతోంది. రాజ్యసభలో రాష్ట్ర కోటాలో ఏప్రిల్ 2 నాటికి ఖాళీ కానున్న మూడు స్థానాలకు వైఎస్సార్‌సీపీ అభ్యర్థులు ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. దీంతో రాజ్యసభలో ఆ పార్టీకి ప్రాతినిధ్యం లేకుండా పోతోంది. టీడీపీ చివరి సభ్యుడి పదవీ కాలం ఏప్రిల్ 2న ముగుస్తుంది. ఈ ఎన్నికల్లో ప్రాతినిధ్యాన్ని నిలుపుకోవడానికి టీడీపీ అధినేత చంద్రబాబు తీవ్ర ప్రయత్నాలే చేశారు. తనదైన శైలిలో కుయుక్తులతో ఓ స్థానం గెల్చుకోవడానికి ప్రయత్నించారు. రాజ్యసభ ఎన్నికల్లో పోటీకి తగినంత సంఖ్యా బలం శాసన సభలో లేకపోయినా.. ఓటుకు కోట్లు ఎరగా వేయాలన్న వ్యూహంతో బరిలోకి దిగడానికి సిద్ధమయ్యారు. గతంలో రాష్ట్ర విభజన అనంతరం తెలంగాణలో టీడీపీకి లేని ఎమ్మెల్సీ స్థానాన్ని చేజిక్కించుకోవాలన్న దుగ్ధతో ఏకంగా ఓటుకు కోట్లు వెదజల్లడానికి సిద్ధమై, అడ్డంగా దొరికిపోయిన చరిత్ర చంద్రబాబుది. అంతే కాదు.. గతంలో రాజ్యసభ సీట్లను చంద్రబాబు అమ్ముకున్నారన్న తీవ్ర విమర్శలు వచ్చాయి. తన వర్గానికి లేదా ఆర్థికంగా మేలు చేసే వారికే సీట్లు ఇచ్చేవారన్న విమర్శలు టీడీపీలోనే ఉన్నాయి. బడుగు, బలహీన వర్గాలకు ఒక్క అవకాశం కూడా ఉండేది కాదు. ఏపీలోనూ ఓ రాజ్యసభ స్థానాన్ని ఎస్సీ వర్గానికి చెందిన వర్ల రామయ్యకు ఇచ్చినట్టే ఇచ్చి, చివర్లో తన సామాజికవర్గానికి చెందిన వ్యక్తికే కట్టబెట్టారు. నామినేషన్ వేయడానికి వెళ్తున్న వర్ల రామయ్యను అవమానకరంగా మధ్య దారిలోనే వెనక్కి పంపించి మరీ తన వాడికి ఇచ్చుకొన్నారు. ఈసారి కూడా టీడీపీ తరఫున రాజ్యసభ స్థానానికి ఓ అభ్యర్థిని నిలబెట్టి, ఓటుకు కోట్లు వెదజల్లడానికి సిద్ధమయ్యారు. అయితే, ఆయన కుయుక్తులు ఫలించకపోవడంతో చివరి నిమిషంలో తమ పార్టీ రాజ్యసభ ఎన్నికల్లో పోటీ చేయడంలేదని ప్రకటించారు. దీంతో రాష్ట్ర కోటాలోని 11 రాజ్యసభ స్థానాలూ వైఎస్సార్‌సీపీ ఖాతాలోకి చేరాయి.

### 2019 ఎన్నికల్లోనే టీడీపీ చరిత్రలో ఘోర పరాజయం

చంద్రబాబు మోసపూరిత విధానాలతో తెలుగుదేశం బలహీన పడిపోయింది. రాష్ట్ర విభజన అనంతరం దొంగ హామీలతో రాష్ట్రంలో అధికారంలోకి వచ్చిన చంద్రబాబు.. పగ్గాలు చేపట్టిన తర్వాత అన్ని వర్గాల ప్రజలను మోసం చేశారు. రైతులు, మహిళల రుణాలు మంజూరు చేస్తామంటూ వారిని ఘోరంగా వంచించారు. ఉద్యోగాలివ్వకుండా యువతకు మొండిచేయి చూపారు. ఫైబర్‌నెట్, అమరావతి ఇన్నర్ రింగ్ రోడ్డు అలైన్‌మెంట్ వంటి పలు కుంభకోణాల్లో వందల కోట్ల దోపిడీ జరిగింది. ఇసుక, మద్యంలో టీడీపీ నేతల దందా చెప్పలేనంత. ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనార్టీలను అవహేళన చేసిన ఘనతా చంద్రబాబుదే. ఇలా పెత్తందారీ పోకడలు, మోసపూరిత విధానాలు, దోపిడీతో రాష్ట్రాన్ని నిలువునా ముంచేశారు. చంద్రబాబు అసలు స్వరూపం మరోసారి బయటపడటంతో 2019 ఎన్నికల్లో ప్రజలు టీడీపీని ఘోరంగా ఓడించారు. మాట తప్పని, మడమ తిప్పని నేత వైఎస్ జగన్‌మోహన్ రెడ్డి నేతృత్వంలోని వైఎస్సార్‌సీపీకి పూర్తిస్థాయిలో మద్దతిచ్చారు. దీంతో 50 శాతం ఓట్లు, 151 శాసనసభ స్థానాలు, 22 లోక్‌సభ స్థానాల్లో వైఎస్సార్‌సీపీ ఘనవిజయం సాధించింది. దేశ చరిత్రలో ఏ పార్టీ కూడా ఇంత భారీ విజయం సాధించిన దాఖలాలు లేవు. టీడీపీ 39.17 శాతం ఓట్లతో 23 శాసనసభ, మూడు లోక్‌సభ స్థానాలకు చతికిలపడింది. టీడీపీ చరిత్రలో ఘోర పరాజయం ఇదే. దీంతో రాజ్యసభలోని అన్ని స్థానాలూ వైఎస్సార్‌సీపీ వశమయ్యాయి.

### సుపరిపాలన అందిస్తున్న సీఎం వైఎస్ జగన్

ప్రజల ఆకాంక్షలకు అనుగుణంగా, సంక్షేమం, అభివృద్ధి సమ్మిళితంగా ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి సుపరిపాలన అందిస్తున్నారు. మేనిఫెస్టో అంటే ఓ భగవద్గీత, ఓ బైబిల్, ఓ ఖురాన్ అని భావించే సీఎం జగన్.. ఆచరణలోనూ దానిని నిరూపించారు. అధికారంలోకి వచ్చిన తొలి ఏడాదే 95 శాతం హామీలు నెరవేర్చారు. ఇప్పటికి 99.5 శాతం హామీలు అమలు చేశారు. సంక్షేమ పథకాల ద్వారా ప్రత్యక్ష నగదు బదిలీ (డీబీటీ) రూపంలో రూ.2.55 లక్షల కోట్లు, నాన్ డీబీటీ రూపంలో రూ.1.76 లక్షల కోట్లు.. మొత్తం రూ.4.31 లక్షల కోట్ల ప్రయోజనాన్ని పేదలకు చేకూర్చారు. విద్య, వైద్య రంగాల్లో విప్లవాత్మక మార్పులు తెచ్చారు. పేదల పిల్లలు అంతర్జాతీయ స్థాయిలో పోటీ పడేలా తీర్చిదిద్దుతున్నారు. పింఛను కోసం పేదలు, దివ్యాంగులు ప్రభుత్వ కార్యాలయాల్లో పడిగాపులు గాయాల్సిన పని లేకుండా వారున్న చోటనే ఇస్తున్నారు. రైతులు, డ్వాక్రా మహిళలకు అండదండలందిస్తున్నారు. గ్రామ, వార్డు సచివాలయాల ద్వారా పాలనను ప్రజల ముంగిటకు తీసుకెళ్లారు. ఇలాంటి ఎన్నో విప్లవాత్మక మార్పులతో రాష్ట్రం ఇప్పుడు అభివృద్ధి పథంలో పయనిస్తోంది.

### వైఎస్సార్‌సీపీ రికార్డు విజయాలు

సంక్షేమాభివృద్ధి పథకాలు, సుపరిపాలనతో సీఎం జగన్ తెచ్చిన మార్పు ప్రతి ఇంట్లో, ప్రతి గ్రామంలో ప్రతి నియోజకవర్గంలో కళ్లకు కట్టినట్లు కన్పిస్తోంది. ఇది 2019 ఎన్నికల తర్వాత జరిగిన ప్రతి ఎన్నికల్లోనూ వైఎస్సార్‌సీపీ రికార్డు విజయాలు సాధించడానికి బాటలు వేసింది. రాష్ట్రంలో 13,094 పంచాయతీలకు ఎన్నికలు నిర్వహిస్తే.. 10,299 పంచాయతీల్లో (80 శాతం) వైఎస్సార్‌సీపీ మద్దతుదారులు విజయం సాధించారు. మున్సిపల్, నగర పంచాయతీ, కార్పొరేషన్ ఎన్నికల్లో 52.63 శాతం ఓట్లతో 84 మున్సిపల్ చైర్‌పర్సన్ పదవులను (97 శాతం) వైఎస్సార్‌సీపీ దక్కించుకుంది. 14 కార్పొరేషన్ మేయర్ పదవులు (వంద శాతం) కైవశం చేసుకుంది. మండల పరిషత్ ఎన్నికల్లో 65.22 శాతం ఓట్లతో 8,216 ఎంపీటీసీ స్థానాల్లో(88 శాతం) విజయం సాధించి, 637 మండల పరిషత్ అధ్యక్ష పదవులను (96 శాతం) వైఎస్సార్‌సీపీ దక్కించుకుంది. జిల్లా పరిషత్ ఎన్నికల్లో 69.25 శాతం ఓట్లతో 630 జెడ్పీటీసీ(87 శాతం) స్థానాలను.. 13 జిల్లా పరిషత్ అధ్యక్ష పదవులను (వంద శాతం) వైఎస్సార్‌సీపీ కైవశం చేసుకుంది. స్థానిక సంస్థల ఎన్నికల్లో ఇంత భారీగా విజయం సాధించిన దాఖలాలు దేశ చరిత్రలో మరే పార్టీకీ లేవు. టీడీపీ స్థానిక సంస్థల ఎన్నికల్లో చారిత్రక అపజయాలను మూటగట్టుకుంది. తిరుపతి లోక్‌సభ నియోజకవర్గానికి, బద్వేలు, ఆత్మకూరు శాసన సభ స్థానాలకు జరిగిన ఉప ఎన్నికల్లో 2019లో కంటే అత్యధిక మెజార్టీతో వైఎస్సార్‌సీపీ అభ్యర్థులు విజయం సాధించారు. ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌కు పెద్ద ఎత్తున ప్రజల మద్దతు ఉండటంతో ఈసారి ఎన్నికల్లో వైఎస్సార్‌సీపీ 2019లోకంటే ఎక్కువ స్థానాల్లో విజయం సాధించడం ఖాయమని టైమ్స్ నౌ వంటి దజనుకుపైగా జాతీయ మీడియా సంస్థలు నిర్వహించిన సర్వేల్లో వెల్లడైంది. ఈసారి సార్వత్రిక ఎన్నికల్లో కూడా టీడీపీకి ఘోర పరాభవం తప్పదని రాజకీయ పరిశీలకులు అంటున్నారు.

### ఏకగ్రీవంగా రాజ్యసభ ఎన్నిక

- ముగ్గురు వైఎస్సార్‌సీపీ అభ్యర్థుల నామినేషన్లకు ఆమోదం
- స్వతంత్ర అభ్యర్థి నామినేషన్ తిరస్కరణ

సాక్షి, అమరావతి: త్వరలో ఖాళీ అవనున్న మూడు రాజ్యసభ స్థానాలకు వైఎస్సార్‌సీపీ అభ్యర్థులు ఏకగ్రీవంగా ఎన్నిక కానున్నారు. శుక్రవారం నామినేషన్ల పరిశీలన అనంతరం వైఎస్సార్‌సీపీ అభ్యర్థులు మాత్రమే రంగంలో మిగిలారు. స్వతంత్ర అభ్యర్థి ఒకరు నామినేషన్ వేసినప్పటికీ, ఆయన సమర్పించిన పత్రాలు సరిగా లేకపోవడంతో అధికారులు తిరస్కరించారు. వైఎస్సార్‌సీపీ అభ్యర్థులు ముగ్గురి నామినేషన్లు సక్రమంగా ఉండడంతో వాటిని ఆమోదించినట్టు రాజ్యసభ ఎన్నికల రిటర్నింగ్ అధికారి ఎం.విజయరాజు వెల్లడించారు. శుక్రవారం అసెంబ్లీ భవనంలో రాష్ట్ర ప్రధాన ఎన్నికల అధికారి ముఖేష్ కుమార్ మీనా, అభ్యర్థుల ప్రతినిధుల సమక్షంలో నామినేషన్ల పరిశీలన జరిగింది. వైఎస్సార్‌సీపీ అభ్యర్థులు గొల్ల బాబూరావు, వైవీ సుబ్బారెడ్డి, మేడా రఘునాథరెడ్డి నామినేషన్లతోపాటు అవసరమైన పలు డాక్యుమెంట్లన్నీ పూర్తి స్థాయిలో సమర్పించారు. దీంతో వీరి నామినేషన్లను ఆమోదించారు. స్వతంత్ర అభ్యర్థిగా శ్రీ పొట్టి శ్రీరాములు నెల్లూరు జిల్లాకు చెందిన పెమ్మసాని ప్రభాకర్ నాయుడు నామినేషన్ దాఖలు చేసినప్పటికీ, కనీసం 10 మంది ఎమ్మెల్యేల మద్దతుతో కూడిన పత్రాన్ని సమర్పించకపోవడంతో ఆయన నామినేషన్‌ను తిరస్కరించినట్టు ఆర్వో విజయరాజు చెప్పారు. నామినేషన్ల ఉపసంహరణకు ఈ నెల 20వ తేదీ వరకు గడువు ఉన్నందున ఆ రోజున ఏకగ్రీవంగా ఎన్నికైన రాజ్యసభ అభ్యర్థుల జాబితాను ప్రకటించనున్నట్లు విజయరాజు తెలిపారు. నామినేషన్ల పరిశీలనలో సహాయ రిటర్నింగ్ అధికారి పి.వి. సుబ్బారెడ్డి, డిప్యూటీ సెక్రటరీ వనితా రాణి తదితరులు పాల్గొన్నారు.

# 'ఫైబర్' ఫ్రాడ్ సూత్రధారి బాబే

▶ మొదటి పేజీ తరువాయి

ఐపీసీ సెక్షన్లు 166, 167, 418, 465, 468, 471, 409, 506 రెడ్ విత్ 120(బి)లతోపాటు అవినీతి నిరోధక చట్టంలోని సెక్షన్లు 13(2), రెడ్ విత్ 13(1)(సి)(డి) ప్రకారం కేసులు నమోదు చేసింది. ఫైబర్‌నెట్ పేరుతో చంద్రబాబు బృందం ప్రజాధనాన్ని ఎలా కొల్లగొట్టిందీ సీఐడీ తన చార్జ్‌షీట్‌లో సవివరంగా పేర్కొంది. ఎఫ్ఐఆర్ నమోదు సమయంలో చంద్రబాబును ఏ 25గా పేర్కొనగా అనంతరం దర్యాప్తులో వెల్లడైన అంశాల ఆధారంగా తాజాగా చార్జ్‌షీట్‌లో ఏ1గా చేర్చారు. ఈ వెసులుబాటు దర్యాప్తు సంస్థలకు ఉంది.

**ఐటీ శాఖకు బదులుగా..**

టెరాసాఫ్ట్‌కు ఫైబర్‌నెట్ ప్రాజెక్టును కట్టబెట్టడం ద్వారా చంద్రబాబు యథేచ్ఛగా అవినీతికి పాల్పడ్డారు. మొత్తం రూ.2 వేల కోట్ల విలువైన ప్రాజెక్టు మొదటి దశలో రూ.333కోట్ల పనుల్లో అక్రమాలకు బరితెగించారు. ఈ ప్రాజెక్టును ఐటీ శాఖ చేపట్టాల్సి ఉండగా విద్యుత్, మౌలిక వసతుల కల్పన, పెట్టుబడుల శాఖ ద్వారా చేపట్టాలని స్వయంగా ఆదేశించారు. నాడు ఈ శాఖలను చంద్రబాబే నిర్వహించడం గమనార్హం.

**బిడ్లు.. టెండర్లు వేమూరివే**

వేమూరి హరికృష్ణకు చెందిన టెరాసాఫ్ట్‌కే ఈ ప్రాజెక్టును అప్పగించాలని ముందే నిర్ణయించుకున్న చంద్రబాబు పక్కాగా కథ నడిపారు. అందుకోసం వేమూరిని ఏపీ ఈ–గవర్నింగ్ కౌన్సిల్‌లో సభ్యుడిగా చేర్చారు. నేర చరిత్ర ఉన్న ఆయన్ను కీలక స్థానంలో నియమించి పనులు చక్కబెట్టారు. నిబంధనలను విరుద్ధంగా ఫైబర్‌నెట్ టెండర్ల మదింపు కమిటీలో సభ్యుడిగా కూడా నియమించారు. ప్రాజెక్టు బిడ్లు దాఖలు చేసే కంపెనీకి చెందిన వ్యక్తులు నిబంధనల ప్రకారం టెండర్ల మదింపు కమిటీలో ఉండకూడదు. చంద్రబాబు దీన్ని తుంగలోకి తొక్కారు.

**అమాంతం విలువ పెంచేసి...**

ప్రాజెక్ట్ విలువను అడ్డగోలుగా నిర్ణయించారు. ఎలాంటి మార్కెట్ సర్వే చేపట్టకుండా సరఫరా చేయాల్సిన పరికరాలు, నాణ్యతను ఖరారు చేసి ప్రాజెక్ట్ విలువను అమాంతం పెంచేశారు. వేమూరి హరికృష్ణ, నాటి ఫైబర్ నెట్ కార్పొరేషన్ ఎండీ కోగంటి సాంబశివరావు ఇందులో కీలక పాత్ర పోషించారు.

**బ్లాక్ లిస్ట్ నుంచి తొలగించి మరీ..**

ప్రాజెక్టు టెండర్ల ప్రక్రియ చేపట్టేనాటికి టెరాసాఫ్ట్ ప్రభుత్వ బ్లాక్ లిస్ట్‌లో ఉంది. పౌర సరఫరాల శాఖకు ఈ – పోస్ యంత్రాల సరఫరాలో విఫలమైన టెరాసాఫ్ట్‌ను అధికారులు బ్లాక్ లిస్టులో చేర్చారు. చంద్రబాబు ఆ కంపెనీని ఏకపక్షంగా బ్లాక్ లిస్టు నుంచి తొలగించారు. పోటీలో ఉన్న ఇతర కంపెనీలను పక్కనబెట్టేశారు. దీనిపై పేస్ పవర్ అనే కంపెనీ అభ్యంతరాలు వ్యక్తం చేసినా ఖాతరు చేయలేదు. కేంద్ర ప్రభుత్వ రంగ సంస్థలను సైతం సాంకేతిక కారణాలతో అనర్హులుగా పేర్కొంటూ టెరాసాఫ్ట్‌కే ప్రాజెక్టును కట్టబెట్టారు. టెండర్ల ప్రక్రియ పారదర్శకంగా నిర్వహించాలని పట్టుబట్టిన అధికారి బి.సుందర్‌ను హఠాత్తుగా బదిలీ చేసి తమకు అనుకూలమైన వ్యక్తులను నియమించుకున్నారు. టెండర్ల ప్రక్రియ మొదలైన తరువాత టెరాసాఫ్ట్ తమ కన్సార్షియంలో మార్పులు చేసి సాంకేతికంగా అధిక స్కోర్ సాధించేందుకు వీలుగా వివిధ పత్రాలను ట్యాంపర్ చేశారు.

**అమలు లోపభూయిష్టం**

ప్రాజెక్టును అమలు చేయడంలో టెరాసాఫ్ట్ అత్యంత నిర్లక్ష్యంగా వ్యవహరించింది. టెండర్ నోటిఫికేషన్ నాణ్యత ప్రమాణాలను ఏమాత్రం పట్టించుకోలేదు. దీంతో 80 శాతం ప్రాజెక్టు పనులు నిరుపయోగంగా మారాయి. మరోవైపు షెల్ కంపెనీల ద్వారా ప్రజాధనాన్ని అక్రమంగా తరలించారు. వేమూరి హరికృష్ణ తన సన్నిహితుడైన కనుమూరి కోటేశ్వరరావు సహకారంతో వ్యవహారాన్ని నడిపించారు. వేమూరికి చెందిన కాఫీ మీడియా ప్రైవేట్ లిమిటెడ్, ఫ్యూచర్ స్పేస్ ఇండియా ప్రైవేట్ లిమిటెడ్ కంపెనీలలో కనుమూరి కోటేశ్వరరావు భాగస్వామిగా ఉన్నాడు. వేమూరి హరికృష్ణ, తుమ్మల గోపీచంద్, రామ్‌కుమార్ రామ్మూర్తిలతో కలసి విజయవాడ కేంద్రంగా నెటాప్స్ ఫైబర్ సొల్యూషన్స్ ఎల్ఎల్‌పీ అనే మ్యాన్ పవర్ సప్లై కంపెనీ పేరిట ఓ షెల్ కంపెనీని సృష్టించారు. ఆ కంపెనీ ఫైబర్ నెట్ ప్రాజెక్టుకు సిబ్బందిని సమకూర్చినట్లు, పర్యవేక్షించినట్లు కాగితాలపై చూపించారు. ఈ ప్రాజెక్టుతో సంబంధం ఉన్న టెరాసాఫ్ట్, ఇతర కంపెనీలకు చంద్రబాబు ప్రభుత్వం ఏకంగా రూ.284 కోట్లు విడుదల చేసింది. నకిలీ ఇన్వాయిస్‌లతో ఆ నిధులను కొల్లగొట్టి కనుమూరి కోటేశ్వరరావు ద్వారా అక్రమంగా తరలించారు. వాటిలో రూ.144 కోట్లను షెల్ కంపెనీల ద్వారా తరలించారు. నాసిరకమైన పనులతో ప్రభుత్వ ఖజానాకు రూ.119.8 కోట్ల నష్టం వాటిల్లిందని నిగ్గు తేలింది.

**కీలక అధికారుల వాంగ్మూలం..**

ఫైబర్‌నెట్ కుంభకోణంపై కేసు నమోదు చేసిన సీఐడీ కీలక ఆధారాలను సేకరించింది. ఇండిపెండెంట్ ఏజెన్సీ ఐబీఐ గ్రూప్ ద్వారా ఆడిటింగ్ జరపడంతో అవినీతి మొత్తం బట్టబయలైంది. టెరాసాఫ్ట్ కంపెనీ నిబంధనలను ఉల్లంఘించి నాసిరకం పరికరాలు సరఫరా చేసి ప్రభుత్వాన్ని మోసగించిందని ఐబీఐ గ్రూప్ నిర్ధారించింది. ఫైబర్ నెట్ కుంభకోణంలో నిధులు కొల్లగొట్టిన తీరును కీలక అధికారులు వెల్లడించారు. నిబంధనలు పాటించాలని తాము పట్టుబట్టినా అప్పటి సీఎం చంద్రబాబు బేఖాతరు చేశారని, ఈ టెండర్ల ప్రక్రియలో ఆయన క్రియాశీలంగా వ్యవహరించారని సెక్షన్ 164 సీఆర్‌పీసీ ప్రకారం న్యాయస్థానంలో వారి వాంగ్మూలాన్ని నమోదు చేయడం ప్రాధాన్యం సంతరించుకుంది.

### రెండు నెలల్లో వైఎస్సార్‌సీపీ నాయకుల లెక్కలు తేలుస్తా

**విజయనగరం, రామతీర్థం సభల్లో టీడీపీ నాయకుడు నారా లోకేశ్**


విజయనగరం సభలో పలుచగా జనం

విజయనగరం రూరల్: 'నేను అందరిలాంటి వాడిని కాదు. రెండు నెలల్లో జరిగే ఎన్నికల్లో గెలుస్తాం. వైఎస్సార్‌సీపీ నాయకులందరి లెక్కలు తేలుస్తా.' అని టీడీపీ నేత నారా లోకేశ్ హెచ్చరించారు. విజయనగరం, నెల్లిమర్ల నియోజకవర్గం రామతీర్థంలో శుక్రవారం నిర్వహించిన 'శంఖారావం' సభల్లో ఆయన మాట్లాడారు. దౌర్జన్యాలు చేసిన అందరి పేర్లను రెడ్‌బుక్‌లో రాసుకున్నానని, రెండు నెలల్లో వారందరికీ తానేంటో చూపిస్తానని లోకేశ్ చెప్పారు. కాగా, రెండు సభల్లోనూ చాలామంది మధ్యలోనే వెళ్లిపోయారు. విజయనగరం సభలో టీడీపీ పొలిట్ బ్యూరో సభ్యుడు అశోక్‌గజపతిరాజు, ఆయన కుమార్తె అదితి గజపతిరాజు, జనసేన జిల్లా ఇన్‌చార్జి పాలవలస యశస్వినికి మాత్రమే మాట్లాడే అవకాశం ఇచ్చారు. బీసీలు అయిన టీడీపీ జిల్లా అధ్యక్షుడు కిమిడి నాగార్జున, మాజీ ఎమ్మెల్యే మీసాల గీతకు అవకాశం ఇవ్వలేదు. రామతీర్థంలో టీడీపీ సీనియర్ నాయకుడు పతివాడ నారాయణస్వామికి మాట్లాడే అవకాశం ఇవ్వలేదు.

# 'బ్రో'... డైలాగ్ మారింది

## 'పవనా'లు ఎటు వీస్తే అటు పరుగులు

## పవన్‌కళ్యాణ్ నోట్లో లెక్క పెట్టలేనన్ని నాలుకలు

- రాజధాని మొదలు అవినీతి, పొత్తులు, వలంటీర్ల వరకూ అదే తీరు
- విద్రోహ శక్తులతో పోల్చిన నోటితోనే వలంటీర్లపై పొగడ్తలు
- అప్పుడు అలా అనలేదంటూ నాలుక మడతలు
- అమరావతి కొద్ది మందిదే అంటూ 2018లో వ్యాఖ్య
- టీడీపీ, బీజేపీ, వామపక్షాల పార్టీలతో విచిత్ర వేషాలు



సాక్షి, అమరావతి: రాష్ట్ర విభజన అంశం.. ప్రత్యేక హోదా విషయం.. పార్టీలతో పొత్తుల వ్యవహారం.. ఎప్పటికప్పుడు సమయానుకూలంగా మాటలు మార్చుతూ రాజకీయాల్లో 'యూ టర్న్' నాయకుడిగా చంద్రబాబు ఎక్కువ ప్రాచుర్యం పొందారు. ఇప్పుడు అచ్చు గుద్దినట్టు చంద్రబాబు మాదిరే రాజకీయాల్లో పవన్‌కళ్యాణ్ రికార్డుల మోత మోగిస్తున్నారు. ఒకటి కాదు.. రెండు కాదు.. దాదాపు అన్ని అంశాలలోనూ ఎప్పటికప్పుడు మాట మార్చుతూ తాను 'నయా యూ టర్న్' నేతనని నిరూపించుకుంటున్నారు. నలభై ఏళ్ల అనుభవంలో చంద్రబాబు అనేక పొత్తులు పెట్టుకుంటే.. పార్టీ పెట్టి ఆరీ తీరీ పదేళ్లు కాకుండానే అన్ని పార్టీలతో పవన్ పొత్తులు పెట్టుకున్నారు. ఆయన ఎప్పుడు ఏ విషయంపై ఏం మాట్లాడుతారోనని రాజకీయ విశ్లేషకులే నిర్ఘాంతపోతున్నారు. గాలివాటంగా వ్యవహరించే ఆయన ఎప్పుడు ఏ పార్టీతో పొత్తు పెట్టుకుంటారో కూడా ఎవరికీ అంతుపట్టడం లేదంటున్నారు. పవన్ కేవలం ఒక్క వలంటీర్లకు సంబంధించిన అంశంలోనే కాదు.. అనేక సందర్భాల్లో అప్పుడొక మాట.. ఇప్పుడొక మాట మార్చుతూ తనకు చాలా నాలుకలున్నాయని రుజువు చేస్తున్నారు. అమరావతి రాజధాని, కాపు రిజర్వేషన్ల అంశంతోపాటు పలు కీలక అంశాలన్నింటిలోనూ జనసేనాని రాజకీయ వైఖరి పూర్తి యూ టర్న్ అన్న రీతినే సాగుతోంది. చంద్రబాబు ముఖ్యమంత్రిగా ఉన్నప్పుడు రాష్ట్రానికి ప్రత్యేక హోదాకు బదులు ప్రత్యేక ప్యాకేజీని కేంద్రం ప్రకటించినప్పుడు పాచిపోయిన లడ్డూలంటూ బీజేపీపై తీవ్ర విమర్శలు చేశారు. 2019 ఎన్నికల్లో ఓడిపోయాక అదే బీజేపీతో పొత్తు పెట్టుకున్నారు. చంద్రబాబుపై 2014లో ఒకలా, 2019లో మరోలా, ఇప్పుడు ఇంకోలా మాట్లాడారు. తన కుటుంబాన్ని, తన తల్లిని కించపరిచేలా మాట్లాడిన టీడీపీ నేతల సంగతి చెబుతానన్న పవన్.. ఇప్పుడు వారితోనే చెట్టాపట్టాల్ వేసుకొని తిరుగుతున్నారు.

**పవన్ నాలుక మడత ఇలా..**

'రాష్ట్రంలో మహిళల అదృశ్యాలకు వలంటీర్లే కారణం. వైఎస్సార్‌సీపీ పాలనలో ప్రతి గ్రామంలో వలంటీర్లను పెట్టి కుటుంబంలో ఎంత మంది ఉన్నారు.. వారిలో మహిళలు ఎందరు? వితంతువులున్నారా? అని ఆరా తీస్తున్నారు. ప్రధానంగా ఒంటరి మహిళలే లక్ష్యంగా చేసుకొని ఆ సమాచారాన్ని కొంత మంది విద్రోహ శక్తులకు ఇస్తే, వాళ్లు కిడ్నాప్, ట్రాప్ చేస్తున్నారు. దీంతో మహిళలు అదృశ్యమవుతున్నారు. నాతో సాక్షాత్తూ కేంద్ర నిఘా వర్గాలే ఈ మాటలు చెప్పాయి.'

– 2023 జూలై 10వ తేదీన పవన్

'ఈ వలంటీర్ వ్యవస్థపై జనసేన కోర్టులో ఛాలెంజ్ చేస్తోంది. మనస్ఫూర్తిగా చెబుతున్నా. ఛాలెంజ్ చేయాలి. జగన్.. నీ ఇష్టం. సై అంటే సై.. తేల్చుకుందాం. దేనికైనా రెడీ. వలంటీరు అనే సమాంతర వ్యవస్థపై నేను సూటిగా అడిగిన ప్రశ్నలకు జగన్ సమాధానం చెప్పకుండా, విచారణకు సిద్ధంగా ఉండాలని ప్రత్యేక జీవో ఇచ్చావ్. జైలుకెళ్లడానికైనా, దెబ్బలు తినడానికైనా సిద్ధం. అరెస్టు చేసుకోండి. చిత్రహింసలు పెట్టుకోండి. తప్పు జరిగితే కచ్చితంగా ఎత్తి చూపుతామని సవాల్ విసురుతున్నా'.

– 2023 జూలై 20న మరోసారి పవన్

'ఆడపిల్లలు వైఎస్సార్‌సీపీ వలంటీర్ల వల్లే అదృశ్యమై పోయారని నేను అన్నానట.. ముఖ్యమంత్రి అంటున్నారు.. దానికి వివరణ ఇస్తున్నా. నేను చెప్పింది మీ వలంటీర్లు సమాచారం సేకరించడం వల్ల, ఆ డేటా ఎటెటో వెళ్లిపోయిందని చెప్పాను. అంతే తప్ప, ఏ రోజూ వలంటీర్లే అంతా చేశారని నేను అనలేదు. వాళ్ల మీద గౌరవం ఉంది. వలంటీర్ల వ్యవస్థను నేను తప్పుపట్టలేదు. వలంటీర్లుగా పని చేస్తున్న వారి భవిష్యత్ కోసం మేమందరం సంపూర్ణంగా పని చేస్తాం'

– 2024, ఫిబ్రవరి 15 తేదీన తాజాగా పవన్ పలుకులు

**పవన్ నోట ఇంకా ఇలా..**

- 2014 తర్వాత మందడంలో చంద్రబాబుతో కలిసి సంక్రాంతి ఉత్సవాల్లో పాల్గొంటూ 'అమరావతే ఆంధ్రప్రదేశ్ రాజధాని. మన (టీడీపీ–జనసేన) ప్రభుత్వంలో ఇదే ప్రాంతంలో బంగారు రాజధానిని నిర్మించుకుందాం' అని అన్నారు.
- 'అమరావతి ఇన్‌క్లూజివ్ క్యాపిటల్ కాదు. కేవలం కొద్ది మంది కోసమే. అది టీడీపీ ఎఫిలియేటెడ్ క్యాపిటల్‌లా ఉంది. ఉత్తరాంధ్ర నుంచి, రాయలసీమ నుంచి ఏమీలేని ఈ క్యాపిటల్‌కు రావాలంటే ఎంత ఇబ్బంది పడతారు? వాళ్లు ఇక్కడకు వచ్చి ఎలా స్థిరపడతారు?' అని గత అసెంబ్లీ ఎన్నికల ముందు 2018లో వ్యాఖ్యానించారు.
- 2014 ఎన్నికల్లో టీడీపీకి ఎందుకు మద్దతు ఇచ్చామా.. అని బాధపడుతున్నా. యువతకు ఉపాధి, ఆడపడుచులకు రక్షణ ఉంటుందని ఆశిస్తే అవేవీ టీడీపీ పాలనలో లేవు. ఈ నాలుగేళ్లలో ముఖ్యమంత్రి చంద్రబాబు అప్పులు చేయడంలోనే అభివృద్ధి చూపించారు.
- 2018 అక్టోబర్ 2న ఏలూరు జిల్లా జంగారెడ్డిగూడెం సభలో 'నాలుగేళ్లు రాష్ట్రానికి ఏం చేశారని మిమ్మల్ని మళ్లీ ముఖ్యమంత్రిగా ఎన్నుకోవాలి చంద్రబాబూ? మీరు చేసిన అద్భుతాలు ఇక చాలు. ఒక్క కొత్త పరిశ్రమ రాలేదు. ఉన్నవాటిని కూడా మూసేస్తున్నా పట్టించుకోవడం లేదు. మీ పాలన మాకొద్దని ప్రజలంతా ముక్త కంఠంతో నినదిస్తున్నారు.'
- 'దురదృష్టవశాత్తు అభిప్రాయ భేదాలవల్ల 2019లో టీడీపీకి మద్దతు ఇవ్వలేకపోయా. అందుకే ఇప్పుడు మద్దతు ఇస్తున్నా' అని గత డిసెంబరు 20వ తేదీన లోకేశ్ యువగళం ముగింపు యాత్రలో వ్యాఖ్యానించారు.

## క్లుప్తంగా...

### ఎన్నికల సిబ్బంది జాబితా పూర్తి చేయండి

- ఎస్పీలు, కలెక్టర్లను ఆదేశించిన రాష్ట్ర ప్రధాన ఎన్నికల అధికారి

**సాక్షి, అమరావతి:** త్వరలో జరగనున్న అసెంబ్లీ, లోక్ సభ ఎన్నికల నిర్వహణలో పాల్గొనే సిబ్బంది జాబితా తయారీ పూర్తి చేయాలని జిల్లా కలెక్టర్లు, ఎస్పీలను రాష్ట్ర ప్రధాన ఎన్నికల అధికారి ముఖేష్ కుమార్ మీనా ఆదేశించారు. ఎన్నికల సన్నద్ధతపై ఆయన శుక్రవారం జిల్లా కలెక్టర్లు, ఎస్పీలతో వీడియో కాన్ఫరెన్స్ నిర్వహించారు. ఎన్నికల సిబ్బంది, ఓటర్ల జాబితాల తయారీ, ఓటర్ కార్డుల పంపిణీ, పోలింగ్ స్టేషన్లలో కనీస వసతుల ఏర్పాటు, శాంతి భద్రతలపై సమీక్షించారు. ప్రతి జిల్లాలో ఎన్నికల సిబ్బంది సంఖ్య ప్రాథమిక అంచనాకంటే 20 శాతం అదనంగా ఉండాలని చెప్పారు. పోలీసు శాఖలో సిబ్బంది కొరత ఉన్న జిల్లాలు అదనపు సిబ్బందిని సమకూర్చుకోవడంపై వెంటనే నివేదిక ఇవ్వాలన్నారు. పోలింగేతర విధులకు సంబంధించి శిక్షణ కార్యక్రమాలు నెలాఖరుకల్లా పూర్తి చేయాలని చెప్పారు. ఎన్నికల విధుల్లో ఉండే ప్రతి ఉద్యోగికీ పోస్టల్ బ్యాలెట్ అవకాశం కల్పించాలన్నారు. ఈ నెలాఖరులోగా సమస్యాత్మక ప్రాంతాల నివేదిక ఇవ్వాలని ఆదేశించారు. జిల్లా సరిహద్దుల్లో సాధ్యమైనంత ఎక్కువ రూట్లలో చెక్ పోస్టులు ఏర్పాటు చేసుకోవాలన్నారు. మేజర్ రూట్లతో పాటూ మైనర్ రూట్లలోనూ నిరంతరం పర్యవేక్షణ ఉండేలా మొబైల్ స్క్వాడ్‌లు, స్టాటిక్ స్క్వాడ్‌లు ఏర్పాటు చేయాలని చెప్పారు. ఈ కార్యక్రమంలో శాంత భద్రతల అదనపు డీజీ శంఖబ్రత బాగ్చి, అదనపు ప్రధాన ఎన్నికల అధికారులు పి.కోటేశ్వరరావు, ఎం.ఎస్. హరేంధిర ప్రసాద్, పాల్గొన్నారు.

### నూజివీడు టీడీపీకి 'కాపా' షాక్



**నూజివీడు:** ఏలూరు జిల్లా నూజివీడులో టీడీపీకి గట్టి ఎదురు దెబ్బ తగిలింది. టీడీపీ మండల మాజీ అధ్యక్షుడు, వ్యవసాయ మార్కెట్ కమిటీ మాజీ చైర్మన్, రావిచర్ల సర్పంచి కాపా శ్రీనివాసరావు తాను రాజకీయాల నుంచి శాశ్వతంగా వీడ్కోలు పలుకుతున్నట్లు శుక్రవారం ప్రకటించడం సంచలనమైంది. నూజివీడులో ఆయన విలేకరులతో మాట్లాడుతూ.. తను, తన కుటుంబ సభ్యులు ఇకనుంచి రాజకీయాల్లో ఉండరని స్పష్టం చేశారు. టీడీపీ నియోజకవర్గ ఇన్‌చార్జి ముద్దరబోయిన వెంకటేశ్వరరావు, ఆయన వర్గం నేతలు ఐటీడీపీ సభ్యులతో రెండేళ్లుగా తనపై సోషల్‌మీడియాలో అసభ్యకరంగా పోస్టులు పెట్టి అవమానపరిచారని చెప్పారు. దీనిపై పార్టీ జిల్లా, రాష్ట్ర నాయకత్వాల దృష్టికి పలుమార్లు తీసుకెళ్లినా ఎలాంటి చర్యలు తీసుకోలేదని ఆవేదన వ్యక్తం చేశారు. పది రోజులుగా ఇది మరింత ఎక్కువయిందన్నారు. విలువల్లేని రాజకీయాలకే పార్టీలు అధిక ప్రాధాన్యత నిస్తుండడంతో తాను రాజకీయాల్లో ఇమడలేనని స్పష్టం చేశారు. కష్టపడి పనిచేసే వారిని అధిష్టానం ఏమాత్రం గుర్తించడం లేదన్నారు.


### యువత ఆకాంక్షలకు అనుగుణంగా మేనిఫెస్టో

- జనసేన అధ్యక్షుడు పవన్‌కళ్యాణ్

**సాక్షి, అమరావతి:** 'భవిష్యత్తుపై ఎన్నో ఆశలు పెంచుకున్న యువతకు జనసేన పార్టీ భరోసా ఇస్తుంది. త్వరలో విడుదల చేసే ఉమ్మడి మేనిఫెస్టో వారి ఆకాంక్షలకు అనుగుణంగా ఉంటుంది' అని జనసేన అధ్యక్షుడు పవన్ కళ్యాణ్ శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. 'పాదయాత్రలో అడిగినవాళ్లకు, అడగనివాళ్లకు హామీలు గుప్పించిన వైఎస్ జగన్ పాలనలోకి వచ్చాక అన్ని వర్గాలను క్షోభకు గురిచేశారు. భవిష్యత్తుపై ఎన్నో ఆశలు పెంచుకున్న యువతను వంచించారు. పోలీస్ కానిస్టేబుల్ ఉద్యోగాలకు ప్రకటన ఇచ్చి ఏడాది దాటినా ఇప్పటికీ నియామకాలు పూర్తిచేయలేదు' అని పేర్కొన్నారు.

### ఏపీలో బీజేపీ అభ్యర్థే సీఎం

- బీజేపీ రాష్ట్ర ఉపాధ్యక్షుడు విష్ణువర్ధన్‌రెడ్డి



**కర్నూలు కల్చరల్/సాక్షి,న్యూఢిల్లీ:** రాష్ట్రంలో బీజేపీ అభ్యర్థే ముఖ్యమంత్రిగా ఉంటారని ఆ పార్టీ రాష్ట్ర ఉపాధ్యక్షుడు విష్ణువర్ధన్‌రెడ్డి తెలిపారు. వేరే పార్టీల వారిని భుజాన మోయడానికి బీజేపీ సిద్ధంగా లేదని తేల్చిచెప్పారు. ఏపీలో బీజేపీని అధికారంలోకి తేవడమే తమ లక్ష్యమని వెల్లడించారు. గుజరాత్‌లో గతంలో ఒక సీటు మాత్రమే ఉండేదని..ఈరోజు అక్కడ అధికారంలో ఉన్నామని గుర్తు చేశారు. ఏపీలో కూడా ఇలాగే అధికారంలోకి వస్తామన్నారు. కర్నూలులో శుక్రవారం విష్ణువర్ధన్‌రెడ్డి మీడియాతో మాట్లాడారు. రాష్ట్రంలో కచ్చితంగా బీజేపీ అధికారంలోకి వస్తుందని, పార్టీ అభ్యర్థే సీఎంగా ఉంటారన్నారు. 2014తో పోలిస్తే 2024 ఎన్నికలకు చాలా తేడా ఉంటుందని చెప్పారు. ఇప్పటివరకు బీజేపీ, జనసేన మధ్య మాత్రమే ఎన్నికల పొత్తు ఉందని తెలిపారు. ప్రతిపక్ష నేతగానే చంద్రబాబు.. అమిత్‌షాను కలిశారన్నారు. వైఎస్సార్‌సీపీ వైఫల్యాలు, దౌర్జన్యాలను ప్రజలకు వివరించేందుకు ఈనెల 21 నుంచి రాష్ట్రంలో ప్రజాపోరు యాత్ర చేపడుతున్నట్లు చెప్పారు. పక్క రాష్ట్రంలో తరిమేసిన షర్మిలను అద్దెకు తెచ్చి పీసీసీ అధ్యక్షురాలిని చేశారన్నారు. రాయలసీమ, ఆంధ్రా ప్రాజెక్టులపై వేసిన కేసులను ఉపసంహరించుకోవాలని ఏపీపీసీసీ.. తెలంగాణ కాంగ్రెస్‌ను కోరాలన్నారు. కాగా బీజేపీ సీనియర్ నేత కిలారు దిలీప్ ఢిల్లీలో మీడియాతో మాట్లాడుతూ ఏపీ ప్రభుత్వ పనితీరును ప్రజల్లో ఎండగడుతూ బీజేపీని బలోపేతం చేస్తామన్నారు.

## క్యాన్సర్ బాధితులకు
# కొండంత భరోసా

### వైఎస్సార్ ఆరోగ్యశ్రీ కింద అన్ని రకాల క్యాన్సర్‌లకు ఉచిత వైద్యం

- 2019 నుంచి 3.03 లక్షల మందికి పైగా చికిత్స
- రూపాయి కూడా ఖర్చుపెట్టకుండా కార్పొరేట్ ఆస్పత్రుల్లో ఖరీదైన వైద్యం
- 10,43,556 ప్రొసీజర్లకు వైద్య సేవలు
- ఏకంగా రూ.2,165 కోట్లు ఖర్చు చేసిన ప్రభుత్వం
- టీడీపీ హయాంలో కేవలం రూ.751 కోట్లే వ్యయం



సాక్షి, అమరావతి:

డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ కోనసీమ జిల్లా మలికిపురంకు చెందిన వంకాయల శ్రీనివాస్ కిరాణా దుకాణం నడుపుకుంటూ జీవించేవారు. ఆయనకు భార్య సాయిపద్మశ్రీ, ఆరేళ్ల కుమార్తె ఉన్నారు. 2022 డిసెంబర్‌లో సాయిపద్మశ్రీ జ్వరం, ఇతర అనారోగ్య సమస్యల బారినపడింది. దీంతో శ్రీనివాస్ వైద్య పరీక్షలు చేయించగా ఆమెకు రొమ్ము క్యాన్సర్ ఉందని వెల్లడైంది. వైద్యులు చికిత్స కోసం ఏదైనా క్యాన్సర్ ఆస్పత్రికి తీసుకువెళ్లాలని సూచించారు. అయితే అప్పటికే వ్యాపారంలో నష్టాలతో ఆర్థిక ఇబ్బందులతో కూరుకుపోయిన శ్రీనివాస్‌కు ఏం చేయాలో పాలుపోలేదు. ఈ పరిస్థితుల్లో వైఎస్సార్ ఆరోగ్యశ్రీ పథకం వారికి అండగా నిలిచింది. తెలిసిన వాళ్లు చెప్పడంతో శ్రీనివాస్ తన భార్యను విజయవాడలోని ప్రముఖ క్యాన్సర్ ఆస్పత్రి హెచ్‌సీజీకి తీసుకువెళ్లాడు. అక్కడ ఒక్క రూపాయి కూడా ఖర్చు చేయకుండానే వైద్యులు వైద్య పరీక్షలన్నీ చేసి సాయిపద్మశ్రీకి చికిత్సను అందించారు. ఈ ఏడాది జనవరిలో చికిత్స పూర్తి కావడంతో ఆమె ప్రస్తుతం పూర్తిగా కోలుకుంది. ఆరోగ్యశ్రీ వల్లే తన భార్య ప్రాణాలతో బయటపడిందని శ్రీనివాస్ సంతోషం వ్యక్తం చేస్తున్నాడు.

**.. ఇది ఒక్క శ్రీనివాస్ ఆనందమే కాదు.. రాష్ట్రంలో ఎంతోమంది ఆరోగ్యశ్రీ తమ ప్రాణాలను కాపాడిందని చెబుతున్నారు. గతంలో ఒకప్పుడు క్యాన్సర్ వచ్చిందంటే ఆశలు వదులుకోవాల్సిందే. రూ.లక్షల ఖర్చయ్యే వైద్యాన్ని తలుచుకుని బాధిత కుటుంబాలు భీతిల్లేవి. ఇల్లు, వాకిలి తెగనమ్ముకోవాల్సి వచ్చేది. కానీ ఇప్పుడు వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ప్రభుత్వం క్యాన్సర్ సోకినవారికి ఆరోగ్యశ్రీ కింద కార్పొరేట్ ఆస్పత్రుల్లో అత్యంత ఖరీదైన వైద్యాన్ని పూర్తి ఉచితంగా అందిస్తోంది. బాధితులు తమ చేతి నుంచి రూపాయి కూడా ఖర్చు పెట్టే పనిలేకుండానే మెరుగైన, నాణ్యమైన వైద్య సేవలు అందజేస్తోంది.**

#### ఆరోగ్యశ్రీ ఆదుకుంది..



మాది ప్రకాశం జిల్లా. ప్రస్తుతం విజయవాడలో ఉంటున్నాం. బస్టాండ్‌లో స్టాల్ నడిపే వాడిని. 2021లో నాకు క్యాన్సర్ సోకింది. కరోనా, ఇతర కారణాలతో వ్యాపారాలు సాగని దుస్థితిలో ఆరోగ్యశ్రీ ఆదుకుంది. చేతి నుంచి డబ్బు ఖర్చు పెట్టే పనిలేకుండానే పూర్తి ఉచితంగా చికిత్స లభించింది. మందులు కూడా ఉచితంగా ఇచ్చారు. ప్రస్తుతం నా ఆరోగ్యం బాగుంది.
– పి.మధుసూదనరావు, విజయవాడ

#### నా ఖర్చంతా ప్రభుత్వమే భరిస్తోంది



నేను లారీ డ్రైవర్‌గా జీవనం సాగిస్తున్నా. క్యాన్సర్ నిర్ధారణ కావడంతో విజయవాడలోని హెచ్‌సీజీ ఆస్పత్రిలో చికిత్స తీసుకుంటున్నా. ఆరోగ్యశ్రీ కింద ఉచిత వైద్యం అందుతోంది. వైద్యం, మందులకు నాకు ఒక్క రూపాయి ఖర్చు కాకుండా మొత్తం ప్రభుత్వమే భరిస్తోంది. ఆరోగ్యశ్రీ లేకపోయి ఉంటే నా పరిస్థితి ఏమయ్యేదో తలుచుకుంటేనే భయం వేస్తోంది.
– ఎస్.రాంబాబు, విజయవాడ

#### రూపాయి కూడా ఖర్చు చేయనక్కర్లేదు



అన్ని రకాల క్యాన్సర్‌లకు ఆరోగ్యశ్రీలో ఉచిత వైద్య సేవలు ఉన్నాయి. అర్హులైన నిరుపేద, మధ్యతరగతి ప్రజలు రూపాయి కూడా ఖర్చు పెట్టాల్సిన పనిలేదు. చికిత్సల భారం మొత్తాన్ని ప్రభుత్వమే భరిస్తుంది. ఈ మేరకు చర్యలు తీసుకుంటున్నాం. పథకంపై ప్రజలకు విస్తృత అవగాహన కల్పిస్తున్నాం.
– డి.కె. బాలాజీ, సీఈవో, వైఎస్సార్ ఆరోగ్యశ్రీ

#### 3.03 లక్షల క్యాన్సర్ బాధితులకు ఉచిత వైద్యం

టీడీపీ ప్రభుత్వ హయాంలో కేవలం ఆరోగ్యశ్రీ పథకంలో 1,059 ప్రొసీజర్లు మాత్రమే అందుబాటులో ఉన్నాయి. 2019లో ముఖ్యమంత్రిగా బాధ్యతలు చేపట్టిన వైఎస్ జగన్ ప్రొసీజర్లను ఏకంగా 3,257కు పెంచారు. అలాగే వైద్య ఖర్చులకు పరిమితి లేకుండా అన్ని రకాల క్యాన్సర్‌లకు పూర్తి ఉచిత వైద్యాన్ని అందుబాటులోకి తెచ్చారు. దీంతో టీడీపీ ప్రభుత్వ హయాంలో 200లోపు మాత్రమే క్యాన్సర్ ప్రొసీజర్‌లు ఉండగా ప్రస్తుతం 400కు పెరిగాయి. లుకేమియా బాధితులకు నిర్వహించే రూ.10 లక్షలు, ఆ పై ఖర్చయ్యే బోన్‌మారో స్టెమ్ సెల్ ట్రాన్స్‌ప్లాంటేషన్‌ను సైతం ఆరోగ్యశ్రీ కింద పూర్తి ఉచితంగా చేస్తున్నారు. ఈ క్రమంలో 2019 నుంచి ఈ పథకం కింద 3,03,899 మంది క్యాన్సర్ బాధితులకు 10,43,556 ప్రొసీజర్స్‌లో ఉచిత వైద్యం అందించారు. ఇందుకోసం ప్రభుత్వం ఏకంగా రూ.2,165.74 కోట్లు ఖర్చు చేసింది. అదే టీడీపీ ప్రభుత్వ హయాంలో 2014–19 మధ్య క్యాన్సర్ చికిత్సకు కేవలం రూ.751.56 కోట్లు మాత్రమే ఖర్చు పెట్టారు.

#### క్యాన్సర్‌కే కాదు..

ఒక్క క్యాన్సర్‌కే కాకుండా హృద్రోగాలు, కిడ్నీ, లివర్.. ఇలా వివిధ రకాల బాధితులకు కూడా ఆరోగ్యశ్రీ సేవలు పూర్తి ఉచితంగా అందుతున్నాయి. టీడీపీ హయాంలో క్యాన్సర్, గుండె జబ్బు, తదితర పెద్ద రోగాల బారినపడితే పేదలు తమ తల తాకట్టు పెట్టుకోవాల్సిన దుర్భర పరిస్థితులు ఉండేవి. ఆ పరిస్థితులను మారుస్తూ వైఎస్ జగన్ ప్రభుత్వం ప్రొసీజర్లను 3,257కు, వైద్యం ఖర్చు పరిమితిని రూ.25 లక్షలకు పెంచింది. 2019 నుంచి ఇప్పటివరకు రూ.12,150 కోట్లను ఆరోగ్యశ్రీ కోసం ఖర్చు చేసింది. ఉచిత వైద్య సేవలే కాకుండా ఆస్పత్రి నుంచి డిశ్చార్జి అయిన రోగులకు విశ్రాంత భృతిగా వైఎస్సార్ ఆరోగ్య ఆసరా కింద నెలకు రూ.5 వేల వరకు ప్రభుత్వం సాయం అందిస్తోంది. ఇలా ఇప్పటివరకు 22.88 లక్షల మందికి రూ.1,366 కోట్ల సాయాన్ని అందించింది.

**వైఎస్సార్ ఆరోగ్యశ్రీ కింద క్యాన్సర్ చికిత్స వివరాలు..**

| ఆర్థిక సంవత్సరం | బాధితులు | ప్రొసీజర్స్ | ఖర్చు (రూ.కోట్లలో) |
|---|---|---|---|
| 2019-20 | 46,263 | 1,32,566 | 217.12 |
| 2020-21 | 48,330 | 1,45,768 | 313.29 |
| 2021-22 | 60,737 | 2,11,951 | 479.75 |
| 2022-23 | 78,880 | 2,80,216 | 622.10 |
| 2023-24 | 69,689 | 2,73,055 | 533.48 |
| మొత్తం | 3,03,899 | 10,43,556 | 2,165.74 |

## విద్యకు సీఎం జగన్ పెద్దపీట

- ముస్లిం విద్యార్థులను సన్మానించిన మైనారిటీ కమిషన్ చైర్మన్ ఇక్బాల్

**సాక్షి, అమరావతి:** దివంగత ముఖ్యమంత్రి వైఎస్ రాజశేఖరరెడ్డి దార్శనికతతో నాలుగు శాతం రిజర్వేషన్ కల్పించడం వల్ల ముస్లింలకు గొప్ప మేలు కలుగుతోందని ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర మైనారిటీస్ కమిషన్ చైర్మన్ డాక్టర్ కె.ఇక్బాల్ అహ్మద్‌ఖాన్ కొనియాడారు. వైఎస్సార్ చలువ వల్ల పేద ముస్లిం పిల్లలు డాక్టర్లు, ఇంజనీర్లు, సాఫ్ట్‌వేర్ ఉద్యోగులుగా ఉన్నత స్థానాలకు ఎదుగుతున్నారని చెప్పారు. వైద్య విద్యలో ప్రతిభ కనబరిచి స్వర్ణపతకాలు సాధించిన రాజమహేంద్రవరానికి చెందిన ముస్లిం డాక్టర్లు ఎం.షామీరుల్ రెహమాన్, ముస్కాన్‌బేగం, ఎండీ ఫర్వేజ్ ఖురేషీ, ఎండీ ముష్కరాబేగం, ఎండీ నాసితాబేగం, ఎండీ సానియాబేగం, ఎండీ హలీమాబేగంలను మంగళగిరిలోని రాష్ట్ర మైనార్టీ కమిషన్ కార్యాలయంలో శుక్రవారం ఇక్బాల్ సన్మానించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ వైఎస్సార్ మాదిరిగానే ఆయన తనయుడు సీఎం జగన్ కూడా విద్యకు పెద్దపీట వేస్తున్నారని చెప్పారు. రాష్ట్రంలో 17 మెడికల్ కాలేజీలు తెచ్చిన ఘనత సీఎం జగన్‌కు దక్కిందన్నారు. దీనివల్ల రాష్ట్రంలో అనేక మంది ముస్లిం మైనార్టీ విద్యార్థులు డాక్టర్లు అయ్యే అవకాశం కలిగిందన్నారు.

## బాబు కోసమే పవన్ పార్ట్‌టైమ్ పాలిటిక్స్

- కాపు కార్పొరేషన్ చైర్మన్ అడపా శేషు ఆగ్రహం

**సాక్షి, అమరావతి:** చంద్రబాబు రాజకీయ ప్రయోజనాల కోసమే పవన్‌కళ్యాణ్ పార్ట్‌టైమ్ పాలిటిక్స్ చేస్తున్నారని ఆంధ్రప్రదేశ్ కాపు కార్పొరేషన్ చైర్మన్ అడపా శేషగిరి(శేషు) దుయ్యబట్టారు. తాడేపల్లిలోని కాపు కార్పొరేషన్ కార్యాలయంలో ఆయన శుక్రవారం మీడియాతో మాట్లాడారు. చంద్రబాబుకు అవసరమైనప్పుడల్లా పవన్ హైదరాబాద్ నుంచి చుట్టపుచూపుగా వచ్చి రాష్ట్రంపై విషం చిమ్మి వెళ్తున్నారని ఆగ్రహం వ్యక్తం చేశారు. టీడీపీ ముసుగు కప్పుకున్న పవన్.. వైఎస్సార్‌సీపీలోని కాపు మంత్రులను, ఎమ్మెల్యేలను టార్గెట్ చేసి విమర్శలు చేస్తున్నారని మండిపడ్డారు. రాజధాని అమరావతి పేరుతో ఒక సామాజికవర్గం భూములను దోచేస్తోందంటూ పవన్ టీడీపీ హయాంలో చేసిన విమర్శలను ప్రజలింకా మర్చిపోలేదన్నారు. రాజధాని పేరుతో జరిగిన దోపిడీని అడ్డుకుంటానంటూ అప్పట్లో ప్రగల్భాలు పలికిన పవన్ ఇప్పుడు చంద్రబాబు పంచన చేరి ఊడిగం చేస్తున్నారని మండిపడ్డారు. చంద్రబాబు దోపిడీ దొంగల ముఠా నాయకుడని, లోకేశ్ అవినీతి, అక్రమాలు కోకొల్లలంటూ విమర్శలు చేసిన పవన్.. ఇప్పుడు వారినే భుజానికెత్తుకొని మోయడం చూస్తే ఆయన నిజాయితీ ఏమిటో అర్థమవుతోందన్నారు. రంగాను హత్య చేయించిన టీడీపీని, ముద్రగడ పద్మనాభాన్ని ఘోరంగా అవమానించిన చంద్రబాబుతో ఎలా అంటకాగుతావ్? అని అడపా శేషు ప్రశ్నించారు. చంద్రబాబుకు కాపులను తాకట్టు పెట్టడానికి పవన్ చేస్తున్న ప్రయత్నాలను కాపు సంఘాలు గమనించాలన్నారు. చంద్రబాబు జనసేనకు ఎన్ని సీట్లిస్తాడు? అందులో కాపులకు నువ్వెన్ని సీట్లిస్తావో చెప్పాలంటూ పవన్‌ను ప్రశ్నించారు. పవన్‌కు దమ్ముంటే జోగయ్య చెప్పిన పేర్లన్నీ ప్రకటించాలని డిమాండ్ చేశారు.

## 'కాపు కులస్తులకు ప్రాధాన్యతనివ్వాలి'

- జేఏసీ నేతల డిమాండ్



రామమోహన్‌రావు

**సాక్షి, అమరావతి/లబ్బీపేట (విజయవాడ తూర్పు):** రాష్ట్రంలో కోటీ పాతిక లక్షల మంది ఉన్న కాపు కులాలకు ఇకపై వార్డు స్థాయి నుంచి పార్లమెంట్ స్థాయి వరకూ రాజకీయ పార్టీలు ప్రాధాన్యతనివ్వాలని రాష్ట్ర కాపు జాయింట్ యాక్షన్ కమిటీ (జేఏసీ) నేతలు డిమాండ్ చేశారు. రాజకీయ ప్రయోజనాల కోసం వారిని వాడుకుని, అవసరం తీరాక పట్టించుకోని ప్రభుత్వాలే గతంలో ఉన్నాయని.. ఇకపై కాపుల ప్రయోజనాలను నెరవేర్చే వారికే తమ మద్దతు ఉంటుందని వారు స్పష్టంచేశారు. టీడీపీ హయాంలో కాపుల హక్కుల కోసం పోరాడితే అణచివేశారని గుర్తుచేశారు. జేఏసీ, కాపు జాగృతి నేతృత్వంలో కాపు ప్రతినిధుల సమావేశం శుక్రవారం విజయవాడలో జరిగింది. ఈ సమావేశంలో జేఏసీ గౌరవ సలహాదారు, తమిళనాడు విశ్రాంత చీఫ్ సెక్రటరీ పి. రామమోహనరావు పలు తీర్మానాలను ప్రకటించగా వీటిని ఏకగ్రీవంగా ఆమోదించారు. తాను పదవుల కోసమో, రాజకీయం కోసమో జేఏసీకి మద్దతివ్వడంలేదని, తాను ఐఏఎస్ అధికారినైనప్పటికీ కాపుల వెనుకబాటుతనాన్ని చూడలేక ముందుకొచ్చానని ఆయన వివరించారు. ఈ కార్యక్రమంలో జీఎస్టీ మాజీ చీఫ్ కమిషనర్ రంగిశెట్టి మంగబాబు, జేఏసీ నేతలు సాయి సుధాకర్ నాయుడు, ఆకుల రామకృష్ణ, నల్లా విష్ణు, తోట రాజీవ్, ఆరేటి ప్రకాష్, రాజా సురేష్‌కుమార్, ముత్యాల రామదాసు, వాసిరెడ్డి ఏసుదాసు, ఉషా నాయుడు, చందు జనార్దన్ పాల్గొన్నారు.

## సాహితీవేత్త 'భాగవతుల' మృతి



**సాక్షి, అమరావతి :** ప్రముఖ సాహిత్యవేత్త, గురజాడ కన్యాశుల్కం నాటకాన్ని ఓలి పేరుతో ఆంగ్లంలో రచించిన భాగవతుల వెంకట రాధాకృష్ణ మూర్తి శుక్రవారం హైదరాబాద్‌లో తుదిశ్వాస విడిచారు. ఆయన స్వస్థలం అనకాపల్లి జిల్లా రాంబిల్లి మండలం, దిమిలి గ్రామం. వృత్తి రీత్యా మేనేజ్‌మెంట్ కన్సల్టెంట్‌గా పనిచేసి ఉద్యోగ విరమణ అనంతరం విశాఖపట్నంలో స్థిరపడ్డారు. తెలుగు సాహిత్యంలో మంచి అభినివేశం కలిగిన గురజాడ రచనలను ఆయన అవపోసన పట్టారు. అనారోగ్యంకొంతకాలంగా భాగవతుల హైదరాబాద్‌లో చికిత్స పొందుతూ మృతిచెందారు.

## రాజధాని ఫైల్స్ కులవాదుల సినిమా

### 1,237వ రోజు కొనసాగుతున్న రిలే దీక్షలో మండిపడ్డ బహుజన నాయకులు



**తాడికొండ:** రాజధాని ఫైల్స్ సినిమాలో అవాస్తవాలను చిత్రీకరించిన కులవాదులు బహుజనులను రెచ్చగొడుతున్నారని బహుజన పరిరక్షణ సమితి నాయకులు మండిపడ్డారు. గుంటూరు జిల్లా తుళ్ళూరు మండలం తాళ్ళాయపాలెం సీడ్ యాక్సిస్ రోడ్డు జంక్షన్‌లో మూడు రాజధానులకు మద్దతుగా బహుజన పరిరక్షణ సమితి ఆధ్వర్యంలో 1,237వ రోజు కొనసాగుతున్న రిలే నిరాహార దీక్షలో శుక్రవారం పలువురు మాట్లాడారు. మూడు రాజధానుల కోసం ప్రభుత్వం నిర్ణయం తీసుకుంటే.. కులవాదులు నిర్మించిన రాజధాని ఫైల్స్ సినిమాలో 4 రాజధానులు అని చూపించడం విడ్డూరమని మండిపడ్డారు. సీఎం వైఎస్ జగన్‌పై అనుచిత వ్యాఖ్యలు చేస్తూ.. హింసను ప్రేరేపించేలా ఉందని, సినిమా నిర్మాత, డైరెక్టర్‌ను అరెస్టు చేసి వివాదాస్పద సీన్‌లు తొలగించాలని డిమాండ్ చేశారు. 29 గ్రామాల పరిధిలో అమరావతి ఉద్యమం ఎక్కడా జరగడం లేదని చెప్పారు. రాజధాని భూములిచ్చిన రైతుల గురించి గొప్పగా వర్ణించిన ఆ సినిమాలో ఉపాధి కోల్పోయిన 17 వేల మంది రైతు కూలీల దుస్థితి కూడా వర్ణించి ఉంటే బాగుండేదన్నారు. బాబును ప్రజలు నమ్మే పరిస్థితి ఉండదని, ఎన్నికల్లో తరిమికొట్టేందుకు సిద్ధంగా ఉన్నారని హెచ్చరించారు. నాయకులు ఎం. గురునాథం, బేతపూడి రాజేంద్ర కుమార్, పెద్దింటి విజయ్, బూదాల సలోమి, బోదాల సౌమ్య, బొలిమేర శామ్యేలు, కొమరవల్లి కిషోర్ బాబు, పులి దాసు, ఈపూరి ఆదాం, కారుమూరి పుష్పరాజు, బేతపూడి సాంబయ్య, నూతక్కి జోషి తదితరులు పాల్గొన్నారు.

## టీడీపీ, జనసేన నుంచి వైఎస్సార్‌సీపీలోకి చేరికలు



పశ్చిమగోదావరి జిల్లా అత్తిలి మండలం బల్లిపాడులో వైఎస్సార్‌సీపీలో చేరిన వారికి పార్టీ కండువాలు కప్పి ఆహ్వానిస్తున్న మంత్రి కారుమూరి నాగేశ్వరరావు

**అత్తిలి/భీమవరం:** టీడీపీ, జనసేన పార్టీలకు ఉమ్మడి పశ్చిమ గోదావరి జిల్లాలో భారీ షాక్ తగిలింది. అత్తిలి మండలం వరిఘేడు, గుమ్మంపాడు, బల్లిపాడు, అత్తిలి గోగులమ్మపేట, అత్తిలి రామన్నపేట, సంతమార్కెట్ సెంటర్‌కు చెందిన టీడీపీ, జనసేన పార్టీల నాయకులు, కార్యకర్తలు పెద్ద సంఖ్యలో శుక్రవారం మంత్రి కారుమూరి నాగేశ్వరరావు సమక్షంలో వైఎస్సార్‌సీపీలో చేరారు. వీరికి మంత్రి కారుమూరి వైఎస్సార్‌సీపీ కండువాలు కప్పి పార్టీలోకి సాదరంగా ఆహ్వానించారు. రానున్న ఎన్నికల్లో వైఎస్సార్‌సీపీ ఘన విజయానికి కృషి చేయాలని సూచించారు. అధికారంలో ఉన్నప్పుడు చంద్రబాబు చేసిన్ని అవినీతి, అక్రమాలకు పాల్పడితే.. సీఎం జగన్ అధికారంలోకి వచ్చిన తర్వాత ఏపీని చదువుల రాష్ట్రంగా మార్చేశారని చెప్పారు. విద్య, వైద్యం, వ్యవసాయ రంగాలు ఎంతో అభివృద్ధి చెందాయన్నారు. కార్యక్రమంలో నాయకులు బుద్ధరాతి భరణీ ప్రసాద్, పైబోయిన సత్యనారాయణ, మక్కా సూర్యనారాయణ, అడ్డాల జానకి, పెన్మెత్స రామరాజు, వెలగల అమ్మిరెడ్డి, శింగంశెట్టి శ్రీనివాస్ పాల్గొన్నారు.

**వీరవాసరం మండలంలో..**

వీరవాసరం మండలం కొణితివాడ గ్రామానికి చెందిన టీడీపీ, జనసేన పార్టీల నాయకులు, కార్యకర్తలు పెద్ద సంఖ్యలో గ్రామ ఉప సర్పంచ్ నాగరాజు శ్రీనివాసరాజు ఆధ్వర్యంలో శుక్రవారం వైఎస్సార్‌సీపీలో చేరారు. భీమవరం ఎమ్మెల్యే గ్రంధి శ్రీనివాస్ వైఎస్సార్‌సీపీ కండువాలు కప్పి వారిని పార్టీలోకి ఆహ్వానించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ.. సీఎం జగన్ కులమతాలు, పార్టీలకు అతీతంగా అన్ని వర్గాల్లోని పేదలకు సంక్షేమ పథకాలను.. అవినీతికి చోటులేకుండా అందజేస్తుండడం వల్లే టీడీపీ, జనసేన నాయకులు, కార్యకర్తలు వైఎస్సార్‌సీపీ వైపు చూస్తున్నారని చెప్పారు. సీఎం జగన్ సంక్షేమాభివృద్ధి పాలన సాగిస్తుండటంతో.. టీడీపీ, జనసేన పార్టీలు ఒంటరిగా ఎదుర్కోలేక పొత్తుల కోసం పాకులాడుతున్నాయని దుయ్యబట్టారు. వచ్చే ఎన్నికల్లో కూడా వైఎస్సార్‌సీపీ ఘన విజయం ఖాయమన్నారు. టీడీపీ, జనసేనకు చెందిన బొంతు శ్రీను, కంకటాల సత్యవతి, కుక్కల శ్రీను, బొక్కా భవాని, గుబ్బల మాసయ్య, వి.సత్యనారాయణ, ముప్పిడి రమేశ్, కండెల్లి శ్రీను, యార్లగడ్డ నరేశ్, రాపాక అశోక్, జవ్వాది కనకారావు, చిన్నమిల్లి తాతాజీ, సీలం సంజయ్, వర్ధనపు చిట్టిబాబు, బొంతు లక్ష్మి, కంకటాల వెంకటేశ్, కొడమంచిలి ప్రకాశ్, మాండ్రు గోపి తదితరులు పార్టీలో చేరారు. కార్యక్రమంలో ఏఎంసీ చైర్మన్ కోటిపల్లి బాబు, జేసీఎస్ కన్వీనర్ మానుకొండ ప్రదీప్ పాల్గొన్నారు.

## బాబుపై యుద్ధానికి సిద్ధం!

### పరిటాల సునీత ఇంట్లో అనంతపురం టీడీపీ సీనియర్ల రహస్య భేటీ



సునీత ఇంట్లో సమావేశమైన టీడీపీ నాయకులు

**సాక్షి ప్రతినిధి, అనంతపురం:** అనంతపురం టీడీపీలో అసమ్మతి రాగం తారాస్థాయికి చేరింది. పార్టీ సీనియర్లంతా జట్టుగా తెరవెనుక జరుపుతున్న మంతనాలు ఇప్పుడు ఆ పార్టీలో హాట్‌టాపిక్‌గా మారాయి. ఇంకా టికెట్లు ప్రకటించకుండానే లొల్లి మొదలవడంతో కార్యకర్తల్లో అయోమయం నెలకొంది. దాదాపు ఇరవై ఏళ్లుగా పార్టీ కోసం అహర్నిశలు కష్టపడితే.. తమకు మొండిచేయి చూపేలా అధిష్టానం ధోరణి ఉండడంపై వారు మండిపడుతున్నారు. పరిటాల సునీత సొంతూరైన శ్రీసత్యసాయి జిల్లా రామగిరి మండలం వెంకటాపురంలోని సునీత ఇల్లు శుక్రవారం ఈ రహస్య సమావేశానికి వేదికైంది. పరిటాల సునీత, పరిటాల శ్రీరామ్, పల్లె రఘునాథరెడ్డి, కందికుంట వెంకట ప్రసాద్, బీకే పార్థసారథి, గుండుమల తిప్పేస్వామి ఈ సమావేశంలో పాల్గొన్నారు. వీళ్లలో చాలామందికి అధిష్టానం టికెట్లు నిరాకరించడమే భేటీకి కారణమని తెలిసింది. టికెట్లు ప్రకటించకముందే తాడోపేడో తేల్చుకోవాలని సీనియర్లు నిర్ణయించుకున్నట్లు సమాచారం.

#### అధిష్టానంపై ఒత్తిడి.. వినకపోతే కార్యాచరణ

ఏళ్ల తరబడి పనిచేస్తున్న తమకే టికెట్లు ఇవ్వకపోతే కేడర్‌కు ఏం సంకేతాలు వెళ్తాయని సమావేశంలో నేతలు ఆవేదన వ్యక్తం చేసినట్లు తెలిసింది. మూడు దశాబ్దాలు పార్టీకి సేవ చేస్తే ఒకే టికెట్ ఇస్తామని చెప్పడం దారుణమని పరిటాల సునీత వాపోయినట్లు సమాచారం. బీజేపీలో ఉన్నా, టీడీపీలో ఉన్నా తనదే టికెట్ అని వరదాపురం సూరి బయట చెప్పుకుంటుంటే బాధగా ఉందని ఆమె అన్నట్లు తెలిసింది. కదిరి, పుట్టపర్తి, పెనుకొండ నియోజకవర్గాల్లో సీనియర్లను పక్కనపెట్టి ఇతరులకు టికెట్లు ఇవ్వాలనే ఆలోచన ఏ పరిస్థితులకు దారితీస్తుందోనని ఆందోళన వ్యక్తం చేశారు. అధిష్టానంపై ఒత్తిడి తేవాలని, వినకపోతే కార్యాచరణ ప్రకటించాలనే యోచనలో ఉన్నట్టు సమావేశంలో పాల్గొన్న ఒక నేత చెప్పారు.

#### లోకేశ్ తీరుపై అసహనం

పలువురు నేతలు..లోకేశ్ వ్యవహార శైలిపై తీవ్ర అసహనం వ్యక్తం చేశారని తెలిసింది. అతను వచ్చాకనే పార్టీలో పరిస్థితి దారుణంగా తయారైందని, పార్టీకి పనిచేసిన వారికి కాదని, డబ్బుకు ప్రాధాన్యత ఇస్తున్నారని వాపోయారు. ఇప్పటికే టికెట్ రాదేమోనన్న బాధలో కేడర్ ఉందని, ఓ వైపు అధికార పార్టీ వాళ్లేమో సమన్వయకర్తలను ప్రకటించి పని చేసుకుంటుంటే.. మనకేమో టికెట్ వస్తుందో రాదోనన్న ఆందోళనలో ఉన్నామన్నారు. ఈ రహస్య భేటీ సమాచారం బయటకు రావడంతో.. నేతలు మాటమార్చి సమన్వయం కోసమే సమావేశమయ్యామని తెలిపారు.

## స్వార్థం, అవకాశవాదం.. వెరసి గరటయ్య!

### పచ్చపార్టీ తీర్థం తీసుకున్న గరటయ్య, కృష్ణచైతన్య
### తండ్రీ,కొడుకుల విశ్వాసఘాతుకంపై నియోజకవర్గ ప్రజల మండిపాటు

**సాక్షి ప్రతినిధి, బాపట్ల:** అద్దంకి నియోజకవర్గం నుంచి గత ఎన్నికల్లో వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ అభ్యర్థిగా పోటీ చేసిన బాచిన గరటయ్య కుటుంబం టీడీపీ అధినేత చంద్రబాబును కలవడంపై విమర్శలు వెల్లువెత్తుతున్నాయి. గత ఎన్నికల్లో టీడీపీ అభ్యర్థి గొట్టిపాటి రవికుమార్ చేతిలో గరటయ్య ఓటమి చెందారు. అయినా సీఎం జగన్ ఆయనను అద్దంకి నియోజకవర్గ ఇన్‌చార్జిగా కొనసాగించారు. ఆ తర్వాత కొంతకాలానికి ఆ బాధ్యతలను ఆయన తనయుడు కృష్ణ చైతన్యకు కట్టబెట్టారు. దీనికితోడు చైతన్యకు రాష్ట్ర శాప్‌నెట్ చైర్మన్ గిరీ కూడా అప్పగించారు. దీంతో ఐదేళ్లుగా గరటయ్య, చైతన్యలు ఎమ్మెల్యేకు మించి నియోజకవర్గంలో పెత్తనం చేశారు. తీరా ఎన్నికలు సమీపిస్తున్న తరుణంలో వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీకి వెన్నుపోటు పొడిచి వారిద్దరూ గురువారం పచ్చ పార్టీ గూటికి చేరారు. ఐదేళ్లుగా పదవులు అనుభవించిన గరటయ్య కుటుంబం పార్టీని వదిలి వెళ్లడాన్ని నియోజకవర్గంలోని వారే కాక జిల్లా ప్రజలు తీవ్రంగా ఖండిస్తున్నారు. రాబోయే ఎన్నికల్లో తమకు టికెట్ ఇవ్వలేదన్న సాకుతో వారు టీడీపీ తీర్థం తీసుకోవడాన్ని తప్పుపడుతున్నారు.

#### సామాజిక సమీకరణలతోనే మార్పు

వాస్తవానికి రాబోయే ఎన్నికలను ప్రతిష్టాత్మకంగా తీసుకున్న వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ గెలుపే లక్ష్యంగా అభ్యర్థులను ఎంపిక చేస్తోంది. సామాజిక సమీకరణలకు ప్రాధాన్యమిస్తోంది. అన్ని వర్గాలను అధికారంలో భాగస్వామ్యులను చేయాలని పార్టీ భావిస్తోంది. అందులో భాగంగా పలు నియోజకవర్గాల్లో ప్రజాభిప్రాయం, సర్వేలు చేపట్టి మరీ అభ్యర్థులను ఎంపిక చేస్తోంది. ఈ క్రమంలోనే రెడ్డి సామాజికవర్గానికి చెందిన హనిమిరెడ్డిని అద్దంకి సమన్వయకర్తగా నియమించింది.

## శ్రీవారి సేవలో హైకోర్టు న్యాయమూర్తులు, జార్ఖండ్ గవర్నర్

**తిరుపతి(అలిపిరి):** తిరుమలలో రథసప్తమి సందర్భంగా శ్రీవారిని ఏపీ హైకోర్టు న్యాయమూర్తులు జస్టిస్ ఏవీ రవీంద్ర బాబు, జస్టిస్ దుర్గాప్రసాదరావు, ఝూర్ఖండ్ గవర్నర్ సీపీ రాధాకృష్ణన్ తదితరులు శుక్రవారం దర్శించుకున్నారు. వీరికి ఆలయ అధికారులు ప్రత్యేక దర్శనం ఏర్పాట్లు చేశారు. దర్శనం అనంతరం వేద పండితులు ఆశీర్వచనం పలుకగా, అధికారులు లడ్డూప్రసాదాలతో ఘనంగా సత్కరించారు.



తిరుమల ఆలయం వెలుపల ఏపీ హైకోర్టు న్యాయమూర్తి జస్టిస్ ఏవీ రవీంద్రబాబు కుటుంబం



ఏపీ హైకోర్టు న్యాయమూర్తి జస్టిస్ దుర్గాప్రసాదరావు కుటుంబం



జార్ఖండ్ గవర్నర్ సీపీ రాధాకృష్ణన్ కుటుంబం

## శ్రీశారదాపీఠంలో వైభవంగా సూర్యారాధన

**పెందుర్తి (విశాఖ జిల్లా):** విశాఖ శ్రీశారదాపీఠం వార్షిక మహోత్సవాలు వైభవంగా జరుగుతున్నాయి. ఉత్సవాల్లో భాగంగా రెండోరోజు శుక్రవారం రథసప్తమి వేడుకలు నిర్వహించారు. పీఠాధిపతి స్వరూపానందేంద్ర సరస్వతి, ఉత్తరాధికారి స్వాత్మానందేంద్ర సరస్వతి సూర్య భగవానుడికి ప్రత్యేక పూజలు జరిపారు. రాష్ట్రం నలుమూలల నుంచి తరలివచ్చిన వేదపండితులు ఆదిత్య భగవానుణ్ణి ప్రార్థిస్తూ త్రిచ విధానంలో సూర్యనమస్కారాలు చేశారు. అరుణ పారాయణం జరిగింది. లోక కల్యాణార్థం చేపట్టిన రాజశ్యామల యాగం కొనసాగింది. శ్రీశైలం దేవస్థానం ఆధ్వర్యంలో శ్రీభ్రమరాంబా సమేత మల్లికార్జున స్వామి కల్యాణం నిర్వహించారు. వైఎస్సార్‌సీపీ ఉత్తరాంధ్ర రీజినల్ కోఆర్డినేటర్ వైవీ సుబ్బారెడ్డి, వైఎస్సార్‌సీపీ ఉత్తర సమన్వయకర్త కె.కె.రాజు తదితరులు పాల్గొన్నారు.



అమ్మవారికి పూజలు చేస్తున్న స్వరూపానందేంద్ర సరస్వతి స్వామీజీ

## ప్రైవేట్ స్కూళ్లలో ఉచిత విద్యకు దరఖాస్తుల ఆహ్వానం

### ఈ నెల 23 నుంచి మార్చి 14 వరకు అవకాశం

**సాక్షి, అమరావతి:** విద్యాహక్కు చట్టం కింద 2024–25 విద్యా సంవత్సరంలో ప్రైవేటు పాఠశాలల్లో పేద పిల్లలకు ఉచిత అడ్మిషన్ల కోసం దరఖాస్తు చేసుకోవాలని సమగ్ర శిక్ష ఎస్పీడీ బి.శ్రీనివాసరావు శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. ప్రతికూల పరిస్థితుల్లో ఉన్న అనాథలు, హెచ్ఐవీ బాధితులు, విభిన్న ప్రతిభావంతులు, ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనారిటీ, ఓసీ వర్గాల పిల్లలకు ఈ పథకం వర్తిస్తుందన్నారు. రాష్ట్రంలోని ప్రైవేటు, అన్ ఎయిడెడ్ పాఠశాలల్లో వీరికి 25 శాతం సీట్లు కేటాయించామన్నారు. ఒకటో తరగతిలో ప్రవేశానికి ఈ నెల 23 నుంచి మార్చి 14వ తేదీ వరకు అర్హత గల విద్యార్థుల ఆధార్ వివరాలతో http://cse.ap.gov.in వెబ్‌సైట్‌లో రిజిస్ట్రేషన్ చేసుకోవాలన్నారు.వివరాలకు సమీప మండల విద్యాశాఖాధికారి లేదా జిల్లా విద్యాశాఖాధికారిని గానీ, 18004258599 టోల్‌ఫ్రీ నంబరులో గానీ సంప్రదించాలని సూచించారు.

## స్టీల్‌ప్లాంట్‌లో సమ్మె పాక్షికం

**ఉక్కునగరం (విశాఖ జిల్లా):** స్టీల్‌ప్లాంట్‌లో కార్మిక సమ్మె పాక్షికంగా జరిగింది. గతంలో జరిగిన సమ్మెలతో పోలిస్తే ఈసారి కార్మిక వర్గం సమ్మె పట్ల ఆసక్తి చూపక పోవడం కనిపించింది. జాతీయ కార్మిక సంఘాల పిలుపు మేరకు దేశవ్యాప్తంగా జరిగిన గ్రామీణ భారత్ బంద్‌లో భాగంగా ఉక్కు అఖిలపక్ష కార్మిక సంఘాల ఆధ్వర్యంలో స్టీల్‌ప్లాంట్ సమ్మె జరిగింది. అయితే 75.25 శాతం మంది కార్మికులు విధులకు హాజరయ్యారు. కాంట్రాక్ట్ కార్మికుల్లో 48 శాతం మాత్రమే హాజరయ్యారు. ఉక్కునగరంలో పాఠశాలలు, బ్యాంకులు, వ్యాపార సంస్థలు యథావిధిగా పనిచేశాయి. అఖిలపక్ష నాయకులు సీహెచ్ నర్సింగరావు, డి.ఆదినారాయణ, మంత్రి రాజశేఖర్, జె. అయోధ్యరామ్, నీరుకొండ రామచంద్రరావు, వై.మస్తానప్ప,జి.గణపతిరెడ్డి,సన్యాసిరావు, సురేష్‌బాబు, బొడ్డు పైడిరాజు పాల్గొన్నారు.

## ఖాట్మండు వర్సిటీతో పద్మావతి వర్సిటీ ఒప్పందం



**తిరుపతి సిటీ:** అసోసియేషన్ ఆఫ్ ఇండియన్ యూనివర్సిటీస్, నేపాల్ ఖాట్మండు యూనివర్సిటీ సంయుక్త ఆధ్వర్యంలో ఈనెల 15 నుంచి 17వ తేదీ వరకు ఖాట్మండు వేదికగా భారత్, నేపాల్ హయ్యర్ ఎడ్యుకేషన్ సమ్మిట్ జరిగింది. ఈ సమ్మిట్‌లో తిరుపతి పద్మావతి మహిళా వర్సిటీ వీసీ డి.భారతి పాల్గొని పలు అంశాల మీద ఖాట్మండు వర్సిటీతో శుక్రవారం ఒప్పందం కుదుర్చుకున్నారు. ప్రధానంగా రీసెర్చ్ కొలాబరేషన్, ఫ్యాకల్టీ ఎక్స్ఛేంజ్, స్టూడెంట్స్ ఎక్స్ఛేంజ్ ప్రోగ్రామ్స్, డ్యూయల్ డిగ్రీ నిర్వహణ వంటి వాటిపై రెండు యూనివర్సిటీల మధ్య అవగాహన కుదిరింది. ఈ కార్యక్రమంలో ఖాట్మండు వర్సిటీ వీసీ డాక్టర్ బోలా తప, రిజిస్ట్రార్ డాక్టర్ అచ్యుత్ వాంగ్లే పాల్గొన్నారు.

■ తెలంగాణ

## కేంద్ర ఉర్దూ భాషాభివృద్ధి మండలి సభ్యునిగా సూర్యనారాయణమూర్తి

**సాక్షి, హైదరాబాద్:** కేంద్ర విద్యాశాఖలోని ఉర్దూ భాషాభివృద్ధి జాతీయ మండలి సభ్యునిగా విశ్రాంత పాత్రికేయుడు, ఉర్దూ తెలుగు–అనువాదకుడు పీవీ సూర్యనారాయణమూర్తి (మెహక్ హైదరాబాదీ) నియమితులయ్యారు. ఈ విషయాన్ని జాతీయ మండలి డైరెక్టర్ ప్రొఫెసర్ ధనుంజయ్ సింగ్ ఒక లేఖ ద్వారా తెలియజేశారు. మండలి సభ్యునిగా సూర్యనారాయణమూర్తి మూడేళ్లపాటు కొనసాగుతారు. తూర్పు గోదావరి జిల్లా ఉండ్రాజవరానికి చెందిన మూర్తి.. 36 ఏళ్ల పాటు వివిధ ప్రధాన తెలుగు దినపత్రికలలో పనిచేసి 2021లో ఉద్యోగ విరమణ చేశారు. ప్రముఖ ఉర్దూ రచయితల కథా సాహిత్యాన్ని తెలుగు వారికి అందించారు. ఫిక్షన్, నాన్ ఫిక్షన్ కలిపి ఇప్పటిదాకా మొత్తం తొమ్మిది పుస్తకాలు తీసుకొచ్చారు. ప్రముఖ ఉర్దూ రచయిత్రి జీలానీ బానూ రెండు సంకలనాలు, ఆమె బాల్య జ్ఞాపకాలతో ఒక పుస్తకం, సాదత్ హసన్ మంటో రెండు కథా సంకలనాలు, అమృతా ప్రీతమ్ నవల 'అస్థిపంజరం', ఒకనాటి హైదరాబాద్ సంస్థానంపై విప్లవ కవి మఖ్దూం మొహియుద్దీన్ రాసిన వివాదాస్పద పుస్తకం, హైదరాబాద్‌పై సోషలిస్టు నేత చెరుకు మాధవ రెడ్డి రాసిన రచనను అనువదించారు. 80 ఏళ్ల వ్యవధిలో హైదరాబాద్ లోని ఉర్దూ రచయితలు హిందువుల జీవితాలపై ప్రత్యేక థీమ్‌తో రాసిన 'గుల్ దస్త' సంకలనాన్ని ఇటీవల ప్రచురించారు. ఇవికాకుండా పలువురు ఉర్దూ ప్రముఖుల వ్యాసాలను తెలుగులోకి అనువదించారు. కొన్ని గజళ్లు కూడా సూర్యనారాయణమూర్తి రాశారు.

# 'పొత్తు'లాటతో అంతర్యుద్ధం

### బాబు వైఖరిపై మండిపడుతున్న టీడీపీ నేతలు

- బహిరంగ విమర్శలు... గ్రూపు రాజకీయాలు
- సీటు కోసం సీనియర్లూ తలలు పట్టుకోవాల్సిన పరిస్థితి
- ఎవరికి ఖరారవుతుందో తెలియక అందరిలోనూ సందిగ్ధం
- ద్వితీయ కేడర్‌కు సమాధానం చెప్పుకోలేక సతమతం
- ఏ జిల్లాలోనూ సరైన నిర్ణయాలు జరగక కేడర్‌లో అయోమయం



తెలుగుదేశం పార్టీ కార్యకర్తల్లో రోజురోజుకూ నైరాశ్యం పెరిగిపోతోంది. ఏ స్థానం నుంచి ఎవరు పోటీ చేస్తారన్నదానిపై అందరిలోనూ సందేహం వ్యక్తమవుతోంది. పొత్తులపైనా నిర్దిష్ట నిర్ణయం జరగక దిగువ స్థాయి కేడర్ సతమతమవుతోంది. టికెట్‌పై స్పష్టత కొరవడడంతో సీనియర్లలోనూ నిరాసక్తత పెరిగిపోతోంది. అసలు ఎన్నికలు సమీపిస్తున్నా అభ్యర్థులెవరన్నది తేలకపోవడంతో ఎక్కడా ఆ హడావుడి మాత్రం కనిపించడం లేదు. ఓ వైపు అధికార పార్టీ అభ్యర్థుల ఖరారు విషయంలో దూకుడుగా వ్యవహరిస్తుంటే తమ పార్టీ అధినేత మీనమేషాలు లెక్కించడం కార్యకర్తలను గందరగోళంలో పడేస్తోంది. మరో వైపు ప్రతి చోటా పొత్తు ధర్మం పేరుతో మిత్రపక్షమైన జనసేన అభ్యర్థుల హడావుడి వారిని తీవ్రంగా కలచివేస్తోంది. ఇప్పటికే జనంలోకి వైఎస్సార్‌సీపీ దూసుకుపోతూ... ప్రజల్లో విశ్వాసం కూడగడుతుంటే తాము మాత్రం ఏం చేశామో... భవిష్యత్తులో ఏం చేస్తామో... చెప్పుకోలేక... డీలా పడిపోతోంది. దీనికి తోడు అప్పుడప్పుడు పెదబాబు... ఇటీవల చినబాబు చేసిన పర్యటనలకు ఖర్చులు పెట్టలేక టికెట్లు ఆశిస్తున్న నాయకులు చేతులెత్తేస్తున్నారు. తీరా ఏర్పాటుచేసిన సభల్లో వారి ప్రసంగాలు ఆకట్టుకోలేకపోవడం... సభలు వెలవెలబోవడంతో ఎక్కువమంది పార్టీ వీడే యోచనలో ఉన్నారు. – సాక్షి నెట్‌వర్క్

### మిత్రత్వంలో శతృత్వం

ఏలూరులో టీడీపీ, జనసేన మధ్య టిక్కెట్ ఫైట్ తీవ్రంగా ఉంది. జనసేనకు టిక్కెట్ ఇస్తే కాపుకాసేది లేదని టీడీపీ నేతలు చెబుతుంటే... టీడీపీ అభ్యర్థి టిక్కెట్ దక్కించుకుంటే తాము సహకరించబోమని, పోటీలో కచ్చితంగా ఉంటామని జనసేన నేతలు బహిరంగంగా చెబుతున్నారు. పొత్తుల్లో ఈ స్థానం టీడీపీకి ఖరారైందని ఆ పార్టీ ఇన్‌చార్జి బడేటి చంటి ప్రచారం చేసుకుని ఏకంగా హోర్డింగులతో హడావుడి చేశారు. దీనికి కౌంటర్‌గా జనసేన నాయకులు 'మేము రెడీ.. టిక్కెట్ మాదే..' అంటూ ఫ్లెక్సీలతో హంగామా చేశారు. అంతేనా... ఏలూరు ఎమ్మెల్యే అభ్యర్థి రెడ్డి అప్పలనాయుడే అంటూ అతను నిర్వహించిన ఆత్మీయ సమావేశంలో జిల్లా జనసేన నేతలే ప్రకటించారు. ఇదిలా కొనసాగుతుండగా జనసేనలో అకస్మాత్తుగా తెరపైకి మరో కొత్త నేత వచ్చి తనకే టికెట్ అంటూ నగరమంతా భారీ ఫ్లెక్సీలు ఏర్పాటు చేసి మరో గందరగోళానికి దారితీశారు.

### అనంతపురంలో అంతర్గత పోరు

అనంతపురం అర్బన్‌లో ప్రభాకర్ చౌదరికి అసమ్మతి బెడద ఎక్కువైంది. ఆయన మున్సిపల్ చైర్మన్‌గా పనిచేసినప్పుడు జరిగిన అవినీతిని వారు గుర్తు చేసుకుంటున్నారు. ఆయనకు మళ్లీ టికెట్ ఇస్తే పార్టీ నామరూపాల్లేకుండా పోతుందని బహిరంగంగా వ్యాఖ్యానిస్తున్నారు. అక్కడ పవన్‌కల్యాణ్ పోటీచేస్తే తాను తప్పుకుని ఆయన గెలుపునకు పాటుపడతానని ప్రభాకర్ చెబుతుండగా 'త్యాగం చెయ్యడానికి, గెలిపించడానికి నువ్వెవరు? ఇదేమైనా నీ తాత, తండ్రుల సొత్తు కాదు కదా!' అని తెలుగుదేశం పార్టీలో బలిజ సామాజిక వర్గానికి చెందిన మునిరత్నం మీడియా ముఖంగా ధ్వజమెత్తారు.

### విభేదాలు బట్టబయలు

శ్రీసత్యసాయి జిల్లాలో ఏ నియోజకవర్గం పరిశీలించినా.. వేరు కుంపట్లు కనిపిస్తున్నాయి. దీనిపై విసిగెత్తిపోతున్న కేడర్ టీడీపీకి టాటా చెబుతోంది. ఇప్పటికే చాలా గ్రామాల్లో టీడీపీ ఖాళీ అయ్యింది. చంద్రబాబు సతీమణి నారా భువనేశ్వరి ఈ నెల 13, 14, 15 తేదీల్లో ఆ జిల్లాలో జరిపిన పర్యటనల్లో పార్టీ నాయకుల మధ్య గొడవలు వెలుగు చూడటం గమనార్హం. పెనుకొండలో నియోజకవర్గ ఇన్‌చార్జ్ బి.కె.పార్థసారథి కంటే సవితమ్మ ఎక్కువ హడావుడి చేశారు. మడకశిరలో దళితులను వెనక్కి నెట్టి.. గుండుమల తిప్పేస్వామి అన్నీ తానై వ్యవహరించడం విమర్శలకు దారి తీసింది. రాప్తాడులో పరిటాల శ్రీరామ్, పరిటాల సునీత హడావుడి చూసి శ్రీరామ్ ధర్మవరం వైపు ఎందుకొస్తున్నారంటూ చాలా మంది టీడీపీ వీడుతున్నారు. పుట్టపర్తిలో పల్లె రఘునాథరెడ్డికి వ్యతిరేకంగా ఒక వర్గం ఏకంగా ఎన్నికల ప్రచారమే చేస్తోంది.

### బత్తులకు ఉత్తచెయ్యేనా...

తూర్పుగోదావరి జిల్లా రాజానగరం నియోజకవర్గం టీడీపీలో అభ్యర్థిత్వాల వ్యవహారం రోజు కోమలుపు తిరుగుతోంది. ఈ స్థానంలో తమ పార్టీ పోటీచేస్తుందని జనసేన అధినేత పవన్ కళ్యాణ్ ప్రకటించడంతో ఇప్పటివరకూ తనకే టికెట్ వస్తుందని ప్రచారం చేసుకున్న ఆ పార్టీ నేత బత్తుల బలరామకృష్ణకు తాజాగా టీడీపీ నియోజకవర్గ ఇన్‌చార్జి బొడ్డు వెంకటరమణ చౌదరి రూపంలో షాక్ తగిలేలా ఉంది. ఆయనకు కాకుండా జనసేనకు టికెట్ ఇవ్వడాన్ని జీర్ణించుకోలేక అధినేత చంద్రబాబుతో తాడోపేడో తేల్చుకునేందుకు సుమారు 300 మంది టీడీపీ కార్యకర్తలతో కలిసి మంగళగిరిలోని టీడీపీ కార్యాలయానికి వెళ్లడంతో పరిస్థితులు తారుమారయ్యే పరిస్థితులు కనిపిస్తున్నాయి.

### వియ్యంకుల్లో ఒకరికేనట!

పల్నాడు జిల్లాలో టీడీపీ సీనియర్ నాయకులు జి.వి.ఆంజనేయులు, కొమ్మాలపాటి శ్రీధర్‌ల టికెట్ల కేటాయింపునకు బంధుత్వం అడ్డుగా నిలుస్తున్నట్టు తెలుస్తోంది. వియ్యంకులైన ఈ ఇద్దరిలో జీవీ వినుకొండ, కొమ్మాలపాటి పెదకూరపాడు టికెట్లు ఆశిస్తున్నారు. ఇదే కోరికతో వారు చంద్రబాబును ఇటీవల కలిశారట. అప్పుడు ఆయన ఒక్కరికే సీటు ఇవ్వగలనని, ఆ ఒక్కరూ ఎవరో మీరే తేల్చుకోండని వారిపైనే ఆ భారం నెట్టేసి చేతులు దులుపుకున్నారట. పరోక్షంగా పెదకూరపాడులో డబ్బు దండిగా పెట్టగల భాష్యం ప్రవీణ్‌కు ఇవ్వాలని యోచిస్తున్నట్టు ఆయన చెప్పడంతో శ్రీధర్ తన వర్గీయులతో శుక్రవారం గుంటూరు నగరంలోని ఓ హోటల్‌లో సమావేశం ఏర్పాటు చేసి తనకు అండగా నిలవాలని కోరారు.

### 'తమ్ముళ్ల' హడావుడితో జనసైనికుల ఆగ్రహం

డాక్టర్ బి.ఆర్.అంబేడ్కర్ కోనసీమ జిల్లాలో సీట్ల పంపకం తేలకున్నా... మిత్రపక్షాన్ని సంప్రదించకుండా టీడీపీ ఇన్‌చార్జులు, పార్టీ టిక్కెట్ ఆశిస్తున్నవారు ప్రచారం ప్రారంభించడంపై జనసేన పార్టీ ఆగ్రహం వ్యక్తం చేస్తోంది. పొత్తులో భాగంగా ఈ జిల్లా నుంచి తమకు అధిక సీట్లు కావాలని జనసేన కేడర్ పట్టుబడుతోంది. కానీ దానిని పట్టించుకోకుండా అమలాపురం టీడీపీ ఇన్‌చార్జి ఆనందరావు ఏకంగా ఎన్నికల ప్రచారానికి సన్నద్ధమవుతున్నారు. మండపేట నుంచి వేగుళ్ల జోగేశ్వరరావును గెలిపించాల్సిందిగా చంద్రబాబు మండపేట సభలో పిలుపునిచ్చిన విషయం తెలిసిందే. దీంతో రాజోలు నుంచి తాము పోటీ చేస్తామని పవన్ కల్యాణ్ ప్రకటించారు. మిగిలిన ఐదు స్థానాల పరిస్థితి తేలాల్సి ఉంది. కొత్తపేట, ముమ్మిడివరంలో టీడీపీ ఇన్‌చార్జిలు బండారు సత్యానందరావు, దాట్ల సుబ్బరాజు(బుచ్చిబాబు) తామే అభ్యర్థులుగా ప్రచారం చేసుకుంటున్నారు.

### యర్రగొండపాలెంలో డిష్యుం.. డిష్యుం

యర్రగొండపాలెంలో టీడీపీపై అసమ్మతి బుసలు కొడుతోంది. డాక్టర్ మన్నె రవీంద్ర కారణంగా ఇక్కడ తెలుగు దేశం పార్టీ గెలవడం లేదని నియోజకవర్గ ఇన్‌చార్జి గూడూరి ఎరిక్షన్ బాబు వర్గం చెబుతుండగా ఆయన గ్రూపులను ప్రోత్సహిస్తూ పార్టీని భ్రష్టు పట్టిస్తున్నారని ఆయనకు టికెట్ఇస్తే సహకరించేది లేదని, అవసరమైతే రాజీనామాకు కూడా వెనకాడబోమని డాక్టర్ రవీంద్ర వర్గం కరాఖండీగా చెబుతోంది.

## ఏపీ విద్యావ్యవస్థ రోల్‌మోడల్

- రేణిగుంట బాలికోన్నత పాఠశాలను సందర్శించిన తమిళనాడు సమగ్ర శిక్ష పీడీ ఎం.ఆరతి బృందం
- ట్యాబ్‌ల ద్వారా అభ్యసిస్తున్న విద్యార్థినులతో ముచ్చటించిన బృందం



విద్యార్థులతో మాట్లాడుతున్న తమిళనాడు సమగ్ర శిక్ష ప్రాజెక్టు డైరెక్టర్ డాక్టర్ ఎం.ఆరతి

**రేణిగుంట (తిరుపతి జిల్లా):** విద్యావ్యవస్థలో రాష్ట్ర ప్రభుత్వం తీసుకొచ్చిన విప్లవాత్మకమైన మార్పులు దేశానికే రోల్‌మోడల్‌గా నిలిచాయని తమిళనాడు రాష్ట్ర సమగ్ర శిక్ష ప్రాజెక్టు డైరెక్టర్ డాక్టర్ ఎం.ఆరతి ప్రశంసించారు. తిరుపతి జిల్లా రేణిగుంట బాలికోన్నత పాఠశాలను శుక్రవారం ఆరతితోపాటు తమిళనాడు స్కూల్ ఎడ్యుకేషన్ జాయింట్ డైరెక్టర్ ఎం.రామకృష్ణన్, ఆ రాష్ట్ర కో ఆర్డినేటర్ వడివేలు బృందం పరిశీలించింది. రాష్ట్ర ప్రభుత్వం అమలు చేస్తున్న కార్యక్రమాల గురించి వారు తెలుసుకున్నారు. ఆరతి క్లాస్‌రూముకు వెళ్లి ట్యాబ్‌ల ద్వారా విద్యార్థినులు పాఠ్యాంశాలను నేర్చుకోవడాన్ని పరిశీలించారు. వారినడిగి వివరాలు తెలుసుకున్నారు. రాష్ట్ర ప్రభుత్వం తమకు ట్యాబ్‌లు ఇవ్వడం ద్వారా బైజూస్, ఏపీ ఈ–పాఠశాల, డ్యూలింగో వంటి యాప్‌లతో ఎంతో సులభంగా నేర్చుకుంటున్నట్లు విద్యార్థులు చెప్పారు. ప్రభుత్వ స్కూళ్లలో ఐసీటీ పరంగా తీసుకొచ్చిన మార్పులను, ఐఎఫ్‌పీ ప్యానెల్ బోర్డులను ఉపయోగించి విద్యా బోధనాభ్యసన ప్రక్రియ సాగే విధానాన్ని ఆమె పరిశీలించారు. పీఏఎల్ ల్యాబ్ వినియోగం, ఐసీటీ ఇనిషియేటివ్ గురించి తెలుసుకున్నారు.

**నాడు–నేడు, జగనన్న గోరుముద్దలపై ప్రశంసలు**

నాడు–నేడు పథకం ద్వారా పాఠశాలలో ఏర్పాటుచేసిన అధునాతన మౌలిక వసతులు, తగరతి గదిలో విద్యార్థులకు కల్పించిన సౌకర్యాలను పరిశీలించి అభినందించారు. మధ్యాహ్నం జగనన్న గోరుముద్ద పథకాన్ని చూసి ప్రశంసించారు. టోఫెల్, అమ్మ ఒడి,జగనన్న విద్యాకానుక పథకాలను ప్రశంసించారు. మరే రాష్ట్రంలోను ఈ తరహాలో సౌకర్యాలు, విద్యావిధానంలో నిర్మాణాత్మక మార్పులు ఏర్పడలేదన్నారు. విద్యార్థుల మేధాశక్తి కూడా భేషుగ్గా ఉందని ఆమె చెప్పారు. ఆమె పాఠశాల ఆవరణంలో మొక్కను నాటారు. తిరుపతి డీఈవో శేఖర్, స్టేట్ ఐటీ సెల్ ప్రతినిధులు తులసీబాబు, వెంకటేష్‌బాబు, సాయిరమేష్, సీఎంవో సురేష్, ఏఎంవో శివశంకర్, ఏపీవో జయరాం, రేణిగుంట ఎంఈవో–2 రంగనాథ్ పాల్గొన్నారు.

## ఏపీలో విద్యా సంస్కరణలు అద్భుతం

- జాంబియా విద్యాశాఖ ప్రతినిధుల ప్రశంసలు
- తమ దేశంలో అమలు చేసేందుకు నిర్ణయం



విద్యార్థుల తల్లిదండ్రులతో మాట్లాడుతున్న జాంబియా ప్రభుత్వ ప్రతినిధులు

**సాక్షి, అమరావతి :** ఏపీలో విద్యా సంస్కరణలు అద్భుతంగా ఉన్నాయని జాంబియా విద్యాశాఖ ప్రతినిధులు ప్రశంసించారు. ముఖ్యంగా ప్రాథమిక విద్యలో నాణ్యత పెంచేందుకు ఏపీ ప్రభుత్వం చేపడుతున్న ప్రతిష్టాత్మక కార్యక్రమాలు, తరల్(టీచింగ్ ఎట్ ది రైట్ లెవెల్) అమలు తీరు బాగున్నాయన్నారు. జాంబియా దేశ ప్రాథమిక విద్యా డైరెక్టర్ కెల్లీ కెజలా మాలే, జాతీయ ప్రిన్సిపల్ ఎడ్యుకేషన్ స్టాండర్డ్స్ రిటైర్డ్ అధికారి హజెంబా, టీచర్ ఎడ్యుకేషన్ అండ్ స్పెషలైజ్డ్ సర్వీసెస్ అసిస్టెంట్ డైరెక్టర్ ఆంటోని టంబటంబా, కంట్రీ ప్రోగ్రామ్స్ మేనేజర్ కరోలిన్ మేరీ ఇలియట్ ప్రతినిధి బృందం శుక్రవారం బాపట్ల జిల్లాలో వివిధ పాఠశాలలను సందర్శించింది. శుక్రవారం విజయవాడలో పాఠశాల విద్యాశాఖ కమిషనర్ సురేష్‌కుమార్‌తో సమావేశమై ఏపీ విద్యా విధానాలు, అమలు చేస్తున్న సంస్కరణలను తెలుసుకున్నారు. బాపట్ల మండలం మరుప్రోలువారిపాలెం ఎంపీ పాఠశాలను సందర్శించారు. అక్కడి టీచర్, పేరెంట్ కమిటీలు, వాటి పాత్రను తెలుసుకున్నారు. ప్రాథమిక విద్యలో ప్రభుత్వం చేపట్టిన సంస్కరణలు అద్భుతంగా ఉన్నాయని, పాఠశాల నిర్వహణలో విద్యార్థుల తల్లిదండ్రులను భాగం చేయడం ద్వారా ఉత్తమ ఫలితాలు సాధించడం గొప్పగా ఉందన్నారు. ఈ విద్యా సంస్కరణలను తమ దేశాల్లోనూ అమలు చేస్తామని జాంబియా ప్రతినిధులు పేర్కొన్నారు. ఈ సందర్భంగా ప్రాథమిక విద్యార్థులు నృత్యం, 'కాకి–ఎలుగుబంటి' లఘు నాటికలను ప్రదర్శించి జాంబియా ప్రతినిధులను మెప్పించారు. అనంతరం బాపట్లలో 'ప్రథమ్' నిర్వహిస్తున్న స్కిల్ ట్రైనింగ్ సెంటర్‌ను సందర్శించి వృత్తి విద్యలో భాగంగా హోటల్ మేనేజ్‌మెంట్ కోర్సు చదువుతున్న విద్యార్థులతో మాట్లాడారు. ఈ విద్యార్థులకు ఆసక్తి ఉంటే జాంబియాలో ఉద్యోగవకాశాలు కల్పిస్తామని చెప్పారు. కాగా, జాంబియా అధికార బృందంలోని మరికొందరు సభ్యులు బాపట్ల మండలంలోని శివపురం, చింతాయపాలెం, చెరువు జమ్ములవారిపాలెంలోని పాఠశాలలను పరిశీలించారు.

## రాప్తాడు 'సిద్ధం' సభ కోసం రాష్ట్రం ఎదురు చూపు

### మంత్రి పెద్దిరెడ్డి రామచంద్రారెడ్డి



**రాప్తాడు :** ఏపీ రాష్ట్రం మొత్తం రాప్తాడు 'సిద్ధం' సభ వైపే చూస్తోందని అనంతపురం జిల్లా ఇన్‌చార్జ్ మంత్రి పెద్దిరెడ్డి రామచంద్రారెడ్డి అన్నారు. ప్రస్తుతం అనంతపురం జిల్లా అనునిత్యం వార్తల్లో కెక్కడానికి కారణం ఈ నెల 18న జరగనున్న సిద్ధం సభేనని, ఈ సభ రాజకీయ చరిత్రలో చిరస్థాయిగా నిలిచిపోతుందని చెప్పారు. త్వరలో జరగనున్న ఎన్నికలకు పార్టీ శ్రేణులను సమాయత్తం చేయడానికి 'సిద్ధం' పేరుతో ప్రాంతాల వారీగా సభలు నిర్వహిస్తున్న సీఎం జగన్‌మోహన్‌రెడ్డి ఈ నెల 18న రాయలసీమ జిల్లాల వైఎస్సార్‌సీపీ కార్యకర్తలతో అనంతపురం జిల్లా రాప్తాడులో సమావేశం కానున్నారు. ఈ నేపథ్యంలో రాప్తాడులో 'సిద్ధం' సభా ప్రాంగణంలో జరుగుతున్న ఏర్పాట్లను మంత్రి పెద్దిరెడ్డి.. శుక్రవారం సీఎం ప్రోగ్రామ్స్ కో–ఆర్డినేటర్ తలశిల రఘురాం, ఎమ్మెల్యేలు తోపుదుర్తి ప్రకాష్‌రెడ్డి, అనంత వెంకటరామిరెడ్డి, కేతిరెడ్డి వెంట్రామిరెడ్డి, ప్రభుత్వ విద్యా సలహాదారు ఆలూరు సాంబశివారెడ్డి తదితరులతో కలసి పరిశీలించారు. అనంతరం పెద్దిరెడ్డి మీడియాతో మాట్లాడుతూ రాప్తాడు సభలో సీఎం జగన్ పాల్గొని వైఎస్సార్‌సీపీ శ్రేణులకు దిశానిర్దేశం చేస్తారన్నారు. ఈ సభలో రాష్ట్ర ప్రజలకు కూడా ఒక సందేశం ఇస్తారని, ఈ సభ కోసం రాష్ట్రం మొత్తం ఎదురుచూస్తోందన్నారు. ఉమ్మడి రాష్ట్రంలో ఇప్పటివరకు ఎక్కడా జరగని రీతిలో రాప్తాడు సభకు ఏర్పాట్లు చేస్తున్నామన్నారు. ఈ సభ తర్వాత ఎన్నికలకు అందరం సన్నద్ధమయ్యే పరిస్థితి రాష్ట్రంలో ఏర్పడుతుందని చెప్పారు. కాంగ్రెస్ నేత రఘువీరారెడ్డి రాజకీయ బ్రోకర్ అని మంత్రి పెద్దిరెడ్డి రామచంద్రా రెడ్డి మండిపడ్డారు. ఖూనీలు చేసే పెద్దిరెడ్డి లాంటి వాళ్లు కూడా కాంగ్రెస్ గురించి మాట్లాడటం వింతగా ఉందని రఘువీరా చేసిన వ్యాఖ్యలను ఓ విలేకరి ప్రస్తావించగా.. ఆయన పైవిధంగా ఫైర్ అయ్యారు. తన మీద ఇప్పటి వరకు ఎలాంటి కేసులూ లేవని, తానెప్పుడూ అలాంటి పనులు చేయలేదని స్పష్టం చేశారు. మొదటి నుంచి ఒక ముఠా ఉందని, అందులో కిరణ్‌కుమార్‌రెడ్డి, రఘువీరారెడ్డి ఉన్నారని విమర్శించారు. తన గురించి రఘువీరాకు ఏం తెలుసని ప్రశ్నించారు. తన మీద ఏదైనా ఉందని నిరూపిస్తే రాజకీయాల నుంచి తప్పుకుంటానని సవాల్ విసిరారు. కాంగ్రెస్ పార్టీకి వెన్నుపోటు పొడిచింది రఘువీరారెడ్డి, కిరణ్‌కుమార్‌రెడ్డిలేనని ఆరోపించారు. చిత్తూరు జిల్లాలో కిరణ్‌కుమార్‌రెడ్డి డిపాజిట్ కూడా తెచ్చుకునే పరిస్థితిలో లేడన్నారు.

# అవినీతి అనకొండ

### వందల కోట్ల దోపిడీకి టీడీపీ మాజీ ఎమ్మెల్యే వంగలపూడి అనిత చిరునామా

**సాక్షి, అనకాపల్లి :** అక్రమాలకు, అవినీతికి కేరాఫ్ అడ్రస్ వంగలపూడి అనిత. పాయకరావుపేట నియోజకవర్గం ఏర్పడినప్పటి నుంచి ఎప్పుడూ లేనంతగా భారీ అవినీతి, భూఆక్రమణలకు పాల్పడ్డారు. వెబ్‌ల్యాండ్‌లో మార్పులతో భారీగా వసూళ్లకు పాల్పడ్డారు. టీడీపీ ఎమ్మెల్యేగా ఉన్న (2014–19) ఐదేళ్లలో అధికారాన్ని అడ్డం పెట్టుకుని ఆమె చేసిన అక్రమాలు అన్ని ఇన్నీ కావు. వందల కోట్ల విలువైన భూములు అన్యాక్రాంతం చేయడమే కాదు.. కోట్ల విలువైన అభివృద్ధి పనులను నామినేషన్ పద్ధతిలో పంచేసుకుని సొమ్ముచేసుకున్నారు. ఇసుకను దోచేశారు. మట్టిని కాజేశారు. మరుగుదొడ్లలో మెక్కేశారు. నిరుద్యోగులకు ఉద్యోగాల ఆశ చూపి దోచుకున్నారు. నీరు–చెట్టు పథకంలో పనులు చేయకుండానే బిల్లులు స్వాహా చేశారు. చెరువు తవ్వకాల్లో వచ్చిన మట్టిని రియల్‌ఎస్టేట్ వ్యాపారులకు విక్రయించడం, తాండవ, వరాహ నదుల్లో ఇసుకను అక్రమంగా తవ్వి కంపెనీలకు విక్రయించడం, భూరికార్డుల ట్యాంపరింగ్, ప్రభుత్వ భూములకు నకిలీ పట్టాలు పుట్టించి పాసు పుస్తకాల్లో నమోదు చేయించుకోవడం, ఈ భూములకు ప్రభుత్వం నుంచి కోట్లాది రూపాయలు పరిహారం పొందేందుకు స్కెచ్ వేయడం ఇలా అక్రమాల చిట్టా చాలానే ఉంది. జన్మభూమి కమిటీలతో ఔట్‌సోర్సింగ్ ఉద్యోగాలను అర్హులైన వారికి కేటాయించకుండా లక్షలాది రూపాయలకు అమ్మేసుకున్నారన్న విమర్శలు ఉన్నాయి. రేషన్ డిపోలు, అంగన్‌వాడీ ఆయా, కార్యకర్తల పోస్టులు కూడా ఇలాగే అమ్మేసుకున్నారు. మరుగుదొడ్లు, పక్కా గృహాలు, పింఛన్ల మంజూరు వంటి పథకాల అములులో కూడా లబ్ధిదారులనుంచి వేలాది రూపాయలు గుంజేశారు.



**మట్టి విక్రయాల్లో రూ.25 కోట్లు**

అప్పటి టీడీపీ ప్రభుత్వంలో నీరుచెట్టు పథకం కింద పాయకరావుపేట నియోజకవర్గంలో నాలుగేళ్లలో సుమారు రూ.12 కోట్ల విలువైన పనులు జరిగాయి. వీటిలో రూ.6 కోట్లు వరకూ అప్పటి టీడీపీ ఎమ్మెల్యే అనిత బొక్కేశారు. ఎస్.రాయవరం, కోటవురట్ల, పాయకరావుపేట మండలాల్లో ఇలా నిధులు కోట్లాది రూపాయలు పక్కదారి పట్టాయి. కోటవురట్లలో ఊరచెరువు, జల్లూరులో నాగన్న చెరువు, ఎస్.రాయవరం మండలం రామయ్యపట్నంలో జగ్గరాజు చెరువు, పెదగుమ్ములూరులో రాతి చెరువు, పెద ఉప్పలం చెరువు అప్పలరాజు చెరువులలో పనులు జరగకపోయినా జరిగినట్లు చూపించి మోసం చేశారు. మట్టి విక్రయాల ద్వారా మరో రూ.25 కోట్లు వెనకేసుకున్నారు.

**రూ.50 కోట్ల ఇసుక తరలింపు**

స్థానిక ప్రజాప్రతినిధి అండదండలు చూసుకుని టీడీపీ నాయకులు ఇసుక నుంచి కోట్లు పిండేశారు. తాండవ, వరాహ నదుల్లో దార్లపూడి, పందూరు, గొట్టివాడ, గుమ్ములూరు, పెదఉప్పలం, పెనుగొల్లు, ధర్మవరం, సోముదేవుపల్లి సత్యవరం, పెంటకోట, మాసయ్యపేట, అరట్లకోట తదితర ప్రాంతాల నుంచి లక్షలాది క్యూబిక్ మీటర్ల ఇసుకను అక్రమంగా తవ్వేశారు. సుమారు రూ.50 కోట్లు విలువైన ఇసుకను కొల్లగొట్టడం ద్వారా నాలుగు మండలాల ముఖ్య నాయకులు సుమారు రూ.20 కోట్ల మేర లాభాలు ఆర్జించారు.

**మరుగుదొడ్లలో 15 కోట్లు..**

టీడీపీ ప్రభుత్వంలో పాయకరావుపేట నియోజకవర్గంలో వివిధ గ్రామాల్లో సీసీ రోడ్లు నిర్మించారు. ఆర్థిక సంఘం నిధులు దాదాపుగా సుమారు రూ.300 కోట్లు మంజూరయ్యాయి. ఈ పనులన్నీ టీడీపీకి చెందిన సర్పంచ్‌లు, ముఖ్య నాయకులే చేపట్టారు. నాణ్యతా లోపంతో పనులు చేసి రూ.50 కోట్ల వరకు స్వాహా చేశారు. అలాగే నియోజకవర్గానికి 25 వేల మరుగుదొడ్లు మంజూరైతే..వాటికి రూ.37 కోట్లు విడుదల చేశారు. ఒక్కో దానికి రూ.15 వేలు కేటాయించారు. వీటిని నిర్మించే బాధ్యత తెలుగుతమ్ముళ్లే తీసుకున్నారు. వీటిలో సగం మరుగుదొడ్లు బినామీలకే మంజూరు చేశారు. ఇలా మరుగుదొడ్లలో రూ.15 కోట్ల వరకు అవినీతి జరిగినట్లు తెలిసింది.

**600 ఎకరాల్లో భూ కుంభకోణాలు**

అప్పట్లో అనిత నేతృత్వంలో నియోజకవర్గంలో సుమారు 600 ఎకరాల్లో భూకుంభకోణాలకు పాల్పడ్డారు. వెబ్‌ల్యాండ్‌లో మార్పుల పేరిట.. భారీగా వసూళ్లకు పాల్పడ్డారు. సబ్‌డివిజన్–2లో సుమారు రూ.10 కోట్ల విలువైన 4.40 ఎకరాల ప్రభుత్వ భూమిని జిరాయితీగా పేర్కొంటూ మరో ముగ్గురి పేరున ఒన్ బీ, ఆన్‌లైన్‌లో నమోదు చేశారు. ల్యాండ్ సీలింగ్ పేరిట టీడీపీ నాయకులు భారీగా ఆక్రమణలకు పాల్పడ్డారు. అమలాపురంలో 105 ఎకరాల భూముల్లో రూ.22 కోట్లు, రాజయ్యపేటలో 19 ఎకరాల్లో రూ.5 కోట్లు, నెల్లిపూడిలో 42 ఎకరాల్లో రూ.15 కోట్లు, గుర్రాజుపేటలో 10 ఎకరాల్లో రూ.3 కోట్ల మేర అవినీతికి పాల్పడ్డారు.

సాక్షి బిజినెస్
శనివారం
17-2-2024

**స్టాక్ మార్కెట్లు**

| దేశీ సూచీలు | | |
|---|---|---|
| సెన్సెక్స్ ▲ | 376 | 72,427 |
| నిఫ్టీ ▲ | 130 | 22,041 |

మరిన్ని బిజినెస్ వార్తల కోసం 'సాక్షి ఫ్లస్' చూడండి

| విదేశీ సూచీలు (శుక్రవారం రాత్రి 11.30 గంటలకు) | | |
|---|---|---|
| నాస్‌డాక్ | 15,878 | ▲ 29 |
| డోజోన్స్ | 38,753 | ▲ 20 |
| ఎఫ్‌టీఎస్‌ఈ 100 | 7712 | ▲ 114 |
| డాక్స్ | 17,117 | ▲ 71 |
| షాంఘై | 2,866 | ▲ 36 |
| నికాయ్ | 38,487 | ▲ 329 |

• అమెరికా • బ్రిటన్ • జర్మనీ • చైనా • జపాన్

**బులియన్** (రూ.లలో) ముంబై

| | | |
|---|---|---|
| బంగారం (99.9 స్వచ్ఛత) | 61,743 | ▲ 235 |
| బంగారం (99.5 స్వచ్ఛత) | 61,496 | ▲ 234 |
| వెండి (కేజీ) | 70,922 | ▲ 719 |

**ఫారెక్స్ రేట్లు** (రూ.లలో)

| | | | కొనుగోలు | అమ్మకం |
|---|---|---|---|---|
| $ | యూఎస్ డాలర్ | ఎస్‌బీఐ | 82.63 | 83.65 |
| £ | బ్రిటన్ పౌండ్ | ఎస్‌బీఐ | 103.33 | 105.88 |
| € | యూరో | ఎస్‌బీఐ | 88.31 | 90.65 |
| ¥ | జపాన్ ఎన్ (100) | ఎస్‌బీఐ | 54.72 | 55.75 |
| AUS | ఆస్ట్రేలియా డాలర్ | ఎస్‌బీఐ | 53.21 | 55.13 |
| S$ | సింగపూర్ డాలర్ | థామస్‌కుక్ | 59.37 | 64.05 |
| SAR | సౌదీ రియాల్ | థామస్‌కుక్ | 21.23 | 22.81 |
| UAE D | యూఏఈ దిర్హామ్ | థామస్‌కుక్ | 21.70 | 23.50 |
| ¥ | చైనా యువాన్ | థామస్‌కుక్ | 10.42 | 12.49 |

## ‘పేటీఎం పేమెంట్ బ్యాంక్’ గడువు పెంపు

- మార్చి 15 వరకు పొడిగించిన ఆర్‌బీఐ
- అప్పట్లోగా వేరే బ్యాంకులకు మారాలంటూ కస్టమర్లకు సూచన
- ఎఫ్‌ఏక్యూల జారీ




**ముంబై:** పేటీఎం పేమెంట్స్ బ్యాంక్ (పీపీబీఎల్) కార్యకలాపాల నిలిపివేతకు విధించిన గడువును రిజర్వ్ బ్యాంక్ 15 రోజుల పాటు పొడిగించింది. మార్చి 15లోగా పీపీబీఎల్‌లోని తమ ఖాతాలను ఇతర బ్యాంకులకు మార్చుకోవాలని కస్టమర్లకు సూచించింది. అయితే, ఆ తర్వాత కూడా సేవింగ్ బ్యాంక్, కరెంటు అకౌంట్స్, ప్రీపెయిడ్ ఇన్‌స్ట్రుమెంట్స్, ఫాస్టాగ్స్, నేషనల్ కామన్ మొబిలిటీ కార్డులు మొదలైన వాటిలో ఉన్న బ్యాలెన్స్ మొత్తాలను ఎటువంటి ఆంక్షలు లేకుండా విత్‌డ్రా చేసుకోవచ్చని లేదా వినియోగించుకోవచ్చని పేర్కొంది. వాస్తవానికి నిబంధనల ఉల్లంఘన కారణంగా పీపీబీఎల్‌లో డిపాజిట్, క్రెడిట్ లావాదేవీలను నిలిపివేసేందుకు డెడ్‌లైన్ ఫిబ్రవరి 29తో ముగియాల్సి ఉన్నప్పటికీ కస్టమర్ల ప్రయోజనాలను దృష్టిలో ఉంచుకుని ఆర్‌బీఐ ఈ నిర్ణయం తీసుకుంది. కస్టమర్ల సౌకర్యార్థం పీపీబీఎల్‌తో లావాదేవీలపై గల సందేహాలను నివృత్తి చేసేందుకు ఎఫ్‌ఏక్యూలను (సాధారణంగా తలెత్తే ప్రశ్నలు, జవాబులు) కూడా రిజర్వ్ బ్యాంక్ విడుదల చేసింది. ‘మార్చి 15 తర్వాత మీరు (పీపీబీఎల్ కస్టమర్లు) మీ పేటీఎం పేమెంట్స్ బ్యాంకు ఖాతాల్లో నగదును డిపాజిట్ చేయలేరు. వడ్డీ, క్యాష్‌బ్యాక్‌లు, రీఫండ్లు మొదలైనవి జమ కావడానికి మాత్రమే అనుమతి ఉంటుంది. కాబట్టి, అసౌకర్యం కలగకుండా మార్చి 15లోగా మరో బ్యాంకుకు మారేలా ప్రత్యామ్నాయ ఏర్పాట్లు చేసుకోవడం శ్రేయస్కరం’ అని ఎఫ్‌ఏక్యూలో ఆర్‌బీఐ పేర్కొంది. వాటి ప్రకారం..

- మార్చి 15 తర్వాత జీతాలు, పెన్షన్లు పీపీబీఎల్ ఖాతాల్లో జమ కావు. పీపీబీఎల్ ద్వారా ఈఎంఐలు లేదా ఓటీటీ సబ్‌స్క్రిప్షన్లు కడుతున్న వారు ప్రత్యామ్నాయ ఏర్పాట్లు చేసుకోవాలి.
- పీపీబీఎల్ వాలెట్ ఉన్న వారు అందులోని బ్యాలెన్స్ మొత్తం అయిపోయే వరకు మార్చి 15 తర్వాత కూడా ఉపయోగించుకోవచ్చు.
- ఫాస్టాగ్స్‌లో బ్యాలెన్స్ ఉన్నంత వరకు వాడుకోవచ్చు. కానీ మార్చి 15 తర్వాత టాప్‌అప్ చేయడానికి ఉండదు. డెడ్‌లైన్‌లోగా ఇతర బ్యాంకుల నుంచి కొత్త ఫాస్టాగ్ తీసుకోవడం మంచిది.
- పీపీబీఎల్ అకౌంట్ లేదా వాలెట్‌తో అనుసంధానమైన పేటీఎం క్యూఆర్ కోడ్, సౌండ్‌బాక్స్, పీవోఎస్ టెర్మినల్స్ ద్వారా చెల్లింపులను స్వీకరిస్తున్న వ్యాపారులు .. మరో బ్యాంకు అకౌంటు లేదా వాలెట్‌ని తీసుకోవాలి. ఇప్పటికే అవి వేరే బ్యాంకుతో అనుసంధానమై ఉంటే ఈ అవసరం ఉండదు.

### ఫాస్టాగ్ నుంచి పీపీబీఎల్ తొలగింపు..

వాహనాలకు ఫాస్టాగ్‌లను జారీ చేసే బ్యాంకుల జాబితా నుంచి పీపీబీఎల్‌ను ఇండియన్ హైవేస్ మేనేజ్‌మెంట్ కంపెనీ (ఐహెచ్‌ఎంసీఎల్) తొలగించింది. హైవే యూజర్లు ఇకపై 32 అధీకృత బ్యాంకుల నుంచే వాటిని కొనుగోలు చేయాలంటూ సోషల్ నెట్‌వర్కింగ్ సైట్ ఎక్స్‌లో పేర్కొంది. ఎయిర్‌టెల్ పేమెంట్స్ బ్యాంక్, ఐసీఐసీఐ బ్యాంక్, హెచ్‌డీఎఫ్‌సీ బ్యాంక్, ఎస్‌బీఐ, యస్ బ్యాంక్, పీఎన్‌బీ మొదలైనవి ఈ లిస్టులో ఉన్నాయి. పీపీబీఎల్ కొత్త ఫాస్టాగ్‌లను జారీ చేయకుండా 2024 జనవరి 19నే ఐహెచ్‌ఎంసీఎల్ ఆంక్షలు విధించింది. దేశీయంగా 8 కోట్ల మందికి పైగా ఫాస్టాగ్ యూజర్లు ఉండగా, పీపీబీఎల్‌కు సుమారు 30 శాతం మార్కెట్ వాటా ఉన్నట్లు నేషనల్ హైవేస్ అథారిటీ (ఎన్‌హెచ్‌ఏఐ) సీనియర్ అధికారి ఒకరు తెలిపారు. కాగా, పేటీఎం మాతృ సంస్థ వన్97 కమ్యూనికేషన్స్ తమ నోడల్ అకౌంటును పీపీబీఎల్ నుంచి యాక్సిస్ బ్యాంక్‌కి మార్చుకున్నట్లు వెల్లడించింది. కస్టమర్లు, వ్యాపారుల లావాదేవీలను సెటిల్ చేసేందుకు ఇది మాస్టర్ అకౌంటుగా ఉపయోగపడుతుంది.




## భారత్ మార్కెట్‌కు ప్రాధాన్యత

- ఇతర అవకాశాలను అన్వేషిస్తాం
- ‘జీ’ విలీనం రద్దు నేపథ్యంలో సోనీ

**న్యూఢిల్లీ:** మీడియా దిగ్గజం జీ ఎంటర్‌టైన్‌మెంట్‌తో ప్రతిపాదిత విలీనం రద్దయిన నేపథ్యంలో ఇతర అవకాశాలను అన్వేషించనున్నట్లు జపనీస్ దిగ్గజం సోనీ తాజాగా వెల్లడించింది. దేశీ మార్కెట్లో వృద్ధి అవకాశాలరీత్యా మరొక కొత్త ప్రణాళికకు తెరతీయనున్నట్లు తెలియజేసింది. దీర్ఘకాలంలో భారీ వృద్ధికి వీలున్న దేశీ మార్కెట్లో సొంత కార్యకలాపాలకూ ప్రాధాన్యత ఇవ్వనున్నట్లు స్పష్టం చేసింది. అత్యంత అవకాశాలున్న భారత్ మార్కెట్లో పెట్టుబడులను కొనసాగించేందుకే కట్టుబడి ఉన్నట్లు సోనీ ప్రెసిడెంట్, సీవోవో, సీఎఫ్‌వో హిరోకీ టొటోకీ పేర్కొన్నారు. వెరసి వివిధ అవకాశాలను అన్వేషించనున్నట్లు తెలియజేశారు. కొత్తగా అవకాశం లభిస్తే పాత ప్రణాళికస్థానే అమలు చేయనున్నట్లు తెలియజేశారు. ‘జీ’తో ప్రతిపాదిత విలీనం రద్దయిన నేపథ్యంలో హిరోకీ భారత్ మార్కెట్లో కంపెనీ వ్యూహాలపై స్పందిస్తూ పలు అంశాలను ప్రస్తావించారు. గత పెట్టుబడుల ప్రణాళికలు లేదా ఆలోచనల్లో ఎలాంటి మార్పులూ లేవని స్పష్టం చేశారు. అయితే ప్రస్తుతానికి నిర్దిష్ట ప్రణాళికలు లేవని వెల్లడించారు. కల్వెర్ మ్యాక్స్ ఎంటర్‌టైన్‌మెంట్(గతంలో సోనీ పిక్చర్స్ నెట్‌వర్క్ ఇండియా) ద్వారా దేశీయంగా కార్యకలాపాలు విస్తరించనున్నట్లు హిరోకీ ఈ సందర్భంగా పేర్కొన్నారు.




## గో ఫస్ట్ కోసం స్పైస్‌జెట్ అజయ్ సింగ్ బిడ్డింగ్

**న్యూఢిల్లీ:** దివాలా తీసిన గో ఫస్ట్ విమానయాన సంస్థను దక్కించుకునేందుకు బిడ్లు దాఖలయ్యాయి. బిజీ బీ ఎయిర్‌వేస్‌తో కలిసి స్పైస్‌జెట్ చీఫ్ అజయ్ సింగ్ బిడ్ వేశారు. స్పైస్‌జెట్ వ్యయాలు తగ్గించుకునేందుకు, నిధుల సమీకరించుకునేందుకు ప్రయత్నాలు చేస్తున్న తరుణంలో అజయ్ సింగ్.. గో ఫస్ట్ కోసం పోటీ పడుతుండటం ప్రాధాన్యం సంతరించుకుంది. ఆయన వ్యక్తిగత హోదాలో బిడ్డింగ్‌లో పాల్గొంటున్నట్లు స్పైస్‌జెట్ తెలిపింది. మరోవైపు, షార్జాకి చెందిన స్కై వన్ ఎఫ్‌జెడ్‌ఈ తాము కూడా బిడ్ వేసినట్లు వెల్లడించింది.




## విదేశాలకు ఆకాశ ఎయిర్

**న్యూఢిల్లీ:** విమానయాన సంస్థ ఆకాశ ఎయిర్ అంతర్జాతీయ సర్వీసులు నడిపేందుకు రెడీ అయింది. ముంబై నుంచి దోహాకు తొలి అంతర్జాతీయ సర్వీసు మార్చి 28న ప్రారంభం కానుంది. వారంలో నాలుగు నాన్-స్టాప్ ఫ్లైట్స్ నడుపనుంది. 2022 ఆగస్టు 7న ఆకాశ ఎయిర్ కార్యకలాపాలు ప్రారంభించింది. కంపెనీ వద్ద బోయింగ్ 737 మ్యాక్స్ రకం 23 విమానాలు ఉన్నాయి. 150 బోయింగ్ 737 మ్యాక్స్ విమానాలకు 2024 జనవరిలో ఆర్డర్ ఇచ్చింది.



## వెయ్యి.. ‘సిప్’ వెయ్యి

- ఫండ్స్‌లో పెట్టుబడులకు యువత ఉత్సాహం
- వైట్‌ఓక్ క్యాపిటల్ మ్యూచువల్ ఫండ్

**న్యూఢిల్లీ:** మెజారిటీ యువత ఈక్విటీ మ్యూచువల్ ఫండ్స్‌లో పెట్టుబడులకు సిస్టమ్యాటిక్ ఇన్వెస్ట్‌మెంట్ ప్లాన్ (సిప్)ను ఎంపిక చేసుకుంటున్నారు. డిజిటల్ రూపంలో లావాదేవీలు సులభంగా నిర్వహించుకునే వీలు, ఖర్చు చేసే ఆదాయంలో వృద్ధి, ఆర్థిక అక్షరజ్ఞానం పెరుగుతుండడం ఇందుకు వీలు కల్పిస్తున్నట్లు వైట్‌ఓక్ క్యాపిటల్ మ్యూచువల్ ఫండ్ ప్రకటించింది. ఈ సంస్థ నిర్వహణలో 3.33 లక్షల ఇన్వెస్టర్లకు సంబంధించి రూ.8,400 కోట్ల పెట్టుబడులు ఉన్నాయి. ఏడాది క్రితమే ఈ సంస్థ మ్యూచువల్ ఫండ్స్ కార్యకలాపాలు మొదలు పెట్టింది. తన కస్టమర్లలో 56 శాతం జెనరేషన్ జెడ్, మిలీనియల్స్ (జెనరేషన్ వై) ఉన్నట్టు తెలిపింది. 1981–1996 మధ్య జన్మించిన వారు జెనరేషన్ వై కిందకు, 1997–2012 మధ్య జన్మించిన వారు జెనరేషన్ జెడ్ కిందకు వస్తారు. తనకున్న 3.33 లక్షల కస్టమర్లలో 28 శాతం మేర జెనరేషన్ జెడ్, మరో 28 శాతం మేర జెనరేషన్ వై విభాగంలోని వారేనని ఈ సంస్థ తెలిపింది. అంతేకాదు 51 శాతం మంది డిజిటల్ చానల్స్ ద్వారానే ఇన్వెస్ట్ చేస్తున్నట్టు పేర్కొంది. ‘‘జెనరేషన్ వై, జెడ్ డిజిటల్ టెక్నాలజీ తెలిసిన వారు. కనుక వారు టెక్నాలజీ ఆధారితంగా నడిచే ఫైనాన్షియల్ సర్వీస్ ప్రొవైడర్లకు ప్రాధాన్యత ఇవ్వడం సహజమే’’అని వైట్‌ఓక్ క్యాపిటల్ చీఫ్ బిజినెస్ ఆఫీసర్ ప్రతీక్ పంత్ తెలిపారు. సహేతుక రాబడులు, నిపుణుల ఆధ్వర్యంలో పెట్టుబడుల నిర్వహణ, చాలా స్వల్ప మొత్తం నుంచే పెట్టుబడికి అవకాశం, ఎన్నో రకాల పెట్టుబడి పథకాలు, సులభంగా ఉపసంహరించుకునే వెసులుబాటు ఇవన్నీ యువ ఇన్వెస్టర్లు సిప్ వేసేందుకు అనుకూలిస్తున్నట్టు చెప్పారు.



**టికెట్ సైజు తక్కువే**

18–35 ఏళ్ల వయసు వారు సిప్ రూపంలో చేస్తున్న పెట్టుబడి, ఇంతకంటే పెద్ద వయసులోని వారితో పోలిస్తే తక్కువగానే ఉన్నట్టు వైట్‌ఓక్ తెలిపింది. తమ పాకెట్ మనీ నుంచి లేదంటే పార్ట్ టైమ్ ఉద్యోగాలు చేయడం ద్వారా వచ్చే మొత్తం నుంచి వీరు ఇన్వెస్ట్ చేస్తుండొచ్చని ప్రతీక్ పంత్ పేర్కొన్నారు. ప్రస్తుతం మ్యూచువల్ ఫండ్స్ పరిశ్రమ నిర్వహణలో 7.92 కోట్ల సిప్ ఖాతాలు ఉన్నాయి.

## నాలుగో రోజూ లాభాలు

- ఐటీ, ఆటో షేర్లకు డిమాండ్
- 22,000 పైకి నిఫ్టీ
- సెన్సెక్స్ లాభం 376 పాయింట్లు

**ముంబై:** ఐటీ, ఆటో షేర్లకు కొనుగోళ్ల మద్దతు లభించడంతో స్టాక్ సూచీలు నాలుగో రోజూ లాభాలు ఆర్జించాయి. ప్రపంచ ఈక్విటీ మార్కెట్లోని సానుకూల సంకేతాలు, ప్రోత్సాహకర స్థూల ఆర్థిక గణాంకాలు సెంటిమెంట్‌ను మార్కెట్ సెంటిమెంట్‌ను బలపరిచాయి. సెన్సెక్స్ 376 పాయింట్లు లాభపడి 72,427 వద్ద స్థిరపడింది. నిఫ్టీ 130 పాయింట్లు పెరిగి 22 వేల స్థాయిపై 22,041 వద్ద ముగిసింది. ఉదయం లాభాలతో మొదలైన సూచీలు రోజంతా స్థిరంగా ముందుకు కదిలాయి.



భారత వాణిజ్య లోటు 9 నెలల కనిష్టానికి దిగిరావడంతో క్యాపిటల్ గూడ్స్, మెటల్, పారిశ్రామిక రంగాల షేర్లకు కొనేందుకు ఇన్వెస్టర్లు ఆసక్తి చూపారు. ఇటీవల ర్యాలీ చేసిన ప్రభుత్వ రంగ బ్యాంకులు, ఆయిల్‌అండ్‌గ్యాస్ షేర్లలో లాభాల స్వీకరణ చోటు చేసుకుంది. ఇంట్రాడేలో సెన్సెక్స్ 72,218 వద్ద కనిష్టాన్ని, 72,545 వద్ద గరిష్టాన్ని తాకింది. నిఫ్టీ 21,969 – 22,069 శ్రేణిలో ట్రేడైంది. బీఎస్‌ఈలో స్మాల్, మిడ్ క్యాప్ సూచీలు వరుసగా 0.68%, 0.78 % చొప్పున రాణించాయి.

- ఎంటిరో హెల్త్‌కేర్ సొల్యూషన్స్ లిస్టింగ్ నిరాశపరిచింది. బీఎస్‌ఈలో ఇష్యూ ధర (రూ.1,258)తో పోలిస్తే 1% డిస్కౌంట్‌తో రూ.1245 వద్ద లిస్టయ్యింది. 9.22 % నష్టపోయి రూ.1142 వద్ద కనిష్టాన్ని తాకింది. చివరికి 8.50% క్షీణించి రూ.1149 వద్ద ముగిసింది.
- వరుస పతనాల నుంచి పేటీఎం షేరు కోలుకుంది. దిగువ స్థాయిల్లో కొనుగోళ్ల మద్దతు లభించడంతో బీఎస్‌ఈలో 5% ఎగసి రూ. 341.50 వద్ద అప్పర్ సర్క్యూట్‌ను తాకింది.

---

**సాక్షి స్పోర్ట్స్**



### భారత్‌కు మూడో విజయం

పురుషుల ప్రొ హాకీ లీగ్ టోర్నీలో భారత జట్టుకు మూడో విజయం దక్కింది. ఐర్లాండ్‌తో శుక్రవారం భువనేశ్వర్‌లో జరిగిన మ్యాచ్‌లో టీమిండియా 1–0 గోల్‌తో గెలిచింది. మ్యాచ్ చివరిదైన 60వ నిమిషంలో గుర్జంత్ సింగ్ గోల్‌తో భారత విజయాన్ని ఖరారు చేశాడు. భారత్ తమ తదుపరి మ్యాచ్‌ను సోమవారం స్పెయిన్‌తో ఆడుతుంది.

### మహీప్ కుమార్, రికీ భుయ్ అర్ధ సెంచరీలు: ఆంధ్ర 260/7

కేరళ జట్టుతో శుక్రవారం మొదలైన రంజీ ట్రోఫీ ఎలైట్ గ్రూప్ ‘బి’ చివరి లీగ్ మ్యాచ్‌లో... ఆంధ్ర జట్టు తొలి రోజు ఆట ముగిసే సమయానికి తొలి ఇన్నింగ్స్‌లో 89.3 ఓవర్లలో 7 వికెట్లు కోల్పోయి 260 పరుగులు సాధించింది. మహీప్ కుమార్ (81; 12 ఫోర్లు), కెప్టెన్ రికీ భుయ్ (79 బ్యాటింగ్; 12 ఫోర్లు) అర్ధ సెంచరీలు చేశారు. కరణ్ షిండే (43; 8 ఫోర్లు) రాణించాడు. కేరళ బౌలర్లలో బాసిల్ థంపి, వైశాఖ్ చంద్రన్ రెండు వికెట్ల చొప్పున తీశారు. గ్రూప్ ‘బి’ నుంచి ఇప్పటికే ముంబై, ఆంధ్ర జట్లు క్వార్టర్ ఫైనల్ చేరుకున్నాయి.

## ఐహిక, శ్రీజ సంచలనం

ప్రపంచ నంబర్‌వన్, రెండో ర్యాంకర్‌లకు షాక్





**బుసాన్:** ప్రపంచ టేబుల్ టెన్నిస్ (టీటీ) టీమ్ చాంపియన్‌షిప్‌లో భారత మహిళల జట్టు స్ఫూర్తిదాయక ప్రదర్శనతో అదరగొట్టింది. డిఫెండింగ్ చాంపియన్ చైనాతో జరిగిన లీగ్ మ్యాచ్‌లో భారత్ 2–3తో ఓడిపోయింది. అయితే భారత క్రీడాకారిణులు ఐహిక ముఖర్జీ, తెలంగాణ అమ్మాయి ఆకుల శ్రీజ పెను సంచలనం సృష్టించారు. తొలి మ్యాచ్‌లో ఐహిక 12–10, 2–11, 13–11, 11–6తో ప్రపంచ నంబర్‌వన్ సన్ యింగ్‌షాను ఓడించింది. రెండో సింగిల్స్‌లో భారత నంబర్‌వన్ మనిక బత్రా ఓడిపోగా... మూడో సింగిల్స్‌లో ఆకుల శ్రీజ 11–7, 11–9, 13–11తో ప్రపంచ రెండో ర్యాంకర్ వాంగ్ యిదిపై గెలిచింది. దాంతో భారత్ 2–1తో ఆధిక్యంలోకి వెళ్లింది. అయితే నాలుగో మ్యాచ్‌లో మనిక బత్రా, ఐదో మ్యాచ్‌లో ఐహిక ఓడిపోవడంతో భారత్‌కు నిరాశ తప్పలేదు.




## ముగిసిన 92 ఏళ్ల నిరీక్షణ

**హామిల్టన్:** ఎట్టకేలకు టెస్టు ఫార్మాట్‌లో దక్షిణాఫ్రికా జట్టుపై న్యూజిలాండ్ జట్టు తొలిసారి సిరీస్‌ను సొంతం చేసుకుంది. శుక్రవారం జరిగిన రెండో టెస్టులో దక్షిణాఫ్రికా నిర్దేశించిన 267 పరుగుల లక్ష్యాన్ని న్యూజిలాండ్ ఛేదించి సిరీస్‌ను 2–0తో క్లీన్‌స్వీప్ చేసింది. 1932 నుంచి రెండు జట్ల మధ్య 18 టెస్టు సిరీస్‌లు జరిగాయి. దక్షిణాఫ్రికా 13 సార్లు నెగ్గగా, నాలుగు సిరీస్‌లు ‘డ్రా’గా ముగిశాయి. 18వ ప్రయత్నంలో మొదటిసారి న్యూజిలాండ్‌కు సిరీస్ దక్కింది. ఓవర్‌నైట్ స్కోరు 40/1తో నాలుగో రోజు రెండో ఇన్నింగ్స్ కొనసాగించిన న్యూజిలాండ్ 94.2 ఓవర్లలో 3 వికెట్లు కోల్పోయి 269 పరుగులు చేసి గెలిచింది. కేన్ విలియమ్సన్ (133 నాటౌట్; 12 ఫోర్లు, 2 సిక్సర్లు) అజేయ సెంచరీ సాధించాడు. విల్ యంగ్ (60 నాటౌట్; 8 ఫోర్లు)తో కలిసి విలియమ్సన్ నాలుగో వికెట్‌కు 152 పరుగుల అభేద్యమైన భాగస్వామ్యాన్ని జోడించాడు.

## డకెట్ ధనాధన్...

- ఇంగ్లండ్ ఓపెనర్ మెరుపు సెంచరీ
- తొలి ఇన్నింగ్స్‌లో 207/2
- భారత్ 445 ఆలౌట్
- అశ్విన్‌కు 500వ వికెట్

35 ఓవర్లలో 5.91 రన్‌రేట్‌తో 207 పరుగులు. పిచ్‌ను, ప్రత్యర్థిని లక్ష్య పెట్టకుండా ఇంగ్లండ్ మూడో టెస్టులోనూ తమ ‘బజ్‌బాల్’ మంత్రాన్ని చూపించింది. ఫలితంగా 445 పరుగుల భారీ స్కోరు కూడా భారత్‌కు సురక్షితం కాదనిపిస్తోంది. భారత గడ్డపై ఒక విదేశీ బ్యాటర్ ఆడిన అత్యుత్తమ ఇన్నింగ్స్‌లో ఒకటిగా నిలిచిపోయే శతకంతో ఓపెనర్ బెన్ డకెట్ చెలరేగాడు. దాంతో రెండు రోజుల ఆట తర్వాత రాజ్‌కోట్ టెస్టు సమంగా నిలిచింది. అశ్విన్ టెస్టుల్లో 500 వికెట్ల మైలురాయిని అందుకోవడం శుక్రవారం ఆటలో గుర్తుంచుకోదగ్గ మరో హైలైట్. మూడో రోజు ఇంగ్లండ్‌ను భారత బౌలర్లు ఎలా నిలువరిస్తారన్నదే ఆసక్తికరం.




**రాజ్‌కోట్:** భారత్‌తో మూడో టెస్టులో ఇంగ్లండ్ తొలి ఇన్నింగ్స్ దూకుడుగా సాగుతోంది. రెండో రోజు ఆట ముగిసే సమయానికి ఇంగ్లండ్ 2 వికెట్ల నష్టానికి 207 పరుగులు చేసింది. బెన్ డకెట్ (118 బంతుల్లో 133 బ్యాటింగ్; 21 ఫోర్లు, 2 సిక్సర్లు) సెంచరీతో సత్తా చాటాడు. అంతకుముందు ఓవర్‌నైట్ స్కోరు 326/5తో ఆట కొనసాగించిన భారత్ 445 పరుగులకు ఆలౌటైంది. ధ్రువ్ జురేల్ (46), అశ్విన్ (37) ఎనిమిదో వికెట్‌కు 77 పరుగులు జత చేశారు. ఇంగ్లండ్ మరో 238 పరుగులు వెనుకబడి ఉంది.

**కీలక భాగస్వామ్యం...**

రెండో రోజు ఆరంభంలోనే భారత్ రెండు వికెట్లు కోల్పోయింది. ఓవర్‌నైట్ స్కోరుకు మరో ఐదు పరుగులు జోడించగానే ఒకే స్కోరు వద్ద కుల్దీప్ (4), జడేజా (112) వెనుదిరిగారు. ఈ దశలో అశ్విన్, జురేల్ భాగస్వామ్యం భారత్‌ను 400 పరుగులు దాటించింది. అశ్విన్ జాగ్రత్తగా ఆడగా, అరంగేట్ర ఆటగాడు జురేల్ కొన్ని దూకుడైన షాట్లతో ఆకట్టుకున్నాడు. అయితే తన తొలి మ్యాచ్‌లో అతను అర్ధ సెంచరీని చేజార్చుకున్నాడు. ఈ భాగస్వామ్యం తర్వాత చివర్లో బుమ్రా (28 బంతుల్లో 26; 3 ఫోర్లు, 1 సిక్స్) కొన్ని విలువైన పరుగులు జోడించాడు. శుక్రవారం 44.5 ఓవర్లు ఆడిన భారత్ మరో 119 పరుగులు జత చేసింది.

**దూకుడే దూకుడు...**

ఇన్నింగ్స్ ఆరంభంలో డకెట్ కాస్త తడబడ్డాడు. కానీ బుమ్రా వేసిన ఐదో ఓవర్లో రెండు ఫోర్లతో ధాటిని మొదలు పెట్టిన అతను ఏ బౌలర్‌నూ వదలకుండా చివరి వరకు దూకుడు కొనసాగించాడు. సెంచరీ వరకు కూడా ఒక్క తప్పుడు షాట్ లేకుండా అతని ఇన్నింగ్స్ అద్భుతమైన స్ట్రోక్‌లతో దూసుకెళ్లింది. టీ తర్వాత తొలి ఓవర్‌నుంచి స్పిన్నర్ కుల్దీప్‌తో బౌలింగ్ వేయించిన ప్రణాళిక ఫలించలేదు. కుల్దీప్ తొలి 4 ఓవర్లలో డకెట్ స్వీప్, రివర్స్ స్వీప్‌లతో 7 ఫోర్లు బాదడం విశేషం. సిరాజ్ ఓవర్లో కొట్టిన రెండు ఫోర్లతో 39 బంతుల్లోనే అతని అర్ధ సెంచరీ పూర్తయింది. మరో ఎండ్‌లో దాదాపు ప్రేక్షక పాత్రకే పరిమితమైన క్రాలీ (15)ని అవుట్ చేసి ఎట్టకేలకు అశ్విన్ ఈ భాగస్వామ్యాన్ని విడదీశాడు. తర్వాత వచ్చిన ఒలీ పోప్ (39; 5 ఫోర్లు, 1 సిక్స్) కూడా ఇంగ్లండ్ జోరును కొనసాగించాడు. అశ్విన్ ఓవర్లో వరుస బంతుల్లో 6, 4 కొట్టి 90ల్లోకి చేరుకున్న డకెట్... సిరాజ్ ఓవర్లో బౌండరీతో 88 బంతుల్లోనే కెరీర్‌లో మూడో శతకాన్ని అందుకున్నాడు. చివరకు సిరాజ్ చక్కటి బంతికి పోప్ వికెట్ల ముందు దొరికిపోయాడు.

**ఐదు పరుగులు పెనాల్టీ...**

భారత బ్యాటర్లు నిబంధనలకు విరుద్ధంగా పిచ్‌పై పరుగెత్తడంతో అంపైర్లు చర్య తీసుకున్నారు. తొలి రోజు ఆటలో జడేజాను ఈ విషయంపై అంపైర్లు హెచ్చరించగా... రెండో రోజు అశ్విన్ కూడా అలాగే చేయడంతో భారత ఇన్నింగ్స్ 102వ ఓవర్లో 5 పరుగులు పెనాల్టీగా విధించారు. దాంతో ఇంగ్లండ్ ఇన్నింగ్స్ 5/0తో మొదలైంది.

### అశ్విన్ @ 500



ఇంగ్లండ్ ఓపెనర్ క్రాలీని అవుట్ చేయడం ద్వారా అశ్విన్ టెస్టుల్లో 500 వికెట్ల మైలురాయిని అందుకున్నాడు. తన 98వ టెస్టులో ఈ ఘనత సాధించిన అశ్విన్... ఓవరాల్‌గా 9వ ఆటగాడిగా, అనిల్ కుంబ్లే (619) తర్వాత రెండో భారత బౌలర్‌గా నిలిచాడు. మ్యాచ్‌లు, బంతుల పరంగా చూస్తే... అత్యంత వేగంగా 500 వికెట్ల మార్కును చేరిన బౌలర్లలో అశ్విన్ రెండో స్థానంలో నిలవడం విశేషం. 2011లో విండీస్‌పై టెస్టుల్లో అరంగేట్రం చేసిన అశ్విన్ ఇప్పటి వరకు ఇన్నింగ్స్‌లో 4 వికెట్లు 24 సార్లు... ఇన్నింగ్స్‌లో 5 వికెట్లు 34 సార్లు... మ్యాచ్ మొత్తంలో 10 వికెట్లు 8 సార్లు తీశాడు.

### టెస్టు నుంచి తప్పుకున్న అశ్విన్

రాజ్‌కోట్ టెస్టులో అనూహ్య పరిణామం సంభవించింది. తన కుటుంబంలో ఏర్పడిన అత్యవసర పరిస్థితుల నేపథ్యంలో అశ్విన్ మూడో టెస్టు నుంచి మధ్యలోనే తప్పుకున్నాడు.

**స్కోరు వివరాలు**

**భారత్ తొలి ఇన్నింగ్స్:** యశస్వి (సి) రూట్ (బి) వుడ్ 10; రోహిత్ (సి) స్టోక్స్ (బి) వుడ్ 131; గిల్ (సి) ఫోక్స్ (బి) వుడ్ 0; పటిదార్ (సి) డకెట్ (బి) హార్ట్‌లీ 5; జడేజా (సి) అండ్ (బి) రూట్ 112; సర్ఫరాజ్ (రనౌట్) 62; కుల్దీప్ (సి) ఫోక్స్ (బి) అండర్సన్ 4; జురేల్ (సి) ఫోక్స్ (బి) రేహన్ 46; అశ్విన్ (సి) అండర్సన్ (బి) రేహన్ 37; బుమ్రా (ఎల్బీ) (బి) వుడ్ 26; సిరాజ్ (నాటౌట్) 3; ఎక్స్‌ట్రాలు 9; **మొత్తం (130.5 ఓవర్లలో ఆలౌట్) 445. వికెట్ల పతనం:** 1-22, 2-24, 3-33, 4-237, 5-314, 6-331, 7-331, 8-408, 9-415, 10-445. **బౌలింగ్:** అండర్సన్ 25-7-61-1, వుడ్ 27.5-2-114-4, హార్ట్‌లీ 40-7-109-1, రూట్ 16-3-70-1, రేహన్ 22-2-85-2. **ఇంగ్లండ్ తొలి ఇన్నింగ్స్:** క్రాలీ (సి) పటిదార్ (బి) అశ్విన్ 15; డకెట్ (బ్యాటింగ్) 133; పోప్ (ఎల్బీ) (బి) సిరాజ్ 39; రూట్ (బ్యాటింగ్) 9; ఎక్స్‌ట్రాలు 11; **మొత్తం (35 ఓవర్లలో 2 వికెట్లకు) 207. వికెట్ల పతనం:** 1-89, 2-182. **బౌలింగ్:** బుమ్రా 8-0-34-0, సిరాజ్ 10-1-54-1, కుల్దీప్ యాదవ్ 6-1-42-0, అశ్విన్ 7-0-37-1, జడేజా 4-0-33-0.

## చరిత్ర సృష్టించిన సింధు బృందం

ఆసియా బ్యాడ్మింటన్ టీమ్ చాంపియన్‌షిప్‌లో తొలిసారి పతకం




**షా ఆలమ్ (మలేసియా):** అంచనాలకు మించి రాణించిన భారత మహిళల జట్టు ఆసియా బ్యాడ్మింటన్ టీమ్ చాంపియన్‌షిప్‌లో తొలిసారి పతకాన్ని ఖాయం చేసుకుంది. హాంకాంగ్‌తో శుక్రవారం జరిగిన క్వార్టర్ ఫైనల్లో పీవీ సింధు బృందం 3–0తో గెలిచి సెమీఫైనల్‌కు చేరుకుంది. తద్వారా కనీసం కాంస్య పతకాన్ని ఖరారు చేసుకుంది. నేడు జరిగే సెమీఫైనల్లో జపాన్‌తో భారత్ ఆడుతుంది. హాంకాంగ్‌తో జరిగిన పోరులో తొలి మ్యాచ్‌లో పీవీ సింధు 21–7, 16–21, 21–12తో లో సిన్ యాన్‌పై నెగ్గి భారత్‌కు 1–0తో ఆధిక్యం అందించింది. రెండో మ్యాచ్‌లో అశ్విని పొన్నప్ప–తనీషా క్రాస్టో ద్వయం 21–10, 21–14తో యెంగ్ టింగ్–యెంగ్ పుయ్ లామ్ జోడీని ఓడించింది. మూడో మ్యాచ్‌లో అష్మిత 21–12, 21–13తో యెంగ్ సమ్ యీపై గెలిచి భారత్‌కు చిరస్మరణీయం విజయాన్ని అందించింది.

**గెలుపు వాకిట శ్రీకాంత్ బోల్తా**




భారత పురుషుల జట్టు మాత్రం క్వార్టర్ ఫైనల్లో 2–3తో జపాన్ చేతిలో ఓడిపోయి టోర్నీ నుంచి నిష్క్రమించింది. స్కోరు 2–2తో సమమయ్యాక నిర్ణాయక ఐదో మ్యాచ్‌లో కిడాంబి శ్రీకాంత్ 21–17, 9–21, 20–22తో ప్రపంచ మాజీ చాంపియన్ కెంటో మొమోటా చేతిలో ఓడిపోయాడు. మూడో గేమ్‌లో శ్రీకాంత్ 19–12తో ఆధిక్యంలో నిలిచి విజయానికి రెండు పాయింట్ల దూరంలో నిలిచాడు. అయితే ఇప్పటి వరకు శ్రీకాంత్‌ను 15 సార్లు ఓడించిన మొమోటా ఏమాత్రం ఆందోళన చెందకుండా ఆడి వరుసగా 8 పాయింట్లు గెలిచి 20–19తో ఆధిక్యంలోకి వచ్చాడు. ఆ తర్వాత శ్రీకాంత్ 20–20తో స్కోరును సమం చేశాడు. అయితే వెంటనే మొమోటా వరుసగా రెండు పాయింట్లు గెలిచి గేమ్‌ను 22–20తోపాటు మ్యాచ్‌ను 3–2తో జపాన్‌కు అందించి భారత శిబిరాన్ని నిరాశలో ముంచాడు. అంతకుముందు తొలి మ్యాచ్‌లో ప్రణయ్ ఓడిపోగా... రెండో మ్యాచ్‌లో సాత్విక్ సాయిరాజ్–చిరాగ్ శెట్టి జోడీ గెలిచింది. మూడో మ్యాచ్‌లో లక్ష్య సేన్ నెగ్గగా... నాలుగో మ్యాచ్‌లో ధ్రువ్ కపిల–అర్జున్ జంట ఓటమి పాలైంది.

## మద్యంతో మహిళల జట్టు కోచ్

విద్యుత్ జైసింహపై హెచ్‌సీఏ వేటు



**సాక్షి, హైదరాబాద్:** ఆయన రాష్ట్ర సీనియర్ మహిళల క్రికెట్ జట్టు కోచ్... టీమ్‌తో పాటు మ్యాచ్ కోసం బస్సులో ప్రయాణిస్తున్నారు... ఎంతో బాధ్యతగా, హుందాగా వ్యవహరించాల్సిన వ్యక్తి కట్టు తప్పారు. బస్సులోనే మద్యం బాటిల్ తీసి దర్జాగా సేవించారు. ఆపై ముందు సీట్లో దానిని పెట్టుకొని అదే కొనసాగించారు! ఈ వీడియో వెలుగులోకి రావడంతో వ్యవహారం బయటపడింది. హైదరాబాద్ మహిళల టీమ్‌కు హెడ్ కోచ్‌గా ఉన్న విద్యుత్ జైసింహ చేసిన నిర్వాకమిది. ఈ ఘటనపై హైదరాబాద్ క్రికెట్ సంఘం (హెచ్‌సీఏ) వెంటనే స్పందించింది. జైసింహను సస్పెండ్ చేస్తున్నట్లు ప్రకటించింది. పూర్తి స్థాయిలో విచారణకు ఆదేశించడంతో పాటు విచారణ ముగిసే వరకు హైదరాబాద్ క్రికెట్‌కు సంబంధించిన ఎలాంటి వ్యవహారాల్లో పాలుపంచుకోరాదని ఆదేశించింది. ఈ ఘటన ఎప్పటిదనే విషయంపై స్పష్టత రాలేదు. బస్సులోకి ఆల్కహాల్‌ను ఎవరు తీసుకొచ్చారు, ఎలా అనుమతించారనే దానిపై కూడా విచారణ చేస్తామని హెచ్‌సీఏ అధ్యక్షుడు అర్శనపల్లి జగన్‌మోహన్ రావు ప్రకటించారు. పాతతరం క్రికెట్ దిగ్గజం ఎంఎల్ జైసింహ కుమారుడైన విద్యుత్ గతంలో హెచ్‌సీఏలో వేర్వేరు బాధ్యతల్లో పని చేశారు. తండ్రి పేరుతోనే సికింద్రాబాద్‌లో చాలా ఏళ్లుగా ఒక ప్రైవేట్ క్రికెట్ అకాడమీని కూడా నిర్వహిస్తున్నారు. అయితే తనపై వచ్చిన ఆరోపణలను విద్యుత్ జైసింహ ఖండించారు. తానెప్పుడూ టీమ్ బస్సులోకి మద్యాన్ని తీసుకురాలేదని, తాగలేదని స్పష్టం చేశారు. తనపై ఆరోపణలు నిరాధారమని... ఒక హైదరాబాద్ మాజీ క్రికెటర్ కుమార్తెను జట్టులోకి ఎంపిక చేయకపోవడంతో ఉద్దేశపూర్వకంగా తనను ఇరికించే ప్రయత్నం చేస్తున్నారని జైసింహ వివరణ ఇచ్చారు.

# కిసాన్ క్రెడిట్ కార్డు రుణాల్లో దేశంలోనే రాష్ట్రం ఐదో స్థానం

## దక్షిణాది రాష్ట్రాల్లో ఏపీ నంబర్ వన్

- 45.52 లక్షల మంది రైతులకు కేసీసీ కార్డులు
- కేసీసీ కార్డులపై రూ.60,879 కోట్ల రుణాలు
- పంటల సాగు రైతులకు కేసీసీ కవరేజ్ బాగుంది
- పశు పోషణ, డెయిరీ, మత్స్య కార్యకలాపాల రైతులకూ కేసీసీ
- ప్రత్యేక డ్రైవ్‌తో మార్చి నెలాఖరు వరకు సంతృప్త స్థాయిలో కవరేజ్
- నాబార్డు, ఎస్ఎల్‌బీసీ నివేదికలు వెల్లడి





**సాక్షి, అమరావతి:** కిసాన్ క్రెడిట్ కార్డుల (కేసీసీ) ద్వారా రైతులకు స్వల్పకాలిక రుణాల మంజూరులో ఆంధ్రప్రదేశ్ రాష్ట్రం దేశంలోనే ఐదో స్థానంలో ఉండగా, దక్షిణాది రాష్ట్రాల్లో అగ్రస్థానంలో ఉంది. వ్యవసాయ రంగానికి వైఎస్ జగన్ ప్రభుత్వం ప్రాధాన్యత ఇస్తుండటం, మద్దతు ధర కల్పిస్తుండటంతో రాష్ట్రంలో ఎటువంటి ఆటంకాలు లేకుండా రైతులు పంటలు సాగు చేస్తున్నారు. దీంతో కేసీసీ ద్వారా స్వల్పకాలిక రుణాలు తీసుకోవడానికి రైతులు ముందుకు వస్తున్నారు. ఈ రుణాల్లో దక్షిణాది రాష్ట్రాల్లో ఆంధ్రప్రదేశ్ రాష్ట్రమే అగ్రస్థానంలో ఉందని నాబార్డు, రాష్ట్ర స్థాయి బ్యాంకర్ల కమిటీ (ఎస్ఎల్‌బీసీ) నివేదికలు వెల్లడించాయి. ఉత్తరప్రదేశ్, మధ్యప్రదేశ్, మహారాష్ట్ర, గుజరాత్ వరుసగా నాలుగు స్థానాల్లో ఉన్నట్లు నాబార్డు నివేదిక తెలిపింది. రాష్ట్రంలో 45.52 లక్షల రైతులకు ఈ కార్డులు మంజూరు చేశారు. ఈ రైతుల్లో చాలా మందికి కేసీపీ కవరేజ్ అయిందని ఎస్ఎల్‌బీసీ నివేదిక పేర్కొంది.

పశు సంవర్థక, డెయిరీ, మత్స్య కార్యకలాపాల రైతులకు అవసరమైన వర్కింగ్ కేపిటల్ కోసం కేసీసీలను సంతృప్త స్థాయిలో ఇవ్వాల్సిన అవసరం ఉందని ఎస్ఎల్‌బీసీ పేర్కొంది. ఈ రైతులకు కేసీసీల మంజూరుకు మార్చి నెలాఖరు వరకు ప్రతి శుక్రవారం ప్రత్యేక క్యాంపులు నిర్వహిస్తున్నట్లు తెలిపింది. ఈ శిబిరాల్లో రైతుల నుంచి దరఖాస్తులు స్వీకరించి, అక్కడికక్కడే పరిశీలిస్తారని తెలిపింది. అర్హులైన వారికి కేసీసీ జారీ చేస్తారంది. ఈ శిబిరాల ద్వారా ఇప్పటివరకు పశు సంవర్థక, డైరీ కార్యకలాపాలకు కేసీసీ కోసం 82,366 దరఖాస్తులు రాగా 68,948 దరఖాస్తులకు కేసీసీ మంజూరు చేశారు. మత్స్య కార్యకలాపాల కోసం 36,076 దరఖాస్తులు రాగా 22,856 మందికి కేసీసీ మంజూరు చేశారు. ప్రస్తుత ఆర్థిక సంవత్సరంలో పశుసంవర్ధక రంగంలో 95,445 ఖాతాలకు రూ.1079.26 కోట్లు, మత్స్య రంగంలో 5,112 ఖాతాలకు రూ.285.95 కోట్లు మంజూరు చేశారు. అయితే సంతృప్త స్థాయిలో కేసీసీల మంజూరుకు బ్యాంకులు మరింతగా దృష్టి సారించాలని ఎస్ఎల్‌బీసీ సూచించింది.

దేశంలో టాప్ ఐదు రాష్ట్రాల్లో 2022-23 ఆర్థిక సంవత్సరం నాటికి కేసీసీ ద్వారా రైతులకు అందించిన రుణాలు

| రాష్ట్రం | కేసీసీ రుణాలు (రూ.కోట్లలో) |
|---|---|
| ఉత్తరప్రదేశ్ | 1,28,115 |
| మధ్యప్రదేశ్ | 78,092 |
| మహారాష్ట్ర | 70,329 |
| గుజరాత్ | 62,373 |
| ఆంధ్రప్రదేశ్ | 60,879 |




## మల్లన్నకు స్వర్ణరథం విరాళం

రూ.11 కోట్లతో తయారు చేయించిన ఎంపీ వేమిరెడ్డి దంపతులు



సంప్రోక్షణకు జలాలు తీసుకొచ్చిన మంత్రి, ఎంపీ దంపతులు, ఎమ్మెల్యే, ఆలయ చైర్మన్ తదితరులు

**శ్రీశైలం టెంపుల్:** శ్రీశైలం దేవస్థానానికి ఎంపీ వేమిరెడ్డి ప్రభాకరరెడ్డి, ప్రశాంతిరెడ్డి దంపతులు రూ.11 కోట్లతో తయారుచేయించిన స్వర్ణరథాన్ని శుక్రవారం విరాళంగా అందజేశారు. సంప్రోక్షణ, అనంతరం స్వామి అమ్మవార్ల స్వర్ణరథోత్సవం కొనసాగింది. డిప్యూటీ సీఎం కొట్టు సత్యనారాయణ, ఎమ్మెల్యే శిల్పా చక్రపాణిరెడ్డి, దేవస్థాన ధర్మకర్తల మండలి చైర్మన్ రెడ్డివారి చక్రపాణిరెడ్డి, ఈవో డి.పెద్దిరాజు పాల్గొన్నారు.

## అంగరంగ వైభవంగా శ్రీనివాసుని కల్యాణం





కల్యాణోత్సవాన్ని నిర్వహిస్తున్న ద్వారంపూడి దంపతులు. కల్యాణానికి అశేషంగా తరలివచ్చిన భక్తజనం

**సాక్షి ప్రతినిధి, కాకినాడ:** కాకినాడ రంగరాయ వైద్య కళాశాల ప్రాంగణంలో కాకినాడ సిటీ ఎమ్మెల్యే ద్వారంపూడి చంద్రశేఖరరెడ్డి, మహాలక్ష్మి దంపతుల ఆధ్వర్యంలో శ్రీపద్మావతీ శ్రీనివాసుల కల్యాణోత్సవం శుక్రవారం అంగరంగ వైభవంగా నిర్వహించారు. ప్రఖ్యాత ఆగమ పండితులు, భాగవతోత్తములు గోపినంబాల శేషాచార్యులు, పాంచరాత్ర ఆగమ పండితులు గోపినంబాల కూర్మాచార్యుల మనుమలు శాస్త్రోక్తంగా కల్యాణ తంతు నిర్వహించారు. మంగళసూత్రధారణ, పుష్పాభిషేకాలు కన్నుల పండువగా సాగాయి. పద్మశాలీల ఆడపడుచుగా కొలిచే పద్మావతి అమ్మవారు, శ్రీనివాసులకు సంప్రదాయబద్ధంగా పద్మశాలీలు తరలివచ్చి పలు రకాల స్వీట్లు, సారె, చీర సమర్పించారు. ఎమ్మెల్యే ద్వారంపూడి దంపతులు పట్టువస్త్రాలు, పండ్లతో వెంకట నగర్ నుంచి కల్యాణోత్సవ ప్రాంగణం వరకూ శోభాయాత్ర నిర్వహించారు. కల్యాణోత్సవాన్ని సుమారు 40 వేల మంది భక్తులు వీక్షించారు. వీరికి తిరుపతి నుంచి తెప్పించిన లడ్డూ ప్రసాదం అందజేశారు. రాష్ట్ర మంత్రి చెల్లుబోయిన శ్రీనివాస వేణుగోపాలకృష్ణ, కాకినాడ ఎంపీ వంగా గీత, వైఎస్సార్ సీపీ కాకినాడ పార్లమెంటరీ కో ఆర్డినేటర్ చలమలశెట్టి సునీల్, కాకినాడ నగరాభివృద్ధి సంస్థ చైర్‌పర్సన్ రాగిరెడ్డి చంద్రకళాదీప్తి తదితరులు పాల్గొన్నారు.



Published and Printed by V. Murali on behalf of Jagati Publications Limited, Published at Survey no 481 phase-2, Jawahar Auto Nagar, Vijaywada, NTR District - 520 007 (AP) and Printed at Jagati Publications Limited, Survey no 481 phase-2, Jawahar Auto Nagar, Vijaywada, NTR District - 520 007 (AP)., Editor: V. Murali, (Responsible for selection of News under the PRB Act) Phone No. 0866-2547436 Fax: No. 0866-2547433. RNI Reg No. APTEL/2008/23794. Reproduction in whole or in part without written permission of the publisher is prohibited.

# సాక్షి
## విజయవాడ సిటీ
ఎన్టీఆర్ జిల్లా

శనివారం । 17 । ఫిబ్రవరి । 2024






### దుర్గమ్మ సేవలో సతీష్‌రెడ్డి
ఇంద్రకీలాద్రి(విజయవాడపశ్చిమ): డీఆర్‌డీఓ మాజీ చైర్మన్, కేంద్ర రక్షణ మంత్రి సాంకేతిక సలహాదారు డాక్టర్ జి.సతీష్‌రెడ్డి శుక్రవారం దుర్గమ్మను దర్శించుకున్నారు.



### దీక్ష విరమణ
మోపిదేవి: సుబ్రహ్మణ్యేశ్వరస్వామివారి మాలధారణ చేసిన భక్తులు శుక్రవారం పాలకావడితో గ్రామోత్సవం నిర్వహించారు. అనంతరం ఆలయ ప్రాంగణంలో దీక్ష విరమించారు.



### కమ్మేసిన పొగమంచు
జిల్లాను పొగమంచు దట్టంగా కమ్మేస్తోంది. ఉదయం 9 గంటల వరకు మంచు తెరలు వీడటం లేదు. విజయవాడ బీఆర్‌టీఎస్ రోడ్డులో శుక్రవారం ఉదయం 9.30 గంటల సమయంలోని దృశ్యమిది.

## న్యూస్‌రీల్

### నేడు జిమ్నాస్టిక్ పోటీలు
విజయవాడస్పోర్ట్స్: కృష్ణా యూనివర్సిటీ అంతర కళాశాలల జిమ్నాస్టిక్స్ స్త్రీ, పురుషుల పోటీలను ఈ నెల 17వ తేదీ శనివారం విజయవాడలోని పీబీ సిద్ధార్థ కళాశాలలో నిర్వహిస్తున్నట్లు ఆ కాలేజీ వ్యాయామ అధ్యాపకులు ఎ.చినబాబు తెలిపారు. ఆ రోజు ఉదయం తొమ్మిది గంటలకు ఈ పోటీలు ప్రారంభమవుతాయన్నారు. అనంతరం దక్షిణ భారత అంతర వర్సిటీ జిమ్నాస్టిక్ పోటీలకు కృష్ణా వర్సిటీ జట్టును ఎంపిక చేస్తామన్నారు.

### రేపు బాడీ బిల్డింగ్ క్రీడాకారుల ఎంపిక
పెనమలూరు: జూనియర్ నేషనల్ బాడీబిల్డింగ్ పోటీలలో పాల్గొనే క్రీడాకారులకు సెలక్షన్స్ నిర్వహిస్తున్నామని ఉమ్మడి కృష్ణా జిల్లా బాడీబిల్డింగ్ అసోసియేషన్ అధ్యక్ష కార్యదర్శులు బి.మనోహర్, తాళ్లూరి అశోక్, కోచ్ సీహెచ్‌రాజు శుక్రవారం తెలిపారు. ఈ నెల 23 నుంచి 25వ తేదీ వరకు తమిళనాడులో 14వ మిస్టర్ ఇండియా జూనియర్ బాడీ బిల్డింగ్ పోటీలు జరుగుతాయన్నారు. దీనికి క్రీడాకారులను 18న కానూరు అశోక్ జిమ్‌లో ఎంపిక చేస్తామమని వివరాలకు 8686771358లో సంప్రదించాలని కోరారు.

# రూ. 1,499 కోట్లతో వీఎంసీ బడ్జెట్

- విజయవాడ అభివృద్ధిలో రాజీ పడే ప్రసక్తే లేదు
- మేయర్ భాగ్యలక్ష్మి స్పష్టం
- నేడు నగరపాలక సంస్థ బడ్జెట్ సమావేశం

పటమట(విజయవాడతూర్పు): నగరాన్ని గతంకంటే మెరుగ్గా అభివృద్ధి చేశామని విజయవాడ నగరపాలక సంస్థ మేయర్ రాయన భాగ్యలక్ష్మి అన్నారు. శుక్రవారం వీఎంసీ ప్రధాన కార్యాలయంలోని ఆమె చాంబర్లో 2024–25 ఆర్థిక సంవత్సర బడ్జెట్‌పై విలేకరుల సమావేశం నిర్వహించారు. వైఎస్సార్ సీపీ అధికారం చేపట్టాక తాము ప్రవేశ పెట్టే మూడో బడ్జెట్ ఇదన్నారు. ప్రజలకు ఎలాంటి పన్నుల భారం లేకుండా, వాస్తవిక ఆదాయాలను, ఖర్చులను పరిగణనలోకి తీసుకుని బడ్జెట్‌ను రూపొందించామన్నారు. ఈ మేరకు శనివారం ఉదయం 10.30 గంటలకు వీఎంసీ కౌన్సిల్ హాల్లో బడ్జెట్ ప్రవేశపెట్టబోతున్నట్లు చెప్పారు.

**అన్నింటికీ సమప్రాధాన్యం..**

నగరంలో అభివృద్ధి పనులతోపాటు ప్రజారోగ్యం, పచ్చదనం, పరిసరాల పరిశుభ్రతకు అధిక ప్రాధాన్యతను ఇచ్చి పార్కులు, ఇతర



విలేకరుల సమావేశంలో మాట్లాడుతున్న మేయర్ రాయన భాగ్యలక్ష్మి

గ్రీనరీ పనులకు బడ్జెట్‌లో అధిక ప్రాధాన్యాన్ని ఇచ్చామని మేయర్ చెప్పారు. 2024–25 వార్షిక బడ్జెట్‌లో రెవెన్యూ ఆదాయం రూ.851.45 కోట్లు, కేపిటల్ ఆదాయం రూ.599.42 కోట్లు, అడ్వాన్సులు రూ.48.17 కోట్లు మొత్తం 1,499.04 కోట్లతో బడ్జెట్ ప్రవేశ పెడుతున్నామని వివరించారు.

**జాతీయ స్థాయిలో గుర్తింపు..**

గత ఆర్థిక సంవత్సరంలో విజయవాడ నగరానికి జాతీయ స్థాయిలో గుర్తింపు తీసుకువచ్చామని మేయర్ భాగ్యలక్ష్మి వివరించారు. స్వచ్ఛ సర్వేక్షణ్ ర్యాంకింగ్‌లో దేశంలో ఆరో నగరంగా అవార్డు పొందామని, వీఎంసీ ప్రధాన కార్యాలయంపై ఏర్పాటు చేసిన సోలార్ ప్యానల్ ద్వారా రూ. 8లక్షల విద్యుత్ బిల్లును తగ్గించామని, అందుకు స్టేట్ ఎనర్జీ కన్జర్వేషన్ అవార్డును పొందామని తెలిపారు.

**రోడ్లకు మెరుగులు..**

గత ఆర్థిక సంవత్సరంలో నగరంలోని మూడు నియోజకవర్గాల్లో 55.03 కి.మీ మేర తారు రోడ్లకు రూ. 43.65 కోట్లు నిధులు వెచ్చించామని, 33.26 కి.మీ మేర సీసీ రోడ్ల నిర్మాణానికి రూ. 22.24 కోట్లు నిధులు వెచ్చించామని మేయర్ చెప్పారు. నగరంలోని మూడు సర్కిళ్ల పరిధిలో రూ. 5.94 కోట్లతో సెంట్రల్ డివైడర్లు అభివృద్ధి చేశామన్నారు.

**సౌకర్యాల కల్పన..**

నగరంలోని 57 డివిజన్లలో అవెన్యూ ప్లాంటేషన్‌కు రూ.41.71కోట్లు ఖర్చు చేశామని మేయర్ చెప్పారు. నగరంలోని వివిధ ప్రాంతాల్లో ఉన్న షాపులు, కల్యాణమండపాలు, పార్కులు, పార్కింగ్ ప్రాంతాలు, కర్మల భవనాల సాయంతో రూ. 44.48 కోట్ల ఆదాయాన్ని ఆర్జించామన్నారు. రాబోయే రోజుల్లో నగరాన్ని మరింత అభివృద్ధి చేయటానికి తాము కృషి చేస్తున్నామని తెలిపారు. సీఎం వైఎస్ జగన్ మోహన్ రెడ్డి సహకారంతో నగరాన్ని అంతర్జాతీయ నగరంగా తీర్చిదిద్దేందుకు ప్రణాళిక రూపొందించామని, నగరవాసులకు మౌలిక వసతులు కల్పనలో రాజీలేకుండా పాలన సాగిస్తామని పేర్కొన్నారు.

# మూడో దశ రీ సర్వే పనులు వేగవంతం

గాంధీనగర్(విజయవాడసెంట్రల్): మూడో దశ రీ సర్వే ప్రక్రియ వేగవంతంగా నిర్వహిస్తున్నామని ఎన్టీఆర్ జిల్లా కలెక్టర్ ఎస్. ఢిల్లీరావు రాష్ట్ర ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి డాక్టర్ కేఎస్ జవహర్ రెడ్డికి వివరించారు. రాష్ట్ర వ్యాప్తంగా జగనన్న శాశ్వత భూ హక్కు, భూ రక్ష కార్యక్రమంలో భాగంగా జరుగుతున్న రీసర్వే మూడో దశ పనుల ప్రగతి, ఆరోగ్యం, వైద్య కుటుంబ సంక్షేమం, ఆరోగ్యశ్రీ కార్డుల పంపిణీ తదితర అంశాలపై శుక్రవారం రాష్ట్ర ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి డాక్టర్ కేఎస్ జవహర్ రెడ్డి అన్ని జిల్లాల కలెక్టర్లు, సంబంధిత శాఖల అధికారులతో వీడియో కాన్ఫరెన్స్ ద్వారా సమీక్షించారు. నగరంలోని వీడియో కాన్ఫరెన్స్ హాల్ నుంచి జిల్లా కలెక్టర్ ఢిల్లీరావు మాట్లాడుతూ.. మూడో దశ రీసర్వేలో స్టోన్ ప్లాంటేషన్ ప్రక్రియను నిర్దేశించిన గడువులోగా పూర్తిచేసేందుకు చర్యలు తీసుకుంటున్నామన్నారు. జగనన్న శాశ్వత భూ హక్కు, భూ రక్ష పథకంలో భాగంగా జిల్లాలోని 16 మండలాల్లో 300 గ్రామాల్లో మూడు దశల్లో రీసర్వే చేపట్టగా అన్ని గ్రామాల్లోను డ్రోన్ ఫ్లై పూర్తిచేశామన్నారు.



ఎన్టీఆర్ జిల్లా కలెక్టర్ ఢిల్లీరావు

- జాతీయ ఉపాధి హామీ పథకంలో భాగంగా జిల్లాలో 1,96,748 జాబ్ కార్డులను పంపిణీ చేశామన్నారు.
- జగనన్న ఆరోగ్య సురక్షలో భాగంగా జిల్లాలో 195 గ్రామ, వార్డు సచివాలయాల పరిధిలో 587 వైద్య శిబిరాలను ఏర్పాటు చేశామన్నారు.
- జిల్లాలో ఇప్పటివరకు 99,416 మందికి ఆరోగ్య శ్రీ కార్డులు పంపిణీ చేశామని, మిగిలిన వాటిని త్వరితగతిన పంపిణీకి చర్యలు తీసుకుంటున్నామని వివరించారు. వీడియో కాన్ఫరెన్స్‌లో డీఆర్వో వి. శ్రీనివాస రావు, డ్వామా పీడీ జె. సునీత, డీఎంహెచ్‌ఓ ఎం. సుహాసిని, ఆరోగ్య శ్రీ జిల్లా కో ఆర్డినేటర్ జె. సుమన్, సర్వే అండ్ ల్యాండ్ రికార్డ్స్ అధికారి కె. శ్రీనివాస్ పాల్గొన్నారు.

# వైఎస్సార్ సీపీ అనుబంధ విభాగాల అధ్యక్షులు నియామకం

గాంధీనగర్(విజయవాడసెంట్రల్): వైఎస్సార్ సీపీ అధ్యక్షుడు వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ఆదేశాల మేరకు పార్టీ విజయవాడ నగర అనుబంధ విభాగాల అధ్యక్షుల నియామకం జరిగింది. ఈ మేరకు పార్టీ కేంద్ర కార్యాలయం శుక్రవారం ఓ ప్రకటన విడుదల చేసింది. మహిళా విభాగం నగర అధ్యక్షురాలిగా ఇందుపల్లి సుభాషిణి(విజయవాడ ఈస్ట్), స్టూడెంట్ వింగ్ ప్రెసిడెంట్‌గా మహమ్మద్ జావెద్(విజయవాడ ఈస్ట్), ఎస్సీ సెల్ ప్రెసిడెంట్‌గా బూదాల శ్రీనివాస్(విజయవాడ వెస్ట్), ఎస్టీ సెల్ ప్రెసిడెంట్‌గా మేడా ఆనంద పవన్(విజయవాడ ఈస్ట్), వైఎస్సార్‌టీయూసీ అధ్యక్షుడిగా విశ్వనాథ రవి( వెస్ట్), మైనార్టీ సెల్ ప్రెసిడెంట్‌గా ఎస్‌కే నహీద్(వెస్ట్), వాణిజ్య విభాగం ప్రెసిడెంట్‌గా శేగు వెంకటేశ్వర్లు (ఈస్ట్), డాక్టర్స్ వింగ్ ప్రెసిడెంట్‌గా విశ్వనాథుల కనక రత్నాచారి(వెస్ట్), ఐటీ వింగ్ ప్రెసిడెంట్‌గా పంతాల సాయి(ఈస్ట్), వైఎస్సార్ సేవాదళ్ ప్రెసిడెంట్‌గా ఊకోటి రమేష్(ఈస్ట్) నియమితులయ్యారు.



**ఎస్టీ, లీగల్ సెల్ కార్యదర్శులు..**

వైఎస్సార్ సీపీ అనుబంధ విభాగాల ఎస్టీ, లీగల్ సెల్ విభాగాల రాష్ట్ర కమిటీకి కృష్ణా జిల్లాకు చెందిన పలువురిని నియమించారు. ఎస్టీ సెల్ కమిటీ కార్యదర్శిగా రమావత్ శ్రీకాంత్ నాయక్, సంయుక్త కార్యదర్శిగా సలా నాగరాజు, లీగల్ సెల్ కార్యదర్శి మహమ్మద్ రఫీ, జాయింట్ సెక్రటరీగా కేబీ గీత నియమితులయ్యారు.

## క్లుప్తంగా

### వడ్డీతో బీమా మొత్తాన్ని చెల్లించండి

**వినియోగదారుల కమిషన్ ఆదేశం**

**చిలకలపూడి(మచిలీపట్నం):** వడ్డీతో బీమా మొత్తాన్ని వినియోగదారునికి చెల్లించాలని వినియోగదారుల కమిషన్ అధ్యక్షుడు చింతలపూడి కిషోర్‌కుమార్, సభ్యులు నందిపాటి పద్మారెడ్డి, శ్రీలక్ష్మీరాయల శుక్రవారం తీర్పు చెప్పారు. గుడివాడ పట్టణానికి చెందిన వసంతవాడ శ్రీనివాస్ హెచ్‌డీఎఫ్‌సీ స్టాండర్డ్ లైఫ్ ఇన్సూరెన్స్ కంపెనీలో రూ.15 లక్షలకు జీవిత బీమా పాలసీ తీసుకున్నారు. పాలసీ అమలులో ఉండగానే శ్రీనివాస్ మరణించారు. దీంతో నామినీగా ఉన్న భార్య వి.రాట్నాలకుమారి ఇన్సూరెన్స్ కంపెనీకి క్లెయిమ్ చేయగా వారు అనారోగ్య కారణాలు ఉన్నాయని తిరస్కరించారు. దీంతో ఆమె వినియోగదారుల కమిషన్‌ను ఆశ్రయించారు. పూర్వాపరాలు విచారించిన అనంతరం కమిషన్ సభ్యులు 2022 సెప్టెంబరు 20వ తేదీ నుంచి ఇన్సూరెన్స్ మొత్తం రూ.15 లక్షలు 9శాతం వడ్డీతో చెల్లించాలని రూ.10 వేలు ఖర్చుల నిమిత్తం తీర్పు వెలువడిన 30 రోజుల్లోగా ఫిర్యాదుదారునికి అందజేయాలని తీర్పు చెప్పారు.

### పార్కులో గేటు విరిగి పడి బాలుడి దుర్మరణం

**కోనేరుసెంటర్:** పార్కు గేటు ఊడిపడి ఓ బాలుడు మృతి చెందాడు. ఈ సంఘటన జిల్లా కేంద్రమైన మచిలీపట్నంలో శుక్రవారం జరిగింది. కేసు నమోదు చేసిన పోలీసులు తెలిపిన వివరాలు ఇలా ఉన్నాయి. నగరంలోని పట్టాభిపురానికి చెందిన వడ్డే లక్ష్మీకాంత్ కారు నడుపుతుంటాడు. ఆయనకు ఇద్దరు కుమారులు, జవహర్ పబ్లిక్ స్కూలులో చదువుకుంటున్నారు. చిన్న కుమారుడు వడ్డే దినేష్‌కుమార్ (8) యూకేజీ చదువుతున్నాడు. రోజు లానే శుక్రవారం పాఠశాలకు వెళ్లి వచ్చిన దినేష్ ఇంటికి సమీపంలో డీఈవో కార్యాలయానికి ఎదురుగా ఉన్న పార్కులో ఆడుకుని వస్తానని తల్లితో చెప్పి వెళ్లాడు. అక్కడ ఆటలాడుకుంటూ పార్కు ప్రధాన గేటు పట్టుకుని వేలాడుతుండగా గేటు ఒక్కసారిగా విరిగి ధబేలుమని దినేష్‌పై పడిపోయింది. దీంతో తలకు తీవ్రంగా గాయమై దినేష్ స్పృహ కోల్పోయాడు. ఈ సంఘటనను ప్రత్యక్షంగా చూసిన స్థానికులు కుటుంబ సభ్యులకు విషయం చెప్పగా తల్లిదండ్రులు, బంధువులు బాలుడిని చికిత్స నిమిత్తం మచిలీపట్నం సర్వజన ఆసుపత్రికి తరలించారు. అక్కడ చికిత్స పొందుతూ దినేష్ మృతి చెందాడు. అప్పటి వరకు ఆటలాడుతూ స్నేహితులతో సరదాగా గడిపిన దినేష్ ఒక్కసారిగా ప్రమాదానికి గురై ప్రాణాలు కోల్పోవటంతో తల్లిదండ్రులు, బంధువులు భోరున విలపించారు. దినేష్ మృతితో పట్టాభిపురంలో విషాదఛాయలు అలముకున్నాయి. బాలుడి తండ్రి ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్లు పోలీసులు తెలిపారు.

# సర్కారీ దవాఖానాల్లో తల్లీ,బిడ్డ భద్రం

- విస్తృతంగా మాతా శిశు సంరక్షణ సేవలు
- గర్భం దాల్చినప్పటి నుంచి ప్రసవం వరకు నిరంతర పర్యవేక్షణ
- ప్రసవం తర్వాత తల్లీబిడ్డల ఎక్స్‌ప్రెస్ ద్వారా ఉచితంగా ఇళ్లకు తరలింపు
- నిర్ణయించిన నెలల్లో ఉచితంగా స్కానింగ్
- ప్రధాన మంత్రి మాతృత్వ వందన యోజన ద్వారా బ్యాంకు ఖాతాలకు రూ.5 వేలు నగదు బదిలీ



తల్లీబిడ్డ ఎక్స్‌ప్రెస్‌లో ఇంటికి వెలుతున్న బాలింత(ఫైల్)

**లబ్బీపేట(విజయవాడతూర్పు):** ఎన్టీఆర్ జిల్లాలో గ్రామీణ, పట్టణ ప్రాంతాల్లో మాతా శిశు సంరక్షణ సేవలు విస్తృతంగా అందిస్తున్నట్లు జిల్లా వైద్య ఆరోగ్యశాఖాధికారి డాక్టర్ మాచర్ల సుహాసిని తెలిపారు. ఈ సందర్భంగా నగరంలోని తన కార్యాలయంలో శుక్రవారం మీడియాతో మాట్లాడుతూ మాతాశిశు సంరక్షణకు తీసుకుంటున్న చర్యలను వివరించారు. ప్రతి గర్భిణిని ఏఎన్ఎం, ఆశ, అంగన్‌వాడీ కార్యకర్తలు నిరంతరం పర్యవేక్షిస్తుంటారని చెప్పారు.

**ఉచిత స్కానింగ్ సేవలు**

ప్రతి గర్భిణికి వైద్యాధికారి పరీక్షలు చేయడంతో పాటు, నిర్ణయించిన నెలల్లో స్కానింగ్ సేవలు ఉచితంగా ఇస్తున్నట్లు తెలిపారు. ప్రభుత్వాస్పత్రులతో పాటు, ఆరోగ్యశ్రీ నెట్‌వర్క్ ఆస్పత్రుల్లో ఈ సేవలు అందుతాయన్నారు. గర్భిణీలలో ప్రమాదకర లక్షణాలను గుర్తించిన వారికి టిఫా స్కాన్‌ను ఉచితంగా చేయనున్నట్లు తెలిపారు. వైద్యులు సూచించిన మేరకు ఈ స్కానింగ్ చేస్తారని స్పష్టం చేశారు.

**ప్రభుత్వ పథకాలు వర్తింపు**

గర్భిణులకు ప్రధాన మంత్రి మాతృత్వ వందన యోజన ద్వారా రూ.5 వేలు అందించనున్నట్లు తెలి పారు. అందులో భాగంగా గర్భం దాల్చిన తర్వాత 12 వారాల్లోపు రూ.3 వేలు, ప్రసవం తర్వాత రూ.2 వేలు అందిస్తున్నట్లు తెలిపారు. ఆ మొత్తాన్ని ఆధార్‌తో లింక్ అయిన బ్యాంక్ అకౌంట్‌కు నగదు బదిలీ చేస్తున్నట్లు తెలిపారు. రెండవ కాన్పులో ఆడబిడ్డకు జన్మనిస్తే, బిడ్డకి టీకాలు అనంతరం ఒకేసారి రూ.6 వేలు ఇస్తున్నట్లు తెలిపారు. ప్రభుత్వాస్పత్రిలో ప్రసవం అయిన వారికి గ్రామీణ ప్రాంతం వారికి రూ.వెయ్యి. పట్టణ ప్రాంతం వారికి రూ.600 చెల్లిస్తున్నట్లు తెలిపారు.

**తల్లీబిడ్డ ఎక్స్‌ప్రెస్ సేవలు**

గర్భిణులు ప్రభుత్వాస్పత్రుల్లో ప్రసవం జరిగిన తర్వాత తల్లీబిడ్డను ఉచితంగా తల్లీబిడ్డ ఎక్స్‌ప్రెస్‌లలో ఇంటికి చేర్చుతున్నట్లు తెలిపారు. కుటుంబ డాక్టర్ కార్యక్రమంలో, ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో వైద్య పరీక్షల సమయంలో రక్తహీనత కలిగిన గర్భిణులను గుర్తిస్తే అలాంటి వారిని తల్లీబిడ్డ ఎక్స్‌ప్రెస్‌లో ఇంటి నుంచి ఆస్పత్రికి ప్రసవం కోసం తీసుకెళ్తున్నట్లు డీఎంహెచ్ఓ తెలిపారు. ఈ సేవల కోసం 104 టోల్‌ఫ్రీ నంబర్ అందుబాటులో ఉన్నట్లు తెలిపారు. గర్భిణులకు రక్తం ఎక్కించాల్సి వచ్చినప్పుడు తల్లీబిడ్డ ఎక్స్‌ప్రెస్‌లో ఆస్పత్రికి తీసుకెళ్లి, చికిత్స అనంతరం ఇంటికి తీసుకువస్తున్నట్లు తెలిపారు. ప్రభుత్వం అందిస్తున్న ఉచిత సేవలను జిల్లాలోని గర్భిణులు అందరూ సద్వినియోగం చేసుకోవాలని డాక్టర్ సుహాసిని కోరారు.

# విజయకీలాద్రిపై రథసప్తమి వేడుకలు



వెంకటేశ్వరస్వామి ప్రత్యేక పూజలు నిర్వహిస్తున్న త్రిదండి దేవనాథ రామానుజ జీయర్‌స్వామి

**తాడేపల్లిరూరల్:** తాడేపల్లి పట్టణ పరిధిలోని సీతానగరం విజయకీలాద్రి దివ్యక్షేత్రంపై శుక్రవారం రథసప్తమి పర్వదినాన్ని పురస్కరించుకుని ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఈ సందర్భంగా జీయర్ ఎడ్యుకేషనల్ ట్రస్ట్ నిర్వాహకులు పురాణం వెంకటాచార్యులు మాట్లాడుతూ విజయకీలాద్రి దివ్యక్షేత్ర ఏడవ వార్షిక బ్రహ్మోత్సవాల్లో భాగంగా రథసప్తమి పురస్కరించుకుని త్రిదండి చిన్న శ్రీమన్నారాయణ రామానుజ జీయర్‌స్వామి, త్రిదండి దేవనాథ రామానుజ జీయర్‌స్వామి పరిపూర్ణ మంగళ శాసనములతో ప్రత్యక్ష పర్యవేక్షలో ఉదయం సామూహిక ఆదిత్య హృదయస్తోత్ర పారాయణ నిర్వహించినట్లు చెప్పారు. అనంతరం విజయకీలాద్రి ఆలయ పెరుమాళ్ల అందరికీ అంగరంగ వైభవంగా కల్యాణ మహోత్సవం జరిగినట్లు తెలిపారు. వెంకటేశ్వరస్వామి వారు సూర్యప్రభ వాహనంపై భక్తులకు దర్శనమిచ్చారని వివరించారు. సాయంత్రం స్వామి వారు గరుడ వాహనంపై విజయకీలాద్రి గిరి పరిక్రమణ జరిగిందన్నారు.

# దేవతా మూర్తులకు జలాధివాసం



దేవతా మూర్తులకు జలాధివాసం నిర్వహిస్తున్న అర్చకులు, వైదిక కమిటీ సభ్యులు

**ఇంద్రకీలాద్రి(విజయవాడపశ్చిమ):** ఇంద్రకీలాద్రిపై మల్లేశ్వర స్వామి వారి నూతన ధ్వజ స్తంభ సహిత స్వర్ణ శిఖర కుంభాభిషేక మహోత్సవాలు వైభవంగా జరుగుతున్నాయి. కార్యక్రమంలో మూడో రోజైన శుక్రవారం ఉదయం 9 గంటల నుంచి మధ్యాహ్నం 12 గంటల వరకు శాంతి పాఠం, గణపతి పూజ, పుణ్యాహవాచనం, శ్రీ దుర్గా మల్లేశ్వర స్వామి వార్లకు ప్రత్యేక పూజలు, హోమాలు నిర్వహించారు. ఆలయ స్థానాచార్య శివ ప్రసాద్ శర్మ పర్యవేక్షణలో ఆలయ వైదిక కమిటీ సభ్యులు హోమాలను శాస్త్రోక్తంగా జరిపించారు. ఆలయ ఉప ప్రధాన అర్చకులు కోట ప్రసాద్, దేవస్థాన వేద పాఠశాల విద్యార్థులు యాగశాలలో మంటప పూజలు, మంటప హోమం, అంగహోమాలను నిర్వహించారు. ఆలయ వేద పండితులు, ఆలయ అర్చకులు వేద పఠనాన్ని ముక్తకంఠంతో పఠించగా, మల్లేశ్వరాలయం మారుమోగింది. ఉదయం స్వామి వారి ఆలయానికి చేరుకున్న ఈవో కేఎస్ రామారావుకు యాగశాలలో జరుగుతున్న పూజలు, హోమాల గురించి ఆలయ వైదిక కమిటీ సభ్యులు యజ్ఞనారాయణ శర్మ, మురళీశర్మ వివరించారు. మధ్యాహ్నం స్వామి వారి ఆలయ ప్రాంగణంలో ఆలయ అర్చకులు, వేద పండితుల పర్యవేక్షణలో దేవతామూర్తులకు జలాధివాసం నిర్వహించారు. ఉత్సవాలలో ఎటువంటి లోటుపాట్లు లేకుండా వైభవంగా నిర్వహించాలని ఆలయ ఈవో రామారావు ఇంజినీరింగ్ అధికారులు, అర్చక సిబ్బందికి సూచించారు. కార్యక్రమంలో ఆలయ ఈఓ రామారావుతో పాటు స్థానాచార్య శివప్రసాద్ శర్మ దంపతులు, వైదిక కమిటీ సభ్యులు కుటుంబ సమేతంగా పాల్గొన్నారు.

# భక్తుల కల్పవల్లి.. ఉయ్యూరు వీరమ్మతల్లి

- 19 నుంచి ఉయ్యూరు వీరమ్మతల్లి తిరునాళ్లు ప్రారంభం
- 15 రోజుల పాటు వైభవంగా ఉత్సవాల నిర్వహణ



శ్రీ కనక చింతయ్య సమేత వీరమ్మతల్లి

**ఉయ్యూరు:** భక్తుల కల్పవల్లిగా ప్రసిద్ధికెక్కిన చల్లని తల్లి ఉయ్యూరు వీరమ్మతల్లి తిరునాళ్ల మహోత్సవం ఈనెల 19 నుంచి ప్రారంభం కానుంది. మాఘశుద్ధ ఏకాదశి (భీష్మ ఏకాదశి ) పర్వదినాన ప్రారంభమై 15 రోజుల పాటు ఉత్సవాలు అంగరంగ వైభవంగా జరుగుతాయి. తిరునాళ్ల మహోత్సవానికి ఉమ్మడి తెలుగు రాష్ట్రాల నుంచి భక్తులు హాజరై అమ్మవారికి మొక్కుబడులు తీర్చుకుంటారు.

**ఎదురుగండ దీపాలతో హారతులు**

అమ్మవారి తిరునాళ్ల మహోత్సవం సోమవారం రాత్రి 7.30 గంటలకు మొదలవుతుంది. తొలుత ఆచార సంప్రదాయం ప్రకారం పట్టణ పోలీసులు అమ్మవారికి చీర, సారె, పసుపు కుంకుమలు సమర్పిస్తారు. పారుపూడి, నెరుసు వంశస్తులు పూజా కార్యక్రమాలు నిర్వహించి ఉత్సవాలకు అంకురార్పణ చేస్తారు. మెట్టనింట కొలువైన అమ్మవారిని బయటకు తీసుకొచ్చి పల్లకిలో కూర్చుండబెడతారు. వేలాదిగా తరలివచ్చిన భక్తులు ఎదురుగండ దీపాలతో హారతులతో స్వాగతం పలికి భక్తిపారవశ్యం చెందటంతో ఊరేగింపు మొదలై అమ్మవారు బయలుదేరుతుంది. ఊరేగింపు అనంతరం రెండో రోజు ప్రధాన సెంటరులో ఊయల ఉత్సవం జరుపుతారు. ఊయల ఉత్సవం పూర్తికావటంతో కనక చింతయ్య సమేతంగా అమ్మవారు ఆలయ ప్రవేశం చేసి భక్తుల పూజలందుకుంటారు.

**శిడిబండి వేడుక**

అమ్మవారి తిరునాళ్లలో 11వ రోజు ఈనెల 29న నిర్వహించే శిడిబండి వేడుక ప్రధాన ఘట్టం. ఉయ్యూరు దళిత వాడ నుంచి పెళ్లి కుమారుడు ఊరేగింపుగా తరలివచ్చి ప్రత్యేకంగా తయారుచేసిన శిడిబండిలో ఊరేగటంతో ఈ ఘట్టం ముగుస్తుంది. శిడిబండి ఉత్సవాన్ని తిలకించేందుకు అశేష భక్తజనం తరలివస్తారు. ఉత్సవాల్లో ప్రధానంగా జోడిపాట్టేళ్ల బండ్లు ఆకర్షణగా నిలుస్తాయి. భక్తులు జోడు పొట్టేళ్ల ప్రభ బండ్లతో ఊరేగింపుగా వచ్చి అమ్మవారికి నైవేద్యం సమర్పించి మొక్కుబడులు చెల్లించుకుంటారు. భక్తుల పూజలతో మార్చి 4న ఉత్సవాలు ముగుస్తాయి. అనంతరం అమ్మవారు ఊరేగింపుగా మెట్టినింటికి చేరుకుని పూజలందుకుంటారు.

**నేడు మంత్రి జోగి రమేష్ సమీక్ష**

ఉత్సవాల నిర్వహణపై రాష్ట్ర గృహ నిర్మాణశాఖ మంత్రి జోగి రమేష్ ఈనెల 17న సమీక్ష నిర్వహించనున్నారు. మున్సిపల్ కార్యాలయంలో అధికారులు, ఆలయ పాలకవర్గంతో సమీక్ష జరిపి ఉత్సవాలను పకడ్బందీగా నిర్వహించేందుకు చర్యలు తీసుకుంటారని మంత్రి కార్యాలయం ఒక ప్రకటనలో తెలిపింది.

### వివాహిత ఆత్మహత్య

**చిట్టినగర్(విజయవాడపశ్చిమ):** వివాహిత ఉరి వేసుకుని ఆత్మహత్యకు పాల్పడిన ఘటన కొత్తపేట పోలీస్ స్టేషన్ పరిధిలోని జక్కంపూడి కాలనీలో గురువారం రాత్రి జరిగింది. ఈ ఘటనపై మృతురాలి తల్లి శుక్రవారం పోలీసులకు ఫిర్యాదు చేయడంతో కేసు నమోదు చేశారు. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం జక్కంపూడి కాలనీ బ్లాక్ నంబరు 52లో కొండ్రాజు మంగమ్మ తన రెండో కుమార్తె ముప్పాల తిరుపతమ్మ(27)తో కలిసి నివాసం ఉంటోంది. తిరుపతమ్మ భర్త నరసయ్య పూనేలో పనిచేస్తుంటాడు. వీరికి ఇద్దరు సంతానం. మంగమ్మ, తిరుపతమ్మలు పనులు చేసుకుని జీవనం సాగిస్తుంటారు. గత ఐదు రోజులుగా తిరుపతమ్మ పనికి వెళ్లకుండా ఇంట్లోనే ఉంటోంది. గురువారం తిరుపతమ్మ కుమార్తె లక్ష్మీ ప్రసన్న స్కూల్ నుంచి ఇంటికి వచ్చే సరికి తలుపునకు లోపలి వైపు గడియ వేసి ఉంది. ఎంత పిలిచినా లోపలి నుంచి సమాధానం లేదు. ఇంతలో అమ్మమ్మ మంగమ్మ ఇంటికి వచ్చింది. ఇద్దరూ తలుపులు కొట్టినా లాభం లేకపోవడంతో పక్క ఇంట్లో ఉండే కుర్రాడు వచ్చి బలవంతంగా తలుపులు తెరిచాడు. లోపలకు వెళ్లి చూసేసరికి ఫ్యాన్‌కు చున్నీతో ఉరికి వేలాడుతూ తిరుపతమ్మ కనిపించింది. పోలీసులు ఘటనా స్థలానికి చేరుకుని మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం ప్రభుత్వాసుపత్రికి తరలించి కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

### ప్రారంభమైన జేఎన్‌టీయూ కే సెంట్రల్ క్రికెట్ టోర్నమెంట్



మిక్ కళాశాలలో క్రికెట్ ఆడుతున్న క్రీడాకారులు

**కంచికచర్ల:** స్థానిక మిక్ కాలేజ్ ఆఫ్ టెక్నాలజీ కళాశాలలో జేఎన్‌టీయూ కాకినాడ పరిధిలో సెంట్రల్ జోన్ క్రికెట్ టోర్నమెంట్ పోటీలు శుక్రవారం ప్రారంభమయ్యాయి. పోటీలను కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ టి.వంశీకిరణ్ ప్రారంభించారు. పోటీలలో జేఎన్‌టీయూ పరిధిలో 60 జట్లు పాల్గొన్నాయని, ఫిబ్రవరి 26వ తేదీ వరకు పోటీలు జరుగుతాయని టోర్నమెంట్ ఆర్గనైజింగ్ కార్యదర్శి నిమ్మగడ్డ శౌరయ్య తెలిపారు. పోటీలకు పరిశీలకుడిగా డాక్టర్ జీపీ రాజు వ్యవహరించారు. తూర్పుగోదావరి, పశ్చిమ గోదావరి, కృష్ణా, గుంటూరు, ప్రకాశం జిల్లాల ఇంజినీరింగ్ కళాశాలల క్రికెట్ క్రీడాకారులు ఈ పోటీల్లో పాల్గొంటున్నారు. విజయవాడ ఆంధ్ర ఆసుపత్రి ఆర్థిక సహకారంతో ఈ పోటీలు జరుగుతున్నట్టు శౌరయ్య తెలిపారు. మిక్‌లో జరిగిన పోటీలో జీఐఈటీ(రాజమండ్రి)జట్టుపై ధనేకుల ఇంజినీరింగ్(విజయవాడ) జట్టు విజయం సాధించింది. అమ్రితసాయి ఇంజినీరింగ్ కళాశాల(పరిటాల)పై కైట్ ఇంజినీరింగ్ కళాశాల(కాకినాడ) జట్టు విజయం సాధించింది. ఎంఈఆర్ ఇంజినీరింగ్ కళాశాలలో జరిగిన పోటీల్లో హేలాపురి ఇంజినీరింగ్ కళాశాల(ఏలూరు)జట్టుపై విష్ణు కళాశాల(భీమవరం) జట్టు విజయం సాధించింది. బీవీసీ కళాశాల(రాజమండ్రి)జట్టుపై లింగయ్యాస్ కళాశాల(విజయవాడ) జట్టు గెలిచింది. ఆర్‌కే ఇంజినీరింగ్ కళాశాలలో జరిగిన టోర్నమెంట్‌లో వాసవి కళాశాల(నందమూరు)పై ఆదిత్య కళాశాల(కాకినాడ) జట్టు విజయం సాధించిందని శౌరయ్య తెలిపారు.



### వృద్ధురాలు సజీవ దహనం





మంటల్లో కాలిపోయిన వృద్ధురాలు సీతామహలక్ష్మి (ఫైల్)

**మోపిదేవి:** మండల కేంద్రమైన మోపిదేవిలో పెను విషాదం చోటుచేసుకుంది. గురువారం అర్ధరాత్రి పూరిగుడిసెలో నివసిస్తున్న కందుల సీతామహలక్ష్మి(77) ఇంటికి గుర్తు తెలియని వ్యక్తులు నిప్పంటించడంతో ఆ మంటల్లో వృద్ధురాలు కాలిపోయింది. విషయం తెలుసుకున్న పోలీసులు ఘటనా స్థలానికి చేరుకుని వివరాలు సేకరిస్తున్నారు. మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం అవనిగడ్డ ప్రభుత్వాసుపత్రికి తరలించారు. పోస్టుమార్టం అనంతరం మృతదేహాన్ని బంధువులకు అప్పగించారు. పూర్తి వివరాలు తెలియాల్సి ఉంది.

### అనుమానాస్పద స్థితిలో యువకుడి మృతి

**చిట్టినగర్(విజయవాడపశ్చిమ):** యువకుడు అనుమానాస్పద రీతిలో మృతి చెందిన ఘటనపై కొత్తపేట పోలీసులు శుక్రవారం కేసు నమోదు చేశారు. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం వించిపేట మేకల వారి వీధికి చెందిన కొమ్మవరపు రాములుకు ముగ్గురు సంతానం, పెద్ద కుమారుడు, కుమార్తెలకు వివాహాలయ్యాయి. కొంత కాలం కిందట రాములు భార్య బేబి గుండెపోటుతో మృతి చెందింది. తల్లి మరణంతో కుంగిపోయిన రెండో కుమారుడు నాగార్జున మద్యానికి బానిసయ్యాడు. డ్వాక్రాలో పని చేసే నాగార్జున కొంత కాలంగా అనారోగ్యంగా ఉండటంతో డాక్టర్లు మద్యం తాగవద్దని చెప్పారు. అయితే గురువారం రాత్రి నాగార్జున మద్యం తాగి వచ్చి ఇంటి ముందు పడిపోయాడు. దీంతో తండ్రి, అన్న కలిసి నాగార్జునను ప్రభుత్వాసుపత్రికి తరలించారు. ఆక్సిజన్ లెవల్స్ పడిపోవడంతో రాత్రి 9 గంటల సమయంలో మృతి చెందినట్లు వైద్యులు పేర్కొన్నారు. ఘటనపై తండ్రి పోలీసులకు ఫిర్యాదు చేయడంతో అనుమానాస్పద మృతి కింద కేసు నమోదు చేశారు.

## క్లుప్తంగా

### మళ్లీ వచ్చేది వైఎస్సార్ సీపీ ప్రభుత్వమే



పటమట(విజయవాడతూర్పు): రాబోయేదీ మళ్లీ వైఎస్సార్ సీపీ ప్రభుత్వమేనని, ఎన్నడూ లేని విధంగా రాష్ట్రంలో అభివృద్ధి, సంక్షేమాన్ని అందించిన ఘనత సీఎం వైఎస్ జగన్‌మోహన్ రెడ్డిదేన ని దేవినేని కుటుంబ సభ్యులు అన్నారు. శుక్రవారం గడప గడపకు మీ అవినాష్ కార్యక్రమం పటమట 4, 11వ డివిజన్‌లలో నిర్వహించారు. వైఎస్సార్ సీపీ తూర్పు నియోజకవర్గ ఇన్‌చార్జి దేవినేని అవినాష్ సతీమణి దేవినేని సుధీర 4వ డివిజన్‌లోని ఎన్టీఆర్ కాలనీ ప్రాంతంలో, 11వ డివిజన్ హైస్కూల్ రోడ్డు, చెన్నుపాటి అప్పారావు వీధి, కాలేషావలి వీధి, ప్రాంతాల్లో పర్యటించారు. 4వ డివిజన్ ఇంచార్జ్, కమ్మ కార్పొరేషన్ డైరెక్టర్ గల్లా పద్మావతి, 11వ డివిజన్ ఇన్‌చార్జ్ పర్వతనేని పవన్, డివిజన్ ప్రెసిడెంట్లు తదితరులు పాల్గొన్నారు.

### ఆధునిక ఆలోచనలతోనే అభివృద్ధి



పటమట(విజయవాడతూర్పు): ఆధునిక ఆలోచన దృక్పథంతోనే భవిష్యత్ నిర్మాణమవుతుందని యూఎస్ కాన్సులేట్ జనరల్ జెన్నిఫర్ లర్సెన్, జోనాథన్ ఓరే అన్నారు. స్టెల్లా కళాశాల్లో శుక్రవారం యూఎస్ కాన్సులేట్ ఆధ్వర్యంలో గ్రాడ్యుయేషన్ డే జరిగింది. ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథులుగా పాల్గొన్న వీరు మాట్లాడుతూ ఈ సర్టిఫికెట్ ప్రోగ్రాంలో విద్యార్థినులకు నైపుణ్యాలు మెరుగు పరచుకోవటం, ఉద్యోగ ఉపాధి అవకాశాలు పెంపొంది చుకోవటం సాధ్య మవుతుందన్నారు. కార్యక్రమంలో కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ జసింత క్వాడ్రస్, కరస్పాండెంట్ టీనా క్వాడ్రస్, కో–ఆర్డినేటర్ నాగసుందరి, రమణ తదితరులు పాల్గొన్నారు.

### ఉచిత వైద్య శిబిరంలో 150 మందికి పరీక్షలు



లబ్బీపేట(విజయవాడతూర్పు): యనమలకుదురు శివపార్వతినగర్‌లోని కెకె గ్లోబల్ అకాడమీలో శుక్రవారం ఉచిత వైద్య శిబిరం నిర్వహించారు. సీతారామపురంలోని దీపక్ మల్టీ స్పెషాలిటీ ఆస్పత్రి ఆధ్వర్యంలో నిర్వహించిన ఈ వైద్య శిబిరంలో క్రీడాకారులతో పాటు, సమీప ప్రాంతాలకు చెందిన 150 మంది ఉచిత వైద్య పరీక్షలు నిర్వహించారు. అవసరమైన వారికి మందులు ఉచితంగా ఇచ్చారు. ఈ సందర్భంగా రక్తపోటు, షుగర్ లెవల్స్, బీఎంఐ వంటి పరీక్షలు నిర్వహించారు. ఈశిబిరంలో డాక్టర్ శివ, డాక్టర్ మౌనిక, డాక్టర్ వెంకట నారాయణలతో పాటు, ఇతర వైద్య శిబ్బంది పాల్గొన్నట్లు ఆస్పత్రి మేనేజింగ్ డైరెక్టర్ డాక్టర్ పదముత్తం సురేష్‌కుమార్ తెలిపారు. అంతేకాకుండా తమ ఆస్పత్రిలో ఉచిత కన్సల్టేషన్‌తో పాటు, బీపీ, షుగర్, బీఎంఐ ఉచితంగా నిర్వహిస్తున్నట్లు ఆయన తెలిపారు. అవసరమైన ఇతర పరీక్షలపై 50 శాతం రాయితీ ఇస్తున్నామన్నారు. ఈ అవకాశాన్ని నగర ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని కోరారు.

### విద్యార్థి బైక్ చోరీ

పెనమలూరు: కానూరు ఇంజినీరింగ్ కాలేజీలో చదువుతున్న విద్యార్థి బైక్‌ను గుర్తు తెలియని వ్యక్తులు చోరీ చేయటంతో శుక్రవారం పోలీసులు కేసు నమోదు చేశారు. పెనమలూరు పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం..విజయవాడ పాయకాపురానికి చెందిన కె.అజయ్ నాగ కృష్ణ కానూరు వీఆర్ సిద్ధార్థ ఇంజినీరింగ్ కాలేజీలో బీటెక్ 3వ సంవత్సరం చదువుతున్నాడు. అతను ఈ నెల 9వ తేదీన తన బైక్‌ను కాలేజీ వద్ద పార్కు చేసి తరతులకు వెళ్లాడు. సాయంత్రం తిరిగి వచ్చి చూసుకునే సరికి అతని బైక్ కనిపించలేదు. బైక్ ఆచూకీ కోసం అనేక ప్రాంతాల్లో వెతికాడు. అయినా బైక్ దొరకక పోవటంతో ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేశామని పోలీసులు తెలిపారు.

### సాంకేతిక విద్యతో ఉజ్వల భవిత

మొగల్రాజపురం(విజయవాడ తూర్పు):పాలిటెక్నిక్ కోర్సు పూర్తి చేయడం వల్ల ఉజ్వల భవిష్యత్తును సొంతం చేసుకోవచ్చునని ప్రభుత్వ పాలిటెక్నిక్ కళాశాల ప్రిన్సిపాల్ ఎం.విజయసారథి చెప్పారు. ఏప్రిల్–27న జరుగనున్న పాలిసెట్–2024 ప్రవేశ పరీక్షపై పదో తరగతి విద్యార్థులకు అవగాహన కార్యక్రమం శుక్రవారం నగరంలోని పలు ప్రైవేటు పాఠశాలల్లో జరిగింది. నగరంలోని పలు ప్రైవేటు, ప్రభుత్వ పాఠశాలలకు ప్రభుత్వ పాలిటెక్నిక్ కళాశాల అధ్యాపకులు వెళ్లి పాలిటెక్నిక్ కోర్సులపై, కోర్సు పూర్తి చేసిన అనంతరం ఉన్న ఉపాధి అవకాశాలపై అవగాహన కల్పించారు. కంపెనీల్లో ఉద్యోగాలు పొందవచ్చన్నారు.

# మౌలిక సదుపాయాల కల్పనే ధ్యేయం

**వైఎస్సార్ సీపీ నియోజకవర్గ ఇన్‌చార్జి దేవినేని అవినాష్**



కమ్యూనిటీ హాల్‌ను ప్రారంభిస్తున్న మేయర్ భాగ్యలక్ష్మి, దేవినేని అవినాష్ తదితరులు

కృష్ణలంక(విజయవాడతూర్పు): సంక్షేమాభివృద్ధి కార్యక్రమాలతో పాటు పేద వర్గాల ప్రజలకు కనీస మౌలిక సదుపాయాల కల్పనే ధ్యేయంగా సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి పాలన సాగిస్తున్నారని నగర మేయర్ రాయన భాగ్యలక్ష్మి, వైఎస్సార్ సీపీ తూర్పు నియోజకవర్గ ఇన్‌చార్జి దేవినేని అవినాష్ అన్నారు. రాణిగారితోట, 18వ డివిజన్‌లో రూ.కోటి 20 లక్షల ప్రభుత్వ నిధులతో నూతనంగా నిర్మించిన కమ్యూనిటీ హాల్ భవనాన్ని శుక్రవారం ప్రారంభించారు. ఈ సందర్భంగా మేయర్ భాగ్యలక్ష్మి మాట్లాడుతూ రాష్ట్రంలో వైఎస్సార్ సీపీ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత సంక్షేమం, అభివృద్ధి రెండు సమపాళ్లలో జరుగుతున్నాయని చెప్పారు. జగనన్న జనరంజక పాలనతో ప్రజలంతా చాలా సంతోషంగా ఉన్నారని తెలిపారు. దేవినేని అవినాష్ మాట్లాడుతూ నియోజకవర్గంలో జరుగుతున్న అభివృద్ధిని చూసి ఓర్వలేక కులపిచ్చితో పత్రిక విలువలకు కూడా తిలోదకాలు ఇచ్చి టీడీపీ అనుకూల మీడియా అసత్య ప్రచారాలు చేయడం సిగ్గుచేటని విమర్శించారు. అభివృద్ధి ఎక్కడా అంటూ ప్రచారం చేస్తున్న పచ్చ మీడియాకు అభివృద్ధి చెందిన ప్రభుత్వ పాఠశాలలు, ఆసుపత్రులు, పార్కులు, కమ్యూనిటీ హాల్స్, అన్ని మౌలిక సదుపాయాలతో రూపుదిద్దుకున్న జగనన్న కాలనీలు కనపించడంలేదా అని ప్రశ్నించారు. గత టీడీపీ ప్రభుత్వంలో ఈ డివిజన్‌లో అభివృద్ధి అనేది జరగలేదని, కానీ నగరాన్ని కాల్‌మనీ, సెక్స్ రాకెట్‌లతో భ్రష్టు పట్టించారని ఆగ్రహం వ్యక్తం చేశారు. నేడు అవేమీ లేకుండా ప్రశాంత వాతావరణంలో నగర వాసులు జీవిస్తుంటే మీకెందుకు అంత కంటగింపు అని నిలదీశారు. జన్మభూమి కమిటీలతో ఎవరు మోసగించారో, టిడ్కో ఇళ్ల పేరుతో చేసిన దగాలు అన్ని ప్రజలకి గుర్తు ఉన్నాయన్నారు. రాబోయే ఎన్నికల్లో వారే టీడీపీకి తగిన బుద్ధి చెబుతారని హెచ్చరించారు. చంద్రబాబు మెప్పు కోసం ఆయన భజన చేస్తూ పుస్తకాలు రాసి వాటి ఆవిష్కరణల పేరుతో హడావుడి చేయడం టీడీపీ నాయకులకే చెల్లుతుందని ధ్వజమెత్తారు. అబద్ధపు రాతలతో రాసిన పుస్తకం కనీసం అతని ఇంట్లో కుటుంబ సభ్యులు కూడా చదవరని ఎద్దేవా చేశారు. ఎన్ని ప్రచారాలు చేసిన కోట్లాది మంది ప్రజల మద్దతుతో జగన్ మరలా ముఖ్యమంత్రి కావడం ఖాయమన్నారు. తూర్పులో అభివృద్ధికి పట్టం కడుతూ వైఎస్సార్ సీపీ జెండా ఎగురుతుందని వెల్లడించారు. ఈ కార్యక్రమంలో 18వ డివిజన్ కార్పొరేటర్, వీఎంసీ ఫ్లోర్ లీడర్ వెంకట సత్యనారాయణ, డెప్యూటీ మేయర్ బెల్లం దుర్గ, 17వ డివిజన్ కార్పొరేటర్ తంగిరాల రామిరెడ్డి, ఆయా కార్పొరేషన్‌ల డైరెక్టర్లు, అనుబంధ సంఘాల నాయకులు, డివిజన్ ప్రెసిడెంట్లు, నాయకులు, కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.

# తూర్పులో అభివృద్ధిపై చర్చకు సిద్ధమా ?

**వైఎస్సార్ సీపీ నియోజకవర్గ ఇన్‌చార్జి దేవినేని అవినాష్**



కరపత్రాలు పంపిణీ చేస్తున్న దేవినేని అవినాష్

కృష్ణలంక(విజయవాడతూర్పు): రాష్ట్రంలో వైఎస్సార్ సీపీ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి నాయకత్వంలో అభివృద్ధి కార్యక్రమాలు శరవేగంగా జరుగుతున్నాయని, అందుకు నిదర్శనమే తూర్పు నియోజకవర్గంలో అభివృద్ధి అని వైఎస్సార్ సీపీ తూర్పు నియోజకవర్గ ఇన్‌చార్జి దేవినేని అవినాష్ అన్నారు. శుక్రవారం కృష్ణలంక, 20వ డివిజన్‌లోని నెహ్రూనగర్, గౌతమీనగర్ ప్రాంతాల్లో ఆయన స్థానిక కార్పొరేటర్, కాపు కార్పొరేషన్ చైర్మన్ అడపా శేషుతో కలిసి గడప గడపకు వైఎస్సార్ సీపీ ప్రభుత్వం కార్యక్రమం నిర్వహించారు. గడప గడపకి వెళ్లి జగనన్న ప్రభుత్వంలో చేపట్టిన సంక్షేమాభివృద్ధి కార్యక్రమాల గురించి వివరించారు. 2024 వైఎస్సార్ సీపీ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన వెంటనే చేపట్టబోయే అభివృద్ధి పనుల గురించి మీ అవినాష్ అన్న హామీ పేరుతో ముద్రించిన కరపత్రాలు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా అవినాష్ మాట్లాడుతూ రాష్ట్రంలో అభివృద్ధి ఎక్కడ జరిగిందని అసత్య ప్రచారాలు చేస్తున్న టీడీపీ, దాని అనుకూల తోక పత్రికలు దమ్ముంటే తూర్పు నియోజకవర్గంలో పర్యటించాలని తెలిపారు. వారికి అభివృద్ధి ఎక్కడ జరిగిందో కళ్ళకు కట్టినట్లు చూపిస్తామని సవాల్ విసిరారు.

**సీసీ రోడ్డు నిర్మాణానికి శంకుస్థాపన...**

కృష్ణలంక, 20వ డివిజన్‌లోని నెహ్రూనగర్ 2వ లైన్‌లో రూ.20 లక్షలతో ప్రభుత్వ నిధులతో నూతనంగా చేపట్టనున్న సీసీ రోడ్డు నిర్మాణానికి అవినాష్ శంకుస్థాపన చేశారు. ఈ సందర్భంగా అవినాష్ మాట్లాడుతూ గత టీడీపీ ప్రభుత్వంలో ఈ డివిజన్‌లో ఎలాంటి అభివృద్ధి కార్యక్రమాలు చేపట్టకుండా నిర్లక్ష్యం చేసారని విమర్శించారు. కానీ తమ ప్రభుత్వం వచ్చిన తర్వాత కోట్లాది రూపాయలు వెచ్చించి అభివృద్ధి పనులు పూర్తి చేశామన్నారు. రణదీవెనగర్ వాసులకు వరద ముంపు నుంచి రక్షణగా చేపట్టిన మూడో దశ రిటైనింగ్ వాల్ నిర్మాణానికి కూడా శ్రీకారం చుట్టి దాదాపు పూర్తి చేశామని పేర్కొన్నారు. కార్యక్రమంలో డెప్యూటీ మేయర్ బెల్లం దుర్గ, 17వ డివిజన్ కార్పొరేటర్ తంగిరాల రామిరెడ్డి, వైఎస్సార్ సీపీ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

## లయోలా విద్యార్థుల ప్రతిభ



విద్యార్థులను అభినందిస్తున్న ప్రిన్సిపల్ ఫాదర్ కిషోర్

గుణదల (విజయవాడ తూర్పు): విద్యార్థులను శాస్త్రవేత్తలుగా తీర్చి దిద్దేందుకు కృషి చేస్తున్నట్లు ఆంధ్ర లయోల కళాశాల ప్రిన్సిపల్ ఫాదర్ కిషోర్ తెలిపారు. ఇటీవల ఎస్ఆర్ఎమ్ విశ్వవిద్యాలయంలో పర్యావరణ సుస్థిరత అనే అంశంపై ప్రదర్శన ఏర్పాటు చేశారని చెప్పారు. ఈ ప్రదర్శనలో తమ విద్యార్థులు ప్రతిభ కనబరిచారని తెలిపారు. బహుమతులు అందించి విద్యార్థులు అభినందించామని పేర్కొన్నారు. విద్యార్థులు బహుమతులతో పాటు 30 వేల నగదు పురస్కారాన్ని గెలుచుకున్నారని తెలిపారు.

జీవశాస్త్రంలో మాలిక్యులర్ టెక్నిక్స్ అనే అంశంపై లయోల కళాశాలలో శుక్రవారం వర్క్‌షాప్ నిర్వహించారు. జిల్లా హెల్త్ కన్సల్టెంట్ డాక్టర్ ఎఆర్ఎస్ బదరీనాథ్ ముఖ్యఅతిథిగా హాజరయ్యారు. జీవశాస్త్రంలో అధునాతన సాంకేతికతపై విద్యార్థులకు అవగాహన కల్పించారు. డీఎన్ఏ ఫింగర్ ప్రింట్, ఇన్సిలికో డిజైనింగ్ వంటి కొత్త టెక్నాలజీ గురించి వివరించారు.

## సిబ్బందికి విధులు కేటాయింపు

ఇంద్రకీలాద్రి(విజయవాడపశ్చిమ): ఇంద్రకీలాద్రిపై మల్లేశ్వరాలయం పునఃప్రారంభం కావడంతో ఆదివారం నుంచి సిబ్బందికి విధులను కేటాయిస్తూ ఆలయ ఈవో కేఎస్ రామారావు ఆదేశాలు జారీ చేశారు. ద్వారకా తిరుమల నుంచి బదిలీపై వచ్చిన జూనియర్ అసిస్టెంట్ టి. అనురాధను మల్లేశ్వరాలయం వద్ద దర్శన టికెట్లు, ప్రసాదం టికెట్ల విక్రయ కౌంటర్‌లో మొదటి షిఫ్ట్ విధులు కేటాయించారు. అటెండర్ ఎం.మనోహర్‌ను దర్శనం, ప్రసాదం టికెట్ల విక్రయ కౌంటర్‌లో రెండో షిఫ్ట్ విధులు అప్పగించారు. ఇక ప్రసాదం కౌంటర్లలో మొదటి షిఫ్టుకు అవుట్ సోర్సింగ్‌కు చెందిన ఎస్. ప్రసాద్‌కు మొదటి షిఫ్ట్, ఎం. గీతకు రెండో షిఫ్ట్ విధులు ఇచ్చారు. బాలాలయంలో విధులు నిర్వహిస్తున్న బి.చిన్నమ్ములును మల్లేశ్వరాలయంలో క్యూలైన్ల పర్యవేక్షణ మొదటి షిఫ్ట్, టి. నాగమణికి రెండో షిఫ్ట్ విధులు కేటాయించారు. బాలాలయంలో విధులు నిర్వహిస్తున్న బి. శేషాచలంను పవిత్ర సారె కౌంటర్‌కు , కుంకుమ ప్రసాదం ప్యాకింగ్ విభాగంలో విధులు నిర్వహిస్తున్న టి. లక్ష్మిని పొంగలి షెడ్డుకు బదిలీ చేశారు.

## ● బెజవాడలో మంచు దుప్పటి



బెజవాడ నగరాన్ని శుక్రవారం మంచు దుప్పటి కప్పేసింది. దట్టమైన పొంగమంచు నగరమంతా వ్యాపించింది. వాహనాలు సైతం లైట్లు వేసుకొని రాకపోకలు సాగించాల్సిన పరిస్థితి ఉంది. స్కూల్‌కు వెళ్లే విద్యార్థులు, ఆఫీసులకు వెళ్లే ప్రభుత్వ, ప్రైవేటు ఉద్యోగులు సైతం మంచులోనే ప్రయాణాలు సాగించారు. కృష్ణా బ్యారేజీ, గుణదల, బెంజిసర్కిల్, కృష్ణలంక తదితర ప్రాంతాల్లో మంచు భారీగా కురిసింది. బీఆర్టీఎస్ రోడ్డులో దట్టమైన పొంగ మంచులోనే స్కూల్‌కు వెళ్తున్న విద్యార్థినుల చిత్రమిది.

–సాక్షి ఫొటోగ్రాఫర్, విజయవాడ

## దుర్గమ్మ సన్నిధిలో భరత నృత్య ప్రదర్శన



ఇంద్రకీలాద్రి(విజయవాడపశ్చిమ): ఇంద్రకీలాద్రిపై దుర్గమ్మ సన్నిధిలో గుంటూరు జిల్లా ఉండవల్లికి చెందిన శ్రీ సుబ్రహ్మణ్యేశ్వర నాట్యమండలి ప్రదర్శించిన భరత నృత్య ప్రదర్శన భక్తులను విశేషంగా ఆకట్టుకుంది. నాట్యమండలికి చెందిన వెన్నెలా రెడ్డి, లక్ష్మీప్రియ, వైష్ణవి, జాహ్నవి, గమనశ్రీలు పలు కీర్తనలకు భరతనాట్య ప్రదర్శన ఇచ్చారు. ధర్మపథంలో భాగంగా ప్రతి శుక్ర, శని, ఆదివారాలు అమ్మవారి సన్నిధిలో చిన్నారులు తమ నృత్య ప్రదర్శన ఇచ్చేందుకు దేవస్థానం అవకాశం కల్పిస్తుంది. అమ్మవారి దర్శనం కల్పించారు.

## రేపు అక్కినేని శత జయంతి వేడుకలు



అక్కినేని శత జయంతి వేడుకలు బ్రోచర్ ఆవిష్కరిస్తున్న నాగేశ్వరరావు, చిట్టిబాబు, డేవిడ్‌రాజు

విజయవాడ కల్చరల్: అక్కినేని ఫౌండేషన్ ఆఫ్ ఇండియా ఆధ్వర్యంలో ఆదివారం సినీ నటుడు, నిర్మాత అక్కినేని నాగేశ్వరరావు శత జయంతి వేడుకలను రాష్ట్రస్థాయిలో నిర్వహి స్తున్నట్లు ఆ సంస్థ వ్యవస్థాపకుడు చీదెళ్ల నాగేశ్వరరావు తెలిపారు. గాంధీనగర్‌లోని సంస్థ కార్యాలయంలో శుక్రవారం నిర్వహించిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ కృష్ణాజిల్లాకు చెందిన అక్కినేని స్వయం కృషితో ఉన్నత శిఖరాలకు చేరుకున్నారని పేర్కొన్నారు. ప్రపంచం గర్వించేలా స్టూడియో నిర్మాణం చేశారని తెలిపారు. అక్కినేని జీవితం గురించి నేటి తరానికి తెలియజేయడానికి పెద్ద ఎత్తున కార్యక్రమం ఏర్పాటు చేశామన్నారు. గాంధీనగర్‌లోని హోటల్ ఐలాపురంలో జరిగే కార్యక్రమానికి ముఖ్య అతిథిగా ఏపీ హైకోర్ట్ న్యాయమూర్తి జస్టిస్ ఆకుల వెంకటశేష సాయి పాల్గొంటారని చెప్పారు. సినీ నటుడు, నిర్మాత మాగంటి మురళీమోహన్‌కు అక్కినేని జాతీయ స్మారక పురస్కారం ప్రదానం చేస్తున్నామని దేశ విదేశాల్లో ఉన్న అక్కినేని అభిమానులు హాజరు అవుతారని తెలిపారు. తెలుగు కళావాహిని అధ్యక్షుడు చింతకాయల చిట్టిబాబు మాట్లాడుతూ అక్కినేని నటించిన చిత్రాల్లోని పాటలను గాయనీ గాయకులు ఆలపిస్తారని వెల్లడించారు. అనంతరం అక్కినేని శత జయంతి వేడుకలు బ్రోచర్‌ను ఆవిష్కరించారు. సమావేశంలో కే డేవిడ్‌రాజు, భేతాళం వీరభద్రరావు, అరిగెల శివరాంప్రసాద్, జేకే చక్రవర్తి, గాయకుడు ప్రిన్స్ పాల్గొన్నారు.

## ప్రజా సంక్షేమంలో ప్రజలు భాగస్వామ్యం కావాలి



విజయవాడ కల్చరల్: ప్రభుత్వం నిర్వహించే ప్రజా సంక్షేమ కార్యక్రమాల్లో ప్రజలు భాగస్వాములు కావాలని ఎమ్మెల్యే, వైఎస్సార్ సీపీ నగర అధ్యక్షుడు మల్లాది విష్ణు సూచించారు. శ్రీ కృష్ణదేవరాయ విగ్రహ కల్చరల్ ఆర్గనైజేషన్ ఆధ్వర్యంలో బీఆర్‌టీఎస్ రోడ్డులోని శ్రీకృష్ణదేవరాయలు విగ్రహం వద్ద ఆయన 553వ జయంతి ఉత్సవాలను శుక్రవారం ఎమ్మెల్యే ప్రారంభించారు. ఎమ్మెల్యే విష్ణు మాట్లాడుతూ శ్రీకృష్ణదేవరాయలు బాటలోనే సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి సాగునీరు, తాగునీరు అందించడానికి కృషి చేస్తున్నట్లు తెలిపారు. విగ్రహ కమిటీ అధ్యక్షుడు శీలం నాగేశ్వరరావు, విద్యావేత్త బీ అరుణ్ పాల్గొన్నారు. అలాగే సాయంత్రం దుర్గాపురంలోని ఘంటసాల వెంకటేశ్వరరావు సంగీత కళాశాలలో కూచిపూడి నృత్యోత్సవం, సాంస్కృతిక కార్యక్రమాలను నిర్వహించారు. భాగవతుల వెంకట్రామశర్మ బృందం సంప్రదాయ కూచిపూడి నృత్యాలను ప్రదర్శించింది. కవి పండిత సత్కార కార్యక్రమంలో భాగంగా వివిధ కళాశాలలో అధ్యాపకులుగా పనిచేస్తున్న డీ దత్తాత్రేయశర్మ, జేవీ చలపతిరావు, డాక్టర్ కే బాలకృష్ణ, డాక్టర్ యశోద పూర్ణచంద్రరావు, నృత్య కళాకారులను ఎమ్మెల్యే మల్లాది విష్ణు సత్కరించారు.

# సార్వత్రిక ఎన్నికలకు పటిష్ట ఏర్పాట్లు

**జిల్లా కలెక్టర్ ఢిల్లీరావు**



మాట్లాడుతున్న కలెక్టర్ ఢిల్లీరావు

గాంధీనగర్(విజయవాడసెంట్రల్): రాబోయే సార్వత్రిక ఎన్నికల విజయవంతంగా నిర్వహించేందుకు ఎన్నికల సంఘం మార్గదర్శకాలకు అనుగుణంగా పటిష్టమైన ఏర్పాట్లు చేస్తున్నట్లు జిల్లా కలెక్టర్ ఎస్. ఢిల్లీరావు తెలిపారు. రాష్ట్ర చీఫ్ ఎలక్టోరల్ ఆఫీసర్ ముఖేష్ కుమార్ మీనా శుక్రవారం రాష్ట్ర సచివాలయం నుంచి అన్ని జిల్లాల కలెక్టర్లతో ఎన్నికల సన్నద్ధతపై వీడియో కాన్ఫరెన్స్ నిర్వహించారు. కలెక్టర్ క్యాంపు కార్యాలయం నుంచి కలెక్టర్ ఎస్.ఢిల్లీరావు, నగర పోలీస్ కమిషనర్ టీకే రాణా, డీసీపీ కృష్ణకాంత్ పాటిల్, కేఆర్సీ స్పెషల్ డెప్యూటీ కలెక్టర్ కిరణ్మయిలతో కలిసి హాజరయ్యారు. పారదర్శకంగా, స్వేచ్ఛగా, నిష్పక్షపాతంగా ఎన్నికల నిర్వహణకు చేపట్టాల్సిన ఏర్పాట్లపై సీఈవో మార్గనిర్దేశం చేశారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ ఢిల్లీరావు మాట్లాడుతూ ఎన్నికల సంఘం నిర్దేశించిన మార్గదర్శకాలకు అనుగుణంగా ఏర్పాట్లు చేస్తున్నామని తెలిపారు. తుది ఓటర్ల జాబితా ప్రకటించిన నాటి నుంచి వివిధ ఫారాల పరిష్కారం, పోలింగ్ కేంద్రాల్లో కనీస వసతుల కల్పన, ఈవీఎంలను భద్రపరచేందుకు స్ట్రాంగ్ రూములు, లెక్కింపు కేంద్రాలలో ఏర్పాట్లు అధికారులు సిబ్బందికి శిక్షణ కార్యక్రమాలు, భద్రతా సిబ్బందికి శిక్షణ, నియోజకవర్గాల వారీగా రూట్లు, అవసరమైన వాహనాలు తదితర అంశాలపై చేపట్టిన ఏర్పాట్లను రాష్ట్ర చీఫ్ ఎలక్టోరల్ ఆఫీసర్ ముఖేష్ కుమార్ మీనాకు వివరించారు.

అనంతరం కలెక్టర్ ఢిల్లీరావు అధికారులతో మాట్లాడుతూ జిల్లాలోని అన్ని శాఖలకు చెందిన డ్రాయింగ్ ఆఫీసర్లు ఆయా శాఖలకు చెందిన ఉద్యోగస్తుల వివరాలను ఎంప్లాయిస్ డేటా వెబ్ సైట్ లో అప్‌లోడ్ చేయాలన్నారు. ఇంకనూ అప్‌లోడ్ ప్రక్రియ పూర్తిచేయని అధికారులు శనివారం లోగా వివిరాలను నమోదు చేయాలన్నారు. నిర్లక్ష్యం వహించే అధికారులపై ఎన్నికల చట్ట ప్రకారం చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు.

# టీడీపీ నాయకుల శవ రాజకీయాలు సిగ్గుచేటు

**కాపు కార్పొరేషన్ చైర్మన్ అడపా శేషు ఆగ్రహం**



ఈనాడు, ఆంధ్రజ్యోతి పేపర్లు దహనం చేస్తున్న శేషు, ఇతర నాయకులు

అజిత్‌సింగ్‌నగర్(విజయవాడసెంట్రల్): వైఎస్సార్ సీపీ యువ నాయకుడు కైకాల చరణ్ మరణంపై టీడీపీ నాయకులు, ఎల్లో మీడియా అసత్య ఆరోపణలు చేయడం, తప్పుడు కథనాలు ప్రచురించడం సిగ్గుచేటని కాపు కార్పొరేషన్ చైర్మన్ అడపా శేషు ఆగ్రహం వ్యక్తం చేశారు. సింగ్‌నగర్ నందమూరినగర్‌లోని వైఎస్సార్ సీపీ సెంట్రల్ నియోజకవర్గ కార్యాలయంలో శుక్రవారం విలేకరుల సమావేశం జరిగింది. శేషు మాట్లాడుతూ వైఎస్సార్ సీపీ విజయం కోసం పరితపించే మంచి యువ నాయకుడు కైకాల చరణ్ అకాల మరణం పార్టీకి తీరని లోటన్నారు. ఎన్నికల్లో ఎలా అయినా లబ్ధి పొందాలనే దుర్మార్గపు ఆలోచనలతో బొండా ఉమా ఈ మరణాన్ని కూడా తన నీచ రాజకీయాల కోసం వాడుకోవాలని చూడడం హేయమని మండిపడ్డారు. ఎమ్మెల్యే వెలంపల్లి శ్రీనివాస్ విజయం కోసం పనిచేసే చరణ్‌ను వెలంపల్లి ఎందుకు వేధింపులకు గురిచేస్తాడని ప్రశ్నించారు. మానవత్వం మంటకలిసే విధంగా బొండా ఉమా వ్యవహరించడం దారుణమన్నారు. వెలంపల్లి ఒత్తిళ్లతోనే కైకాల చరణ్ చనిపోయారంటూ టీడీపీ నాయకులు అసత్య ఆరోపణలు చేయడం, వాటిని తోక పత్రికలైన ఆంధ్రజ్యోతి, ఈనాడులో ప్రచురించడం దుర్మార్గమని నిప్పులు చెరిగారు.

ఈనాడు ఆంధ్రజ్యోతి విషపు రాతలను కాపు నేతలంతా ఖండిస్తున్నారన్నారు. ఎమ్మెల్యే వెలంపల్లి శ్రీనివాస్ వెనకాల తిరుగుతున్నాడని టీడీపీ నాయకులే చరణ్‌ను బెదిరించి ఉంటారని మాకు కూడా అనుమానంగా ఉందన్నారు. కాపుల వ్యతిరేక పార్టీ తెలుగుదేశం అని, వంగవీటి మోహన్ రంగాను చంపిన దగ్గర నుంచి కాపులంతా ఆ పార్టీని వ్యతిరేకిస్తున్నామని తెలిపారు. పచ్చ మీడియా నీచ రాతలపై న్యాయ పోరాటం చేస్తాం అని, చరణ్ కుటుంబాన్ని అన్ని విధాలుగా ఆదుకుంటాం అని తెలిపారు. కాపు సంఘం నాయకులు చింతా శ్రీనివాసరావు మాట్లాడుతూ ఎమ్మెల్యే వెలంపల్లి శ్రీనివాస్‌ను చూస్తుంటే బొండా ఉమాకు వణుకుపుడుతుందని పేర్కొన్నారు. ఆయనను రాజకీయంగా ఎదుర్కొనే దమ్ము ధైర్యం లేక ఇలా తప్పుడు ప్రచారాలు చేస్తున్నారని ధ్వజమెత్తారు. చరణ్ భౌతికకాయాన్ని దర్శించకుండా, కనీసం వారి కుటుంబాన్ని పరామర్శించని బొండా ఉమా, టీడీపీ నాయకులు అతని మరణంపై అసత్య ఆరోపణలు చేసి, వారి కుటుంబ పరువును రోడ్డుకు ఈడ్చడం దారుణమన్నారు. బొండా ఉమా, టీడీపీ నాయకులు ఇలానే శవరాజకీయాలు చేయాలని చూస్తే తగిన గుణపాఠం గట్టిగా చెబుతామని హెచ్చరించారు. అనంతరం ఈనాడు, ఆంధ్రజ్యోతి పత్రికలను తగలబెట్టారు. కాపు సంఘం నాయకులు కమ్మిలి రత్నాకర్, దుర్గ గుడి మాజీ ధర్మకర్త బాల, మహేష్, చింతలపూడి రమేష్, నారాయణ తదితరులు పాల్గొన్నారు.

# నూతన ఆవిష్కరణలపై యువత దృష్టి పెట్టాలి

**ఉత్సాహంగా సాగిన సింటిల్లా–2024**



హాజరైన సాయి సంతోష్ కుమార్, ఢిల్లేశ్వర రావు, కళాశాల ప్రతినిధులు

మొగల్రాజపురం(విజయవాడ తూర్పు): సమాజంలో ఎదురయ్యే సమస్యలకు యువత పరిష్కార మార్గాలను అన్వేషించాలని హైదరాబాద్‌లోని ఐఐటీ కళాశాల భౌతిక శాస్త్రం ప్రొఫెసర్ సాయి సంతోష్ కుమార్ చెప్పారు. సిద్ధార్థ కళాశాల భౌతికశాస్త్ర విభాగం ఆధ్వర్యంలో సింటిల్లా–2024 పేరుతో సిద్ధార్థ ఆడిటోరియంలో భౌతిక శాస్త్రం చదువుతున్న విద్యార్థులకు సాంకేతిక, సాంస్కృతిక అంశాలపై పోటీలు శుక్రవారం జరిగాయి. ఈ కార్యక్రమానికి సాయి సంతోష్ కుమార్ ముఖ్యఅతిథిగా హాజరై విద్యార్థులను ఉద్దేశించి మాట్లాడారు. సామాజిక దృక్పథంతో కూడిన నూతన ఆవిష్కరణలు చాలా అవసరమని చెప్పారు. ఆంధ్రప్రదేశ్ స్టేట్ కౌన్సిల్ ఆఫ్ సైన్స్ అండ్ టెక్నాలజీ ప్రాజెక్టు ఆఫీసర్ జె.ఢిల్లేశ్వరరావు మాట్లాడుతూ సైన్స్ అండ్ టెక్నాలజీకి ప్రభుత్వ అధిక ప్రాధాన్యం ఇస్తోందని చెప్పారు. సైన్స్ పట్ల యువత ఆసక్తిని పెంచుకోవాలని, అప్పుడే నూతన ఆవిష్కరణలు సాధ్యమన్నారు. సిద్ధార్థ కళాశాల డీన్ రాజేష్ సి.జంపాల, కళాశాల ప్రిన్సిపాల్ ఎం.రమేష్ మాట్లాడుతూ విద్యార్థులు ఇలాంటి కార్యక్రమాల్లో పాల్గొనడం వల్ల వారిలో సృజనాత్మకత పెరుగుతోందన్నారు. కళాశాల డైరెక్టర్ వేమూరి బాబూరావు మాట్లాడుతూ నిత్య జీవితంలో సైన్స్ పాత్ర చాలా ముఖ్యమని చెప్పారు. సింటిల్లా–2024 కన్వీనర్ డాక్టర్ శ్రీనివాస కృష్ణతో పాటుగా అధ్యాపకులు, కళాశాల, పాఠశాల స్థాయి విద్యార్థులు పాల్గొన్నారు. కళాశాల, పాఠశాల స్థాయి విద్యార్థులకు వేర్వేరుగా వివిధ అంశాల్లో నిర్వహించిన పోటీల్లో విద్యార్థులు ఉత్సాహంగా పాల్గొన్నారు. ముగింపు సభలో విజేతలకు బహుమతులు అందించారు.


# విద్యార్థులకు అభినందనలు



బహుమతులు పొందిన విద్యార్థులతో ప్రిన్సిపాల్ ఎం.రమేష్, డాక్టర్ టీఎస్ రవికిరణ్

మొగల్రాజపురం(విజయవాడ తూర్పు):ఈ నెల 15వ తేదీన నగరంలోని ఆంధ్రా లయోలా కళాశాల ఆవరణలో సైంటియా–2024 పేరుతో కంప్యూటర్ సైన్స్ విద్యార్థుల రాష్ట్ర స్థాయి సమ్మేళనానికి తమ కళాశాల విద్యార్థులు హాజరై వివిధ పోటీల్లో ప్రతిభ చూపి బహుమతులు సొంతం చేసుకున్నారని పీబీ సిద్ధార్థ కళాశాల ప్రిన్సిపాల్ ఎం.రమేష్ చెప్పారు. బహుమతులు పొందిన విద్యార్థులకు శుక్రవారం సిద్ధార్థ కళాశాల ఆవరణలో అభినందించారు. కోడింగ్ అండ్ డీ బగ్గింగ్ పోటీల్లో పి.మేఘన మొదటి, షేక్ ఉబైద్ ద్వితీయ బహుమతి, టెక్నికల్ క్విజ్‌లో జయప్రకాష్, కమలాకర్ మొదటి బహుమతి, ఏఎస్.శివకుమార్, జీ.జగదీష్, ఐ.శివాజీ ద్వితీయ బహుమతి, ఫొటోగ్రఫీలో కె.సిద్ధార్థ మొదటి స్థానం, పాటల పోటీల్లో ఎం.గాయత్రి మొదటి బహుమతి గెలుపొందారని వివరించారు. బహుమతులు పొందిన విద్యార్థులకు కళాశాల డైరెక్టర్ వేమూరి బాబూరావు, డీన్ రాజేష్ సీ.జంపాల, కంప్యూటర్ సైన్స్ విభాగాధిపతి డాక్టర్ టీఎస్.రవికిరణ్‌తో పాటుగా అధ్యాపకులు విద్యార్థులను అభినందించారు.

మన శరీరంలో పేరుకుపోయే వ్యర్థాలను ఎప్పటికప్పుడు బయటకు పంపిం వేందుకు కిడ్నీలు ఎప్పుడూ శ్రమిస్తూనే ఉంటాయి. అందుకుగాను మనం తగినంత నీటిని తాగడంతోపాటు కిడ్నీలను సురక్షితంగా ఉంచే ఆహా రాలను తీసుకోవాలి. అయితే కొందరిలో పలు కారణాల వల్ల కిడ్నీ సమస్యలు వస్తుంటాయి. ఈ క్రమంలోనే వారిలో కొన్ని లక్షణాలు కనిపిస్తాయి. అవేమిటో తెలుసుకుంటే ముందే జాగ్రత్త పడవచ్చు. ఆ లక్షణాలేమిటో తెలుసుకుందాం.



# మీ కిడ్నీలు కుశలమేనా?

**త**రచూ మూత్రానికి వెళ్లాల్సి వస్తే దాన్ని కిడ్నీ సమస్యగా అను మానించాలి. అయితే డయాబెటిస్ ఉన్నవారిలో సహజంగానే ఇలా జరుగుతుంది. కనుక ఆ వ్యాధి ఉందో, లేదో చెక్ చేయిం చుకోవాలి. ఒకవేళ డయాబెటిస్ లేకపోయినా మాటిమాటికీ మూత్రానికి వెళ్లాల్సి వస్తుందంటే.. దాన్ని కిడ్నీ సమ స్యగా అనుమానించాలి.

● కిడ్నీ సమస్యలు ఉన్నవారిలో ముఖం అంతా వాపులకు గురై ఉబ్బిపోయి కనిపి స్తుంది. కాలి మడమలు, కాళ్లు, పాదాలు, చేతులు ఉబ్బిపోయి కనిపిస్తాయి ● కిడ్నీ సమస్యలు ఉంటే తీవ్రమైన అలసట వస్తుంది. కొందరిలో రక్తహీనత సమస్య కూడా ఏర్పడుతుంది ● చర్మం పొడిగా మారి దురదలు పెడుతుంది ● నోటి దుర్వాసన ఉంటుంది ● కిడ్నీ సమస్యలు ఉంటే కొందరిలో జ్ఞాపకశక్తి తగ్గుతుంది. కొందరికి తల తిరిగినట్లు అనిపిస్తుంది ● కిడ్నీ సమస్యలు ఉన్నవారిలో వెన్ను నొప్పి వస్తుంటుంది ● వాంతి వచ్చినట్టుగా... వికారంగా అనిపిస్తుంది ● కిడ్నీ సమస్యలు ఉంటే శ్వాస తీసుకోవడం కష్టంగా మారుతుంది ● కిడ్నీ సమస్యలు ఉన్నవారు వేడి వాతా వరణంలో ఉన్నప్పటికీ చలిగా అనిపిస్తుంది. కొందరు వణుకు తారు.

టపైన తెలిపిన లక్షణాలు కనుక ఎవరిలో అయినా ఉంటే ఏమాత్రం ఆలస్యం చేయకుండా వెంటనే వైద్యుని సంప్రదించి వారి సలహా మేరకు సంబంధిత పరీక్షలు చేయించుకోవాలి. అవసరం అయితే మందులను వాడాల్సి ఉంటుంది. దీంతో పాటు కిడ్నీలను ఆరోగ్యంగా ఉంచే ఆహారాలను తినాలి. ఇలా చేయడం వల్ల కిడ్నీలను ఆరోగ్యంగా ఉంచుకోవచ్చు.

వెడ్డింగ్ ప్లాన్

# సింపుల్‌గా... సూపర్‌గా..!

ఇల్లు కట్టి చూడు.. పెళ్లి చేసి చూడు అన్నారు పెద్దలు. అంటే మన సమాజంలో ఈ రెండు విషయాలూ ఎంతో ప్రాధాన్యతను సంతరించుకున్న విషయాలన్నమాట. ఎందుకంటే ఒకవైపు ఖర్చు ఎంత పెట్టినా ఇంకా పెట్టాలేమో అన్నట్లుగా ఉంటుంది. ఎక్కడ పెంచాలో.. ఎక్కడ తగ్గించుకోవాలో అర్థం కాదు.. సరైన ప్లానింగ్ లేకపోతే అంతా గందరగోళమే. చివరికి తడిసి మోపడమవడం ఖాయం. తీరా అంత ఖర్చు పెట్టాక మనసుకు సంతృప్తి లేకపోతే మరింత ఇబ్బందికరంగా ఉంటుంది. అందుకే పెళ్లి విషయంలో ముందస్తు ప్రణాళిక అవసరం.



**భా**రతీయ సంప్రదాయంలో పెళ్లికి ఎంతో ప్రాధాన్యత ఇస్తారు. కన్యాదాత ఎంతో హంగు, ఆర్భాటాలతో పెళ్లి చేస్తాడు. ఒకోసారి వరుడి తరఫు వారే పెళ్లి ఖర్చులు పెట్టుకోవడం, లేదా ఖర్చును ఇద్దరూ కలిసి పంచుకోవడం... ఏ రకంగా చూసినా సరే, జీవితంలో ఒక్కసారే జరిగే సంబరం కావడంతో ఖర్చుకు ఎక్కడా వెను కాడరు. పెళ్లి శుభలేఖ దగ్గర నుంచి.. మండపాలంకరణ వరకు, పెళ్లిబట్టల నుంచి నగల వరకు; టిఫిన్ల దగ్గర నుంచి విందు భోజనాల వరకు... ఇలా ప్రతిదీ ఖర్చుతో కూడుకున్నదే. భారతీయులు సగటున పెళ్లికోసం చేస్తున్న ఖర్చు రూ. 5 లక్షల నుంచి రూ. కోటికి పైగా ఉంటుందన్నది ఒక అంచనా.



ఇల్లలకగానే పండగా... అన్నట్లు ఉన్నదంతా వదిలిం చుకుని లేదా లేకపోతే అప్పులు చేసి మరీ పెళ్లి చేసిన తర్వాత ఆ జంట కాపురం కోసం మరి కొంత ఖర్చు చేయాల్సి వస్తుంది. ఏది తక్కువైనా నవ్వుల పాలు కావడం ఖాయం. అయితే వైభవంగా పెళ్లి చేయడం వరకు తప్పేం లేదు కానీ స్తోమతకు మించి అప్పులు చేయడంలోనే అభ్యంతరం... తప్పనిసరి వాటికి ఎలాగూ ఖర్చు తప్పదు కానీ కాస్త ఆచి తూచి ప్లాన్ ప్రకారం చేస్తే పెళ్లికి అయ్యే వృథా ఖర్చును కొంత తగ్గిం చవచ్చు. అదెలాగో చూద్దాం...



**ముందస్తు ప్రణాళిక ...**

పెళ్లి ఎంత గ్రాండ్ గా చేశాం అనే దానికన్నా ఎంత ప్రణాళికాబద్ధంగా ఆర్గనైజ్ చేశామన్నది ముఖ్యం. అనుకున్న బడ్జెట్ లోపు చేయాలంటే ఖర్చు ఎక్కడ పెట్టాలి.. ఎక్కడ తగ్గించుకోవాలో ముందుగానే నిర్ణయించుకో వాలి. ఇందుకోసం పెళ్లి తంతులో వివిధ ఘట్టాలకు అవసరమైన వస్తు సామగ్రిని ముందుగానే జాబితా రాసుకోవాలి. అవసరమైతే మండపం, అలంకరణ, కేటరింగ్ వంటి వాటిని ఒకరికే కాంట్రాక్ట్ ఇస్తే కొంతమేరకు ఖర్చు తగ్గే అవకాశం ఉంటుంది. అలాగే పర్యవేక్షణ కూడా బావుంటుంది. వస్త్రాలు, నగలు కూడా అవసరం మేరకే కొనుగోలు చేయాలి.

**అతిథుల జాబితా అన్నింటికన్నా ముఖ్యం...**

పెళ్లి అంటేనే సకుటుంబ సపరివారంతోపాటు బంధు మిత్రులు, శ్రేయోభిలాషులు అంతా హాజరు కావాలని అందరూ కోరుకుంటారు. అందుకోసం బంధువులకు ఒకటని, మిత్రులకు మరొకటని కార్డులు ప్రింట్ చేయి స్తుంటారు. ఇక్కడ కూడా ఖర్చు తగ్గించుకునే అవ కాశం ఉంటుంది. అందరికీ కామన్‌గా ఒకే ఆహ్వాన పత్రిక ఉంటే ఖర్చు తగ్గుతుంది. సేహితులకు కార్డులు కొట్టించే బదులు ఈ ఇన్విటేషన్ల ద్వారా కూడా ఆహ్వానం పంపుకోవచ్చు. అలాగే పెళ్లిలో మెహందీ అని, సంగీత్ అని, హల్దీ అనీ, రిసెప్షన్ అనీ ఇలా చాలా రకాల ఈవెంట్స్ చేస్తున్నారు. పెళ్లికూతురు దగ్గర కొన్ని, పెళ్లి కొడుకు వద్ద మరికొన్ని.. ఇద్దరిని కలిపి కొన్ని ఈవెంట్స్ ప్లాన్ చేస్తున్నారు. వీటికి ఎవరెవరిని పిలవాలనే దానిపై కూడా కసరత్తు చేయాలి. అప్పుడు ఏ ఈవెంట్ కు ఎంతమంది వస్తారో అవగాహన ఉంటుంది కాబట్టి.. అందుకనుగుణంగా ఏర్పాట్లు చేసుకోవాలి.

**ముందుగా బడ్జెట్ వేసుకోండి...** పెళ్లికి ముందు బడ్జెట్ సిద్ధం చేసుకో వాలి. బడ్జెట్ లేకుండా వెడ్డింగ్ ఫంక్షన్ నిర్వహిస్తే ఖర్చులు భారీగా ఉంటాయి. మీ ఆర్థిక పరిస్థితిని దృష్టిలో ఉంచుకుని బడ్జెట్ సిద్ధం చేసుకో వడం మొదటి పని. వివాహం అలా చేసుకోవాలని ఇలా చేసుకోవాలని చాలా కోరికలు ఉంటాయి. కానీ అవసరమైన వాటిని మాత్రమే కొను గోలు చేయాలని గుర్తుంచుకోండి. ఉదాహరణకు వివాహానికి బట్టలు, ఆభరణాలు అవసరం. అలాగని ఖరీదైన బట్టలు, ఆభరణాలు అవసరం లేదు. బడ్జెట్‌లో వచ్చే వాటిని తీసుకోవడం ఉత్తమం.

**క్యాటరింగ్:** పెళ్లి విందులకు డబ్బు గుడ్డిగా ఖర్చు చేస్తారు. చాలా పెళ్లిళ్ల లో ఆహారం వృథా అవడం గమనిస్తూనే ఉంటాం. వివాహ విందు మెనులో అవసరమైన ఆహార పదార్థాలను మాత్రమే చేర్చండి. లేనిపోని గొప్పల కోసం మెనూని పెంచవద్దు. హాజ రయ్యే అతిథుల సంఖ్యకు అనుగుణంగా క్యాటరింగ్ సిద్ధం చేసుకోవాలి.



**అలంకరణ సామగ్రి**

పెళ్లి ఇంట్లో చాలా అలంకరణ ఉంటుంది. అవసరమైన అలంకరణ వస్తువులు మాత్రమే తీసుకోవాలి. వీటిలో పువ్వులు చాలా ముఖ్యమై నవి. వాటిని చౌకగా ఉన్న ప్రదే శాల నుంచి కొనుగోలు చేస్తే కొంత డబ్బు ఆదా అవుతుంది.



**హనీమూన్ ట్రిప్...** పెళ్లితంతు ముగిసిన తర్వాత నూతన వధూవరుల హనీమూన్ కోసం లక్షల రూపాయలు ఖర్చు చేస్తున్నారు. హనీమూన్ డెస్టినేష న్లుగా పేరుగాంచిన దేశాలకు ఎగిరిపోతున్నారు. ఇది కూడా బడ్జెట్ పెరగడానికి కారణం అవుతుంది. దీని బదులుగా మన దేశంలోనే అనువైన ప్రాంతాలను ఎంచు కుంటే చాలా సమయంతో పాటు ధనమూ ఆదా అవు తుంది. ఒకవేళ విదేశాలకే వెళ్లాలనుకుంటే తక్కువ ఖర్చుతో వెళ్లి రాగలిగే మలేసియా, థాయ్‌ల్యాండ్ వంటివి ఎంచుకుంటే సరిపోతుంది.

లైఫ్@360



శరీరంలో స్రవించే హార్మోన్లలో ఒక్కోసారి చోటు చేసుకునే కొన్ని రకాల అసమతౌల్యతల కారణంగా చాలా ఒత్తిడికి లోనవుతుండటం లేదా మూడ్ ఆఫ్ కావడం మామూలే. అయితే దాన్ని సరిచే యడానికి మందులు మింగే బదులు కొన్ని ఆహారాలను తీసు కోవడం వల్ల మానసిక, శారీ రక ఆరోగ్యాలు దృఢంగా ఉంటాయి. ఆ ఆహారాలే మిటో తెలుసుకుని, మూడ్ బాగుండనప్పుడు వాటిని తీసుకుంటే సరి!

# మూడ్‌ని మార్చే ఫుడ్

**ఒ**క్కొక్కసారి మనకు తెలియ కుండానే మూడ్ పాడవుతుంది. ఏదో పోగొట్టుకున్నట్లు... వెలి తిగా... ఒకలాంటి బాధగా అనిపిస్తుంది. అలాంట ప్పుడు కొన్నిరకాల ఆహారా లను తీసుకోవడం వల్ల వెంటనే మూడ్ సరవుతుంది. అవేమిటో తెలుసు కుందాం...



**పాలకూర..** ఐరన్ పాళ్లు అధికంగా ఉండే పాలకూర సంతోషకరమైన హార్మోన్లను పెంచడానికి పనిచేస్తుంది. అంతేకాదు, ఇందులో ఫైబర్, విటమిన్ ఇ పుష్కలంగా ఉండటం వల్ల జీర్ణవ్యవస్థకు, చర్మానికి ఎంతో మేలు చేస్తుంది. పాలకూర స్మూతీ, సూప్ లేదా పాలకూరను ఏదో ఒక రూపంలో ఆహా రంలో తీసుకోవడం చాలా ఉప యోగకరంగా ఉంటుంది.



**మష్రూమ్స్..** మష్రూమ్స్ యాంటి డిప్రెసెంట్ లక్షణాలకు ప్రసిద్ధి చెందింది. ఇందులో సమృద్ధిగా ఉండే విటమిన్ డి మానసిక స్థితిని నియంత్రిస్తుంది. ఇది సెరటోనిన్ సంశ్లేషణ స్థాయికి సంబం ధించినది. దీని కారణంగా వ్యక్తి సంతోషకరమైన భావోద్వేగా లను అనుభవించగలడు. మీ మూడ్ ఆఫ్‌లో ఉన్నప్పుడు, మష్రూమ్ రెసిపీని తినడం వల్ల తిరిగి మంచి మూడ్‌లోకి వచ్చేసే అవకాశం మెండుగా ఉంది. ప్రయోజ నకరంగా ఉంటుంది.

**అవకాడో..** కొద్దికాలం క్రితం నిర్వ హించిన ఒక అధ్యయనం ప్రకారం అవకాడోలో పోషకాలు పుష్కలంగా ఉన్నాయి. ఇందులో ఉండే విటమిన్ బి3 ,ఒమేగా–3 ఫ్యాటీ యాసిడ్‌లు సంతోషకర మైన హార్మోన్ అయిన సెరోటోనిన్ ఉత్ప త్తిని పెంచడంలో సహాయపడ తాయి. రోజంతా సంతోషంగా ఉండటానికి సలాడ్, శాండ్‌విచ్ లేదా అల్పాహారంలో అవకా డోను చేర్చవచ్చు.



**డ్రై ఫ్రూట్స్..** ప్రతిరోజూ కొన్ని బాదం లేదా వాల్‌నట్‌లను తినడం వల్ల మానసిక స్థితి మెరుగుపడుతుంది, ఒత్తిడి తగ్గుతుంది. డ్రై ఫ్రూట్స్‌లో ఉండే యాంటీ ఆక్సిడెంట్ల వల్ల ఇలా జరుగుతుంది.

**డార్క్ చాకొలేట్..** ఓ నివేదిక ప్రకారం డార్క్ చాకొలేట్ తినడం వల్ల శరీరంలో సంతోషకరమైన హార్మోన్ల స్థాయి పెరుగు తుంది. ఇందులో ఉండే యాంటీ ఆక్సి డెంట్లు మానసిక స్థితిని మెరుగుపరుస్తాయి. ఇందులో ఉండే ట్రిప్టోఫాన్ సెరోటోనిన్ స్థాయులను పెంచుతుంది. ఫలితంగా వెంటనే మూడ్ సరవుతుంది. మూడ్ బాగుండనప్పుడు ఈ ఫుడ్ ప్రయత్నించండి.



## సినిమా

# దేవర డేట్ ఫిక్స్



● ఎన్టీఆర్

**రి**లీజ్ డేట్ ఫిక్స్ చేసుకున్నాడు 'దేవర'. ఈ ఏడాది అక్టోబరు 10న 'దేవర' చిత్రం తొలి భాగం విడుదల కానుంది. 'జనతా గ్యారేజ్' వంటి హిట్ ఫిల్మ్ తర్వాత హీరో ఎన్టీఆర్, దర్శకుడు కొరటాల శివ కాంబోలో వస్తున్న చిత్రం ఇది. ఈ చిత్రంలో జాన్వీ కపూర్ హీరోయిన్‌గా నటిస్తుండగా, సైఫ్ అలీఖాన్ ఓ లీడ్ రోల్‌లో నటిస్తున్నారు. నందమూరి కల్యాణ్ రామ్, కె. హరికృష్ణ, మిక్కిలినేని సుధాకర్ నిర్మిస్తున్న ఈ సినిమా రెండు భాగాలుగా విడుదల కానుంది. కాగా తొలి భాగాన్ని ఈ ఏడాది ఏప్రిల్ 5న విడుదల చేయాలనుకున్నారు. కానీ వాయిదా వేశారు. తెలుగు, తమిళ, మలయాళ, కన్నడ, హిందీ భాషల్లో అక్టోబరు 10న సినిమాని విడుదల చేయనున్నట్లు శుక్రవారం వెల్లడించారు మేకర్స్.

# ఈ ప్రపంచాన్నే మనం బహిష్కరిద్దాం



● రాజేంద్రప్రసాద్, జయప్రద

**'ఈ** ప్రపంచం మన ప్రేమని తిరస్కరిస్తే.. ఈ ప్రపంచాన్నే మనం బహిష్కరిద్దాం' (రాజేంద్ర ప్రసాద్), 'అందరూ నన్ను ఏడిపించినవాళ్లే.. కానీ, నాకోసం ఏడ్చింది నువ్వు ఒక్కడివే' (జయప్రద) వంటి డైలాగులు 'లవ్ @65' మూవీ ట్రైలర్‌లో ఉన్నాయి. రాజేంద్ర ప్రసాద్, జయప్రద ప్రధాన పాత్రల్లో నటించిన చిత్రం 'లవ్ @65'. వీఎన్ ఆదిత్య దర్శకత్వం వహించిన ఈ చిత్రంలో కార్తీక్ రాజు, స్పందన పల్లి ముఖ్య పాత్రలు పోషించగా, సునీల్, అజయ్ ప్రత్యేక పాత్రల్లో కనిపించనున్నారు. టీజీ విశ్వ ప్రసాద్ నిర్మించిన ఈ చిత్రం త్వరలో విడుదల కానున్న సందర్భంగా శుక్రవారం ట్రైలర్‌ని విడుదల చేశారు. 'రాత్రి ఇక్కడి నుంచి ఇద్దరు మిస్ అయి పోయారు సార్', 'ఎవరు', 'మా కావేరి సార్.. మా ఆది సార్', 'ఎలా మిస్సయ్యారు', 'వాళ్లు లేచిపోయారు సార్', 'ఇద్దరూ మేజర్లా', 'కాదు సార్.. ఆయనకి డెబ్బై నిండాయి.. ఆవిడకి ఓ అరవైఐదు దాక ఉంటాయి'.. వంటి డైలాగులు ట్రైలర్‌లో ఉన్నాయి. ఈ చిత్రానికి కెమెరా: శ్యామ్ తుమ్మల పల్లి, సంగీతం: అనూప్ రూబెన్స్.

# అన్యాయంపై పోరాటం



● అనుష్క

'**అ**రుంధతి', 'భాగమతి'.. ఇలా ఉమెన్ సెంట్రిక్ ఫిల్మ్స్‌లో తనదైన శైలిని చాటు కుని సక్సెస్ అయ్యారు అనుష్క. తాజాగా ఆమె కథానాయిక ప్రాధాన్యంగా సాగే మరో సినిమా అంగీక రించారు. క్రిష్ (జాగర్లమూడి రాధాకృష్ణ) ఈ సినిమాకు దర్శకుడు. యూవీ క్రియే షన్స్ నిర్మిస్తున్న ఈ సినిమా చిత్రీకరణ మొద లైంది. ఒడిశాలోని ఒక మహిళ జీవితంలో పదేళ్ల క్రితం జరిగిన వాస్తవ ఘటనల ఆధారంగా ఈ సినిమా రూపొందుతోందని సమాచారం. తనకు జరి గిన అన్యాయంపై పోరాటం చేసే ఓ సాధారణ అమ్మాయిగా అనుష్క పాత్ర ఉంటుందట. ఇటీవల ఒడిస్సాలో కీలక సన్నివేశాల చిత్రీకరణ జరుపుతున్నా రని తెలిసింది. కాగా ఈ సినిమాకు 'శీలవతి' అనే టైటిల్‌ను చిత్ర యూనిట్ పరిశీలిస్తోందనే టాక్ వినిపిస్తోంది. అలాగే ఈ సినిమాలో తమిళ నటుడు విక్రమ్ ప్రభు ఓ లీడ్ రోల్ చేస్తున్నారని, ఈ సినిమా ఈ ఏడాదే దక్షిణాది భాషల్లో విడుదలవుతుందనే ప్రచారం జరుగుతోంది. ఈ విషయాలపై అధికారిక ప్రకటన రావాల్సి ఉంది.

# మహారాజా?



● మహేశ్‌బాబు

**మ**హేశ్‌బాబు హీరోగా రాజమౌళి దర్శక త్వంలో అంతర్జాతీయ స్థాయిలో ఓ భారీ బడ్జెట్ ఫిల్మ్ తెరకెక్కనున్న సంగతి తెలిసిందే. ఈ చిత్రంలోని హీరోయిన్ పాత్ర కోసం ఇండో నేషియా బ్యూటీ చెల్సియా ఇస్లాన్, దీపికా పదుకోన్ పేర్లు తెరపైకి వచ్చాయి. ఫారెస్ట్ అడ్వెంచరస్ ఫిల్మ్‌గా తెరకెక్కనున్న ఈ చిత్రా నికి 'మహారాజా', 'మహారాజ్', 'చక్రవర్తి' అనే టైటిల్స్‌ను పరిశీలిస్తున్నారనే టాక్ తెరపైకి వచ్చింది. మరి.. ఫైనల్‌గా ఈ టైటిల్స్‌లో ఏదో ఒకటి ఫిక్స్ అవుతుందా? లేక మరొక టైటిల్‌ను మేకర్స్ ఖరారు చేస్తారా? అనేది తెలి యాలంటే కొన్ని రోజులు వెయిట్ చేయక తప్పదు. ఇక విజయేంద్రప్రసాద్ కథ అందిం చిన ఈ చిత్రానికి ఎమ్ఎమ్ కీరవాణి సంగీతద ర్శకుడు. ఈ చిత్రం రెగ్యులర్ షూటింగ్ ఈ ఏడాది వేసవిలో ఆరంభమవుతుందని టాక్.

# మళ్లీ వస్తున్నాడు జోకర్



● 'జోకర్ 2' పోస్టర్

**హా**లీవుడ్ జోకర్ మళ్లీ వస్తున్నాడు. హాలీవుడ్ మ్యూజికల్ సైకలాజికల్ థ్రిల్లర్ ఫిల్మ్ 'జోకర్'. జోక్విన్ ఫీనిక్స్ ప్రధాన పాత్రలో టాడ్ ఫిలిప్స్ డైరెక్షన్‌లో రూపొందిన ఈ సినిమా 2019లో విడుదలై బాక్సాఫీస్ వద్ద బ్లాక్ బస్టర్‌గా నిలిచింది. ఈ సినిమాకు సీక్వెల్‌గా 'జోకర్ 2' (జోకర్: ఫోలీ ఎ డ్యూక్స్)ను ప్రకటించారు టాడ్ ఫిలిప్స్. ఈ చిత్రంలో జోక్విన్ ఫీనిక్స్‌తో పాటు లేడీ గగా మరో లీడ్ రోల్ చేస్తున్నారు. జాజై బీట్జ్ మరో లీడ్ రోల్‌లో కనిపిస్తారు. లాస్ ఏంజిల్స్, న్యూయార్క్, న్యూ జెర్సీ లొకేషన్స్‌లో చిత్రీకరణ జరిపారు. ఈ చిత్రం ట్రైలర్ ఏప్రిల్ 4న విడుదల కానుం దని హాలీవుడ్ టాక్. సినిమాను ఈ ఏడాది అక్టోబరు 4న విడుదల చేయాలనుకుంటున్నారు. టాడ్ ఫిలిప్స్, బ్రాడ్లీ కూపర్ నిర్మిస్తున్న ఈ చిత్రాన్ని ప్రపంచవ్యాప్తంగా వార్నర్ బ్రదర్స్ డిస్ట్రిబ్యూట్ చేయనుంది.

# థ్రిల్ స్టార్ట్



● మోహన్ భగత్

**మో**హన్ భగత్, సుప్రిత సత్యనారాయణ్, భూషణ్ కల్యాణ్, రవీంద్ర విజయ్ ప్రధాన పాత్రల్లో నటి స్తున్న చిత్రం 'ఆరంభం'. అజయ్ నాగ్ వి. దర్శకత్వంలో వీటీ అభిషేక్ నిర్మి స్తున్న సినిమా ఇది. ఈ సినిమా టీజర్‌ను హీరో నాగచైతన్య విడుదల చేసి, 'బ్యాగ్రౌండ్‌లో రామా యణ స్టోరీని నరేట్ చేస్తూ ఇంటర్‌కట్స్‌లో వేసిన విజువల్స్‌తో టీజర్‌ని డిఫరెంట్‌గా కట్ చేశారు. థ్రిల్లింగ్, యాక్షన్ ఎలిమెంట్స్‌తో టీజర్ ఆసక్తిగా ఉంది'' అన్నారు.

# యుద్ధానికి సిద్ధం!



● హృతిక్ రోషన్

**బా**లీవుడ్‌లో మరో వార్‌కు సిద్ధం అవుతు న్నారు హీరో హృతిక్ రోషన్. ఆయన నటిస్తున్న యాక్షన్ స్పై ఫిల్మ్ 'వార్ 2'. ఎన్టీఆర్ మరో లీడ్ రోల్ చేస్తున్నారు. అయాన్ ము ఖర్జీ దర్శకత్వం వహిస్తున్న ఈ సినిమా చిత్రీకరణ ఈ నెలాఖర్లో ప్రారంభం కానుంది. హృతిక్ రోషన్‌పై ఓ యాక్షన్ సీక్వెన్స్‌ను ప్లాన్ చేశారట అయాన్ ముఖర్జీ. ఈ చిత్రం 2025 ఆగస్టు 14న విడుదల కానుంది. 2019లో హృతిక్, టైగర్ ష్రాఫ్‌లు నటించిన 'వార్' సినిమాకు సీక్వెల్‌గా 'వార్ 2' వస్తోంది.

## రీల్స్

# పెళ్లనేది పాన్ ఇండియా సమస్య



● 'అల్లరి' నరేశ్

**'ఆ** ఒక్కటీ అడక్కు' అంటున్నారు హీరో 'అల్లరి' నరేశ్. ఆయన నటిస్తున్న 61వ చిత్రానికి నూతన దర్శకుడు మల్లి అంకం దర్శకత్వం వహిస్తున్నారు. ఇందులో ఫరియా అబ్దుల్లా హీరోయిన్. రాజీవ్ చిలక నిర్మిస్తున్న ఈ సినిమాకి 'ఆ ఒక్కటీ అడక్కు' టైటిల్ ఖరారు చేసి, ఫస్ట్ లుక్ గ్లింప్స్ విడుదల చేశారు. ఈ మూవీలో నరేశ్ పాత్ర పేరు గణ. అతని పెళ్లి గురించి కుటుంబ సభ్యులు, ఇరుగు పొరుగు వారు అడి గితే.. 'ఆ ఒక్కటీ అడక్కు.. పెళ్లనేది పాన్ ఇండియా సమస్య' అంటూ నరేశ్ చెప్పే డైలాగ్స్ గ్లింప్స్‌లో ఉన్నాయి. ''వినోదాత్మకంగా రూపొందు తున్న చిత్రమిది. మార్చి 22న విడుదల చేస్తాం'' అన్నారు మేకర్స్.

# గ్రామీణ నేపథ్యంలో...



● యువ చంద్రకృష్ణ

**యు**వ చంద్రకృష్ణ, అనన్య నాగళ్ల జంటగా సాహిత్ మోత్కూరి దర్శకత్వం వహించిన చిత్రం 'పొట్టేల్'. నిశాంక్ రెడ్డి కుడితి, సురేష్ కుమార్ సడిగె నిర్మించిన ఈ చిత్రానికి శేఖర్ చంద్ర సంగీతం అందించారు. ఈ చిత్రం నుంచి 'వచ్చారే..' అంటూ సాగే రెండో పాటని విడుదల చేశారు. కాసర్ల శ్యామ్ సాహిత్యం అందించిన ఈ పాటని రాహుల్ సిప్లిగంజ్ పాడారు. ''గ్రామీణ నేపథ్యంలో కొత్త కథాంశంతో తెరకెక్కిన చిత్రం 'పొట్టేల్'. ఈ చిత్రంలోని భావోద్వేగాలు ప్రేక్షకులను ఆకట్టుకుంటాయి'' అని చిత్ర యూనిట్ పేర్కొంది.

# సందె వేళ...



● శాంతి చంద్ర, దీపికా సింగ్

**శాం**తి చంద్ర హీరోగా, దీపికా సింగ్, మిస్ ఇండియా 2022 సిమ్రితి హీరోయిన్లుగా రూపొందిన చిత్రం 'డర్టీ ఫెలో'. ఆడారి మూర్తి సాయి దర్శకత్వంలో గూడూరు భద్రకాళి సమ ర్పణలో జీయస్ బాబు నిర్మించిన ఈ సినిమా త్వరలో రిలీజ్ కానుంది. డా. సతీష్ కుమార్ పి. సంగీతం అందించిన ఈ చిత్రంలోని 'సందె వేళ...' అంటూ సాగే పాటని డైరెక్టర్ సాయి రాజేశ్ రిలీజ్ చేసి, మాట్లాడుతూ– ''నా మిత్రుడు శాంతి చంద్ర నటించిన 'డర్టీ ఫెలో'లోని 'సందె వేళ..' పాట బాగుంది'' అన్నారు. ''వినూత్న కథతో రూపొందిన చిత్రమిది'' అన్నారు శాంతిచంద్ర.

# ప్రేమ.. నవ్వులు



● గౌతమ్, పరశురామ్

**గౌ**తమ్ సాగి, దీప్శికా జంటగా చంద్ర శేఖర్ కానూరి దర్శకత్వంలో శ్రీధర్ వర్మ సాగి నిర్మిస్తున్న చిత్రం 'రవికుల రఘు రామ'. సుకుమార్ పమ్మి సంగీతం అందించిన ఈ చిత్రంలోని 'చంద మామే..' అంటూ సాగే పాటని డైరెక్టర్ పరశురామ్ విడుదల చేశారు. ''లవ్ అండ్ రొమాంటిక్ ఎంటర్‌టైనర్‌గా రూపొందుతోన్న చిత్రమిది. ప్రేక్షకులకు మంచి వినోదాన్ని ఇవ్వాలని తన సృజనాత్మకత మొత్తం జోడించి ప్రాణం పోస్తున్నారు చంద్రశేఖర్'' అని యూనిట్ పేర్కొంది.